ఈనాడు

విజయవాడ 5-11-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 85
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

తల్లి తర్వాత భార్యాబిడ్డలకే ప్రాధాన్యమివ్వాలి

వారిని వదిలేస్తే అనంతర పరిణామాలను ఎదుర్కోవాల్సిందే

ఏపీకి చెందిన ఓ కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్య


ఈనాడు, దిల్లీ: భార్యాబిడ్డలను వదిలేసిన వ్యక్తి తద్వారా ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. కాకినాడ జిల్లాకు చెందిన ఓ సీనియర్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ నుంచి తగినంత భరణం ఇప్పించాలని కోరుతూ ఆయన భార్య దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారించిన జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన (మిగతా 2లో)

పెట్టుబడిదారులకు ప్రభుత్వ సంపూర్ణ సహకారం

దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలతో భేటీలో మంత్రి నారాయణ లోపలి పేజీలో

నైపుణ్యానికి ఏఐ పోర్టల్

యువత కోసం దేశంలోనే మొదటిసారిగా రూపకల్పన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



- సామర్థ్యాల అంచనా.. లోపాలు తెలుసుకునే అవకాశం
- కంపెనీల ఖాళీలు, నిరుద్యోగుల సమాచారం అనుసంధానం
- విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ఆవిష్కరణ

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పించేందుకు దేశంలోనే తొలిసారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర ప్రభుత్వం 'నైపుణ్యం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు కృత్రిమ మేధ (ఏఐ)తో ఇంటర్వ్యూను ప్రవేశ పెడుతోంది. ప్లంబర్ నుంచి బీటెక్ సాంకేతిక విద్య వరకు ప్రతి అభ్యర్థి సామర్థ్యాన్ని ఏఐ అంచనా వేస్తుంది. నిరుద్యోగులు తమ అర్హతలతో ఏఐని వినియోగించి రెజ్యూమెను సైతం తయారు చేసుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ఈ పోర్టల్‌ను ఆవిష్కరించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్దనున్న అన్ని రకాల డేటాను ఈ పోర్టల్‌తో లింక్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్, ఆధార్, డిజి లాకర్, ఈపీఎఫ్, ఆదాయ పన్ను చెల్లింపుదారుల వివరాలను అనుసంధానం చేస్తున్నారు. అంటే వీటి ద్వారా ఎవరైనా ఇప్పటికే ఉద్యోగంలో ఉంటే ఆ వివరాలు తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ఉన్న వివిధ విభాగాల డేటాను అనుసంధానిస్తారు. ఆర్థికశాఖ వద్దనున్న ఉద్యోగుల డేటాను కూడా దీనికి లింక్ చేస్తున్నారు. ఉద్యోగాల కల్పన సంస్థలు నౌకరీ, విజన్ ఇండియా వంటి సంస్థలు, యునిసెఫ్, ఇన్ఫోసిస్ వంటి అభ్యసన ప్లాట్‌ఫాంలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. వాటి వద్ద ఉండే ఖాళీల వివరాలు ఈ పోర్టల్‌లో కనిపిస్తాయి.

రెజ్యూమె తయారీ..

ఈ పోర్టల్‌లో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా రెజ్యూమె తయారు చేసుకోవచ్చు. ఆధార్ నంబరు నమోదు చేస్తే సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. తర్వాత వచ్చే వివరాలను నమోదు చేస్తే రెజ్యూమె వస్తుంది. (మిగతా 2లో)

సామర్థ్యాల మదింపు

- ఈ పోర్టల్‌లో ఏఐ ఇంటర్వ్యూ ఉంటుంది. మొదట అభ్యర్థులు పేరు, ఉద్యోగం, అనుభవం వంటి వివరాలు నమోదు చేయాలి.
- టెక్నికల్, ప్రాక్టికల్ తదితర ప్రశ్నలు ఉంటాయి. వాటిని నింపగానే అభ్యర్థి సామర్థ్యాన్ని మదింపు చేసి వెల్లడిస్తుంది.
- ఆ ఉద్యోగానికి సంబంధించి లేదా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు నింపగానే అభ్యర్థి ఏ స్థాయిలో ఉన్నారు.. ఎక్కడ లోపం ఉందో, ఏం నేర్చుకోవాలో ఏఐ వెల్లడిస్తుంది.
- ఏఐ వర్చువల్ సహాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 'ఆస్క్ విద్య'పై క్లిక్ చేయగానే అందుబాటులో ఉన్న కోర్సులు, అవి ఎక్కడ ఉన్నాయి.. తర్వాత వారం రోజుల్లో వచ్చే కోర్సులే మిటో తెలుస్తాయి.



లండన్‌లోని మేఫెయిర్ హాలులో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ ప్రతినిధుల నుంచి అవార్డును అందుకుంటున్న నారా భువనేశ్వరి. చిత్రంలో సీఎం చంద్రబాబు తదితరులు

నారా భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' పురస్కారం ప్రదానం

- హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు అందజేత
- లండన్‌లో ప్రదానం చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రతిష్ఠాత్మక 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' అందుకున్నారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 1.30 సమయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) సంస్థ ప్రతినిధులు ఆమెకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ (మిగతా 2లో)

వసుధైక కుటుంబ భావనతో... కలిసి పనిచేద్దాం

లండన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు 2లో

లోపలి పేజీల్లో

భోగాపురంలో విమానయాన విశ్వవిద్యాలయం!

డిసెంబరు నెలాఖరులో ఫ్లైట్ టెస్ట్

91.7 శాతం నిర్మాణ పనులు పూర్తి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



విమానాశ్రయం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే నాగమాధవి

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లా భోగాపురంలో విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని, దీనిపై విశాఖలో జరిగే పారిశ్రామిక సదస్సులో సంబంధిత రంగాలకు చెందిన కంపెనీలను ఆహ్వానిస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. విమానాశ్రయ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిర్మాణ పనులు (మిగతా 2లో)

రూ.2 వేల కోట్ల సాస్కీ నిధులతో రోడ్ల నిర్మాణం



- సరైన ప్రమాణాలతో పనులు చేపట్టాలి
- అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు – అమరావతి

గ్రామాల్లో కొత్త రహదారుల నిర్మాణం కోసం సాస్కీ (రాష్ట్ర మూలధన పెట్టుబడులపై ప్రత్యేక సహాయం) పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.2 వేల కోట్లు సమకూర్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో పటిష్ఠంగా రహదారులు నిర్మించాలని పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. సాస్కీ నిధుల వినియోగంపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో తీసుకొచ్చిన నిధులివి. వీటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంపై ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ రోడ్లు మెరుగుపడేలా నిధులు సమకూరుస్తున్నాం. నాణ్యతపై రాజీ పడొద్దు. రహదారుల నిర్మాణంలో ప్రమాణాలు పాటిస్తున్నారో, లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. నిర్మాణం మొదలయ్యాక పలు దశల్లో నాణ్యత పరిశీలించాలి. నేను, నిపుణులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేస్తాం. ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేయకపోతే అధికారులు, ఇంజినీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు. ప్రతి గ్రామానికీ రహదారులు ఉండాలి. మౌలిక సదుపాయాల కల్పనలో రహదారులు ఎంతో కీలకం. ప్రత్యేకమైన ప్రాంతాల్లో, సందర్భాల్లో సాస్కీ నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

పుట్టపర్తిలో మౌలిక వసతులకు రూ.35 కోట్లు

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తిలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పంచాయతీరాజ్ రోడ్లు పటిష్ఠపరచాలి. ఇందుకోసం సాస్కీ పథకం నుంచి రూ.35 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరించింది. కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నా విస్మరించింది. కూటమి ప్రభుత్వం (మిగతా 2లో)



జంగాలమెట్టలో కూలిన ఇంటి గోడ

విశాఖలో స్వల్ప భూ ప్రకంపనలు

కొన్ని సెకన్ల పాటు కంపించిన భూమి

ఈనాడు, విశాఖపట్నం–జి.మాడుగుల, న్యూస్‌టుడే: విశాఖ నగరంలో మంగళవారం తెల్లవారుజామున కొన్ని సెకన్ల పాటు స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. మహారాణిపేట, ఆరిలోవ, అడవివరం, మాధవధార, అక్కయ్యపాలెం, హెచ్‌బీ కాలనీ, అల్లిపురం, ఎండాడ, పెందుర్తి, భీమిలి, సింహాచలం తదితర ప్రాంతాల్లో ఉదయం సుమారు 4:20 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. భీమిలి బీచ్ రోడ్డులో పెద్ద శబ్దంతో ఇళ్లు ఊగాయి. గాఢ నిద్రలో ఉండటంతో ఏమైందో తెలియక కొందరు ఆందోళనకు గురయ్యారు. పలుచోట్ల ప్రాణభయంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల సమీపంలో భూ ఉపరితలానికి పది కిలోమీటర్ల లోతులో భూకంప (మిగతా 2లో)

గూడ్సు రైలును ఢీకొట్టిన ప్యాసింజర్


- లోకో పైలట్ సహా 8 మంది మృతి
- ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ సమీపంలో ఘటన

బిలాస్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం ఘోర రైలు ప్రమాదం జరిగింది. గూడ్సు రైలును ప్రయాణికుల రైలు వెనుక నుంచి ఢీకొట్టింది. లోకో పైలట్ సహా ఎనిమిది మంది మృతి చెందారు. సహాయక లోకో పైలట్‌తో పాటు 14 మంది గాయపడ్డారు. శిథిలమైన బోగీలో ఇరుక్కుపోయి ముగ్గురిని వెలుపలికి తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో సరకు రవాణా (గూడ్సు) రైలును వెనుక నుంచి ప్యాసింజర్ (మెమూ) రైలు ఢీకొనడంతో ఈ దుర్ఘటన సంభవించిందని బిలాస్‌పుర్ కలెక్టర్ సంజయ్ అగర్వాల్ తెలిపారు. ఆ సమయంలో రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై, ఒకే దిశలో వెళ్తున్నాయి. కోర్బా జిల్లాలోని గెవరా నుంచి బయలుదేరిన ప్యాసింజరు రైలు.. గటోరా-బిలాస్‌పుర్ రైల్వేస్టేషన్ల మధ్యలో ఉన్న లాల్‌ఖండ్ గ్రామ సమీపంలో ప్రమాదానికి గురైంది. ప్యాసింజరు రైలు బోగీ ఒకటి గూడ్సు రైలు వ్యాగన్‌పైకి ఎక్కేసి.. పడిపోవడం ఘటన తీవ్రతను తెలియజేస్తోంది. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా (మిగతా 2లో)



బిలాస్‌పుర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో గూడ్సు రైలుపైకి ఎక్కిన ప్యాసింజర్ రైలు

ఇదీ సంగతి!



ఇంటి నంబర్ తెలియదు సార్.. ఎప్పటినుంచో ఇదే మా ఆవాసం!!

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి

- న్యాయం చేసేవరకూ పోరాడతాం
- ఒక్క రోజులో పంట నష్టం ఎలా అంచనా వేస్తారు?
- కృష్ణా జిల్లా పర్యటనలో వైకాపా అధినేత జగన్

ఈనాడు–అమరావతి, ఈనాడు డిజిటల్–మచిలీపట్నం: 'చంద్రబాబు పాలన మొదలైన 18 నెలల్లో 16 సార్లు తుపాన్లు, కరవు, అనావృష్టి, అకాలవర్షాలు వచ్చి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఒక్క రైతుకైనా ఇన్‌పుట్ రాయితీ ఇచ్చారా? తుపాను ప్రభావం వల్ల రాష్ట్రంలో దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోతే అందులో దాదాపు 11 లక్షల ఎకరాల్లో వరి ఉంది. వైకాపా ప్రభుత్వం ప్రతి రైతుకూ అండగా ఉండేది. ఇప్పుడు తూతూమంత్రంగా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. (మిగతా 3లో)



గూడూరు మండలం ఆకుమర్రు వద్ద పొలాలను పరిశీలిస్తున్న జగన్

చెరువులకు మంచి రోజులు!

- జాతీయ స్థాయిలో ప్రయోగాత్మకంగా వెంగళాయపాలెం చెరువు ఎంపిక
- భూగర్భ జలాల పెంపుదల.. ప్రజలకు ఆహ్లాదకరంగా నిలిచేలా అభివృద్ధి
- ఈ నెల 11న వివిధ రాష్ట్రాల మంత్రులు, ముఖ్య కార్యదర్శుల సందర్శన



వెంగళాయపాలెం చెరువు

చెరువు అభివృద్ధి పనులిలా..

- నాలుగు వైపులా చెరువు కట్టల పటిష్ఠం
- నడక మార్గం (వాకింగ్ ట్రాక్)
- కట్టలపై కొబ్బరి మొక్కలు
- గ్రీన్ ఫెన్సింగ్ ➤ సిమెంట్ బెంచీలు
- సోలార్ లైట్లు ➤ నక్షత్ర వనం అభివృద్ధి
- పిల్లల పార్కు ➤ ఓపెన్ జిమ్, ఆడిటోరియం

ఈనాడు – అమరావతి

సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ పేరుతో గ్రామాల్లో చెరువుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా చేపట్టే ప్రయోగాత్మక ప్రాజెక్టుకు మన రాష్ట్రంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వెంగళాయపాలెం ఎంపికైంది. ఈనెల 10, 11వ తేదీల్లో గుంటూరులో నిర్వహించే జాతీయ స్థాయి వాటర్‌షెడ్ సదస్సుకు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు వివిధ రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖల మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు హాజరు కానున్నారు. వెంగళాయపాలెంలో అభివృద్ధి చేస్తున్న చెరువును వీరు సందర్శిస్తారు. ఇదే మోడల్‌ను దేశంలోని మిగతా రాష్ట్రాల్లోనూ అమలు చేయించాలన్నది కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రధాన ఉద్దేశం. ప్రధానమంత్రి వ్యవసాయ నీటి పారుదల పథకంలో ఇప్పటి వరకు గ్రామాల్లో వర్షపు నీరు, మట్టి సంరక్షణ కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈసారి చెరువులను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వర్షపు నీటి సంరక్షణతోపాటు ప్రజలకు.. ముఖ్యంగా బాలలకు ఆహ్లాదకరంగా ఉండేలా వీటిని తీర్చిదిద్దాలన్నది లక్ష్యం. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టుకు ఏపీని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రూ.1.20 కోట్లతో వెంగళాయపాలెంలో ఇటీవలే చెరువు అభివృద్ధి పనులు (మిగతా 2లో)

నారా భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025'

పురస్కారం ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

గవర్నెన్స్' విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డునూ ఆ సంస్థ వీసీఎండీ అయిన భువనేశ్వరికి ఇదే వేదికపై అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

● ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో ప్రజాసేవ- సామాజిక సాధికారత రంగాల్లో చేసిన విశేష కృషికిగానూ భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' పురస్కారాన్ని అందించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, మహిళా సాధికారత, విపత్తుల్లో సహాయం తదితర అంశాల్లో ఆమె విస్తృత సేవలందిస్తున్నారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థి సహాయ పథకాలు, మహిళల ఆర్థిక స్వావలంబన వంటి సేవా కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. తలసేమియా రోగులకు ఉచితంగా రక్తమార్పిడి చేయిస్తున్నారు. దీనిపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలూ నిర్వహించారు.

● దేశంలోనే ప్రతిష్ఠాత్మక డెయిరీ బ్రాండ్‌గా 'హెరిటేజ్‌'ను తీర్చిదిద్దడం, ఆ సంస్థ ఎదుగుదల, కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు, కోట్ల మంది వినియోగదారులకు ఆ ఉత్పత్తులు చేరువయ్యేలా చేయడంలో భువనేశ్వరిది క్రియాశీలక పాత్ర. ఈ సంస్థ కార్యకలాపాల ద్వారా రైతుల సాధికారతకు ఆమె పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'హెరిటేజ్ ఫుడ్స్' సంస్థకు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును ఆ సంస్థ వీసీఎండీ హోదాలో భువనేశ్వరి అందుకున్నారు.

వసుధైక కుటుంబ భావనతో... కలిసి పనిచేద్దాం

● విజన్ ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి ● లండన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ● భాగస్వామ్య సదస్సుకు రావాలంటూ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం



పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి, సీఎం చంద్రబాబు. హాజరైన అతిథులు

ఈనాడు, అమరావతి: ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న పర్యావరణ మార్పుల సమస్య పరిష్కారానికి దేశాలన్నీ అత్యవసరంగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతికూల వాతావరణంతో పెనుముప్పును ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రాక మునుపే మేల్కోవాలని అభిప్రాయపడ్డారు. వసుధైక కుటుంబమనే భారతీయ భావనతో ప్రపంచ దేశాలన్నీ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ 35 ఏళ్లుగా కార్పొరేట్ రంగానికి సేవలందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సంస్థ... భువనేశ్వరి సేవలను గుర్తించడం సంతోషం' అని చంద్రబాబు అన్నారు. డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025 పురస్కారాన్ని దక్కించుకున్న భువనేశ్వరికి, ఆమెతో పాటు ఈ సంస్థ నుంచి ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్న డాక్టర్ చిగురుపాటి కృష్ణప్రసాద్, ప్రొఫెసర్ పీటర్ బోన్‌ఫీల్డ్, హర్ష్ బీనా ఝువేరీలకూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. విలువలతో కూడిన విధానాలు, సమాజానికి మేలు చేయడం ద్వారా మిగతా కంపెనీలు, పారిశ్రామికవేత్తలూ ఈ అవార్డులకు పోటీ పడాలని ఆయన సూచించారు. ఈనెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో పాల్గొనాల్సిందిగా బ్రిటన్‌లోని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. 'రేపటితరం భవిష్యత్తు కోసం సరైన వేదికలు సిద్ధం చేయాల్సిన బాధ్యత పాలకులు, పారిశ్రామికవేత్తలపై ఉంది. విజన్ ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యం. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు, సంస్థలు వాటి ప్రణాళికలను మార్చుకోవాలి. భౌగోళిక, రాజకీయ మార్పులతో పాటు వాతావరణ సంక్షోభాలను అధిగమించాలి. దూరదృష్టి, పక్కా ప్రణాళిక అవసరం' అన్నారు.

నైపుణ్యానికి ఏఐ పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

పోర్టల్‌లో పౌరుడు, ఉద్యోగార్థులు, విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రం, అంచనా కేంద్రం, శిక్షకులు, అడ్మినిస్ట్రేటర్ విభాగాలుగా లాగిన్లు ఉంటాయి.

● నైపుణ్య కోర్సుల కోసం అభ్యర్థులు నమోదు చేసుకోవచ్చు. అన్నిరకాల శిక్షణ వివరాలు పోర్టల్‌లో ఉంటాయి. కావలసిన రంగాన్ని ఎంచుకుంటే దానికి సంబంధించిన నైపుణ్య కళాశాలలు, కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో కనిపిస్తాయి. అభ్యర్థి అక్కడకు వెళ్లి నచ్చిన కోర్సులో చేరవచ్చు.

● కోర్సు ప్రారంభం, ముగింపు, అర్హతలు, ఏ వయసు వారికి, జాతీయ నైపుణ్య అర్హత ఫ్రేమ్‌వర్క్‌లో అది ఏ స్థాయి శిక్షణ వంటి వివరాలు ఉంటాయి. వీటి వద్ద దరఖాస్తు చేసుకునేందుకు ఐచ్ఛికం ఉంటుంది. అక్కడ క్లిక్ చేసి, మిగతా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఎంత నేర్చుకున్నారు?

● నైపుణ్య శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ఏఐ ద్వారా మదింపు చేస్తారు. అభ్యర్థి ఎంతవరకు నేర్చుకున్నారు? అనే దాన్ని మదింపు చేస్తుంది.

● ఉద్యోగావకాశాలు విభాగంలోకి వెళ్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏయే రంగాలు, విభాగాల్లో ఎక్కడ ఎన్ని ఖాళీలు ఉన్నాయో పోర్టల్‌లో కనిపిస్తాయి.

● అభ్యర్థి ఏదైనా విభాగాన్ని ఎంచుకుంటే దానికి అవసరమైన విద్యార్హతలు, అనుభవం, వయసు, ఉద్యోగం చేయాల్సిన ప్రాంతం తదితర వివరాలు స్క్రీన్‌పై వస్తాయి. వాటిల్లో ఆసక్తి మేరకు ఎంచుకోవచ్చు.

కంపెనీలతో అనుసంధానం..

● ఉద్యోగాలు కల్పించే సంస్థలు, ఉద్యోగులు అవసరమైన కంపెనీలు ఈ పోర్టల్‌లో నేరుగా తమ వద్ద ఉన్న ఖాళీల వివరాలు నమోదు చేసుకోవచ్చు. దీంతో అటు నిరుద్యోగ అభ్యర్థులకు, ఇటు అవసరం ఉన్న కంపెనీలకు మధ్య అనుసంధానం ఏర్పడుతుంది.

● కంపెనీలు పాన్ కార్డు ద్వారా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకుని పూర్తి వివరాలు నమోదు చేయవచ్చు.

4 గంటలు.. 4,000 సమస్యలు

● మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్‌కు పోటెత్తిన బాధితులు..

● అండగా ఉంటామని యువనేత భరోసా



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన 70వ ప్రజాదర్బార్‌కు పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. లోకేశ్ వస్తున్నారనే సమాచారంతో ఉదయం 5 గంటలకే పార్టీ కార్యాలయానికి ప్రజలు చేరుకోవడంతో ప్రాంగణం కిక్కిరిసింది. ఆయన ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు నాలుగు గంటలపాటు సుమారు 4 వేల మంది నుంచి వినతులు స్వీకరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి వేదన విన్నారు. కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వినతులపై అక్కడి నుంచే సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

● తెదేపా కార్యకర్తననే కక్షతో వైకాపా ప్రభుత్వంలో తనపై అక్రమ కేసులు పెట్టారని, వారి ప్రోద్బలంతో తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బుడ్డేపుపేటకు చెందిన దనపాన హరికృష్ణ వాపోయారు.

● వారసత్వంగా వచ్చిన భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన ఎం.రవిబాబు అర్జీ ఇచ్చారు.

● తెదేపా సానుభూతిపరుడిననే కక్షతో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనను వైకాపా ప్రభుత్వంలో విధుల నుంచి తొలగించారని, మళ్లీ ఉద్యోగ అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉలిద్ర రవి విన్నవించారు.

● తన భర్త కంచిపల్లి శ్రీనును కిరాతకంగా హత్యచేసిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని అమలాపురానికి చెందిన మృతుని భార్య విన్నవించారు.

● విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని గరిమెళ్ల అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

● వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఆరోగ్య సహాయకుల (పురుషుల) పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అన్ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

● ప్రకాశం జిల్లాలోని గిరిజన చెంచు, ఆదివాసీ గూడేల్లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నూతన పాఠశాలల మంజూరుకు చర్యలు తీసుకోవాలని నల్లమల గిరిజన చెంచు (పీటీజీ) సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు.

● ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న 23,500 మంది ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతన సవరణతోపాటు ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు.

● చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బి.ఎం.కిశోర్ అర్జీ ఇచ్చారు.

● 'మీ సేవ' సర్వీసుల్ని ఐటీ శాఖ పరిధిలోకి తీసుకురావాలని పలువురు మీ సేవ నిర్వాహకులు కోరారు. వీటి పరిధిలోని రెవెన్యూ సేవల్ని తొలగించడంతో తమ ఆదాయం పూర్తిగా పడిపోయిందని వాపోయారు.

రూ.2 వేల కోట్ల సాస్కీ నిధులతో రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం సహకారంతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తోంది. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నిధులు పొందడంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో సీఎం చంద్రబాబు తగిన సూచనలు అందిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలన్న కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు.

కొత్తగా 8 నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు

ఈనాడు, అమరావతి: అప్పుడే పుట్టిన బిడ్డల సంరక్షణకు ప్రభుత్వ వైద్యశాలల్లో కొత్తగా 8 ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు(ఎస్ఎన్సీయూ) ఏర్పాటు కానున్నాయి. అమలాపురం, కుప్పం, గుంతకల్లు, నూజివీడు, కావలి, కదిరి, శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రులతోపాటు ఎమ్మిగనూరు సీహెచ్‌సీలో వీటిని త్వరలో అందుబాటులోకి తెస్తారు. వీటిద్వారా 80 పడకలు (రేడియంట్ వార్మర్), తక్కువ బరువుతో పుట్టిన, కామెర్లు ఇతరత్రా సమస్యలతో బాధపడుతున్న శిశువులకు వైద్యసేవలు సమకూరతాయి.

ప్రతి నియోజకవర్గంలో ప్రజాదర్బార్ జరగాల్సిందే

● పార్టీ ముఖ్యనేతలతో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రతి నియోజకవర్గంలోనూ తప్పనిసరిగా ప్రజల నుంచి వినతుల స్వీకరణ చేపట్టాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, వారు లేనిచోట నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఈ బాధ్యత తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఈ వ్యవస్థ లేకపోవడంతోనే పార్టీ కేంద్ర కార్యాలయానికి, తన క్యాంపు ఆఫీసుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివస్తున్నారన్నారు. కిందిస్థాయిలో సమస్యలు పరిష్కారమైతే వారు ఇంత దూరం ఎందుకొస్తారని ప్రశ్నించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోనూ ప్రతిరోజు ఓ మంత్రి తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి మంగళవారం వచ్చిన లోకేశ్.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అనగాని సత్యప్రసాద్ సహా ఇతర ముఖ్యనేతలు, కార్యాలయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. 'పార్టీ లోక్‌సభ నియోజకవర్గ కమిటీల్ని త్వరలో ప్రకటించాలి. తెదేపా అనుబంధ విభాగాలకూ అధ్యక్షుల్ని నియమించాలి. పార్టీ కార్యకర్తలకిచ్చే శిక్షణ రాజకీయాలు, సిద్ధాంతాలకే పరిమితం కాకుండా వారి జీవనానికి ఉపయోగపడేలా తరగతులు ఉండాలి. కొందరు పార్టీ క్రమశిక్షణ తప్పుతున్నారు. నేరుగా మీడియా దగ్గరకు వెళుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు' అని లోకేశ్ పేర్కొన్నారు.

వాళ్లు రెచ్చగొడుతుంటే.. మీరు తిప్పికొట్టలేరా?

నకిలీ మద్యం వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయి అరెస్టయిన వైకాపా నేత జోగి రమేష్ కులం పేరుతో బీసీల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారని లోకేశ్ మండిపడ్డారు. 'తప్పు చేసి కులం పేరు వాడుకుని వైకాపావారు తప్పించుకోవాలని చూస్తున్నారు. పార్టీలోని కొందరు నేతలు వారి విమర్శల్ని తిప్పికొట్టడంలో నిర్లక్ష్యంగా ఉన్నారు. వైకాపా వాళ్ల అసత్య ప్రచారాల్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి' అని స్పష్టం చేశారు. తెదేపా కార్యకర్తలు మరణిస్తే చెల్లించే ప్రమాదబీమా సాయం అందజేతలో కొందరు నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

కావ్య కృష్ణారెడ్డిపై ఆగ్రహం

కావలి పరిణామాలపైనా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని తెదేపా కేంద్ర కార్యాలయానికి పిలిపించి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడారు. ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు దశదిన కర్మకు ఎందుకు వెళ్లలేదని కావ్య కృష్ణారెడ్డిని నిలదీశారు. సుబ్బానాయుడు దశదిన కర్మలో జరిగిన పరిణామాల గురించి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో అందర్నీ కలుపుకొనిపోవాలని సూచించారు. సుబ్బానాయుడితో తనకు విభేదాలు లేవని, ఆయన సూచించిన వారికి పదవులు ఇచ్చానని కృష్ణారెడ్డి వివరణ ఇచ్చారు.

సెక్యూరిటీల వేలంలో రూ.వెయ్యి కోట్ల రుణం

ఈనాడు, అమరావతి: రిజర్వు బ్యాంకు మంగళవారం నిర్వహించిన సెక్యూరిటీల వేలంలో రాష్ట్ర ప్రభుత్వం పాల్గొని రూ.వెయ్యి కోట్ల రుణం సమీకరించింది. ఈ మొత్తం 12 ఏళ్లలో తిరిగి చెల్లించేలా 7.30 శాతం వడ్డీకి సమీకరించింది.

గుంతల్లేవు.. నీళ్లలోనే నిశ్చింతగా వెళ్లొచ్చు!



వరదలు, వరుస ప్రమాదాలకు పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. విజయవాడలో చెరువులా మారిన రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోకుండా 'ఇక్కడ గుంతలు లేవు..' అని ట్రాఫిక్ పోలీసులు ప్లకార్డులు పట్టుకొని నిల్చుంటున్నారు. విజయవాడ సమీపంలోని ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల వద్ద కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి చిన్న వర్షానికే చెరువులా మారుతోంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు నరకం చూస్తున్నారు. మంగళవారం వచ్చిన వర్షానికి రోడ్డంతా నీటితో నిండిపోయింది. ఆ నీటిలో గుంతలు కనిపించక వాహనదారులు నెమ్మదిగా వెళ్తుండటంతో.. "ఇక్కడ గుంతలు లేవు. మీరు నిశ్చింతగా వెళ్లొచ్చు' అని ఓ ట్రాఫిక్ పోలీసు ప్లకార్డు పట్టుకొని వాహనదారులకు ధైర్యం చెప్పారు. – ఈనాడు, అమరావతి

గూడ్సు రైలును ఢీకొట్టిన ప్యాసింజర్

(మొదటి పేజీ తరువాయి)

స్థలానికి చేరుకుని క్షత గాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ఆ మార్గంలో వెళ్లే రైళ్లకు పూర్తి అంతరాయం కలిగింది. పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5లక్షల చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున రైల్వే శాఖ పరిహారం ప్రకటించింది. ప్రమాద ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

రెడ్ సిగ్నల్‌ను జంప్ చేయడం వల్లే..

ప్రయాణికుల రైలు రెడ్ సిగ్నల్‌ను దాటి ముందుకు వెళ్లడంతోనే ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు రైల్వే బోర్డు ప్రాథమికంగా అంచనా వేసింది. లోకో పైలట్ విద్యాసాగర్ రెడ్ సిగ్నల్‌ను గమనించకుండా రైలును ముందుకు నడిపి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదంలో ఆయన కూడా మృతి చెందారు. సహాయక లోకో పైలట్‌గా ఉన్న రష్మీ రాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గూడ్సు రైలు చివరన బ్రేక్ వ్యానులో ఉన్న గార్డు కిందికి దూకేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాద సమయంలో గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో ప్యాసింజరు రైలు వెళ్లి ఉంటుందని, కనిపించేంత దూరంలోనే గూడ్సు రైలు ఉన్నప్పటికీ సడన్ బ్రేకు వేయలేకపోవడంతోనే ఢీకొని ఉంటుందని రైల్వే సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

విశాఖలో స్వల్ప భూ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాన్ని గుర్తించినట్లు 'నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ' తొలుత పేర్కొంది. అక్కడ దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.7గా నమోదైనట్లు తెలిపింది. అయితే తర్వాత సవరించి విశాఖ సాగర తీరంలో తొట్లకొండ బౌద్ధారామానికి సమీపంలో 10 కి.మీ. లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు ప్రకటించింది. అక్కడ దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4 గా నమోదైందని వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండల కేంద్రంలోనూ తెల్లవారుజామున భూమి కంపించింది. జి.మాడుగుల పంచాయతీ జంగాలమెట్ట గ్రామంలో ఉదయం జి.పూర్ణమ్మ ఇంటి గోడ కూలిపోయింది. భూమి కంపించడంతో భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన కొద్దిసేపటికే మట్టి గోడ కూలిందని ఆమె చెప్పారు. మండలంలోని గొప్పవీధి, వంజరి, కుంబిడిసింగితో పాటు పలు గ్రామాల్లో భూమి కంపించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

చెరువులకు మంచి రోజులు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. ఈనెల 10న ప్రారంభించే జాతీయ స్థాయి సదస్సు నాటికి ఈ పనులను పూర్తి చేయనున్నారు.

అభివృద్ధి చేశాక పంచాయతీలకు అప్పగింత

● దేశంలో జిల్లాకో చెరువును అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ఏపీ మోడల్‌ను అమలు చేసేలా ఆదేశాలివ్వనుంది.

● చెరువులను అభివృద్ధి చేశాక నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించనున్నారు. వాటిలో చేపల పెంపకం, కొబ్బరి మొక్కల ద్వారా వచ్చే ఆదాయంతో నిర్వహణ చేపట్టేలా ప్రణాళిక తయారు చేస్తారు.

● రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోనూ చెరువుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించనుంది.

తల్లి తర్వాత భార్యాబిడ్డలకే ప్రాధాన్యమివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. భర్త తనను, తన బిడ్డలను వదిలేసినందున ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ముగ్గురికీ కలిపి నెలకు రూ.30 వేల భరణం ఇప్పించాలని బాధితురాలు కింది కోర్టును ఆశ్రయించగా సదరు కోర్టు ఒక్కో బిడ్డకు రూ.6 వేల చొప్పున మాత్రమే ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని సవాల్ చేస్తూ బాధితురాలు హైకోర్టును ఆశ్రయించగా అక్కడా అదే తీర్పు వచ్చింది. దాంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ చేపట్టిన ధర్మాసనం భార్య, ఇద్దరు బిడ్డలకూ కలిపి నెలకు రూ.25 వేల చొప్పున భరణం కింద ఇవ్వాలని స్పష్టంచేసింది. అయితే తనకు తల్లి, మతిస్థిమితం లేని పెళ్లికాని సోదరి ఉన్నందున వారి ఆలనాపాలనా కూడా చూసుకోవాల్సి ఉన్నందున భార్యాబిడ్డలకు ఇప్పుడిస్తున్న భరణాన్ని పెంచవద్దని భర్త తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఆమె పేరిట రెండున్నర ఎకరాల పొలం, 300 గజాల్లో తాను నిర్మించిన ఇల్లు కూడా ఉందని, దానికి నెలకు రూ.10,500 ఈఎంఐ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ ఇంటికి రూ.15 వేల అద్దె, కాకినాడ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూమికి ఏటా రూ.3.50 లక్షల దాకా ఆదాయం వస్తోందని, అందువల్ల ఇప్పుడున్న మెయింటెనెన్స్‌ని పెంచొద్దని కోరారు. ఆ వాదనలను న్యాయమూర్తులు తోసిపుచ్చారు. 15 ఏళ్ల పిల్లలకు రూ.6 వేల చొప్పున ఇస్తే ఏమొస్తుంది? కనీసం యూనిఫాం కూడా రాదని న్యాయమూర్తి పేర్కొన్నారు. తాను పిఠాపురంలో అద్దె ఇంట్లో ఉన్నానని భర్త తన న్యాయవాది ద్వారా తెలపగా అందుకు న్యాయమూర్తి స్పందిస్తూ "అది మీ సమస్య. మీరు భార్య, బిడ్డలను వదిలేసినప్పుడు.. దానివల్ల ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోవాల్సిందే. తల్లి తర్వాత భార్యాబిడ్డలకే ప్రాధాన్యం ఇవ్వాలి" అని పేర్కొన్నారు. నెలకు రూ.1.16 లక్షల స్థూల వేతనం పొందుతున్న వ్యక్తి రూ.25 వేల భరణం ఇవ్వడంలో తప్పులేదని పేర్కొన్నారు. ఏటా 5% పెంచుతూ పోవాలని నిర్దేశించారు.

భోగాపురంలో విమానయాన విశ్వవిద్యాలయం!

(మొదటి పేజీ తరువాయి)

91.7 శాతం పూర్తయ్యాయని, డిసెంబరులో ఫ్లైట్ టెస్ట్ ఉంటుందని ప్రకటించారు. అన్ని పరీక్షలూ పూర్తయ్యాక జనవరి నాటికే విమానాలు ఎగురుతాయని చెప్పారు. దీంతో ఆర్థిక, వాణిజ్య రంగాలకు ఈ ప్రాంతం కేంద్ర బిందువుగా మారనుందన్నారు.

ఇండిగో హబ్..: కార్యకలాపాలు ప్రారంభమయ్యే నాటికి ఈ ప్రాంతంలో ఫైవ్‌స్టార్ హోటళ్లు వస్తాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ట్యాక్సీవే, రన్‌వే నిర్మాణ పనులు ప్రపంచ ప్రమాణాలతో వేగవంతంగా జరిగాయన్నారు. నావిగేషన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పరంగా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకు తన మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని ఎయిర్ లైన్ల కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఇండిగో సంస్థ ప్రతినిధులతో మాట్లాడామని చెప్పారు. ఇక్కడ ఇండిగో హబ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. కనెక్టివిటీ పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని చెప్పారు. భవిష్యత్తులో విశాఖ నగరం ఏవి హబ్‌గా మారనుందని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. దీనికి భోగాపురం విమానాశ్రయం కీలకం కానుందన్నారు. ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామన్నారు. కేంద్ర మాజీ మంత్రి, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు వేసిన పునాది నేడు ఈ స్థాయికి చేరుకుందని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి వెంట విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, జీఎంఆర్, ఎల్అండ్‌టీ సంస్థల ప్రతినిధులున్నారు.

గ్రహం అనుగ్రహం

5–11–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, శుక్లపక్షం

పూర్ణిమ: రా. 7-12 తదుపరి బహుళ పక్ష పాడ్యమి

అశ్విని: ఉ. 10-16 తదుపరి భరణి

వర్జ్యం: ఉ. 6-34 నుంచి 8-03 వరకు తిరిగి రా. 7-13 నుంచి 8-43 వరకు

అమృత ఘడియలు: తె. 4-11 నుంచి 5-40 వరకు

దుర్ముహూర్తం: ఉ. 11-21 నుంచి 12-07 వరకు

రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు

సూర్యోదయం: ఉ.6.04; సూర్యాస్తమయం: సా.5.25

కార్తిక పూర్ణిమ, జ్వాలాతోరణం, గురునానక్ జయంతి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	25.0
నరసాపురం	34.0	26.7
తిరుపతి	33.6	25.6
విజయవాడ	33.6	25.6
నెల్లూరు	33.1	27.4
తాడేపల్లిగూడెం	33.0	27.0
అనంతపురం	32.6	23.2
ఒంగోలు	32.0	26.4
కడప	32.0	24.0
శ్రీకాకుళం	32.0	24.0
గుంటూరు	31.0	26.0
విజయనగరం	31.0	24.0
విశాఖపట్నం	30.6	26.0
హైదరాబాద్	29.0	23.2
కర్నూలు	28.9	23.8
సూర్యాపేట	26.5	25.0

అగ్రిగోల్డ్ భూముల్లో.. అడ్డగోలు పాగా

- నిషేధిత జాబితాలో ఉన్న భూమిపై జోగి రమేష్ కన్ను
- నకిలీ పత్రాలతో.. కుమారుడు, బాబాయి పేరిట రిజిస్ట్రేషన్
- ఆరు నెలల్లో అమ్మేసి రూ.10 కోట్లకు పైగా కాజేశారు





జోగి రాజీవ్, వెంకటేశ్వరరావు పేర్లతో అక్రమంగా రిజిస్టర్ చేసి, అనంతరం అమ్మేసిన అగ్రిగోల్డ్ భూమి ★ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు జోగి రమేష్.. మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని వివాదాల్లో ఉన్న ఆస్తులపై కన్నేసి.. వాటిని సొంతం చేసుకునేందుకు జోగి ఎంతకైనా తెగించేవారన్న ఆరోపణలున్నాయి. నిషేధిత జాబితాలోని అగ్రిగోల్డ్ భూములనూ వదల్లేదు. తన కుమారుడు జోగి రాజీవ్, బాబాయి జోగి వెంకటేశ్వరరావు పేర్లతో అగ్రిగోల్డ్‌కు చెందిన విలువైన భూములను 2022లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వాటిని అమ్మేసి రూ.10 కోట్లకు పైగా సొమ్ము చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు రాజీవ్, వెంకటేశ్వరరావులను అరెస్టు చేయగా.. బెయిల్‌పై బయట కొచ్చారు. ఈ ఏడాది మేలో ఏసీబీ, సీఐడీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా రంగంలోకి దిగారు. భూములను సర్వే నంబర్ల ఆధారంగా గుర్తించి, అక్రమాలకు ఎలా పాల్పడ్డారో.. క్షేత్రస్థాయిలో అందరినీ విచారించి, నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురంలోని అగ్రిగోల్డ్ భూములను అధికారులు.. ఈడీకి ఎటాచ్ చేసి నిషేధిత జాబితాలో పెట్టారు. వైకాపా ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జోగి రమేష్ కన్ను వీటిపై పడింది. పూర్వ యజమానుల దగ్గర ఆ భూములను కొన్నట్లు పత్రాలను సృష్టించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారుల సహకారంతో సర్వే నంబరు మార్చి తన కుమారుడు, బాబాయి పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం వాటిని ఏడు ప్లాట్లుగా విభజించి అమ్మేశారు. కొన్నవారికి పాత సర్వే నంబరుతోనే రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం.

అక్రమాలపై అధికారుల నివేదిక

అధికారుల బృందం ఐదు నెలల కిందట ఈ భూములను పరిశీలించి.. సర్వే నంబర్ల వారీగా కొలతలు వేసి. . మార్కింగ్ చేసింది. యజమాని అవ్వా వెంకట శేషనారాయణ, ఆయన కుటుంబసభ్యులు, సరిహద్దు స్థలాల యజమానులను విచారించింది. కొత్త, పాత సర్వే నంబర్లు, భూమి పత్రాలు, అప్రూవల్ లే ఔట్ డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి నివేదికను తయారుచేసింది. దాని ప్రకారం.. ఈ నిషేధిత భూమి సర్వే నంబరు 87లో ఉంది. కానీ 88లో ఉన్నట్టు చూపి, ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సర్వే నంబరు 87లోని అగ్రిగోల్డ్‌కు చెందిన తొమ్మిది ప్లాట్లు, మధ్యలో ఉన్న 445 చ.గ., 209.5 చ.గ. రహదారులను కలిపి చుట్టూ ప్రహరీని నిర్మించారు. తొమ్మిది ప్లాట్ల స్థలం 1,540.10 చ.గ., రహదారులతో కలిపితే 2,194.60 చ.గ. అని అధికారులు కొలతలు వేసి గుర్తించి నివేదికలో పొందుపరిచారు.

స్వీయ సవరణతో మార్చేసి మరీ..

◆ 2022 డిసెంబరు 9న రాజీవ్ పేరుతో 1,074 చ.గ.లను ఆర్ఎస్ నం.88లో కొనుగోలు చేసినట్లు దస్తావేజు 7,589లో చూపించారు. వాస్తవంగా ఆ సర్వే నంబరులో ఈ భూమి లేదు. దీంతో వేరొకరికి అమ్మడం కుదరదు. అందుకే.. మళ్లీ స్వీయ సవరణ ద్వారా దస్తావేజు నం.2,674, 2,675, 2,673లో 2023 ఏప్రిల్ 29న సర్వే నంబరు 87లోకి మార్చారు.

◆ 2022 సెప్టెంబరు 9న.. వెంకటేశ్వరరావు పేరుతో 1,086 చ.గ.లను ఆర్ఎస్ నం.88లో కొనుగోలు చేసినట్లు దస్తావేజు 7,592లో చూపించారు. దీనినీ 2023, ఏప్రిల్ 29న స్వీయ సవరణ దస్తావేజు నం.2,676 ద్వారా సర్వే నం.87లోకి మార్చేశారు. అనంతరం ఈ స్థలాలను అమ్మేసి.. వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేసేశారు.

◆ 2,194.60 చ.గ. భూమిని తమ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేసుకుని... ఆరు నెలల్లోనే 208.05 గజాల చొప్పున ఏడు ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. 2023 మే 31న వేరేవారికి రిజిస్ట్రేషన్లు చేసేశారు. వారి నుంచి రూ.10 కోట్ల వరకూ దండుకున్నారు.

◆ భూమిని కొని మోసపోయామంటూ.. పడిగపాటి బాలమ్మ, సోముల దుర్గాభవాని, సోముల వెంకటేశ్వరరెడ్డి, పడిగపాటి సుబ్బారెడ్డి తదితరులు.. అధికారులను కలిసి తమ దగ్గరున్న దస్తావేజులను చూపించారు. అవి అగ్రిగోల్డ్ భూములని తెలియక కొన్నామని వాపోయారు.

జోగి భూ అక్రమాలు ఎన్నెన్నో...

◆ పెడన నియోజకవర్గంలో ఓ వ్యక్తి చనిపోవడంతో ఆయన భూమిపై జోగి వర్గం కన్నుపడింది. ఆయన తల్లి, భార్య మధ్య ఆస్తి విభేదాలు రావడంతో.. మధ్యలో జోగి కలగజేసుకున్నారనే ఆరోపణలున్నాయి. మధ్యవర్తిత్వంలో కొంత భూమిని తన బినామీ అయిన ఓ అనుచరుడి పేరుపైకి మార్చినట్లు తెలుస్తోంది.

◆ జోగి ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్నప్పుడే తీరప్రాంతంలో 1,500 ఎకరాల వరకూ మడ అడవులను కొట్టేసి చేపల చెరువులు తవ్వేశారు. వీటిలోనూ తన బినామీ పేర్లతో 50 ఎకరాల వరకూ కబ్జా చేసినట్లు ఆరోపణలున్నాయి.

◆ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో ఎకరా రూ.3 లక్షల చొప్పున 30 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయంటూ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన వీరవెంకట ప్రసాద్, ఆయన కుమారుడు కల్యాణ్‌ను జోగి రమేష్, తన అనుచరులు నమ్మించి రూ.90 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత భూమి చూపించకుండా బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది.

ఏపీ విద్యా సంస్థలతో లండన్ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం

ఈనాడు, అమరావతి: లండన్‌లోని విశ్వవిద్యాలయాలు లైఫ్ సైన్సెస్, బయో జెనెటిక్స్, ఖనిజాల వెలికితీత తదితర అంశాల్లో ఏపీలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకునే విషయంపై అక్కడి భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామితో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. లండన్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబును దొరైస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్‌లోని వివిధ యూనివర్సిటీలు ఏపీతో భాగస్వామ్యమయ్యేందుకు ఉన్న అవకాశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'ఆయా యూనివర్సిటీలు కేంద్రాలను ఏపీలో ప్రారంభించేలా అంశాన్ని పరిశీలించాలి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసేలా చూడాలి. యూనివర్సిటీలు, విద్యా సంస్థల మధ్య విద్యార్థుల పరస్పర మార్పిడిపై దృష్టి పెట్టాలి. ఏఐ, సెమీకండక్టర్, స్పేస్ టెక్నాలజీ, కోర్ ఇంజినీరింగ్, మెరైన్ ఇండస్ట్రీ 4.0లో సహకరించాలి' అని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు సహించం: అనిత



తుళ్లూరు ఎస్డీపీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తదితరులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: "రాజధాని రైతుల త్యాగాలతోనే అమరావతి నిర్మాణం జరుగుతోంది. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధానిలో సుమారు ఎకరం భూమి కేటాయించి తుళ్లూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్డీపీవో) కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత వైకాపా ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీఎస్పీ కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించుకోవడం శుభపరిణామం" అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. పోలీసులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టి ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాజధాని గ్రామం వెలగపూడి సమీపంలో నిర్మించిన తుళ్లూరు డీఎస్పీ కార్యాలయాన్ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, పోలీసు అధికారులతో కలిసి హోం మంత్రి అనిత మంగళవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్నటువంటి వ్యవస్థ ఓ లాజిస్టిక్స్ అక్కడి పోలీసు రాయి విసిరిన వీడియోను.. ఏం సాయంతో మన రాష్ట్రంలో జరిగినట్లుగా సృష్టించి వైకాపా సోషల్ మీడియా విభాగం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో ఎస్పీ క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

6 లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్-విజయవాడ మధ్య 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ రహదారిలో 40 నుంచి 269 కిలోమీటరు వరకు మొత్తం 229 కి.మీ.ను నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరించడానికి అవసరమైన భూసేకరణ కోసం తెలంగాణ, ఏపీల్లో అధికారులను నియమిస్తూ కేంద్ర రహదారి, రవాణాశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ మండలంలో 4, కంచికచర్లలో 4, జగ్గయ్యపేటలో 7, పెనుగంచిప్రోలులో 3, ఇబ్రహీంపట్నంలో 12, విజయవాడ రూరల్‌లో 1, విజయవాడ వెస్ట్‌లో 2, విజయవాడ నార్త్ పరిధిలోని 1 గ్రామంలో భూసేకరణ చేపట్టే బాధ్యతలను అక్కడి జాయింట్ కలెక్టర్లకు అప్పగించారు.

రాజధాని నిర్మాణానికి సలహాలు ఇవ్వొచ్చు

ప్రజలకు సీఆర్డీఏ అవకాశం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రపంచస్థాయి రాజధాని ప్రాంతాన్ని నిర్మించేందుకు ఏపీ సీఆర్డీఏ విజన్-2047 కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందుకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను కోరుతోంది. సీఆర్డీఏ ప్రాంతం సుమారు 8600 చ.కి.మీ. విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద ప్రణాళిక ప్రాంతాల్లో ఒకటిగా నిలుస్తోంది. ఇందులో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరుజిల్లాల్లోని 56 మండలాలు.. విజయవాడ, గుంటూరు, అమరావతి, మంగళగిరి-తాడేపల్లి నగరాలతో పాటు 900కు పైగా గ్రామాలు ఉన్నాయి. ఇందులో భాగస్వాములు కావాలనుకునే వారు సీఆర్డీఏ వెబ్‌సైట్ (సీఆర్డీఏ.ఏపీ.జీవోవీ.ఇన్)లోకి వెళ్లి లింక్‌పై క్లిక్ చేయడం లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

క్యూఆర్ కోడ్

వైకాపా హయాంలో వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు బారికేడ్లు అడ్డుపెట్టుకుని, ఉన్నతాధికారులతో వరిపైరును తెప్పించుకుని పరిశీలించిన జగన్‌మోహన్‌రెడ్డికి నేడు అన్నదాతలను కలిసి పరామర్శించే అర్హత లేదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.



నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి. న్యాయం చేసే వరకూ పోరాటం చేస్తాం' అని వైకాపా అధినేత జగన్ పేర్కొన్నారు. మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు ఆయన మంగళవారం కృష్ణా జిల్లాలో పర్యటించారు. పెనమలూరు, పెడన, పామర్రు, మచిలీపట్నం నియోజకవర్గాల్లో పాడైన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారి కష్టాలు తెలుసుకున్నారు. అనంతరం గూడూరు మండలం ఆకుమర్రు లాకు దగ్గర విలేకర్లతో మాట్లాడారు.

ఉచిత బీమా తొలగించారు

'పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామన్నారు. రెండేళ్లకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.5 వేలు ఇచ్చారు. ఉచిత పంటల బీమా కూడా చేయలేదు. రూ.263కే వచ్చే యూరియా బస్తాను రూ.500-రూ.600కు కొని రైతులు నష్టపోతున్నారు. మేం ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాం. చంద్రబాబు ప్రభుత్వంలో 19 లక్షల మంది రైతులకే బీమా చేయించారు. అదీ బ్యాంకు రుణాలు తీసుకున్నవారికే. ఉచిత పంటల బీమా తీసేయటం దారుణం' అని జగన్ విమర్శించారు. 'తుపాను నష్టం అంచనాకు ఒక్కరోజే సమయం ఇస్తే ఎలా సాధ్యం? వివరాలు ఇచ్చిన వారి పంట కొనాలని ఆదేశాలిచ్చారు. నష్టాన్ని తక్కువగా చూపిస్తున్నారు. సీఎం ఇంగ్లండ్ వెళ్లారు. ఆయన కుమారుడు ఆస్ట్రేలియా నుంచి వచ్చి ముంబయిలో క్రికెట్ చూసేందుకు వెళ్లారు. ప్రభుత్వం రైతుకు మంచి చేయాలి. నష్టం ఎందుకు చేస్తోంది?' అని ప్రశ్నించారు.

పొలంలోకి దిగితేనే నష్టం తెలిసేది

'తుపాను ప్రభావంతో పంట ఎలా నష్టపోయిందనే విషయం పొలంలో దిగి చూస్తేనే కదా తెలిసేది. ఎవరూ పొలాల్లోకి రాలేదు. అయినా నష్టాన్ని లెక్కించినట్లు చెబుతున్నారు. పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ రాయితీ, పరిహారం ఇవ్వాలి, పంటలను కొనాలి. ఇక్కడ ఒకటి వస్తే మరోటి రాదు. తెదేపా రైతులకు భూమి కన్నా ఎక్కువ వివరాలు నమోదు చేస్తున్నారు. పర్చూరులో 112%, జె.పంగులూరులో 114%, బల్లికురవలో 115%.. ఇలా అనేకచోట్ల ఎక్కువగా నమోదు చేశారు. రైతులకు మేలు జరిగేవరకూ వారికి తోడుగా నిలుస్తాం' అని జగన్ ప్రకటించారు.

అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చే జగన్‌కు ఏం తెలుస్తుంది?

మంత్రి లోకేశ్ ఎద్దేవా

ఈనాడు, అమరావతి: అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చే వైకాపా అధ్యక్షుడు జగన్‌కు తుపాన్ సమయంలో ప్రభుత్వం ప్రజల్ని ఆదుకున్న విషయం ఎలా తెలుస్తుంది అని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. "అప్పుడప్పుడు ఏపీకి వచ్చే జగన్.. ఎప్పుడూ జనం మధ్య ఉండే మా వైపు ఒక వేలెత్తి చూపిస్తున్నారు. మిగతా నాలుగు వేళ్లు ఆయన వైపే చూపుతున్నాయన్నదాన్ని జగన్ మర్చిపోతున్నారు. తుపాన్ హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి సాధారణ పరిస్థితి నెలకొనే దాకా సీఎం నుంచి ఎమ్మెల్యే వరకు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి గ్రామ కార్యదర్శి వరకు అంతా ప్రజల చెంతే ఉన్నాం. ప్రజల్ని ఆదుకున్నాం. ఇవన్నీ జగన్‌కు తెలియడానికి ఆయన ఇక్కడ లేరు" అని విమర్శించారు.

అప్పుడు నేలమీదకు దిగని జగన్‌కు.. ఇప్పుడు రైతులు గుర్తొచ్చారా?

మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి-కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తుపాన్లు, కరవు పరిస్థితులొచ్చినప్పుడు గాలి పర్యటనలు చేస్తూ నేలమీదకు దిగని జగన్‌కు ఇప్పుడు రైతులు గుర్తొచ్చారా అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కిష్టుపురం సభలో, అంతకుముందు ఓ ప్రకటనలో జగన్‌పై అచ్చెన్నాయుడు విమర్శలు గుప్పించారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు, కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని జగన్‌కు సవాల్ విసిరారు. "వైకాపా హయాంలో తుపాన్లతో రైతులకు రూ.20 వేల కోట్ల పంటనష్టం జరిగితే, పెట్టుబడి రాయితీగా రూ.1,612 కోట్లే ఇచ్చారు. మొంథా తుపాన్ వల్ల 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగున్నర లక్షల ఎకరాల వరి, 37 వేల ఎకరాల వరకు ఉద్యానపంటలు దెబ్బతిన్నట్లు అంచనాకు వచ్చాం. మరింత సమగ్రంగా నష్టాన్ని అంచనా వేసేందుకు మరో నాలుగు రోజుల గడువిచ్చాం' అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

అడుగడుగునా అరాచకమే

- అడ్డగోలు జన సమీకరణతో నిబంధనలకు పాతర
- రోజంతా నరకం చూసిన ప్రయాణికులు



పెనమలూరు కూడలిలో అభివాదం చేస్తున్న జగన్, బందరు రోడ్డులో కిలోమీటర్ల పొడవునా నిలిచిన ట్రాఫిక్

ఈనాడు-అమరావతి, ఈనాడు డిజిటల్-మచిలీపట్నం, న్యూస్‌టుడే బృందం: మొంథా తుపానుతో నష్టపోయిన రైతుల కష్టాలు తెలుసుకునేందుకు మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో జగన్ పర్యటించారు. ఈ పర్యటన ఆసాంతం వైకాపా శ్రేణులు షరతులు ఉల్లంఘిస్తూ పేట్రేగిపోయాయి. పుట్టెడు నష్టాల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతుల దగ్గరకు వెళ్తూ.. డీజేలు పెట్టి డ్యాన్సులు చేశారు. అనుమతి ఇచ్చేందుకు పెట్టిన ఒక్క షరతునూ లెక్కచేయకుండా అడుగడుగునా అరాచకంగా పర్యటన సాగింది.

షరతు-1: హైవేపై గుమిగూడకూడదు. రాకపోకలకు, ప్రజా జీవనానికి అంతరాయం కలిగించకూడదు

అతిక్రమణ: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై జగన్ పర్యటన మొదలైనప్పటి నుంచి సాధారణ ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పర్యటన బెంజ్ సర్కిల్ చేరే సమయానికి దాదాపు 3 కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించింది. ఉదయం ఎండ ఎక్కువగా ఉండడంతో ప్రజలు నీరుగారిపోయారు. ట్రాఫిక్ క్లియర్ అవడానికి చాలా సమయం పట్టింది.

షరతు-2: పర్యటన అనుమతి సమయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకే. రామరాజుపాలెం, ఆకుమర్రు, సీతారామపురం, ఎస్ఎన్‌గొల్లపాలెంలో మాత్రమే పర్యటనకు అనుమతి ఉంది

అతిక్రమణ: విజయవాడలో పర్యటన మొదలైనప్పటి నుంచి అడుగడుగునా ఆగుతూనే ఉన్నారు. రైతులను కలిసేందుకు వెళ్తున్నట్లు చెప్పిన కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచారయాత్రలా మార్చేశారు. మధ్యాహ్నం 2 గంటలకే పర్యటన ముగించాల్సి ఉన్నా రాత్రి వరకు కొనసాగింది.

షరతు-3: పర్యటనకు అనుమతి ఉన్న ప్రాంతాల్లో 500 మందికి, 10 వాహనాలే వెళ్లాలి. ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు.

అతిక్రమణ: రైతుల దగ్గరికి వెళ్తూ.. బలప్రదర్శనకో, ప్రచారసభకో జనాన్ని పోగేసినట్లు తీసుకొచ్చారు. అనుమతికి మించి వాహనాలు ఉండటంతో ఉయ్యూరు మండలం గండిగుంటలో కాన్వాయ్ వాహనాలు ఢీకొని.. నాలుగు వాహనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. జాతీయ రహదారి పొడవునా సాధారణ వాహనాలు కదిలేందుకు దారివ్వకపోవడంతో ర్యాలీకి, ద్విచక్రవాహనాలకు అనుమతి లేకున్నా అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాల హారన్లు కొడుతూ, పైకి లేపి విన్యాసాలు చేస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశారు.

రప్పా రప్పా.. సీఎం సీఎం

ఆకుమర్రు లాకు దగ్గర జగన్ మీడియా సమావేశం ముందు వైకాపా శ్రేణులు రప్పా రప్పా.. సీఎం సీఎం అని నినాదాలు చేశారు. పోలీసులను తోసుకుంటూ ముందుకెళ్లారు.

షరతు-4: పరిమితికి మించిన వాహనాలను, ప్రజలను సమీకరించకూడదు. తొక్కిసలాట జరగకుండా, ప్రజాజీవనానికి అసౌకర్యం కలగకుండా పోలీసుల తీసుకునే భద్రతా చర్యలను అతిక్రమించకూడదు

అతిక్రమణ: పామర్రు మండలం గోపువానిపాలెంలో హైవేపై వైకాపా శ్రేణులు ట్రాఫిక్ ఇబ్బంది సృష్టించడంతో. . నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించిన పోలీసులతో మాజీ ఎమ్మెల్యే అనిల్ వాగ్వాదానికి దిగారు. ఏం చేసుకుంటారో చేసుకోండి.. హైవే పైనే ఉంటాం.. పోలీసుల జులుం నశించాలి.. సీఐ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయించారు. షరతులకు మించి జనాన్ని ఆటోల్లో తీసుకొచ్చిన పేర్ని కిట్టును పోలీసులు అడ్డుకోగా.. ఎస్సైతో గొడవకు దిగారు. పోలీసులను తోసుకుంటూ జనాన్ని పంపించారు. జగన్ వాహనానికి ముందున్న కారుకు రెండు వైపులా మాజీ మంత్రి పేర్ని నాని, దేవినేని అవినాష్ వేలాడుతూ ప్రయాణించారు.



బందరు రోడ్డుపై పోలీసులు వారిస్తున్నా బాణసంచా కాలుస్తున్న వైకాపా కార్యకర్తలు

షరతు-5: డీజేలు వినియోగించేందుకు అనుమతి లేదు. . ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తాం

అతిక్రమణ: వైకాపా నేతలు పెనమలూరు పరిధిలోని గోసాలలో డీజేలు ఏర్పాటుచేశారు. వైకాపా పాటలు పెట్టి డ్యాన్సులు వేశారు.

సొమ్ములు ఇచ్చి.. వాహనాలు పెట్టి...

జగన్ పర్యటనకు వచ్చిన వారిలో ఎక్కువ మందికి సొమ్ములు ఇచ్చి.. వాహనాలు పెట్టి తరలించారు. టిఫిన్, భోజనం పెట్టి, మద్యం సీసాలు ఇచ్చి భారీగా సమీకరించారు. పర్యటన ఆసాంతం రహదారిని ఆక్రమించి జెండా కర్రలు ఊపుతూ వీరంగం సృష్టించారు. జై జగన్ అని అరుస్తూ, ఈలలు వేస్తూ, కేకలు పెడుతూ కనిపించారు.








పెడన నియోజకవర్గం గూడూరు కూడలి వద్ద పోలీసు ఆంక్షలు ఉల్లంఘించి జాతీయ రహదారిపైకి చేరిన వైకాపా కార్యకర్తలు ★ జగన్ కాన్వాయ్ కారణంగా గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం ★ జగన్ వాహనం ముందు కాన్వాయ్‌లో వేలాడుతూ ప్రయాణిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని, దేవినేని అవినాష్

రుణం తక్కువ.. వసూళ్లు ఎక్కువ

కోర్టుకెక్కిన విజయ్ మాల్యా



బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: తనకు బ్యాంకులు ఇచ్చిన రుణం కన్నా.. ఎక్కువ మొత్తంలో వసూలు చేశాయని విదేశాల్లో తలదాచుకున్న పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా అభ్యంతరం తెలిపారు. తన నుంచి వసూలు చేసిన అసలు, వడ్డీలకు మరోసారి కొత్తగా వడ్డీ విధిస్తున్నారని ఆరోపిస్తూ కర్ణాటక హైకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలుచేశారు. యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌లో తాను, తన కంపెనీ తీసుకున్న రుణాల్లో బకాయిల వివరాలను బ్యాంకులు విడుదల చేయాలని ఆదేశించాలని కోరుతూ ఈ వ్యాజ్యం వేశారు. ఈ వ్యాజ్యం జస్టిస్ కన్నెగంటి లలిత ధర్మాసనం ముందుకు మంగళవారం విచారణకు వచ్చింది. తన నుంచి రూ.10 వేల కోట్లు వసూలు చేశామని రుణ వసూలు ట్రైబ్యునల్ నివేదిక ఇవ్వగా, కేంద్ర ఆర్థికమంత్రి మాత్రం రూ.14 వేల కోట్లు వసూలు చేశామని లోక్‌సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. చెల్లించిన రుణానికి కూడా మళ్లీ వడ్డీ వేస్తున్నట్లు ఉందని మాల్యా తరఫు న్యాయవాది వాదించారు. రుణాలు ఇచ్చిన బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసి తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

ఈనాడు

రహదారి భద్రత మెరుగుపడేదెన్నడు?

రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ దగ్గర మొన్న పొద్దున్నే జరిగిన ఘోరప్రమాదంలో పందొమ్మిది మంది కంకర రాళ్ల కింద మాత్రమే కూరుకుపోయి మరణించలేదు! ప్రజాభద్రత పట్టని అధికార యంత్రాంగం నిర్లక్ష్యాల మూలంగా తాడెత్తున మేటవేసిన వ్యవస్థాగత లోపాల గుట్టల కింద నలిగిపోయి నరకయాతన అనుభవించి చనిపోయారు పాపం ఆ ప్రయాణికులు! గజానికో గుంత, అర కిలోమీటర్‌కో మలుపుతో నోరుతెరుచుకున్న మృత్యుదేవత మాదిరిగా ఉండే ఆ రోడ్డును బాగుచేయమని స్థానికులు పదేళ్లుగా నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. ఆ నేపథ్యంలో నాలుగు లైన్ల నిర్మాణానికి మూడేళ్ల క్రితం శంకుస్థాపన జరిగినా న్యాయపరమైన అవాంతరాలను అధిగమించడంలో అలసత్వం కారణంగా రహదారి విస్తరణ పనుల్లో ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు. నేషనల్ హైవే కాకముందు తెలంగాణ ఆర్‌అండ్‌బీ విభాగం పరిధిలో ఉన్నప్పుడు ఆ రోడ్డుపై ఏర్పడే ప్రమాదకర గుంతలను కనీసం పూడ్చేవారు. ఏడేళ్ల కిందట ఎన్‌హెచ్ఏఐ చేతుల్లోకి వెళ్లాక ఆ మాత్రం మరమ్మతుల గురించి పట్టించుకున్నవారే లేకపోయారు! దాంతో పరమ అధ్వానంగా తయారైన ఇరుకిరుకు రోడ్లలో పరిమితికి మించిన లోడ్‌తో అధిక వేగంతో భారీ వాహనాలు దూసుకుపోతున్నా అడ్డుకునేవారే కరవయ్యారు! తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన బస్సుకు ఆ విధంగా సర్కారీ విభాగాల బాధ్యతారాహిత్యమే పెనుశాపమైంది. నివారించదగిన ఈ దుర్ఘటనకు ప్రధాన కారణమైన యంత్రాంగం నిష్క్రియాపరత్వమే- దుఃఖాగ్ని జ్వాలల్లో దహించుకుపోతున్న మృతులూ క్షతగాత్రుల కుటుంబాల ఉసురు పోసుకుంది!

'సామర్థ్యానికి మించి అధిక లోడుతో వెళ్తున్న వాహనాలవల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కఠిన శిక్షలు లేని పక్షంలో అమాయకుల ప్రాణాలకు రక్షణ కల్పించడం సాధ్యంకాదు' అని తెలంగాణ హైకోర్టు ఆరేళ్ల క్రితమే స్పష్టంచేసింది. అక్రమాలకు ఒడిగడుతున్న ఇసుక లారీల జప్తు విషయంలో మైనింగ్, రవాణా శాఖాధికారులు కలిసి పనిచేయాలని నిర్దేశించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇసుక, కంకర, గ్రానైట్ తదితరాలను తరలించే టిప్పర్లు చాలావరకు మృత్యుశకటాల మాదిరిగా పరుగులుదీస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. కిందటి నెలలో ఇసుక టిప్పర్ మూలంగా నెల్లూరు జిల్లాలో ఏడు ప్రాణాలు కడతేరిపోయాయి. నిత్యం ఇలా ఎన్నో ప్రమాదాలు వాటిల్లుతున్నప్పటికీ మామూళ్ల మత్తులో జోగాడుతున్న కొందరు అధికారులూ నేతలు భ్రష్టాచారాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. జరుగుతున్న దారుణాలకు అలాంటి వారినీ బాధ్యులను చేసి బోనెక్కిస్తే తప్ప అవినీతి రక్కసి స్వైరవిహారం తగ్గి రహదారి భద్రత మెరుగుపడదు!

హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు నెత్తుటిమయమైన మొన్న సోమవారమే ఏపీలో మూడు రహదారి దుర్ఘటనల్లో ఏడుగురు బలైపోయారు. రాజస్థాన్‌లో డంపర్ ట్రక్ డ్రైవర్ అలక్ష్యానికి పద్నాలుగు మంది ప్రాణాలు కోల్పోయారు. 2018-2023 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న 26.53 లక్షల రోడ్డు ప్రమాదాలు- 9.50 లక్షల జీవితాలను కబళించాయి. పాతిక లక్షల మందికి పైగా ప్రయాణికులు, పాదచారులను గాయాల పాల్జేశాయి. బాధిత కుటుంబాలు ఆర్థిక అగాథాలను ఎదుర్కొంటూ పేదరికంలోకి జారిపోతున్నాయి. ప్రపంచ బ్యాంకు బృందం అంచనా ప్రకారం- రోడ్డు యాక్సిడెంట్ల కారణంగానే భారతావని ఏడాదికి దాదాపు 13లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. ఈ విషాదవృష్టి ఆగాలంటే- రోడ్ల నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాలను పరిహరించి, ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయాలి. లైసెన్సులూ రవాణా పర్మిట్ల జారీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు ఎడాపెడా బండ్లు తోలేవాళ్లు, మందుకొట్టి స్టీరింగ్ పట్టుకునేవాళ్లను కఠినంగా దండించాలి!



దేశంలో ప్రతి రాష్ట్రానికీ దానిదైన ప్రత్యేకత ఉంది. కానీ జాతీయత, భారతీయ సంస్కృతి అనేవి వాటన్నిటినీ ఏకం చేస్తున్నాయి. అలా కాకుండా ఏ ఒక్క మతమో విడిగా సంఘటితమవడానికి ప్రయత్నిస్తే అదే పని అన్ని మతాలూ చేస్తాయని గుర్తుంచుకోవాలి. అది దేశ ప్రయోజనాలకు హాని చేస్తుంది.

– 'దేశబంధు' చిత్తరంజన్ దాస్

కార్తిక పున్నమి రేయి

కార్తిక పౌర్ణమి ఒక విలక్షణమైన పర్వదినం. సాహితీ ప్రియులకు, ఆధ్యాత్మిక వేత్తలకు సామాజిక ప్రియంభావుకులకు సమానంగా ఆనందాన్ని పంచి ఇచ్చే పండుగ కార్తిక పౌర్ణమి. తెల్లని వెన్నెల రాత్రులకు పేరెన్నికగన్న కార్తికం సాహిత్యవేత్తలకు నన్నయను గుర్తు చేస్తుంది. 'శరత్కాలం నింగికి నేలకు శోభను చేకూరుస్తుంది' అన్నాడు నన్నయ భట్టు- పున్నమి రోజు రేయెండ(వెన్నెల) వర్షంలా కురుస్తూ భువనానికీ గగనానికీ మధ్య వంతెన నిర్మిస్తుంది కాబట్టి! అది చూసే మైమరచిపోయాడు భవభూతి. ఆయన పూర్వ నామం శ్రీకంఠశర్మ. 'అది వెన్నెల కాదు, కైలాసంలో తాండవనృత్యం చేస్తున్న భవుడి దేహం నుంచి జలజల రాలిపడుతున్న విభూతి' అన్నాడో శ్లోకంలో. ముగ్ధ మనోహరమైన ఆ భావనకు మురిసిపోయిన రసజ్ఞ లోకం- 'నీపేరు శ్రీకంఠుడు కాదు- భవభూతి' అంది.



అంతర్యామి

వానాకాలంలో దేవలోకాలకు తరలిపోయిన రాజహంసలు శరత్కాలం రాగానే క్రౌంచ పర్వత రంధ్రం ద్వారా తిరిగి భూలోకానికి వస్తాయని చెప్పినవాడు భవభూతే! దాన్నే కృష్ణదేవరాయలు 'రాజమరాళ లబ్ధగిరి రంధ్రం' అన్నాడు. గుండెల్లో వెన్నెల నింపే ఈ ఘట్టాలన్నీ స్ఫురించి మళ్లీ మళ్లీ సౌందర్య అనుభూతికి లోనవుతారు సాహితీప్రియులు. అందుకే వారికి కార్తికమన్నా, పౌర్ణమి అన్నా పరమప్రీతి.

శరదృతువులో స్ఫుటంగా గోచరించే సప్తర్షి మండలాన్ని వీక్షించడం ఆధ్యాత్మిక పరులకు ఆనందదాయకం. దానికి అనువైన రోజు కార్తిక పున్నమి. 'శరత్కాల లక్ష్మి కార్తిక కౌముది వస్త్రంతో వెన్నెల దరహాసంతో లోకాన్ని మంత్రముగ్ధం చేస్తోంది' అన్నాడు వైజయంతీ విలాసంలో సారంగు తమ్మయ్య. లక్ష్మీకళ మాత్రమే కాదు, శివకేశవ అద్వైత భావన సైతం ఆధ్యాత్మిక ప్రియులకు చాలా ఇష్టం. రూపా గోస్వామిది మరింత విలక్షణమైన చూపు. 'వెన్నెల వెలుగులు తెల్లనివి కావు' అన్నాడాయన. కృష్ణుడి కారణంగా నీలికాంతి అలుముకున్న అవి 'నీలి వెన్నెలలు' అని వర్ణించాడు. కృష్ణకాంతుల కారణంగానే భువనమంతటా అతిలోక మాధుర్యం వ్యాపించిందంటాడు రూపా గోస్వామి. ధాత్రీ(ఉసిరి) సహిత దామోదర కైంకర్యాలు, పరమశివారాధనలతో హరిహరాత్మకమై ప్రకాశిస్తున్న కార్తికమాసంలోని పున్నమి రాత్రి రాజచిహ్నాలతో అలరారుతుందని హరివంశం వర్ణించింది.

అందమైన వెన్నెలంతా అడవి పాలవుతుందని విచారిస్తూ కూర్చుంటారు కొందరు. నిజానికి వెన్నెలకు స్వపర భేదం లేనే లేదు. ఎర్రని ఎడారిలోనూ, పచ్చని అడవిలోను, చివరకు ప్రతి పెరట్లోనూ ఒకేలా వికసిస్తుందది. మనసుల్లో అలాంటి తారతమ్యాలు ఉండరాదని పాఠం చెబుతుంది. కలిసి బతకడాన్ని ప్రోత్సహిస్తుంది. రూపా గోస్వామో లీలాశుకుడో జయదేవుడో మదిని ఆవేశిస్తే కౌముది తత్వం గుండెకు పడుతుంది. కార్తికాన్ని వెన్నెల మాసం అనడంలోని అంతరార్థం బోధపడుతుంది. చంద్రుణ్ని షోడశ కళాప్రపూర్ణుడని ఎందుకంటారో తెలుస్తుంది. అమృత, మానద, పూష, తుష్టి, పుష్టి, రతి, ధృతి, శశిని, చంద్రిక, కాంతి, జ్యోత్స్న, శ్రీ, ప్రీతి, అంగద, పూర్ణ, పూర్ణామృత- అనే పదహారు కళలతో నిండుగా వెలిగే పున్నమి చంద్రుడి అతిలోక సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదించాలంటే కార్తిక పౌర్ణమిని మించిన రోజు లేనేలేదు.

– ఎర్రాప్రగడ రామకృష్ణ



బైడెన్ హయాంలో 2022లో వెలువరించిన 'విస్తృత ఇండో-పసిఫిక్ వ్యూహం'లో భాగంగా... బంగ్లాదేశ్, మయన్మార్‌లతో కూడిన బంగాళాఖాతం ప్రాంతంలో అమెరికా చురుగ్గా వ్యవహరిస్తోంది. అప్పటి నుంచి అమెరికా-బంగ్లాదేశ్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంచేందుకు జరిగిన చర్చల్లో- సముద్ర భద్రత, వాణిజ్యం, ఇండో-పసిఫిక్ సహకారం, బంగాళాఖాతంలో వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అయితే, షేక్ హసీనా ప్రభుత్వం వాషింగ్టన్‌తో రక్షణ సహకారం, బంగాళాఖాతానికి సంబంధించిన వ్యూహాత్మక విషయాలపై ఆచితూచి వ్యవహరించింది. తన సార్వభౌమత్వంపైనా, స్వతంత్ర విదేశాంగ విధానంపైనా ప్రభావం పడుతుందనే ఆందోళనతో అమెరికా ప్రతిపాదించిన జనరల్ సెక్యూరిటీ ఆఫ్ మిలిటరీ ఇన్ఫర్మేషన్, అక్విజిషన్ అండ్ క్రాస్-సర్వీసింగ్ అగ్రిమెంట్‌లపై ఢాకా సంతకాలు చేయలేదు. చైనాతో తనకున్న ఆర్థిక బంధాన్ని కాపాడుకోవడానికి అమెరికా నేతృత్వంలోని ఇండో-పసిఫిక్ వ్యూహంలో చేరకుండా జాగ్రత్తపడింది. ఇది ఈ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి అడ్డంకిగా... వాషింగ్టన్ దీర్ఘకాలిక ప్రయోజనాలను దెబ్బతీసేదిగా మారింది. ఆ క్రమంలోనే బంగ్లాదేశ్‌లో హసీనా సర్కారు కూలిపోయి మహమ్మద్ యూనస్ చేతుల్లోకి అధికార పగ్గాలు వచ్చాయి. అటు తరవాత అమెరికా-బంగ్లా సంబంధాలు గణనీయంగా బలపడ్డాయి. మొన్న ఆగస్టులో రెండు దేశాలు కలిసి టైగర్ షార్క్ సైనిక విన్యాసాలు చేశాయి. అమెరికా జనవరిలో విడుదల చేసిన 'ఫ్యాక్ట్‌షీట్-2025'... తన ఇండో-పసిఫిక్ వ్యూహంలో బంగ్లాదేశ్‌ను కీలక భాగస్వామిగా పేర్కొంది. బంగ్లాదేశ్‌లో అమెరికా రాయబారి బ్రెంట్ క్రిస్టెన్‌సెన్- ఈ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి ఢాకాతో బలమైన సైనిక సంబంధాలు అవసరమని వ్యాఖ్యానించారు.

> ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన 'ఆసియాన్' శిఖరాగ్ర సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరై కంబోడియా, థాయిలాండ్‌ల మధ్య సరిహద్దు ఒప్పందాలు కుదిర్చారు. ఆ దేశాలతో పాటు వియత్నాం, మలేసియాలతోనూ వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. ఇవన్నీ చైనా ప్రభావాన్ని తగ్గించే వ్యూహాలుగానే కనిపిస్తాయి. కానీ, భారతదేశ తూర్పు సరిహద్దుల్లో జరుగుతున్న పరిణామాలు బంగాళాఖాతం ప్రాంతంలో వాషింగ్టన్ దీర్ఘకాలిక వ్యూహాత్మక ఎత్తుగడలకు అద్దం పడుతున్నాయి. ఇవి భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయి?



మయన్మార్‌లో మారిన చిత్రం...

అగ్రరాజ్యం- మయన్మార్‌లోనూ పట్టు పెంచుకోవడానికి పావులు కదుపుతోంది. అక్కడి మిలిటరీ జుంటాకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇండిపెండెన్స్ ఆర్మీ, దాని మిత్రపక్షాలు కాచిన్ రాష్ట్రంలో చాలా ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. అరకాన్ ఆర్మీ అయితే రాఖైన్ రాష్ట్రంలో 80శాతానికి పైగా భూభాగాన్ని గుప్పిట పట్టింది. ఇలాంటి తిరుగుబాటు గ్రూపులతో అమెరికా నేరుగా చర్చల్లో పాల్గొనకపోయినా- ఈ ప్రాంత ప్రజలకు మానవతా సాయం అందిస్తూ మచ్చిక చేసుకుంటోంది. ఇంకోవైపు, రాఖైన్ రాష్ట్రం కోసం ఐరాస ప్రతిపాదించిన బంగ్లాదేశ్-మయన్మార్ మానవతా కారిడార్‌కు అవసరమైన ఆర్థిక, సిబ్బంది పరమైన మద్దతును అందించింది. అక్కడి మిలిటరీ జుంటా ప్రభుత్వం సైతం 'ఆసియాన్' సభ సందర్భంగా అమెరికాతో వాణిజ్య అంశాలను చర్చించడానికి ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. చైనాపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించుకుని అమెరికాతో ఆర్థిక, వాణిజ్య బంధాలను ఏర్పాటు చేసుకోవాలనీ, తద్వారా ఆ రెండు దేశాలను సమతుల్యం చేసుకోవచ్చని మిలిటరీ జుంటా భావిస్తోంది.

నిజానికి కాచిన్, రాఖైన్ రాష్ట్రాలు చైనాకు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైనవి. హైటెక్, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీలతో పాటు క్రిటికల్ మినరల్స్ రంగంలో డ్రాగన్ ఆధిపత్యానికి డిస్ప్రోసియం, టెర్బియం వంటి ఖనిజాలు అవసరం. ఇవి కాచిన్‌లో సమృద్ధిగా లభిస్తాయి. 2017-24 మధ్య చైనా దిగుమతి చేసుకున్న మొత్తం క్రిటికల్ మినరల్స్‌లో మూడింట రెండొంతులు కాచిన్ నుంచి వచ్చినవే! చైనాకు మయన్మార్ చేసే మొత్తం ఎగుమతుల్లో సుమారు 80శాతం క్రిటికల్ మినరల్స్. ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజీ అండ్ పాలసీ వివరాల ప్రకారం, 2021 తిరుగుబాటు తరవాత కాచిన్‌లో ఈ గనుల తవ్వకాలు మూడురెట్లు పెరిగాయి. కానీ, ఇటీవలి పరిణామాలతో చైనాకు వీటి ఎగుమతులు గణనీయంగా(89శాతం) తగ్గిపోయాయి. దీనికి ప్రధాన కారణం- ఆయా గనులను తిరుగుబాటు గ్రూపు ఇండిపెండెన్స్ ఆర్మీ స్వాధీనం చేసుకోవడమే.

ఇక రాఖైన్ గుండా వెళ్లే చైనా-మయన్మార్ ఆర్థిక నడవా... భారత్‌కు వ్యూహాత్మకంగా పట్టున్న మలక్కా జలసంధికి ప్రత్యామ్నాయంగా డ్రాగన్ అభివృద్ధి చేస్తున్న కయాక్ఫియు ఓడరేవును అనుసంధానిస్తుంది. ఈ కారిడార్‌లో ఇంధన పైప్‌లైన్‌లు, రవాణా ప్రాజెక్టుల కోసం డ్రాగన్ ఇప్పటికే భారీగా ఖర్చు చేసింది. ప్రస్తుతం ఈ రేవు మిలిటరీ జుంటా ఆధీనంలోనే ఉంది. కానీ, దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న అరకాన్ సైన్యం ఆధీనంలోని ప్రాంతాల్లో అమెరికా పట్టు పెంచుకుంటూ వస్తున్న విషయాన్ని ఇక్కడ గమనించాలి.

భారత్ చేయాల్సిందేంటి?

బంగ్లాదేశ్, మయన్మార్‌లలో పెరుగుతున్న అమెరికా-చైనా పోటీ భారతదేశ వ్యూహాత్మక, ఆర్థిక, ప్రాంతీయ ప్రయోజనాలపై గణనీయ ప్రభావం చూపుతుంది. భారత్ చేపట్టిన 'తూర్పు దిశగా కార్యాచరణ' కింద చేపట్టిన పలు అనుసంధాన ప్రాజెక్టుల్లో బంగ్లా, మయన్మార్‌లు కీలక భాగస్వాములు. ఆ రెండు సరిహద్దు దేశాల్లో అమెరికా ప్రాబల్యం విస్తరించడం వల్ల చైనాను కట్టడి చేయడం ఇండియాకు సులభమవుతుంది. మయన్మార్‌లో మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా అధికం. అమెరికా వాటిని నిలువరిస్తే, మన ఈశాన్య రాష్ట్రాలకు మేలు జరుగుతుంది. కానీ అమెరికా ప్రాంతీయ రాజకీయాలనూ ఆర్థిక నడవాలనూ ఇండియా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉపయోగిస్తే, వాటిని ఎదుర్కోవడం మనకు కష్టమవుతుంది. అమెరికాతో జట్టుకట్టిన పాకిస్థాన్- బంగ్లాదేశ్‌లో ప్రాబల్యం పెంచుకుంటోంది. ఇది భారతదేశ ప్రయోజనాలను దెబ్బతీసేదే. కాబట్టి, ఇండియా ఈ ప్రాంతంలో తన సాంప్రదాయ ఆధిపత్యాన్నీ, ప్రాంతీయ ప్రయోజనాలనూ కాపాడుకోవడానికి ప్రయత్నించాలి. తూర్పు సరిహద్దుల్లో కఠినమైన, సరికొత్త ముక్కోణ పోటీని ఎదుర్కోవడానికి సంసిద్ధం కావాలి.



డాక్టర్ గద్దె ఓంప్రసాద్
అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన కేంద్రం,
స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్, జేఎన్‌యూ

'ఏంటోనోయ్.. పెన్ను ఎక్కడ పెట్టానో ఎప్పుడూ మరిచిపోతుంటాను' అన్నాడు తేజ.

'ఎందుకలా..?' ప్రశ్నించాడు రఘు.

'మతిమరుపు.. అందుకే ఖరీదైన పెన్నులు వాడటం మానేసి చౌకరకం వాడుతున్నా. పోయినా బాధ ఉండదు.'

'అయితే ఒక పని చెయ్యి. నువ్వు ఎంత ఖరీదైన పెన్ను కొనగలవో అంతది కొని వాడు. నీ మతిమరుపు దెబ్బకు పోతుంది' చెప్పాడు రఘు.

ఆర్నెల్ల తరవాత తానిచ్చిన సలహా పాటించాడో లేదో, ఒక వేళ చేస్తే అదెంత మాత్రం పనిచేసిందో కనుక్కుందామని ఫోన్ చేశాడు రఘు. 'నువ్వు చెప్పావని ధైర్యం చేసి మంచి గోల్డ్ కోటెడ్ పెన్ కొన్నాను. అసలే నాకు పెన్నులంటే పిచ్చి ఇష్టం. దానికి తోడు చాలా ఖరీదైంది కావడంతో జాగ్రత్తగా చూసుకుంటున్నా. ఈ ఆర్నెల్లలో ఒక్కసారి కూడా మర్చిపోలేదు. మొత్తానికి నీ సలహా బాగానే పనిచేసింది' సంతోషంగా చెప్పాడు తేజ. అతడు విలువ ఇచ్చింది పెన్నుకు కాదు, దాని ఖరీదుకు.



మనం దేనికి విలువిస్తామో దాన్ని అస్సలు మరిచిపోం. బంధాలు, బంధుత్వాలు, స్నేహితులు, డబ్బు, ఆరోగ్యం, ప్రేమ... ఏదైనా సరే. దేనికి ఎంత విలువిస్తే అంత జాగ్రత్తగా చూసుకుంటాం. కానీ, ఉరుకులు పరుగుల జీవితంలో ఇప్పుడు దేనికీ విలువ ఇవ్వలేని రోజులు. ఒకప్పుడు ముత్తాతల గురించి కూడా గొప్పలు చెప్పుకొనేవారు. ఇప్పుడు తాతయ్య పేరేంటీ అంటే పిల్లలు తడుముకునే పరిస్థితి. ఒకే ఇంట్లో ఉండే తల్లిదండ్రులూ పిల్లల మధ్యే రోజూ అరగంటైనా కబుర్లు చెప్పుకొనే వాతావరణం కనిపించడం లేదు. కుటుంబసభ్యులు కావాల్సిన నాన్నమ్మా అమ్మమ్మా తాతయ్యలు చుట్టాల జాబితాలోకి చేరిపోయారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పిల్లలు సెలవుల్లో వచ్చి నాలుగు రోజులు ఉండటమనేది అరుదైన విషయంగా మారిపోయింది. ఇలాంటి సమయంలో బంధువులు ఎవరో పిల్లలకు ఎలా తెలుస్తారు? వారికి సంబంధించిన విషయాలు ఏం గుర్తుంటాయి?


సోషల్ మీడియాలో వర్చువల్ స్నేహాలకు ఇచ్చినంత విలువ, కేటాయించినంత సమయం నిజమైన స్నేహాలకు ఇవ్వలేకపోతున్నారు. ఎవరెవరు ఏ ఫొటోలు పెట్టారో, ఏమని కామెంట్లు రాశారో చెప్పగలరు కానీ యూనివర్సిటీలో కలిసి చదివిన బెస్ట్ ఫ్రెండ్స్ ఎక్కడున్నారో ఏం చేస్తున్నారో తెలియని వారే ఎక్కువ. ఇక, నెలకోసారన్నా పెద్దలను ఫోనులో అయినా పలకరించి, ఆరోగ్యాల గురించి కనుక్కుంటారా అన్నదీ అనుమానమే. దేనికి ఎంత విలువ ఇవ్వాలో పెద్దలకే తెలియనప్పుడు పిల్లలకెలా తెలుస్తుంది? మర్చిపోతున్నామని యూజ్ అండ్ త్రో పెన్నులు వాడిపారేసినట్లు కాదు, బంధుత్వాలు. బంగారు పెన్నుల్లా కాపాడుకోవాల్సినవి. మనిషి మానసిక, శారీరక ఆరోగ్యాలన్నిటికీ బలాన్నిచ్చేది అనుబంధాలే. వాటిని భద్రంగా కాపాడుకోవడానికి ఏం చేయాలో ఆలోచించాలి. దానికి తగ్గట్టుగా పెద్దలు నడచుకుని పిల్లలకు అలవాటు చేయాలి. అప్పుడే బంగారంలాగా బంధాల విలువా పెరుగుతుంది.

– ఏలేటి ప్రభాకర్‌రెడ్డి

అయిదు కోట్ల ఉద్యోగాలు...

ఇండియాలో 2030 నాటికి రిటైల్ రంగంలో కొత్తగా అయిదు కోట్ల కొలువులు పుట్టుకొస్తాయని అంచనా. దేశీయంగా రిటైల్ రంగంలో పనిచేస్తున్న శ్రామికుల్లో అత్యధికులు అరకొర అక్షరజ్ఞానం ఉన్నవారే. యువతకు తగిన నైపుణ్యాలు నేర్పడంపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. తద్వారా వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడానికి, విపణిలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడానికి అవకాశం ఉంటుంది. దేశీయంగా 2023-24లో రిటైల్ రంగంలో పనిచేస్తున్నవారి విద్యార్హతలు...

(శాతాల్లో)



నిరక్షరాస్యులు	10.9
దిగువ ప్రాథమిక స్థాయి	4.6
ప్రాథమిక విద్య	14.2
మాధ్యమిక స్థాయి	25
సెకండరీ	18.2
హయ్యర్ సెకండరీ	14.8
డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు	0.9
గ్రాడ్యుయేట్	10
పీజీ, అంతకు పైన	1.2

(ఆధారం: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్)

వికటించిన వ్యూహం!

'ఆడేవాడు గొప్పవాడా... ఆడించేవాడు గొప్పవాడా?'

'సహజంగా ఆడేవాడే కదా!'

'అవునా... గోల్ కొట్టేవాడు గొప్పవాడా... గోల్ ఇలా కొట్టాలి అని చెప్పేవాడు గొప్పవాడా?'

'మ్‌మ్... గోల్... ఎలా కొట్టాలో చెప్పేవాడే కావచ్చు'

'నీ మొహం. రెండు ప్రశ్నలూ ఒకటే. కానీ రెండు రకాల సమాధానాలు చెప్పావు'

'నిజమా... అలా అనిపించలేదే'

'మళ్లీ అడుగుతా. బరిలో ఉన్నవాడు గొప్పా... బరి బయటి నుంచి సలహాలు చెప్పేవాడు గొప్పా'

'కచ్చితంగా బరిలో ఉన్నవాడే...'

'మరి దంగల్ సినిమాలో బయట ఉండి కుస్తీపట్లు నేర్పిన ఆమిర్‌ఖాన్ గొప్పా, బరిలో పోటీ పడిన అమ్మాయి గొప్పా?'

'పేరు ఆమిర్‌ఖాన్‌కే ఎక్కువ వచ్చింది కాబట్టి అతడి పాత్రే గొప్ప'

'చదరంగం ఆడేవాడు గొప్పా... పక్కన కూర్చొని ఈ ఎత్తులు వేయమని సలహాలు ఇచ్చేవాడు గొప్పా?'

'ఆడేవాడు, ఆటను సరి చేసేవాడు ఇద్దరూ గొప్పేగా!'

'మళ్లీ జవాబు మార్చేశావు. నీ దగ్గర నిలకడ లేదా? ఆలోచన లేదా?'

'అదేంటి అంతమాట అన్నావ్?'


'ప్రశ్నలన్నీ ఒకటే అయినా, మూడు రకాల ఆన్సర్లు ఇచ్చావు కదా! అందుకని'

'కష్టంగా ఉందే... ప్రశ్నలో తికమక ఉందా? నువ్వు తికమక పెడుతున్నావా? అయినా ఈ గొప్పల గోలేంటి'

'చెబుతా. కత్తులు తయారు చేసేవాడు, నా కత్తుల వల్లే అందరూ యుద్ధాల్లో గెలిచారు... కాబట్టి ఆ కత్తులు పట్టుకుని నేనే యుద్ధంచేసి గెలిచేస్తా అంటే ఎలా ఉంటుంది?'

'కామెడీగా ఉంటుంది. కత్తులు తయారు చేసినంత మాత్రాన యుద్ధం తెలుస్తుందా? వీరత్వం ఉండాలిగా?'

'అదే అనుకుంటున్నారు అందరూ. రాజకీయ వ్యూహాలు పన్ని ఎన్నికల్లో కొందరిని గెలిపించాననుకునే ప్రశాంత్ కిశోర్, ఏకంగా తానే పార్టీ పెట్టి బిహార్ బరిలో పోటీలోకి దిగాడు. సరిగ్గా ఎలక్షన్ యుద్ధం మొదలయ్యే సమయంలో తాను పోటీ చేయడం లేదంటూ చేతులు ఎత్తేశాడు. పోటీలో ఉంటే పార్టీ విజయానికి పూర్తి స్థాయిలో పనిచేయలేను అంటున్నాడు.'



'కత్తి యుద్ధం మొదలు కాకముందే నా కత్తి బరువుగా ఉంది, పక్కవాళ్లకు సాయం చేస్తా అన్నట్లుంది. భయపడ్డాడంటావా? రాజకీయం ఇంకా వంటబట్టలేదంటావా? లేదా అసలైన రాజకీయాన్ని గ్రౌండ్ లెవెల్‌లో చూసి కళ్లు తెరుచుకున్నాయా?'

'వ్యూహకర్తగా చాలామందిని గెలిపించినవాడు, నాయకుడిగా గెలవలేడా?'

'గెలిపించాడా? అంత సీన్ లేదు. గెలవగలిగిన వాళ్లను ఎంచుకుని వాళ్ల వైపే పని చేశాడంతే. అదీ తెలివైన పనేలే... అయినా పోటీ నుంచి ఎందుకు తప్పించుకున్నాడంటావ్?'

'ఏం చేస్తాడు పాపం? లెక్క తప్పినట్లుంది. ఊపు మీద ఉన్న తేజస్వీ మీద పోటీకి దిగాడు. ఓడిపోతే పరువు పోతుంది. నియోజకవర్గం మార్చుకుంటే పారిపోయాడంటారు. దాని కంటే విరమించుకుంటే కాస్త గౌరవం అన్నా మిగులుతుంది కదా. అదీ బతకనేర్చిన తెలివితేటలంటే...'

'అంతేనంటావా... మరి ఆ విషయాన్ని ముందుగానే గ్రహించాలి కదా అంత పెద్ద స్వీయ ప్రకటిత రాజకీయ వ్యూహకర్త! లేదా ఇంకెవరికైనా లాభం చేకూర్చడానికి చేస్తున్నాడంటావా?'

'అదీ కావచ్చు. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేగా...'

'మరి పాదయాత్రలు చేశాడు, అవినీతి అంటూ అధికార పార్టీ మీద విరుచుకుపడ్డాడు. పరీక్షల్లో అవకతవకలంటూ గోల చేశాడు. కింగ్ కాకపోయినా, కనీసం కింగ్ మేకర్ అవుతాడనుకుని కొందరు కలలు కంటుంటే ఇలా హఠాత్తుగా వెన్ను చూపాడేంటి'

'కింగ్ మేకర్‌నా... ఎక్కడా? అటు ఎన్డీఏ, ఇటు మహాగఠ్‌బంధన్ మధ్య పోటీ యమా గట్టిగా ఉంది. మద గజాల మధ్య మనకెందుకని మర్యాదగా తప్పించుకుని ఉంటాడు.'

'నిజమేలే... రిజల్ట్ తెలిసినప్పుడు రిస్క్ తీసుకోవడం తెలివితక్కువతనమే!'

'పైగా రాజకీయం ఆయనగారికి ఒక ప్రాజెక్టులాంటిది. ఒకటి ఫెయిల్ అయితే భవిష్యత్తు ప్రాజెక్టులు రావడం కష్టమవుతుంది. బ్రాండ్ వ్యాల్యూ పడిపోతుంది. వ్యాపారం దెబ్బ తింటుంది.'

'కరెక్ట్. అంతా అయిపోయిన తరవాత ఫలితం ఏది వచ్చినా... చూశారా నా వ్యూహం ఫెయిల్ కాలేదు అని చెప్పుకోవడానికైనా ఉంటుంది.'

'అవునవును. తెలివైనవాడు... తెలిసినవాడు... తత్వం తలకెక్కిన తరవాత తప్పించుకుని తెరవెనకే ఉండటానికి సిద్ధపడ్డాడు. ఇప్పటికి మాత్రం సొంతపార్టీ ప్రచారకర్తగా మిగిలిపోయాడు!'

– ఎమ్మెస్

ఓయ్! బుజ్జీ!!


మహామంత్రి సలహా!

ఆనందగిరి రాజ్యాన్ని మైత్రివర్ధనుడు పాలించేవాడు. ఒకరోజు సైన్యాధిపతి వచ్చి.. 'రాజా! రాజ్యంలో కోతుల బెడద ఎక్కువైంది. వీధి వ్యాపారులను దుకాణం తెరవనివ్వడం లేదు. ఇళ్లలోకీ వస్తున్నాయి. వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలి' అని చెప్పాడు. కాసేపు ఆలోచించిన రాజు.. మంత్రుల సలహా అడిగాడు. సైన్యాన్ని పిలిపించి బంధించాలని, ఇళ్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్కొక్కరు ఒక్కో సలహా ఇచ్చారు. కానీ అవేవీ రాజుకు అంతగా నచ్చలేదు. మూగజీవాల్ని



కొట్టించడం తప్పు.. రక్షణ కవచాల ఏర్పాటు చాలా ఖర్చుతో కూడుకున్నదని ఆలోచించసాగాడు రాజు. అప్పుడు మహామంత్రి.. 'రాజా! ఏ సమస్యకైనా పరిష్కారం దాని మూలంలోనే ఉంటుంది. మన రాజ్యంలోని అడవిలో ఈ మధ్య ఎక్కువగా చెట్లు నరికేస్తున్నారు. దాంతో అక్కడ ఉండాల్సిన కోతులన్నీ రాజ్యం లోపలికి వచ్చేస్తున్నాయి' అన్నాడు. 'ఇక మీదట ఎవరూ అడవిలోని చెట్లను నరకొద్దని ఆదేశాలు జారీ చేస్తున్నాను. కానీ ప్రస్తుత సమస్య నుంచి ఎలా గట్టెక్కాలి' అన్నాడు రాజు. 'బాణసంచా కాల్చి ఆ శబ్దాలతో కోతులను రాజ్యానికి తూర్పు దిక్కు అడవిలోకి తరమాలి. అక్కడ వాటికి కొంత ఆహారం దొరుకుతుంది. కొన్నిరోజుల వరకు వాటికి మరికొంత ఆహారాన్ని మనమే ఏర్పాటు చేయాలి. అప్పుడవి ఊళ్లకు రావడం మానేస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఖాళీగా ఉన్న అడవి ప్రాంతంలో త్వరగా పండ్లనిచ్చే మొక్కల్ని నాటాలి. అప్పుడు ఇక రాజ్యానికి కోతుల బాధ తప్పుతుంది' అని చెప్పాడు మహామంత్రి. వెంటనే ఆ పనులన్నీ జరిగేలా చూశాడు రాజు. అలా కొన్ని నెలల్లోనే రాజ్యానికి కోతుల బెడద పూర్తిగా తొలగిపోయింది.

– ఏడువాక హరీశ్



జవాబు: ATTRACTION

పెళ్లంటే పవిత్రమే కానీ బాధలను భరించడం కాదు

భార్యను చిత్రహింసలు పెట్టిన 85 ఏళ్ల వృద్ధుడికి జైలు శిక్ష

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: వివాహం పవిత్రత అంటే అణచివేత లేదా బాధలను నిశ్శబ్దంగా భరించడం కాదని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం.. భార్యను చిత్రహింసలు పెడుతున్న 85 ఏళ్ల వృద్ధుడికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది. భర్త ధనశీలన్ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని రామనాథపురం జిల్లా పరమకుడికి చెందిన ఇంద్ర అనే మహిళ స్థానిక కోర్టులో కేసు వేసింది. కోడలితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, ఆ విషయాన్ని ప్రశ్నించినందుకు తిండి పెట్టకుండా తనను హింసిస్తున్నాడని తెలిపింది. ఈ కేసులో ధనశీలన్‌కు 6 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన పరమకుడి జిల్లా అదనపు కోర్టు ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యాలు లేవంటూ ధనశీలన్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ ఇంద్ర.. హైకోర్టు మదురై ధర్మాసనంలో అప్పీల్ చేశారు. న్యాయమూర్తి జస్టిస్ విక్టోరియా గౌరీ మంగళవారం ఆమె అప్పీల్‌పై విచారణ జరిపారు. భారత సంప్రదాయం ప్రకారం వివాహం అనేది కలకాలం కొనసాగే పవిత్రబంధమని న్యాయమూర్తి తెలిపారు. వృద్ధురాలైన మహిళ కుటుంబ గౌరవాన్ని, వివాహ పవిత్రతను కాపాడాలనే ఉద్దేశంతో ఇంతకాలం ఇవి మౌనంగా, నిశ్శబ్దంగా భరించిందన్నారు. వృద్ధురాలైన భర్తను శిక్షించాలని భార్య కోరడం ప్రతీకార చర్య కాదని అభిప్రాయపడ్డారు. గృహహింసలు దాంపత్యంలో నాలుగు గోడల మధ్యే ఉంటాయని, వాటికి సాక్ష్యాలు కావాలని కోరకూడదన్నారు. నేరస్థుడి వయసు అతని తప్పుడు ప్రవర్తనను సమర్థించబోదని, వృద్ధులకే అధిక బాధ్యత ఉంటుందన్నారు. పిటిషనర్ భర్తను దోషి అని తీర్మానిస్తున్నట్లు తెలుపుతూ కింది కోర్టు విధించిన 6 నెలల జైలు శిక్షను, రూ.500 జరిమానాను సమర్థిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.



ఆత్మవిశ్వాసం + శక్తిసముపార్జనకు..

- ✦ ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రించాలి.
- ✦ నిద్రకు 4 గంటల ముందే భోజనం ముగించాలి.
- ✦ శయనించడానికి గంటముందు ఫోను, ల్యాప్‌టాప్, టీవీలను కట్టిపెట్టాలి.
- ✦ పవళించే 10 నిమిషాల ముందు ఓ పుస్తకం చదవాలి.
- ✦ రోజూ 20 నిమిషాలు కసరత్తు చేయాలి.

– బ్రియాన్ జాన్సన్, ఇన్‌ఫ్లుయెన్సర్

క్లస్టర్ వ్యవస్థ రద్దు!

- స్వతంత్ర పాలన యూనిట్లుగా పంచాయతీలు
- సంస్కరణల అమలుకు ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమలులో ఉన్న పంచాయతీ క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసింది. పంచాయతీలను స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా ప్రకటించింది. వీటిని నాలుగు గ్రేడులుగా విభజించడంతోపాటు పంచాయతీ కార్యదర్శుల పేర్లను పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా మార్చింది. పురపాలక సంఘాల తరహాలో ప్రతి పంచాయతీలోనూ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక, వీధి దీపాలు, ఇంజినీరింగ్, ఆదాయం, పన్ను వసూళ్ల విభాగాలను ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయించాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలను మంత్రివర్గం ఇటీవల ఆమోదించడంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఇందుకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

■ ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలు స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా విభజన ■ 13,351 పంచాయతీలు నాలుగు గ్రేడులుగా వర్గీకరణ ■ వీటిలో రూర్బన్ పంచాయతీలు: 359 ■ గ్రేడ్-1: 3,082 ■ గ్రేడ్-2: 3,163 ■ గ్రేడ్-3: 6,747 ■ గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల పోస్టులను డిప్యూటీ ఎంపీడీవో క్యాడర్‌లో చేర్చాలని నిర్ణయం.

■ మిగతా కార్యదర్శులను మూడు గ్రేడులుగా విభజన. ■ రూర్బన్ పంచాయతీల్లో మెరుగైన పరిపాలన కోసం జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు 359 మందిని సీనియర్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం. ■ ప్రతి పంచాయతీలోనూ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక, వీధి దీపాలు, ఇంజినీరింగ్, ఆదాయం విభాగాల్లో సిబ్బంది ఏర్పాటు.

■ ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్ల సేవలు గ్రామీణ ప్రణాళిక అసిస్టెంట్‌లుగా వినియోగం. ■ డిజిటల్ అసిస్టెంట్లతో పంచాయతీల్లో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటు. ■ పంచాయతీల్లో కార్యదర్శుల ఖాళీలు 2025-26 ప్యానల్‌కు ముందే నింపాలని నిర్ణయం.

పెట్టుబడిదారులకు ప్రభుత్వ సంపూర్ణ సహకారం

- దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలతో భేటీలో మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని దుబాయ్ పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ప్రభుత్వ విధానాలు పరిశీలించిన తరువాత పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. దుబాయ్‌లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ రెండో రోజు మంగళవారం అక్కడి పారిశ్రామికవేత్తలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను వారికి వివరించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి గురించి పారిశ్రామికవేత్తలకు ప్రజంటేషన్ ఇచ్చారు.

◆ అపరెల్ గ్రూప్ ప్రెసిడెంట్ నీలేష్ వేద్, సీఈవో నీరజ్, సీటీఓ కమల్ కొటక్‌తో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. ఫ్యాషన్‌వేర్, గార్మెంట్స్, ఫుట్‌వేర్, కాస్మెటిక్స్ రంగంలో 14 దేశాల్లో 2,300 స్టోర్లు నిర్వహిస్తున్న అపరెల్ గ్రూప్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి ఆహ్వానించారు.

◆ ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్ ప్రెసిడెంట్ రమేష్ రామకృష్ణన్‌తో మంత్రి భేటీ అయ్యారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో దుబాయ్ కేంద్రంగా, ఇతర అనేక దేశాల్లో ఈ సంస్థ వ్యాపారాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. సుదీర్ఘ తీర ప్రాంతం, పోర్టులు, విమానాశ్రయాల నిర్మాణంతోపాటు షిప్ బిల్డింగ్ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి వచ్చి వ్యాపార అవకాశాలు పరిశీలించాలని కోరారు.



ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ప్రధాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

◆ దుబాయ్ డౌన్‌టౌన్‌లోని తబ్రీద్ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని నారాయణ సందర్శించారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టంను ఈ కంపెనీ నిర్వహిస్తోంది. సంస్థ సీఈవో ఖలీద్, సీడీవో ఫిలిప్, ఇతర ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సెంటర్ ఏర్పాటు చేసే ప్రతిపాదన గతంలో ఉంది. అమరావతితోపాటు అవసరమైన ఇతర ప్రాంతాల్లో కూలింగ్ సెంటర్ల ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. విశాఖలో నిర్వహించే పెట్టుబడిదారుల సదస్సుకు హాజరుకావాలని పారిశ్రామికవేత్తలను నారాయణ ఆహ్వానించారు.

ప్రైవేటు టూరిస్ట్ బస్సులకు గ్రీన్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలి

- ఏపీ ప్రైవేటు టూరిస్ట్ బస్సు యజమానుల సంఘం విజ్ఞప్తి

రామవరప్పాడు కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలో తిరిగే ప్రైవేటు టూరిస్ట్ బస్సులకు గ్రీన్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని ఏపీ ప్రైవేటు టూరిస్ట్ బస్సు యజమానుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా అనీష్ బాబు, కె.శివరామ్, ఉపాధ్యక్షుడు ఎం.మురళీ మోహన్ తదితరులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టూరిస్ట్ బస్సు ఆపరేటర్లు ఏటా రూ.8,000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివరామ్. వేదికపై మురళీ మోహన్, అనీష్ బాబు తదితరులు

ఈశాన్య రాష్ట్రాల్లో పర్మిట్లు తీసుకుని రాష్ట్రంలో బస్సులు నడిపే వారి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రాష్ట్రానికి ఒక్క రూపాయి పన్ను చెల్లించకుండా స్టేట్ క్యారేజ్ నిర్వహిస్తూ తమ వ్యాపారానికి గండి కొడుతున్నారని తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ మినహాయింపు కోరుతూ ఆరు నెలల క్రితం రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించినా స్పందించకపోవడం సరికాదన్నారు. కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం తర్వాత ప్రభుత్వం టూరిస్ట్ బస్సు ఆపరేటర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. టూరిస్ట్ బస్సు ఆపరేటర్లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న వాహనాలను మాత్రమే వినియోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో పర్మిట్లు తీసుకొని రాష్ట్రంలో తిరిగే బస్సుల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తమ బస్సుల్లో స్పీడ్ గవర్నర్లు ఉండటంతో.. 80 కిలోమీటర్ల వేగంతో మాత్రమే వెళ్తాయని తెలిపారు. సంఘం సభ్యులు కె.శ్రీనివాసరావు, కొల్లి కృష్ణ చైతన్య, సంబిరెడ్డి, అశ్విన్ రెడ్డి, సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, చిరంజీవి, రణదీప్, కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలోకి గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలు!

- కొత్తగా మరికొన్ని రెవెన్యూ డివిజన్లు..
- నేటి మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో చర్చ

ఈనాడు-అమరావతి: గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్ని ఎన్టీఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపే ప్రతిపాదనల్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తోంది. విజయవాడలో భాగంగా ఉన్న పెనమలూరు నియోజకవర్గాన్ని మాత్రం కృష్ణా జిల్లాలోనే కొనసాగించనున్నారు. మార్కాపురం, మదనపల్లె కేంద్రంగా రెండు కొత్త జిల్లాలతోపాటు పీలేరు, అద్దంకి, గిద్దలూరు, మడకశిర కేంద్రాలుగా కొత్తగా రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మరికొన్ని రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు అంశం తాజాగా తెరపైకి వచ్చింది. బుధవారం సచివాలయంలో జరిగే సమావేశంలో దీనితోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని రెవెన్యూ డివిజన్లలో మార్పులు, చేర్పులపైనా ఉపసంఘం చర్చించి ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. సీఎం చంద్రబాబు వద్ద మరోసారి చర్చిస్తారు. 10న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. ఒక నియోజకవర్గంలోని మండలాలన్నీ ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండేలా చూడాలనే అంశంపై పునరాలోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున మార్పులు, చేర్పులు చేయాల్సి ఉండటంతో.. అన్నిటినీ పరిశీలించి పరిష్కరించే సమయం కూడా ఇప్పుడు లేదు. జనగణన నేపథ్యంలో డిసెంబరు నెలాఖరులోగా ఈ ప్రక్రియ ముగించాలి. వైకాపా ప్రభుత్వ హయాంలో సమగ్ర కసరత్తు లేకుండానే హడావుడిగా విభజన చేయడంతో సమస్యలు వెంటాడుతున్నాయి. అలాంటి తప్పు మరోసారి చేయకూడదని.. పాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకే శాస్త్రీయంగా విభజన జరగాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎలాగూ ముందుముందు నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగనుంది. తర్వాతే వాటికి అనుగుణంగా రెవెన్యూ డివిజన్లను సర్దుబాటు చేయొచ్చని ఆలోచిస్తోంది.

పెట్టుబడులకు భరోసా కల్పించే బాధ్యత మాది

- లండన్‌లో ప్రారంభమైన ప్రపంచ ట్రావెల్ మార్కెట్-2025లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు-అమరావతి: పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని వివిధ దేశాలకు చెందిన ప్రముఖ సంస్థలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆహ్వానించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతోపాటు అనేక ప్రోత్సాహకాలతో కొత్త విధానం తీసుకొచ్చామని ఆయన వివరించారు. పెట్టుబడులకు భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వానిదని మంత్రి అన్నారు. లండన్‌లో ఈ నెల 6 వరకు నిర్వహించే వరల్డ్ ట్రావెల్ మార్కెట్-2025 మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిగ్నేచర్ హాస్పిటాలిటీ గ్రూప్ సీఈవో రమేశ్ అరోరా, పికాక్ టూర్



డబ్ల్యూటీఎంలో ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్ వద్ద మంత్రి దుర్గేష్, అధికారులు

కంపెనీ సీఈవో కన్నన్ శివనాథన్, రష్యా తదితర దేశాలకు చెందిన ట్రావెల్ ఎగ్జిబిటర్లు, వివిధ హోటళ్ల ప్రతినిధులతో మంత్రి సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఆయనవెంట రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పాల్గొన్నారు.

ఏపీ స్టాల్‌కు వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధులకు కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి అరకు కాఫీ అందజేసి పూతరేకుల రుచి చూపించారు.

బాధితులకు వ్యతిరేకంగా పిటిషన్ వేయడమేంటి?

- తమిళనాడు సర్కారుపై మద్రాసు హైకోర్టు అసంతృప్తి
- వీరప్పన్ గాలింపు బాధితులకు పరిహారం చెల్లించాలని ఆదేశం

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: 'ప్రజల సొమ్ముకు ప్రభుత్వం ట్రస్టీ మాత్రమే' అని మద్రాసు హైకోర్టు స్పష్టంచేసింది. వీరప్పన్ గాలింపు చర్యల్లో బాధితులైన వారికి రూ.2.59 కోట్లు చెల్లించకుండా వారికి వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. గంధపు చెక్కల దొంగ వీరప్పన్ కోసం గాలింపు చేపట్టిన తమిళనాడు-కర్ణాటక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దర్యాప్తు పేరుతో గిరిజనులపై మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్లు గతంలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన కమిషన్ బాధితులకు రూ.5 కోట్లు పరిహారంగా ఇవ్వాలని తమిళనాడు ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం రూ.1.20 కోట్లు మాత్రమే ఇవ్వడంతో మిగతా రూ.3.80 కోట్లు విడుదల చేయాలని హక్కుల కమిషన్ ఆదేశించింది. దానిని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇది ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్ మురుగన్ ధర్మాసనం వద్ద మంగళవారం విచారణకు వచ్చింది. బాధితులకు ఇవ్వాల్సిన రూ.2.59 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆదేశిస్తూ విచారణను డిసెంబరు 4కు వాయిదా వేశారు.

స్టాక్ ట్రేడింగ్ పేరిట రూ.4.89 కోట్లు స్వాహా

పటాన్‌చెరు వ్యాపారిని మోసగించిన మహిళలు

ఈనాడు, హైదరాబాద్: పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన వ్యాపారి(41)ని స్టాక్ ట్రేడింగ్ పేరిట ఇద్దరు మహిళలు రూ.4.89కోట్లకు నిలువునా ముంచేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు మంగళవారం నమోదు చేసిన కేసు వివరాల మేరకు.. వ్యాపారికి సెప్టెంబరు 7న లావణ్య దాసరి, అర్పితగా తమను తాము పరిచయం చేసుకున్న ఇద్దరు మహిళలు ఫోన్ చేశారు. తమది విశాఖపట్నం భీమిలి అగ్రహారం అని చెప్పారు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నామని, మా మామ నర్సింహారావు లండన్‌లో ఉంటారని.. తండ్రి వైజాగ్‌లో టైర్ డిస్ట్రిబ్యూటర్ అని పేర్కొన్నారు. ఇండియా, అమెరికాలో స్టాక్ ట్రేడింగ్ కోసం తాము సూచించిన షేర్లు కొంటే భారీగా లాభాలొస్తాయని నమ్మబలికారు. నిజమేనని నమ్మిన వ్యాపారి అదే నెల 21న తొలుత రూ.50వేలు ఫోన్‌పే ద్వారా వారు సూచించిన ఖాతాకు బదిలీ చేశారు. ఈ క్రమంలో అతడి పేరుతో ఉన్న వర్చువల్ ట్రేడింగ్ ఖాతాలో 15శాతం లాభం వచ్చినట్లు చూపించారు. బాధితుడిని నమ్మించేందుకు రూ.15,400ను ఆయన బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. దీంతో బాధితుడు అత్యాశతో 60రోజుల వ్యవధిలో ఏకంగా రూ.4.89కోట్లను బదిలీ చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆయన ట్రేడింగ్ ఖాతాలో షేర్ల విలువ భారీగా రూ.16కోట్లుగా చూపించారు. గత నెల 28న ఆయన వాటిని ఉపసంహరించేందుకు ప్రయత్నించారు. అయితే క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ కింద మరో రూ.2.5కోట్లు చెల్లించాలని చెప్పడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. అనంతరం ఎంతగా ప్రయత్నించినా సొమ్ము ఉపసంహరణ సాధ్యం కాకపోవడంతో టీజీసీఎస్‌బీకి ఫిర్యాదు చేశారు.

కర్ణాటక ఆర్టీసీ బస్సు, లారీ ఢీ



ప్రమాదానికి గురైన లారీ, కేఎస్ఆర్టీసీ బస్సు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్ణాటక ఆర్టీసీ బస్సు, సిమెంటు లారీ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఓగీపూర్ శివారులో మంగళవారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం కలబురగి నుంచి ప్రయాణికులతో తాండూరు వైపు వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చిన సిమెంటు లారీని ఢీకొంది. బస్సులోని కండక్టర్‌తోపాటు తుకారాం అనే ప్రయాణికుడికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని కలబురగి సిమెంటు కర్మాగార ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు.





వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో తడిసిన పత్తి బస్తాల వద్ద రైతులు, మహేశ్వరంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలోకి నీరు చేరడంతో పక్క భవనంలోకి తరలుతున్న విద్యార్థినులు

కోతల వేళ.. గుండెకోత వానలు

- మార్కెట్‌యార్డులు, కల్లాల్లో కొట్టుకుపోయిన ధాన్యం
- తెలంగాణలో పిడుగుపాటుకు రైతు మృతి

ఈనాడు, హనుమకొండ- న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్, హుజూరాబాద్ గ్రామీణం, పరకాల రూరల్, మహేశ్వరం: పంటలు చేతికొచ్చి కోతలు మొదలైన వేళ హఠాత్తు వర్షాలు అన్నదాతలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మంగళవారం తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో కురిసిన వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర మార్కెట్‌లో ఆరబోసిన వడ్లు కాల్వలోకి కొట్టుకుపోయాయి. 30 బస్తాల ధాన్యం కొట్టుకుపోయినట్లు శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ రైతు సంపత్ వాపోయారు. మరోవైపు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో కురిసిన వర్షానికి పత్తి బస్తాలు తడిసిపోయాయి. అన్నదాతలు దూరప్రాంతాల నుంచి 7,230 బస్తాల పత్తి తీసుకురాగా సుమారు 2 వేల బస్తాలు.. మక్కలు 640 బస్తాలు తీసుకురాగా 500 బస్తాలు తడిసిపోయినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెటింగ్ శాఖ టార్పాలిన్లు కొనుగోలు చేసి మార్కెట్‌లో నిల్వ చేస్తున్నా వర్షాల సమయంలో వెంటనే అందజేయడంలో అధికారులు విఫలమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం పోచారానికి చెందిన మహిపాల్(43) వర్షంలో తన పొలంనుంచి ఎడ్లను తోలుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రాంచంద్రగూడ కొండేటి చెరువు అలుగు పారింది. దీంతో దిగువన 6 కి.మీ. దూరంలో కేసీతండా సమీపంలో కేజీబీవీ విద్యాలయం, మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలతోపాటు ఈ-సిటీని వరద ముంచెత్తింది.



మక్కలు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కొండాపురానికి చెందిన రైతు సుగుణ

మోడల్ స్కూల్ వసతిగృహంలో ఉన్న 115 మంది బాలికలను పోలీసులు, స్థానికులు ఆర్టీసీ బస్సుల్లో ఇళ్లకు తరలించారు. ఈ-సిటీలో కొన్ని పరిశ్రమల్లోకి, రాంచంద్రగూడలోని కొన్ని ఇళ్లలోకి వరద చేరింది. చారిత్రక శివగంగరాజరాజేశ్వరస్వామి ఆలయ గర్భగుడిలోకి నీరు చేరింది.

బ్రేక్ వేయకపోవడంతోనే దారుణం?

- మీర్జాగూడ ప్రమాదంపై వివిధ శాఖల దర్యాప్తు
- టిప్పర్ డ్రైవర్ లైసెన్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఈనాడు, హైదరాబాద్ - చేవెళ్ల గ్రామీణ, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో సోమవారం జరిగిన దారుణ రోడ్డు ప్రమాదానికి కారణాలపై పోలీసు, రవాణా శాఖల దర్యాప్తు మొదలైంది. టిప్పర్ డ్రైవర్ గుంతను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సును ఢీకొట్టడానికి ముందు బ్రేక్ వేయకపోవడంతోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. టిప్పర్‌లో పరిమితికి మించి కంకర లోడుతోపాటు అతివేగంతో... ఒక్కసారిగా కుడివైపు తిప్పడంతో అదుపు తప్పి నియంత్రణ కోల్పోయినట్లు విశ్లేషిస్తున్నారు. బస్సును టిప్పర్ ఢీకొట్టిన తర్వాత 50-60 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. దీన్నిబట్టి బ్రేక్ వినియోగించకపోవడం లేదంటే పడకపోవడం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. టిప్పర్‌ను రవాణా శాఖ అధికారులు పరిశీలించారు. యజమాని లచ్చునాయక్ ఈ ఏడాదే దాన్ని కొనుగోలు చేసినా. . బ్రేకులు ఎలా పనిచేస్తున్నాయనే కోణంలో ఆరా తీస్తున్నారు. డ్రైవర్ ఆకాశ్ దన్య కాంబ్లే(23)కు లైసెన్స్ ఉందని



మీర్జాగూడ సంఘటన స్థలంలో రోడ్డు ప్రమాద చిత్రాలను డీజీపీ శివధర్‌రెడ్డికి చూపుతున్న అవినాశ్ మహంతి. చిత్రంలో మహేశ్ భగవత్ తదితరులు

అధికారులు చెబుతున్నారు. టిప్పర్ నడపాలంటే హెవీ మోటార్ లైసెన్స్ ఉండాలి. అతను మహారాష్ట్రలోని నాందేడ్‌లో లైసెన్స్ తీసుకున్నాడు. దాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు అది... అసలైనదేనా అని నిర్ధారించుకోవడానికి మహారాష్ట్ర అధికారుల్ని సంప్రదిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనం ఎంత వేగంతో ఉందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

నోరు, ముక్కు భాగాల్లో దుమ్ము

ప్రమాదంలో మరణించిన 19 మందిలో 17 మంది నోరు, ముక్కులో కంకర దుమ్ము ఎక్కువగా ఉన్నట్లు పోస్టుమార్టం చేసిన వైద్యులు పేర్కొన్నారు. గాయపడిన 24 మందికి చికిత్స కొనసాగుతోంది. ఐదుగురి పరిస్థితి కొంత విషమంగా ఉన్నా... క్రమంగా కోలుకుంటున్నారు. చేవెళ్లలోని పీఎంఆర్ ఆసుపత్రిలో 14 మంది.. . వికారాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రిలో 10 మంది చికిత్స పొందుతున్నారు. కోలుకున్న బాధితుల నుంచి వాంగ్మూలం సేకరిస్తామని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ డ్రైవర్లు ఇద్దరూ మరణించడంతో బాధితుల వాంగ్మూలం కీలకంగా మారనుంది. వారిద్దరూ ఒకవేళ డ్రంకెన్ డ్రైవ్ చేశారేమో అనే అనుమానంతో వారి రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఫలితాలు రావాల్సి ఉంది.

ప్రమాదాలు జరగకుండా చర్యలు: డీజీపీ

మీర్జాగూడ దగ్గర ప్రమాద స్థలిని డీజీపీ శివధర్‌రెడ్డి, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి మంగళవారం పరిశీలించారు. చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో మాట్లాడారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ... "పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణకు మార్గం సుగమమైంది. పనులు పూర్తయ్యే వరకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలిస్తున్నాం. మలుపుల దగ్గర సమస్యలను గుర్తిస్తున్నాం. రహదారి ప్రమాదాల నివారణకు వచ్చే నెల నుంచి 'అరైవల్' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వాహనదారుల్లో ఎక్కువ మంది 'డిఫెన్సివ్ డ్రైవింగ్‌'ను పాటించడం లేదు. రహదారి పరిస్థితి, ఇతర వాహనాలు ఎలా వస్తున్నాయో అంచనా వేస్తూ డ్రైవింగ్ చేయాలి" అని సూచించారు.



బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

సుక్మా అడవుల్లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ధ్వంసం

- ఆయుధాలు, పేలుడు పరికరాల స్వాధీనం

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మంగళవారం మావోయిస్టులకు చెందిన ఆయుధాలు తయారు చేసే ఫ్యాక్టరీని డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలు ధ్వంసం చేశాయి. జిల్లాలోని గోంగూడ-కంచాల అడవుల్లో మావోయిస్టుల కోసం ఆపరేషన్ చేపట్టిన బలగాలు ఓ రహస్య ప్రాంతంలో బెటాలియన్ నంబర్-1కు చెందిన ఆయుధ కర్మాగారాన్ని గుర్తించాయి. ఆ ప్రాంతం నుంచి 17 రైఫిళ్లు, రాకెట్ లాంచర్లు, ఆయుధ తయారీ సామగ్రి, పరికరాలను స్వాధీనం చేసుకొని.. ఫ్యాక్టరీని ధ్వంసం చేశాయి. ఈ ఘటనను ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు.

లొంగిపోయినవారు దేశద్రోహులు: మావోయిస్టుల వీడియో

ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులు దేశద్రోహులని ఆ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం పార్టీ పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ పేరిట లేఖతో పాటు ఓ వీడియోను విడుదల చేసింది. గత నెల 26న భైరంగఢ్ ఏరియా కమిటీ డీవీసీ (డివిజనల్ కమిటీ సభ్యుడు) కమల్ పూనం రూ.2 లక్షలు తీసుకొని లొంగిపోయాడని ఆరోపించింది. పార్టీని, ప్రజలను మోసం చేసిన తర్వాత ఇప్పుడు తమపై తిరుగుబాటు చేస్తున్నారని ఆక్షేపించింది. లొంగిపోయినవారికి వ్యతిరేకంగా గోండు భాషలో ఓ గీతాన్ని ఆలపిస్తూ వీడియోను విడుదల చేసింది.

మంత్రి అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ



ఈనాడు, హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మహమ్మద్ అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖలను కేటాయించింది. మైనారిటీ సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల శాఖలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మైనారిటీ సంక్షేమశాఖ ఇప్పటివరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వద్ద, ప్రభుత్వ రంగ సంస్థలు ముఖ్యమంత్రి వద్ద ఉండగా.. తాజాగా ఈ రెండు శాఖలను అజారుద్దీన్‌కు కేటాయించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

15 మంది ప్రయాణికులకు గాయాలు

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో 15 మంది ప్రయాణికులకు గాయాలైన సంఘటన కరీంనగర్ జిల్లా రేణికుంట వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డిపోనకు చెందిన బస్సు సోమవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు బయల్దేరింది. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద వేకువ జామున 4.50గంటల సమయంలో ధాన్యం బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సులోని 15 మంది ప్రయాణికులతోపాటు ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎల్ఎండీ పోలీసులు చేరుకొని క్షతగాత్రులను అంబులెన్సులో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము,

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు

ఆర్ సి నెం.జి4/329/2025 తేది: 03.11.2025

ఫారము -6(ఎ)

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారము పొందే హక్కు, పారదర్శకత చట్టములో సెక్షన్ (1) 11 మరియు ఆంధ్ర ప్రదేశ్ నియమావళి 2018లో రూల్ -19 సబ్ రూల్ - (1) ననుసరించి

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి మండలము, రుద్రకోట గ్రామము నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పారిశ్రామిక కూడలి/ పరిశ్రమలు స్థాపించుట కొరకు భూములు అవసరమై వున్నవని కోరినందున మరియు శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వారు అవసరమని భావించినందున భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలో పునరుపాధి కల్పన చట్టం - 2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలను అనుసరించి ఈ విషయము గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది.

2018 భూసేకరణ, పునరావాసము, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2018లోని 22 చట్టం) ద్వారా సవరించబడిన విధముగా 2013 భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2013 లో 30వ చట్టం) సెక్షన్ 10(ఎ) ప్రకారము "కావలి మండలము రుద్రకోట గ్రామములో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం భూములు అవసరమై వున్న విషయములో" సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.

పై చట్టములోని సెక్షన్ (4) 11 ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, మరియు శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కావలి వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకము మరియు కొనుగోలు (క్రయ, విక్రయాలు) ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టములో సెక్షన్-15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి /వ్యక్తులు ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు మరియు శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కావలి వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

పై అవసర నిమిత్తమై గుడ్లూరు మండలం, కావలి మండలం రుద్రకోట గ్రామము నందు గల క్రింది పొందుపరచిన విధముగా య. 447.84 సెంట్ల భూమిని భూసేకరణ కొరకు నోటిఫికేషన్ జారీ చేయడమైనది.

షెడ్యూల్

జిల్లా: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా **మండలము:** కావలి **గ్రామము:** రుద్రకోట

వ. సం.	సర్వే నెం.	ఎల్.ఎ. ఎక్స్‌టెంట్	భూమి రకం	సేకరించిన విస్తీర్ణం ఎకరాలు	పట్టాదారు పేరు	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు కట్టడములు, ఇతరములు
1	11	4	అసైన్మెంట్	0.1	తుళ్లూరుపెద్ద తిరుపతి S/o వెంకట రామయ్య	12	94	10	13, 88	
				0.3	రాపూరురమణయ్య S/o చిన వెంకయ్య	12	94	10	13,88	
				1.73	ఇతరులు	12	94	10	13,88	
				0.02	బడుగుసీనయ్య	12	94	10	13,88	
				0.18	ఉప్పలపోలయ్య S/o వెంకయ్య	12	94	10	13,88	
				0.73	ఉప్పలపోలయ్య S/o వెంకయ్య	12	94	10	13,88	
				0.2	ఉప్పలపోలయ్య S/o వెంకయ్య	12	94	10	13,88	
				0.07	ఇతరులు	12	94	10	13,88	
				0.67	చేబ్రోలురామయ్య S/o రోసయ్య	12	94	10	13,88	
2	12	4.7	అసైన్మెంట్	4.7	ఇతరులు	21	11	4	13,14, 17,18	
					రాపూరు రమణయ్య S/o చిన వెంకయ్య	21	11	4	13,14, 17,18	
					చౌటూరు వెంకటేశ్వర్లు S/o చిన వెంకయ్య	21	11	4	13,14, 17,18	
					జంపని చెంచయ్య S/o జలయ్య	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					నంబూరుశంకరమ్మ W/o శంకరయ్య	21	11	4	13,14, 17,18	
					నంబూరుశంకరమ్మ W/o శంకరయ్య	21	11	4	13,14, 17,18	
					నంబూరుశంకరమ్మ W/o శంకరయ్య	21	11	4	13,14, 17,18	
					నంబూరుశంకరమ్మ W/o శంకరయ్య	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					ఇతరులు	21	11	4	13,14, 17,18	
					తుళ్లూరు కాంతమ్మ	21	11	4	13,14, 17,18	
					రాపూరు రమణయ్య S/o చిన వెంకయ్య	21	11	4	13,14, 17,18	
					రాపూరు రమణయ్య S/o చిన వెంకయ్య	21	11	4	13,14, 17,18	
					చౌటూరు రమణమ్మ W/o చిన్న వెంకయ్య	21	11	4	13,14, 17,18	
3	13	4.03	అసైన్మెంట్	0.31	తాతా వెంకటసుబ్బయ్య S/o చిన్నయ్య	12,11	72	87,88	14	
				0.66	పాలకీర్తిదుగ్గయ్య S/o కొండయ్య	12,11	72	87,88	14	
				0.31	తుళ్లూరుకృష్ణయ్య S/o రాగయ్య	12,11	72	87,88	14	
				0.095	తుళ్లూరుచిన్న తిరుపతి	12,11	72	87,88	14	
				0.095	తుళ్లూరుపెద్ద తిరుపతి	12,11	72	87,88	14	
				0.095	తుళ్లూరుపద్మ	12,11	72	87,88	14	
				0.095	తుళ్లూరు భాస్కర్ రావు	12,11	72	87,88	14	
				0.59	ఉప్పల వెంకమ్మ	12,11	72	87,88	14	
				1.16	ముక్కుపొట్టయ్య S/o నాగసుందరరావు	12,11	72	87,88	14	
				0.33	ఉప్పలఆదెమ్మ రామ స్వామి భార్య	12,11	72	87,88	14	
				0.29	ఉప్పలవెంకట స్వామి	12,11	72	87,88	14	
4	14	3.45	చుక్కలు భూమి	3.45	ఉప్పలఅచ్చయ్య S/o నరసయ్య	12	15, 72	13	16,17	
					తుళ్లూరు చెన్నయ్య S/o పెద మీరయ్య	12		13	16,17	
					ఉప్పల వెంకట స్వామి S/o నరసయ్య	12		13	16.17	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	12		13	16.17	
5	15	1.6	పట్టా	1.6	ఉప్పలవెంకట స్వామి S/o నరసయ్య	16	71, 72	14	69	
					ఉప్పల వెంకట స్వామి S/o నరసయ్య	16	71, 72	14	69	
					ఉప్పల పోలమ్మ W/o వెంకట స్వామి	16	71, 72	14	69	
					ఉప్పల వెంకట స్వామి S/o నరసయ్య	16	71, 72	14	69	
					ఉప్పల వెంకట స్వామి S/o నరసయ్య	16	71, 72	14	69	
					ఉప్పల పోలమ్మ W/o వెంకట స్వామి	16	71,	14	69	
					జమ్మునజలయ్య S/o చిన్నయ్య	16	71, 72	14	69	
6	18	2.65	పట్టా	2.65	తుళ్లూరుకొండయ్య s/o పెద్ద మీరయ్య	20	17	12, 21	19	
					తుళ్లూరు తిరుపతి S/o వెంకట స్వామి	20	17	12, 21	19	
					జంపని బుజ్జమ్మ W/o చిన్న పోలయ్య	20	17	12, 21	19	
					యానాదితో దద్దల యానదమ్మ	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	20	17	12, 21	19	
7	19/1	0.89	పట్టా	0.89	తుళ్లూరుకృష్ణయ్య S/o రామయ్య	49	16, 51	18	25	
					తుళ్లూరు కృష్ణయ్య S/o రామయ్య	49	16, 51	18	25	
					మైలపూరు నరసయ్య s/o ముస్లయ్య	49	16, 51	18	25	
					తుళ్లూరు వెంకటేశ్వరరావు S/o తిరుపతిరావు	49	16, 51	18	25	
8	19/2	0.33	పట్టా	0.33	వలపరాలవెంకయ్య S/o చిన్న తిరుపతి	49	16, 51	18	25	
9	20	5.21	పట్టా	5.21	మైలపూరునరసయ్య S/o ముస్లయ్య	27	18	21, 22	19,49	
					మైలపూరు నరసయ్య S/o ముస్లయ్య	27	18	21, 22	19,49	
					మైలపూరు నరసయ్య S/o ముస్లయ్య	27	18	21, 22	19,49	
					వ్యాపరాల అప్పయ్య	27	18	21,22	19,49	
					వలపర్ల రోశయ్య	27	18	21,22	19,49	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	27	18	21,22	19,49	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	27	18	21,22	19,49	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	27	18	21,22	19,49	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	27	18	21,22	19,49	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	27	18	21,22	19,49	
					నంబూరుశంకరమ్మ W/o రామయ్య	27	18	21,22	19,49	
					చేబ్రోలు రాధయ్య S/o రోశయ్య	27	18	21,22	19,49	
					ఉప్పల రమణమ్మ W/o రమణయ్య	27	18	21,22	19,49	
					చేబ్రోలు రాధయ్య S/o రోశయ్య	27	18	21,22	19,49	
10	21	4.72	చుక్కలు భూమి	4.72	ఇతరులు	22	12	3	18,20	
					వలపర్ల అప్పయ్య	22	12	3	18,20	
					జంపని బుజ్జమ్మ W/o చిన్న పోలయ్య	22	12	3	18,20	
					రామయ్య భార్య నంబూరుశంకరమ్మ	22	12	3	18,20	
					దద్దలపిచ్చయ్య	22	12	3	18,20	
					తాళ్లూరు వెంకటస్వామి	22	12	3	18,20	
					దద్దలపిచ్చయ్య S/o యానాది	22	12	3	18,20	
					దద్దలయానాది	22	12	3	18,20	
					దద్దల పోలయ్య S/o సుబ్బయ్య	22	12	3	18,20	
					రాపూరు రాంనాయుడు S/o చిన వెంకయ్య	22	12	3	18,20	
					చౌటూరు వెంకటేశ్వర్లు S/o వెంకయ్య	22	12	3	18,20	
					ఇతరులు	22	12	3	18,20	
					ఇతరులు	22	12	3	18,20	
					ఇతరులు	22	12	3	18,20	
					జంపని చెంచయ్య S/o జలయ్య	22	12	3	18,20	
					చౌటూరురామమ్మ W/o వెంకయ్య	22	12	3	18,20	
					రాపూరు రాంనాయుడు S/o చిన వెంకయ్య	22	12	3	18,20	
					నంబూరుశంకరమ్మ W/o రామయ్య	22	12	3	18,20	
					చౌటూరు వెంకటేశ్వర్లు S/o వెంకయ్య	22	12	3	18,20	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	22	12	3	18,20	
					ఇతరులు	22	12	3	18,20	
11	22	2.84	చుక్కలు భూమి	2.84	దద్దలపోలయ్య S/o సుబ్బయ్య	24	21	23	20	
					జంపనైబుజ్జమ్మ S/o చిన్న పోలయ్య	24	21	23	20	
					మైలాపురం రమణయ్య S/o చిన్న వెంకయ్య	24	21	23	20	
					మైలాపురం రమణయ్య S/o చిన్న వెంకయ్య	24	21	23	20	
					మైలాపురం రమణయ్య S/o చిన్న వెంకయ్య	24	21	23	20	
					మైలాపురం రమణయ్య S/o చిన్న వెంకయ్య	24	21	23	20	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	24	21	23	20	
					మైలాపురం రత్తయ్య S/o నరసయ్య	24	21	23	20	
					ఇతరులు	24	21	23	20	
12	24	4.26	చుక్కలు భూమి	4.26	తుళ్లూరుతిరుపతయ్య S/o జలయ్య	26	22	23	27	
					తమ్మిశెట్టి యానాదయ్య S/o పెద్ద వెంకయ్య	26	22	23	27	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	26	22	23	27	
					చౌటూరు రమణమ్మ W/o వెంకయ్య	26	22	23	27	
					మైలాపురం రత్తయ్య S/o నరసయ్య	26	22	23	27	
					దేవళ్ల వెంకయ్య s/o అంకయ్య	26	22	23	27	
					ఇతరులు	26	22	23	27	
13	26	1.63	చుక్కలు భూమి	1.63	తుళ్లూరుతిరుపతమ్మ W/o తిరుపతయ్య	23	25	24,27	25	
					తుళ్లూరు తిరుపతమ్మ W/o తిరుపతయ్య		25	24,27	25	
					కొండా రుక్మిణమ్మ W/o వెంకట సుబ్బారెడ్డి		25	24,27	25	
14	27	3.77	పట్టా	3.77	తుళ్లూరు అంకులు కొండయ్య వంశం	26	20,49	24	25	
					దద్దల పోలయ్య S/o సుబ్బయ్య	26	20,49	24	25	
					తుళ్లూరు సుబ్బ రాయుడు S/o కొండయ్య	26	20,49	24	25	
					దల్ల సుబ్బులు S/o యుంచయ్య	26	20,49	24	25	
					తుళ్లూరు తిరుపతమ్మ W/o తిరుపతయ్య	26	20,49	24	25	
					తుళ్లూరు ఆదినారాయణ	26	20,49	24	25	
					చేబ్రోలు స్వాతి W/o బాలకృష్ణ	26	20,49	24	25	
					గండికోట సీతారావమ్మ w/o తిరుపతయ్య	26	20,49	24	25	
15	28	1.36	పట్టా	1.36	చెబ్రోలుసుబ్బయ్య S/o రోసియా	25	44	46, 47,48	29	
					మణెమల సుబ్బా రెడ్డి S/o వెంకటరామిరెడ్డి	25	44	46, 47, 48	29	
16	29	1.32	పట్టా	1.32	వకాశ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	30	28	25	44	
					చేబోలు నాగరాజు S/o సుబ్బయ్య	30	28	25	44	
					తుళ్లూరు సుదాకర్ s/o వెంకయ్య	30	28	25	44	
17	30	3.45	పట్టా	3.45	తిప్పారెడ్డి వెంకట శేషమ్మ W/o రమణా రెడ్డి	31,32	29	25	33,44	
					తిప్పారెడ్డి వెంకట శేషమ్మ W/o రమణా రెడ్డి	31.32	29	25	33,44	
					యమల వెంకయ్య S/o తిరుపతయ్య	31.32	29	25	33,44	
					యామల వెంకట్ రమణమ్మ W/o బాబు	31.32	29	25	33,44	
					వకా శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	31.32	29	25	33,44	
18	31	2.8	పట్టా	2.8	తిప్పారెడ్డి వెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	36 AND CHEVURU KANDUKUR TALUKA	30	25	32	
					కాకుటూరు శ్రీ సూర్య ప్రకాష్ S/o ఆదిశేష రెడ్డి	36 AND CHEVURU KANDUKUR TALUKA	30	25	32	
					తిప్పారెడ్డి వెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	36 AND CHEVURU KANDUKUR TALUKA	30	25	32	
					తిప్పా రెడ్డి వెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	36 AND CHEVURU KANDUKUR TALUKA	30	25	32	
19	32/1	1.94	పట్టా	1.94	దేగాబాలకృష్ణయ్య S/o చెంచయ్య	36	30, 33, 34	31	35	
					బొమ్మిరెడ్డి భాస్కర రెడ్డి S/o పిచ్చి రెడ్డి	36	30, 33, 34	31	35	
20	33	0.73	పట్టా	0.73	తిప్పిరెడ్డివెంకట శేషమ్మ W/o రమణా రెడ్డి	32	44	30	34, 43	
21	34	0.67	పట్టా	0.67	kaku Chinna Malakondaiah S/o Kondaiah	32, 35	43	33	59	
					తమ్మిశెట్టియండయ్య S/o పెద్ద వెంకయ్య	32, 35	43	33	59	
22	35	0.4	పట్టా	0.4	Nakkala Veeraiah S/o రాగయ్య ఉరఫ్ చిన్న రాగయ్య	36	34	32	42	
23	37	2.22	పట్టా	2.22	దేవళ్ళ చెంచా రావు S/o సుబ్బయ్య	38	41	42, 59	39	
					దేవళ్ళ రమణమ్మ w/o గార్దయ్య	38	41	42, 59	39	
					వంటబోయిన యానాదయ్య S/o కొండయ్య	38	41	42, 59	39	
					వంటబోయిన యానాదయ్య S/o కొండయ్య	38	41	42, 59	39	
					దేవళ్ళ రమణమ్మ W/o గార్దయ్య	38	41	42, 59	39	
24	39	3.62	చుక్కలు భూమి	3.62	ఇతరులు	38	40	41, 37	484	
25	40	0.47	చుక్కలు భూమి	0.34	ఇతరులు	41, 39	61	61	484	
				0.13	వకరాగమ్మ W/o వెంకటసుబ్బారెడ్డి	41, 39	61	61	484	
26	41	1.39	పట్టా	0.64	వాకా వెంకటకృష్ణరెడ్డి S/o శంకర్ రావు	37	40	59	39	
				0.5	గండికోటశ్రీనివాసులు S/o పెద్ద వెంకయ్య	37	40	59	39	
				0.25	వాకా శేషమ్మ W/o దివంగత హరిచంద్రారెడ్డి	37	40	59	39	
27	42	1.97	పట్టా	0.985	పులియానాడి S/o సుబ్బయ్య	36	59	35	37	
				0.4925	పులినాగరాజు S/o పుల్లయ్య	36	59	35	37	
				0.4925	పులిసుబ్బారావు S/o పుల్లయ్య	36	59	35	37	
28	43	1.55	ఇనామ్	1.55	శ్రీరామలింగేశ్వర స్వామి	33, 34	45	44	59	
29	44	1.96	పట్టా	0.6	గండికోటవెంకమ్మ W/o కొండయ్య	30, 33	46,45	28, 29, 30	43, 45	
				0.46	తమ్మిశెట్టిసౌభాగ్యమ్మ W/o పెద్ద కోటయ్య	30, 33	46,45	28, 29, 30	43, 45	
				0.27	తిప్పారెడ్డివెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	30, 33	46,45	28, 29, 30	43, 45	
				0.13	తిప్పారెడ్డివెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	30, 33	46,45	28, 29, 30	43, 45	
				0.5	వకాశ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	30, 33	46,45	28, 29, 30	43, 45	
30	45	2.86	పట్టా	0.59	పేరంకోటయ్య S/o అంకయ్య	43	56	44, 46, 47, 55	58, 59	
				0.57	వాకా దశరథరామిరెడ్డి S/o శంకర్ రెడ్డి	43	56	44, 46, 47, 55	58, 59	
				0.62	దారుకుమల్లిసునీత W/o బాలరామిరెడ్డి	43	56	44, 46, 47, 55	58, 59	
				0.36	వకవేనెల D/o నిరంజన్ రెడ్డి	43	56	44, 46, 47, 55	58, 59	
				0.36	వక నీరజ D/o నిరంజన్ రెడ్డి	43	56	44, 46, 47, 55	58, 59	
				0.36	వక మానస D/o నిరంజన్ రెడ్డి	43	56	44, 46, 47, 55	58, 59	
31	46/1	0.22	పట్టా	0.22	వకాశ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	44	46/2	47	45	
32	46/2	0.2	పట్టా	0.2	వకాశ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	46/2	47	47	45	
33	47	1.79	పట్టా	1.79	Manemlaa Venka Reddy S/o వెంకటరామి రెడ్డిలు	45, 16, 48	55	48	45	
34	48	3.1	పట్టా	0.95	వలప్రలజంకమ్మ w/o వెంకయ్య	28	50	25	47, 55	
				0.175	గండికోటచిన్నారావు S/o యలమందయ్య	28	50	25	47, 55	
				0.675	వైదుపల్లిశ్రీనివాసులు S/o Yanadaiah	28	50	25	47, 55	
				0.7	వలపర్లకలగమ్మ w/o వెంకయ్య	28	50	25	47, 55	
				0.3	జమాపాణిబ్రహ్మం S/o యనాదయ్య	28	50	25	47, 55	
				0.3	తాటా అంకమ్మ w/o శ్రీనివాసులు	28	50	25	47, 55	
35	49	1.3	పట్టా	0.47	మైలాపురంరత్తయ్య S/o నరసయ్య	27	19	20	25	
				0.21	వలప్రల కలగయ్య	27	19	20	25	
				0.06	తుళ్లూరుకృష్ణయ్య S/o రామయ్య	27	19	20	25	
				0.56	మైలాపురంరత్తయ్య S/o నరసయ్య	27	19	20	25	
36	50	4.4	పట్టా	1.5	వైదుపల్లియనాది S/o ముసలై	48, 55	51	25	52, 53	
				1.84	మైలాపురంరత్తయ్య S/o నరసయ్య	48, 55	51	25	52, 53	
				0.28	తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	48, 55	51	25	52, 53	
				0.28	మైలాపురిసామ్రాజ్యం W/o రత్తయ్య	48, 55	51	25	52, 53	
				0.5	తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	48, 55	51	25	52, 53	
37	51	1.48	పట్టా	1.48	మైలాపురంరత్తయ్య S/o నరసయ్య	19	52	16	19, 25, 50	
					తుళ్లూరు కాంతమ్మ W/o పెద్ద తిరుపతి	19	52	16	19, 25, 50	
					మైలాపురి సామ్రాజ్యం W/o రత్తయ్య	19	52	16	19, 25, 50	
38	52/1	1.11	పట్టా	0.37	ఆళ్ల చంద్రశేఖర్ రెడ్డి S/o వెంకటరమణా రెడ్డి	50, 53	52/2	50, 51	56	
				0.37	సల్లపరెడ్డిరమాదేవి w/o యానాది రెడ్డి	50, 53	52/2	50, 51	56	
				0.37	ఆళ్లభాస్కర్ రెడ్డి S/o రమణా రెడ్డి	50, 53	52/2	50, 51	56	
39	53	1.08	పట్టా	1.08	మణెమల్లవెంక రెడ్డి S/o వెకటరామి రెడ్డి	55	52	50, 52, 55	54, 56	
40	54/1	0.33	పట్టా	0.33	నరయ్యతో మన్నెం వరలక్ష్మి	55	54/2	53	56	

(మిగతా 7వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

41	54/2	0.3	పట్టా	0.3	మన్నెం వరలక్ష్మి w/o నరయ్య	54/1	52	53	56
42	55	1.78	పట్టా	0.42	మణెమల్లవెంక రెడ్డి S/o వెంకటరామిరెడ్డి	45, 47	50, 53, 54, 56	48	45
				0.42	మణెమల్లశ్రీదేవమ్మ w/o వెంకారెడ్డి	45, 47	50, 53, 54, 56	48	45
				0.94	ఖైదుపల్లియానాది s/o ముసలయ్య	45, 47	50, 53, 54, 56	48	45
43	56/1	6.49	పట్టా	0.6	నెల్లూరుకామేశ్వరమ్మ w/o వెంకటనారపరెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				1.32	ఆళ్ల వెంకటకృష్ణ రెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				0.04	నెల్లూరురాణి వాసులురెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				0.85	వెల్లూరుశంకర్ రెడ్డి S/o వెంకట ఉబ్బారెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				0.42	వెల్లూరుశంకర్ రెడ్డి S/o వెంకట ఉబ్బారెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				0.025	వాకా సరోజనమ్మ w/o సుధాకర్ రెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				0.665	వాకా వెంకటకృష్ణరెడ్డి S/o రామి రెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				0.69	వాకా వెంకటకృష్ణ రెడ్డి S/o రామి రెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
				1.88	వాకా వెంకటకృష్ణ రెడ్డి S/o రామి రెడ్డి	45, 54	16	52, 53, 54	58,57, 63,64
44	57	2.84	పట్టా	0.48	వాకాయానాది రెడ్డి S/o చంద్ర రెడ్డి	58	63	56	62
				0.96	వాకా రమణమ్మ W/o వెంకటకృష్ణరెడ్డి	58	63	56	62
				0.245	వాకాయానాది రెడ్డి S/o చంద్ర రెడ్డి	58	63	56	62
				0.015	వాకా వెంకటకృష్ణ రెడ్డి S/o రామి రెడ్డి	58	63	56	62
				0.335	వాకాయానాది రెడ్డి S/o చంద్ర రెడ్డి	58	63	56	62
				0.805	వాకా వెంకటకృష్ణ రెడ్డి S/o రామి రెడ్డి	58	63	56	62
45	58	3	పట్టా	3	వాకా శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	59, 60	57	45, 56	61, 62
					వాకా ఓబులు రెడ్డి S/o వెంకటసుబ్బారెడ్డి	59, 60	57	45, 56	61, 62
					వాకా శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	59, 60	57	45, 56	61, 62
					వాకా రమణమ్మ W/o వెంకటకృష్ణరెడ్డి	59, 60	57	45, 56	61, 62
					వాకా శ్రీనివాసులురెడ్డి S/o రమణా రెడ్డి	59, 60	57	45, 56	61, 62
46	59	6.13	పట్టా	6.13	శ్రీరామలింగేశ్వర స్వామి	42	58, 60,61	34, 43, 45	57, 41
47	60	1.03	పట్టా	0.34	గడికోట శ్రీనివాసులు S/o పెద్ద వెంకయ్య	59	58	58, 59	51
				0.02	ఇతరులు	59	58	58, 59	51
				0.67	వాకా శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	59	58	58, 59	51
48	61/1	0.62	చుక్కలు భూమి	0.62	వాకా రాగమ్మ W/o వెంకటసుబ్బారెడ్డి	59	61/2	60	40
49	61/2	0.78	చుక్కలు భూమి	0.39	గండికోటకొండయ్య	61/2	62	58	484
				0.39	దేవళ్ల హరిబాబు S/o చంద్ర మౌళి	61/2	62	58	484
50	62	1.23	ఇనామ్	1.09	వాకాయానాది రెడ్డి S/o చంద్ర రెడ్డి	61	484	57, 58, 63	484
				0.14	ఇతరులు	61	484	57, 58, 63	484
51	63/1	2.34	పట్టా	0.86	పాలకీర్తి కనకయ్య S/o దుర్గయ్య	57	63/2, 64	56	62484
				1.35	PalkteerthiPandaiah S/o పెద్ద రామలింగయ్య	57	63/2, 64	56	62484
				0.13	PalkteerthiPandaiah S/o పెద్ద రామలింగయ్య	57 64	63/2,	56	62484
52	63/2	0.42	పట్టా	0.42	పాలకీర్తిసుబ్బమ్మ	63/1	65	64	484
				0.465	వెన్నలగంటివెంకట రమణారావు	484	239, 240	484	242	
				0.46	పోలంరెడ్డి విజయలక్ష్మమ్మ W/o శ్రీనివాసులు రెడ్డి	484	239, 240	484	242	
194	242	2.74	పట్టా	1.54	వెన్నలగంటివెంకట రమణారావు	484	239	241	250	
				0.16	వెన్నలగంటివెంకట రమణారావు	484	239	241	250	
				0.57	వెన్నలగంటివెంకట రమణారావు	484	239	241	250	
				0.47	పోలంరెడ్డివిజయ లక్ష్మమ్మ W/o దివంగత శ్రీనివాసులు రెడ్డి	484	239	241	250	
195	273	5.95	పట్టా	5.95	వాకా కోటరెడ్డి S/o అంజి రెడ్డి	272, 277	274 276	191, 192, 194/1	277, 281	
					వాకా బ్రహ్మానంద రెడ్డి S/o రమణా రెడ్డి	272, 277	274, 276	191, 192, 194/1	277, 281	
					వాకా రామచంద్రా రెడ్డి S/o రాధా కృష్ణ రెడ్డి	272, 277	274, 276	191, 192, 194/1	277, 281	
					వాకా వెంకట సరప రెడ్డి	272, 277	274, 276	191,277, 192, 194/1	281	
					వాకా శేషమ్మ W/o సుదాకర్ రెడ్డి	272, 277	274, 276	191, 192, 194/1	277 281	
					వాకా మల్లికార్జున రెడ్డి S/o రాఘవ రెడ్డి	272, 277	274, 276	191, 192, 194/1	277, 281	
					వాకా శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	272, 277	274, 276	191, 192, 194/1	277, 281	
					వాక దయాకర్ రెడ్డి S/o సుధాకర్ రెడ్డి	272, 277	274, 276	191, 192, 194/1	277, 281	
					ఇతరులు	272, 277	274, 276	191, 192, 194/1	277 281	
					వాకారామలక్ష్మమ్మ W/o రామకృష్ణా రెడ్డి	272 277	274, 276	191, 277, 192, 194/1	281	
					వాకారామలక్ష్మమ్మ W/o రామకృష్ణా రెడ్డి	272, 277	274, 276	191, 192 194/1	277, 281	
Total				447.84						

సం/- హిమాన్షు శుక్ల, I.A.S.,
కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పారదర్శక దర్యాప్తునకు అభ్యంతరం లేదు

- వివేకా హత్య కేసులో సునీల్ యాదవ్ కౌంటర్
- సునీత పిటిషన్‌పై విచారణ 10కి వాయిదా

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలంటూ ఆయన కుమార్తె సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సీబీఐ కోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు రెండో నిందితుడైన యాదాటి సునీల్‌యాదవ్ మంగళవారం కౌంటర్ దాఖలు చేశారని సునీత తరఫు న్యాయవాది ఎస్.గౌతం తెలిపారు. పిటిషన్‌లో నిందితులందరూ కౌంటరు దాఖలు చేసినట్లు చెప్పారు. వివేకా హత్యపై పారదర్శక, నిష్పాక్షిక దర్యాప్తునకు అభ్యంతరం లేదని సునీల్ యాదవ్ కౌంటరులో పేర్కొన్నారు. దర్యాప్తు పురోగతిని ప్రతివారం కోర్టు పర్యవేక్షించాలని కోరారు.

అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయించాలి: ‘కేవలం పిటిషనర్ సునీతారెడ్డి లేవనెత్తిన అభ్యంతరాలనే కాకుండా గతంలో హైకోర్టుల్లో పలు పిటిషన్లలో వెల్లడించిన వ్యక్తుల గురించి దర్యాప్తు జరిపించాలి. వివేకా హత్యకు కుటుంబసభ్యులు, సన్నిహితుల సహకారం ఉంది. ఆయన వ్యక్తిగత జీవితంలోని అంశాలు కూడా కారణం. వాటన్నింటిపై దర్యాప్తు జరపాలి. సాక్షులకు రక్షణ కల్పించకపోవడంతో సహా అన్ని అంశాలపై దర్యాప్తు చేయాలి. కె.శ్రీనివాసరెడ్డి, కె.గంగాధర్‌రెడ్డి, నారాయణయాదవ్, ప్రత్యక్ష సాక్షి అయిన వాచ్‌మన్ రంగన్న, డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డిలు మృతి చెందారు. తనను నేరం అంగీకరించమని ప్రలోభపెట్టారని శివశంకరరెడ్డికి సన్నిహితుడైన గంగాధర్‌రెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. తర్వాత ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. జైల్లో దస్తగిరికి ముడుపులు ఇవ్వచూపిన అంశం సహా అన్నింటిపైనా నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉంది’ అని కౌంటర్‌లో సునీల్ యాదవ్ పేర్కొన్నారు. హవాలాతో పాటు ఇతర అంశాలపై ఎన్ఐఏ సహకారంతో నిష్పాక్షిక దర్యాప్తును నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా ఆదేశించాలని కోరారు.

ప్రత్యేక సౌకర్యాలకు అనుమతించలేం

- జైలు నిబంధనల మేరకే కల్పిస్తారు
- జోగి రమేష్ పిటిషన్‌పై ఎక్సైజ్ కోర్టు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: జైల్లో తనకు ప్రత్యేక వసతులు కల్పించాలని కోరుతూ వైకాపా నేత జోగి రమేష్ వేసిన పిటిషన్‌ను విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు మంగళవారం తిరస్కరించింది. ప్రత్యేక గది, మంచం, పరుపు, బెడ్ షీట్లు, దుప్పట్లు, ఫ్యాన్, పిల్లో, వైద్యులు సూచించిన మందులు, ఇంటి నుంచి భోజనం, వెస్టర్న్ టాయిలెట్‌కు అనుమతించాలని పిటిషన్‌లో జోగి కోరగా, వాటికి అనుమతించలేమని.. జైలు నిబంధనల ప్రకారమే వసతులు కల్పించాలని కారాగార సూపరింటెండెంట్‌ను ఆదేశిస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని జోగి రమేష్ వేసిన మరో పిటిషన్‌పై విచారణ ఈ నెల 6కు వాయిదా పడింది. నకిలీ మద్యం కేసులో జోగి రమేష్, ఆయన సోదరుడు రామును కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ వేయగా, దీనిపై కౌంటర్ దాఖలు నిమిత్తం విచారణను ఈ నెల 6కు కోర్టు వాయిదా వేసింది. ములాఖత్‌ల సంఖ్యను పెంచాలని రమేష్ వేసిన మరో పిటిషన్‌పైనా కూడా విచారణ ఈ నెల 11కు వాయిదా పడింది.

ఏడుగురి కస్టడీకి అనుమతి

ఇదే కేసులో రవి (ఏ4), బాదల్ దాస్ (ఏ7), ప్రదీప్ దాస్ (ఏ8), శ్రీనివాస్‌రెడ్డి (ఏ11), కల్యాణ్ (ఏ12), రమేష్ బాబు (ఏ15), అల్లాభక్ష్ (ఏ16)లను కస్టడీకి ఇవ్వాలని సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఎక్సైజ్ కోర్టు అనుమతించింది. ఈ నెల 7 నుంచి 11 వరకు వారిని ఐదు రోజులు కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి లెనిన్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. మరో నిందితుడు సతీష్‌బాబు (ఏ17) కస్టడీ పిటిషన్‌పై వాదనల నిమిత్తం విచారణ 11కు వాయిదా పడింది.

అనుమతులు లేని బీఈడీ కళాశాల?

- వైకాపా నాయకుల నిర్వహణ

ఈనాడు, నెల్లూరు: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ విడుదల చేయడంతో.. గత ఐదేళ్లలో కనిపించని బీఈడీ కళాశాలలు పుట్టుకొస్తున్నాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో బీఈడీ కళాశాలల అనుమతుల పునరుద్ధరణలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని నివారించేందుకు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) ప్రత్యేక మార్గదర్శకాలు జారీచేసినా.. క్షేత్రస్థాయిలో వాటిని పట్టించుకునే వారు కరవయ్యారు. నెల్లూరు బీవీ నగర్‌లో వైకాపా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓ బీఈడీ కళాశాలకు సంబంధించి, అనుమతుల కోసం నకిలీ డాక్యుమెంట్లను దాఖలుచేశారని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కళాశాల యాజమాన్యం అప్పటి వరకు ఉన్న కళాశాల బోర్డును తీసి లోపల పెట్టేసింది. దీనిపై విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం డీన్ హుసేనయ్యను వివరణ కోరగా తమకు ఫిర్యాదులేవీ అందలేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తల ఆధారంగా విచారణ చేపడతామన్నారు.

అమెరికా దేశస్థుడికి బాలిక దత్తత


దత్తత ఇస్తున్న పాపను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లాలో తొలిసారి ఓ బాలికను విదేశీయుడికి దత్తత ఇవ్వనున్నారు. ఈ మేరకు కలెక్టర్ మంగళవారం అనుమతించారు. అమెరికాలో ఇల్లినాయిస్‌కు చెందిన బ్రాడెన్ రీజ్‌వెట్ తాను దత్తత తీసుకునేందుకు బాలిక కావాలని కేంద్ర ప్రభుత్వ కేరింగ్ పోర్టల్‌కు దరఖాస్తు చేశారు. ఇందుకు సెంట్రల్ అడాప్షన్ అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ సంరక్షణలో దత్తత సంస్థలో ఉన్న ఏడాది వయసున్న విభిన్న ప్రతిభావంతురాలైన అమర ప్రగతిని దత్తత ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. దీనిపై కలెక్టర్ కృతికా శుక్లాను అనుమతి కోరగా.. దత్తత కోరుతున్న రీజ్‌వెట్‌తో కలెక్టర్ ఆన్‌లైన్‌లో మాట్లాడి విభిన్న ప్రతిభావంతురాలిని దత్తత తీసుకోవడంలో లక్ష్యం, సంసిద్ధత తదితర అంశాలపై ఆరా తీశారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు జన్మించిన ఇతర పిల్లలతో సమానంగా చూడాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించడంతో బాలికను దత్తత ఇచ్చేందుకు కలెక్టర్ అనుమతించారు.

7న అనంతపురంలో ‘రెవెన్యూ క్రీడోత్సవం’

- బొప్పరాజు వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు. చిత్రంలో డీఆర్వో మాలోల తదితరులు

అనంతపురం (జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే: అనంతపురంలో మూడు రోజుల పాటు నిర్వహించే ‘రెవెన్యూ క్రీడల’ పండుగకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం ఆయన ఇక్కడ ఆర్డీటీ క్రీడాగ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ‘‘రెవెన్యూ క్రీడల పండుగలో భాగంగా ఈ నెల 7, 8, 9వ తేదీల్లో 16 విభాగాల్లో 31 రకాల క్రీడలు, ఆటల పోటీలు ఉంటాయి. సీసీఎల్ఏ జట్టుతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 27 జట్ల తరఫున 2 వేల మంది దాకా ఉద్యోగులు ఇందులో పాల్గొంటారు. 7న ప్రారంభోత్సవానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీసీఎల్ఏ కార్యదర్శి హాజరవుతారు. ముగింపు వేడుకలకు సీఎం చంద్రబాబు వచ్చే అవకాశం ఉంది’’ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రాజేశ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దివాకర్‌రావు, సోమశేఖర్, డీఆర్వో మాలోల, ప్రత్యేక ఉపకలెక్టర్లు రామకృష్ణారెడ్డి, మల్లికార్జునుడు, ఆనంద్, ఆర్డీవో కేశవ నాయుడు పాల్గొన్నారు.

చెవిరెడ్డి భాస్కరరెడ్డికి రెండోరోజు ఎయిమ్స్‌లో చికిత్స

తాడేపల్లి, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్‌లో రెండో రోజు వైద్య చికిత్స అందించారు. ఈ నెల 3న ఆయనకు చర్మ, పలు సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్య సహాయం అందించారు. ఉదయం 8:30 గంటలకు పోలీసు ఎస్కార్ట్ వాహనంలో ఎయిమ్స్‌కు చేరుకున్న ఆయన సాయంత్రం 3:30 గంటల వరకు ఆసుపత్రిలో ఉన్నారు. అనంతరం పోలీసులు ఆయన్ను జైలుకు తీసుకువెళ్లారు.


ఎయిమ్స్ నుంచి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు

రాష్ట్రవ్యాప్తంగా వందేమాతరం 150 వసంతాల వేడుక

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

ఈనాడు, అమరావతి: కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈ నెల 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమం రాష్ట్ర ఇన్‌ఛార్జిగా భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ వ్యవహరిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర పదాధికారులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాధవ్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
బుధవారం నవంబరు 5, 2025

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం



శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. **ప్రవేశ పాసులు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం వద్ద పంపిణీ చేస్తారు.** ఇవి పరిమిత సంఖ్యలో ఉంటాయి. చిన్న పిల్లలకు అనుమతి లేదు. నేల పై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

–విజయవాడ సిటీ,న్యూస్‌టుడే

పరిమిత సంఖ్యతో ప్రవేశ పాసుల పంపిణీ

సమయం:
ఈ రోజు (బుధవారం)
సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం.

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 5న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

ETV ఆంధ్ర ప్రదేశ్ | ETV తెలంగాణ | ETV Life

బ్యారేజీ 35 గేట్ల మూసివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం మంగళవారం బాగా తగ్గింది. ఈ క్రమంలో ఉదయం ఆరు గంటలకు 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 35 గేట్లను మూసివేశారు. సముద్రంలోకి 25,375 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. **పంట కాలువలకు 2,711 క్యూసెక్కులు:** కృష్ణా డెల్టాలో బందరు కాల్వ మినహా మిగతా అన్ని పంట కాలువలకు నీటి విడుదలను పునరుద్ధరించారు. మొత్తం 2,711 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 1,514, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 1,016, గుంటూరు ఛానల్‌కు 181 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ 503, కేఈబీ 500, ఏలూరు కాలువలకు 511 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

శివయ్య లేని నంది.. ఇక్కడ ప్రత్యేకమండి



సాధారణంగా నంది విగ్రహం శివాలయాల్లో ఉంటుంది. కానీ పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయంలో ఉన్న నంది విగ్రహానికి భక్తులు పూజలు చేస్తున్నారు. అసలు ఈ ఆలయంలో నంది విగ్రహం ఎలా వచ్చిందో.. దాని కథేంటో తెలుసుకుందాం. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పెనుగంచిప్రోలులోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఒకటి. ఈ దేవాలయ ప్రాంగణంలో నందీశ్వరుడు ప్రత్యేక పూజలందుకుంటున్నాడు. ఒకప్పటి పెనుగంచిప్రోలులో శిల్ప సంపదకు తార్కాణంగా నిలుస్తోంది. కొన్ని వందల ఏళ్ల కిందట కంచికోట, పెదకంచి నేటి పెనుగంచిప్రోలుగా మారింది. కంచి దీటుగా నాడు పెదకంచి ప్రోలు విరాజిల్లుతుండేదని ఈ పేరు వచ్చిందని స్థానికులు చెబుతుంటారు. గ్రామ గత చరిత్రను చాటి చెప్పే శిలలు, విగ్రహాలు ఎన్నో తవ్వకాల్లో లభ్యమయ్యాయి. వీటిల్లో కొన్నింటిని విజయవాడలోని విక్టోరియా మ్యూజియంలో భద్రపర్చారు. మరికొన్ని స్థానిక ఆలయాల్లో కొలువుదీరాయి. ఇలా తవ్వకాల్లో లభ్యమైన పెద్ద నంది విగ్రహమే నేడు శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేకంగా కన్పించేలా ప్రతిష్ఠించారు. ★ గతంలో శిథిలమైన పెద్ద నంది విగ్రహం నాలుగు దశాబ్దాల కిందట మునేరు ఒడ్డున ఓ ఇంటికి పునాదుల తవ్వకాల్లో వెలుగు చూసింది. నంది విగ్రహానికి తల భాగం లేకుండా ఉంది. అక్కడి నుంచి తీసుకొచ్చి గ్రామంలోని సత్రం సెంటర్‌లో ఉంచారు. ఎన్నో ఏళ్ల ఇక్కడే నిరాదరణకు గురైంది. దీనిపై 'ఈనాడు'లో కథనం రావడంతో విగ్రహాన్ని తిరుపతమ్మ ఆలయానికి వచ్చిన ఓ అధికారి పరిశీలించి విగ్రహానికి శిల్పులతో తల భాగాన్ని ఏర్పాటు చేయించారు. అనంతరం తిరుపతమ్మ ఆలయంలో ఏర్పాటు చేయించారు.

– పెనుగంచిప్రోలు, నందిగామ(న్యూస్‌టుడే)

జోరుగ మూగి... తీరుగ దోచి!

భూములు, చెరువులు, లీజులు అన్నింటా యాగీ ★ నాడు ప్రజాప్రతినిధిగా జోగి దందా..



ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

'పెడనలో వైకాపా నేత జోగి రమేశ్ చేసిన అక్రమాలు.. అరాచకాలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వ భూముల అమ్మకాలు.. రైతుల స్వాధీనంలోని చెరువులకు మధ్యవర్తిగా వ్యవహరించి లీజుల పేరుతో రూ.కోట్లు దండుకోవడం.. కొందరు రైతుల భూములను ఆక్రమించేశారనే ఆరోపణలు దండిగా ఉన్నాయి.'

'జోగి ప్రధాన అనుచరుడు శ్రీనివాస్‌రెడ్డి తన భూమి ఆక్రమించారనీ.. 30 ఎకరాలకు దొంగ దస్తావేజులు సృష్టించారనీ.. జోగి ప్రోద్బలంతోనే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రామకృష్ణ, బంటుమిల్లి సబ్‌రిజిస్ట్రార్ సహకరించారని మంత్రి అనగాని వద్ద నిరుడు బంటుమిల్లివాసి రంగబాబు వాపోయారు.'

రైతుల మాటున మేత...

❖ కృత్తివెన్ను మండలంలో రైతులకు పట్టాలు ఇప్పిస్తానని.. కారు చౌకగా చెరువులను లీజులకు తీసుకొన్న జోగి అదే చెరువులను గోదావరి జిల్లా వ్యాపారులకు సబ్ లీజులకు ఇచ్చి రూ.కోట్లు దండుకున్న ఆరోపణలు ఉన్నాయి. ❖ కృత్తివెన్ను మండలంలో మడ, ప్రభుత్వ భూములు ఏళ్లుగా రైతుల స్వాధీనంలో చెరువులుగా ఉన్నాయి. రైతులను ముందు పెట్టి పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను ప్రసన్నం చేసుకొని బినామీల పేర్లతో భారీగానే బొక్కేశారు. ❖ బంటుమిల్లి మండలంలో ప్రభుత్వ భూముల్లో చెరువుల తవ్వకాలు, భూముల అమ్మకాలు.. మట్టి మాఫియా, విద్యుత్తు నియంత్రికల ఏర్పాటు, మాట వినని పెద్ద రైతులకు విద్యుత్తు కట్ చేసే వరకు అంతా జోగి యాగీనే నడిచింది.



ఇంతేరులో బంజరు భూములు

పట్టాలు ఇప్పిస్తానని నమ్మించి...

కృత్తివెన్ను మండలం గరిశపూడి, నిడమర్రు రెవెన్యూలో తణేలు వంతెన సమీపంలో పెదలంక డ్రెయిన్ వద్ద ఆర్‌ఎస్ నంబరు 66, 75, 76, 77లో సుమారు 300 ఎకరాలపై జోగి కన్నుపడింది. ఏళ్లుగా ఇక్కడ సాగులో ఉన్న రైతులను మధ్యవర్తిగా నమ్మించి ఆదాయం రాని భూములను తనకు ఏడేళ్ల పాటు అగ్రిమెంటు రాసి లీజుకు ఇవ్వాలని కోరారు. లీజు పూర్తయ్యేసరికి పట్టాలు ఇప్పిస్తానని నమ్మించారు. ఆశ పడిన రైతులు భూములను ఏటా రూ.5-10 వేలకు లీజుకు ఇచ్చారు. చాలా మందిని బెదిరించి లీజుకు రాయించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి.

సబ్ లీజులతో రూ.కోట్లు స్వాహా...


❖ రైతుల నుంచి కారుచౌకగా లీజుకు పొందిన జోగి అవే చెరువులను భీమవరం వ్యాపారులకు పది రెట్ల లాభానికి సబ్ లీజులు ఇచ్చారని సమాచారం. ❖ ఒక్కో ఎకరం రూ.50-60 వేలకు ఏడాదికి లీజు ఇచ్చేలా ఒప్పందం జరిపి.. మధ్యవర్తి పేరుతో రైతులకు చెందాల్సిన రూ.కోట్లు వెనకేశారు. ❖ పెద్ద చెరువులు తవ్వేందుకు బడా వ్యాపారుల నుంచే ఎకరానికి రూ.5 వేలకుపైగా వసూలు చేశారు. ❖ మొత్తంగా రూ.కోటిన్నర మేర దోచినట్లు వాపోతున్నారు. ❖ పడతడిక, నిడమర్రుల్లో పోడు రోడ్డు నుంచి లక్ష్మీపురం సబ్‌ఛానల్ వరకు 120 ఎకరాలను రైతుల వద్ద కారుచౌకగా లీజుకు తీసుకొని గోదావరి జిల్లా బడా బాబులకు సబ్‌లీజులకు ఇచ్చి రూ.60 లక్షలకు పైగా దోచేశారని తెలిసింది. ❖ కృత్తివెన్ను పరిధి ఇంతేరులో బంజరును ప్రైవేట్ భూములని చెప్పి డబ్బు తీసుకొని తమకు కట్టబెట్టారనీ.. రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని భీమవరం వాసులు ఇటీవల బందరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు.

'కో-ల-వె-న్ను'.. ప్రత్యేకతలు కోకొల్లలు

కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామం పలు ప్రత్యేకతలకు నిలయంగా మారింది. 'కో' అంటే కోట్లు, 'ల' అంటే లక్షలు, 'వె' అంటే వేలు, 'న్ను' అంటే నూర్లుగా పేరుగాంచింది. పశుసంపదకు చెర్నా'కోల', పంటలకు వరి'వెన్ను' పదాలతో 'కోల-వెన్ను'గా పేరు వచ్చినట్లు చెబుతుంటారు. పేరుకు తగ్గట్లుగానే పాడి పంటలతో అనాదిగా అలరారుతోంది. గ్రామాభివృద్ధికి తూర్పు, పడమర షావుకార్లు పోటీపడి రూ.కోట్ల విలువైన భూములు విరాళంగా ఇవ్వడమే కాకుండా వాటిలో ప్రభుత్వ పాఠశాలలు, ఆయుర్వేద ఆసుపత్రి, పీఏసీఎస్, వీఆర్వో, పంచాయతీ భవనాలు, శుద్ధజల కేంద్రం, పశువైద్యశాల, పాలకేంద్రం, దేవాలయాలు, అంతర్గత సిమెంట్ రహదారులు నిర్మించారు. ✪ సోగ్గాడు, పాడిపంటలు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి వంటి సినిమాల్లోని పలు దృశ్యాలను ఇక్కడే చిత్రీకరించారు. ✪ సురేష్ ప్రొడక్షన్స్ సినిమాల్లో ముందుగా కనిపించే సిద్ధివినాయక విగ్రహం స్థానిక మండపాల కూడలిలో నిత్య పూజలందుకుంటోంది. ✪ గ్రామస్థుల సమష్టి కృషితో రూ.1.5 కోట్లతో అధునాతన సామాజిక కల్యాణ మండపం, దాతల విరాళాలతో వరసిద్ధి వినాయక పేరుతో భవనాలు నిర్మించారు. కోలవెన్ను పరిధిలో బందరు రహదారి పక్కన ఏర్పాటు చేసిన పశుప్రదర్శనను ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ సందర్శించడం విశేషంగా చెబుతుంటారు. శ్రీకృష్ణదేవరాయలు పేరుతో గ్రామస్థులు స్థాపించిన గ్రంథాలయంలో ప్రముఖ నటుడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి పాలకుడిగా సేవలందించారు. ✪ ఇదే ప్రాంగణంలో 1944లో జిల్లా స్థాయిలో నిర్వహించిన 'స్వదేశీ' ఆందోళన సమ్మేళనంలో రాష్ట్రం, జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నాటి పెద్దలు చెబుతుంటారు. ఈ విషయాన్ని 'మహాత్మా గాంధీ టూర్ ఇన్ ఆంధ్రప్రదేశ్' పుస్తకంలో పేర్కొనడం ప్రస్తావనీయం.



సామాజిక కల్యాణ మండపం



పంచకర్మ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి

– కంకిపాడు, న్యూస్‌టుడే

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనులు వేగవంతం చేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం విశిష్ట అతిథుల భవనంలో ఎయిర్ పోర్టు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనుల పురోగతి, సమస్యలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నిర్మాణం, సీలింగ్, ఎలివేషన్ పనులు, వాహనాల పార్కింగ్ ఏరియా, డ్రైనేజీ ఇతర మౌలిక వసతుల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు, భూసేకరణ సమస్యలపై చర్చించారు. కొనసాగుతున్న పనుల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏఏఐ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని తెలిపారు. విమానాశ్రయ విస్తరణలో నెలకొన్న భూసమస్యలు, కోర్టు వివాదాలు, ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం, రైతులకు పరిహారం.. ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న న్యూ ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌ను కలెక్టర్ పరిశీలించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో విమానాశ్రయ జనరల్ మేనేజర్ రామాచారి, డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శివయ్య, పంచాయతీరాజ్ ఎస్‌ఈ రమణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సోమశేఖర్, రహదారులు భవనాల శాఖ ఈఈ లోకేశ్వరరావు, ఇరిగేషన్, డ్రైనేజీ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

శాస్త్రవేత్తలు.. మేధావులకో వనం



మానవాళికి మేలు చేసేలా అద్భుతమైన ఆవిష్కరణలు చేసిన శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో మేధావుల పేర్లు పుస్తకాల్లో చదవడం మినహా వారెలా ఉంటారో నేటితరం విద్యార్థులకు గూగుల్‌లో చూస్తే తప్ప అంతగా తెలియదు. అందుకే వారిని చూపిస్తూ వారు సాధించిన విజయాలు, అందించిన విజ్ఞానాన్ని వివరిస్తూ బోధన సాగించేలా కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వేలేరు జవహర్ నవోదయ విద్యాలయలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా గణితం, సామాన్య శాస్త్రాల్లో అసమాన ప్రతిభ కనబర్చిన శాస్త్రవేత్తల విగ్రహాలతో ఒక ఉద్యాన వనాన్నే నెలకొల్పారు. ఐన్‌స్టీన్, అరిస్టాటిల్, సీవీరామన్, సిగ్మండ్ ఫ్రాయిడ్ తదితర శాస్త్రవేత్తలు, మేధావుల విగ్రహాలు ఈ పాఠశాలలోకి అడుగు పెట్టగానే ఎంతో ఆకర్షిస్తున్నాయి.

– హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

వచ్చాడంటే.. చచ్చామంతే..!

దండయాత్రలా జగన్ పరామర్శ పర్యటన



గూడూరు: బీవీతోట వద్ద రైతులు తడిసిన పంటను చూపుతున్నా పట్టించుకోకుండా అభివాదం చేసి, కారు ఎక్కి వెళ్లిపోతున్న జగన్

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - న్యూస్‌టుడే బృందం: మొంథా తుపాను ధాటికి పంటలు దెబ్బతిన్న రైతులను పరామర్శించేందుకు మంగళవారం కృష్ణా జిల్లాలో సాగిన వైకాపా అధినేత జగన్ పర్యటన ఆది నుంచి ప్రజలను అవస్థల పాలుచేసింది. గత పర్యటనల నేపథ్యంలో కార్యకర్తల అత్యుత్సాహంతో జరిగిన పరిణామాలతో పోలీసులు షరతులతో కూడిన అనుమతులిచ్చారు. పర్యటన ఆసాంతం ఎక్కడా అవి అమలు కాలేదు. భారీ జన సమీకరణలు, పరిమితికి మించి వాహనాలతో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

గంటల కొద్దీ యాతన.. విజయవాడ నుంచి మొదలైన జగన్ కాన్వాయ్‌తో.... గోసాల, గండిగుంట, గోపువానిపాలెం, బల్లిపర్రు, నిడుమోలు, గూడూరు, రామరాజుపాలెం, ఎస్‌ఎన్ గొల్లపాలెం వరకు ప్రతిచోట ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు తప్పలేదు. జగన్ గోసాల దాటే సమయంలో మచిలీపట్నం వైపు నుంచి వస్తున్న ఓ అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. మధ్యాహ్నం 2 గంటలకే కార్యక్రమం పూర్తికావాల్సి ఉండగా.. రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. దీంతో సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల నుంచి వచ్చే విద్యార్థులతో ఉన్న ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు అన్నింటికి గంటల తరబడి నడిరోడ్డుపై నిరీక్షణ తప్పలేదు.

తోపులాటలు.. గాయాలు... ఆకుమర్రు లాకు వద్ద మీడియా పాయింట్ దగ్గర వైకాపా శ్రేణులు పోలీసులను తోసుకుంటూ లోపలకు వచ్చేందుకు యత్నించారు. పోలీసులు, శ్రేణుల తోపులాటలో పలువురు యువకులు, సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. ✪ పామర్రు మండలం కనుమూరు వద్ద జగన్ కాన్వాయిని అనుసరిస్తూ తోట్లవల్లూరు మండలం కనకవల్లికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో వారికి గాయాలయ్యాయి.


బడి పిల్లలు వీధుల్లో... పామర్రులో జడ్పీ పాఠశాల విద్యార్థులు జెండాలు పట్టుకొని రోడ్లపై తిరిగారు. ఎందుకొచ్చారని అడిగితే పాఠశాలలో హాజరు వేయించుకొని ఉపాధ్యాయులకు తెలియకుండా వచ్చామని సుమారు 15 మంది విద్యార్థులు చెప్పారు. విద్యార్థులు గంటల తరబడి పాఠశాలలో కనిపించకపోతే ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారు? జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ✪ రామరాజుపాలెం మండల పరిషత్తు పాఠశాల విద్యార్థులు జనాల్లో ఇరుక్కుంటూ ఆకుమర్రు లాకు వద్ద కనిపించారు.



ఉయ్యూరు వద్ద కార్యకర్తలు తక్కువగా ఉన్నా పలకరించడానికి కాన్వాయ్ ఆపడంతో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

విద్యుత్తు బిల్లు.. మీరే లెక్కించండి..!

★ మధురానగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి అక్టోబరు నెలలో 123 యూనిట్ల గృహ విద్యుత్తును వినియోగించుకున్నారు. దానికి ఎనర్జీ ఛార్జెస్ కింద రూ.408లు బిల్లులో వచ్చింది. ★ సూర్యారావుపేటకు చెందిన ఒక మెడికల్ ల్యాబ్.. 134 యూనిట్లు వాణిజ్య విద్యుత్తును వినియోగించుకుంది. దానికి ఎనర్జీ ఛార్జెస్ రూ.960లు అయింది. ..పై రెండింటిలో ఒకటి గృహ, మరొకటి వాణిజ్య విద్యుత్తు కనెక్షన్. రెండింటికీ ఛార్జీలు వేర్వేరుగా ఉంటాయి. వినియోగించిన యూనిట్లను బట్టి ధరలు మారుతుంటాయి. అవి ఎలా ఉంటాయో తెలుసుకుందామా..



గృహ ఛార్జీలు ఇలా..

యూనిట్లు	రూ.లలో
0–30	1.90
31–75	3.00
76–125	4.50
126–225	6.00
226–400	8.75
400 పైన	9.75

వాణిజ్య విద్యుత్తు ఇలా..

యూనిట్లు	రూ.లలో
0–50	5.40
51–100	7.65
101–300	9.05
301–500	9.60
500 పైన	10.15

ఇలా లెక్కిస్తారు... గృహ విద్యుత్తు వినియోగదారులకు 30 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.1.90లు వసూలు చేస్తారు. తర్వాత 31 నుంచి 75 యూనిట్ల వరకు (45 యూనిట్లకు) యూనిట్‌కు రూ.3లు, 76 నుంచి 125 యూనిట్ల వరకు (50 యూనిట్లు) యూనిట్‌కు రూ.4.50లు... ఇలా వసూలు చేస్తారు. ఇలా శ్రీనివాసరెడ్డికి అక్టోబరు నెలలో 123 యూనిట్లు వాడుకోగా మొదటి 30 యూనిట్లకు రూ.1.90 చొప్పున రూ.57లు, తర్వాత 45 యూనిట్లకు రూ.3లు చొప్పున రూ.135లు లెక్కించారు. 48 యూనిట్లు మిగలగా.. వాటికి యూనిట్‌కు రూ.4.50 చొప్పున రూ.216లు లెక్కించారు. ఇవన్నీ కలిపితే రూ.408లు వచ్చింది. అదే ఎనర్జీ ఛార్జెస్‌గా లెక్కిస్తారు. ★ సూర్యారావుపేటలోని మెడికల్ ల్యాబ్‌కు 134 యూనిట్లకు ఇదే విధంగా.. వాణిజ్య ఛార్జీల ప్రకారం లెక్కిస్తే రూ.960లు అయింది. ఇది బిల్లులో మొదటి లైనులోనే ఎనర్జీ ఛార్జెస్ అని ఉంటుంది. ఇది మనం వినియోగించిన విద్యుత్తుకు అయిన బిల్లు. దీనికి అదనంగా ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూఅప్, ఎఫ్‌పీపీసీఏ ఛార్జీలు కలిపి మొత్తం బిల్లు పంపిస్తారు.

– సూర్యారావుపేట, న్యూస్‌టుడే

చేరువ అవుదాం... చేయూతనిద్దాం!

☛ ప్రచారం కొరవడి.. అందరికీ దరి చేరక
☛ పోలీసు సామాజిక మాధ్యమాల తీరిది..

ఈనాడు, అమరావతి

పోలీసింగ్‌లో సాంకేతికతను జోడించి మంచి ఫలితాలు సాధించడంలో ముందున్న విజయవాడ కమిషనరేట్.. సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ప్రజలకు చేరువ కావడంలో వెనకబడింది. కేవలం భౌతికంగానే కాకుండా సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులను స్వీకరించే ఏర్పాటును ఈ ఖాతాల ద్వారా చేస్తున్నా స్పందన కొరవడుతోంది. ఈ ఫిర్యాదులకు వెంటనే స్పందించి సమాధానం ఇస్తున్నా పెద్దగా ఎవరూ ఉపయోగించుకోవడం లేదు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వచ్చింది అరకొరే...

నగర పోలీసు సామాజిక ఖాతాలకు ఈ ఏడాది ఇప్పటికి 12 ఫిర్యాదులే అందాయి. నేరుగా స్టేషనుకు వెళ్లి చెప్పుకోలేని, ఇతర ప్రాంతాల వారికి ఈ వేదికలు ఉపకరిస్తాయి. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా పోలీసుల దృష్టికి తెస్తే.. ఫిర్యాదు వచ్చిన నిమిషంలోనే సమాధానం ఇస్తున్నారు. మీ ఫిర్యాదు స్వీకరించాం. దానిని సంబంధిత అధికారికి పంపాం. చర్య తీసుకుంటామని తెలియజేస్తారు. తర్వాత వాటిని సంబంధిత ఠాణాకు పంపిస్తున్నారు.



ఎక్స్ ఖాతా పేజీ

2025లో అందిన ఫిర్యాదులు

ఫేస్‌బుక్ (@vjacitypolice)- 02
ఎక్స్ (@vjacitypolice)- 05
ఇన్‌స్టాగ్రామ్(@vijayawadacitypolice) - 05

☛ కేవలం వ్యక్తిగత ఫిర్యాదులే కాక పలు అంశాల వివరాలు అందిస్తున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు, రుణ యాప్ మోసాలు, ఆకతాయిల సమాచారం ఇస్తున్నారు. సైబర్ నేరాలపై కూడా ఫిర్యాదులు చేస్తున్నారు.

☛ హైదరాబాద్ యువతి కల్పన పీజీ పూర్తి చేసి, అమెరికాలో ఉంటోంది. విజయవాడ వ్యక్తిని అని ఒకరు టెలిగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. తనకు జాబ్ కన్సల్టెన్సీ ఉందనీ, మీకు ఉద్యోగం విషయంలో సాయం చేస్తానని నమ్మించాడు. 500 డాలర్లు తీసుకున్నాడు.. ఇంత వరకు ఉద్యోగం చూపించలేదని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మొత్తాన్ని తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నాడనీ.. నగదు ఇప్పించమని ఫిర్యాదులో అభ్యర్థించింది.

☛ తమ ఇంటి సమీపంలో కొందరు రోడ్లపైనే తాగుతున్నారని గాంధీనగర్‌వాసి అన్వర్ ఫిర్యాదు చేశారు. ఇది పెద్ద న్యూసెన్స్‌లా తయారైందన్నారు. గత కొన్ని నెలలుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రియాశీలకంగా వ్యవహరిస్తేనే ...

★ కమిషనరేట్ వారే కాకుండా ఇతర ప్రాంతాల్లో నగరవాసుల నుంచీ ఫిర్యాదులు అందుతున్నాయి. రోడ్లపై ట్రాఫిక్ ఉల్లంఘనల ఫొటోలు తీసి పంపిస్తున్నారు. వాటిని వెంటనే పోలీసులు సంబంధిత ట్రాఫిక్ స్టేషనుకు పంపి, చలానా వేసి, ఆ వివరాలను ఫిర్యాదు చేసిన వారికి పోస్టు చేస్తున్నారు.

★ సామాజిక ఖాతాల గురించి పెద్దఎత్తున ప్రచారం నిర్వహించి, ఉపయోగించుకునేలా నగర పోలీసులు మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తేనే ఎక్కువ మందికి చేరువకావచ్చు.

యాత్రకు బ్రేక్

నగరపాలక సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర కార్పొరేటర్ల విజ్ఞానయాత్రకు ఆకస్మిక బ్రేక్ పడింది. యాత్రకు వెళ్లేందుకు వైకాపా, తెదేపా కార్పొరేటర్లు సిద్ధమైనా, పార్లమెంట్ సభ్యుడు, శాసనసభ్యులు విముఖత చూపడంతో కూటమి పార్టీల కార్పొరేటర్లు వెళ్లకూడదని నిర్ణయించారు. మరోవైపు ప్రభుత్వ అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలతో యాత్రను రద్దు చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాలకసభ్యులు తలలు పట్టుకుంటున్నారు. ★ కార్పొరేటర్లు 2025 ఏప్రిల్ - మే నెలలో రూ.70 లక్షలు వెచ్చించి బెంగళూరు, మైసూర్, ఊటీ, కొడైకెనాల్, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, కొచ్చిన్ తదితర దక్షిణాది ప్రాంతాల్లో పర్యటించారు. తిరిగి ఈనెల 6న యాత్రకు సిద్ధమయ్యారు. ముంబై, అరేబియా సముద్ర గర్భంలోని ఎలిఫెంటా కేవ్స్, పలు ఆలయాలు తదితర ప్రాంతాల్లో 14 రోజులు పర్యటించాలని నిర్ణయించుకున్నారు. ప్రాథమికంగా రూ.లక్షల వ్యయం అవుతుందని అంచనా చేసి, స్థాయీ సంఘంలో ఆమోదించుకున్నారు.

ఈనాడు కథనానికి స్పందన

కమిషనర్‌పై ఒత్తిడి..

యాత్రకు నిధులు మంజూరు చేయాలంటూ వైకాపా పక్షం కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చింది. ప్రాథమికంగా రూ.25 లక్షలు విత్‌డ్రా చేసుకున్నట్లు చెబుతున్నారు. అయితే తుపాను ఇబ్బందులు, రూ.కోట్లలో నష్టం, ఇతర సమస్యల కారణంగా రూ.లక్షలు వెచ్చించి ఈ ఏడాది రెండోసారి యాత్రకు వెళ్లడం భావ్యం కాదని తెదేపా పక్షం గుర్తించింది. పార్లమెంట్ సభ్యుడు, శాసనసభ్యుల సూచనలతో తెదేపా కార్పొరేటర్లు రద్దు చేసుకున్నారు.

రూ.25 లక్షల మాటేంటి?

పాలకపక్షం ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి ఇప్పటికే రూ.25 లక్షలు డ్రా చేసుకున్నట్లు చెబుతున్నారు. ఆ సొమ్మును ట్రావెల్ ఏజెన్సీకి అడ్వాన్స్‌గా చెల్లించినట్లు ప్రచారం ఉంది. పాలకపక్షం వైఖరిని పలువురు తప్పుబడుతున్నారు. యాత్ర షెడ్యూల్‌ను నిర్ధారించుకోకుండా ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. సొమ్ము తిరిగి ఖజానాకు జమ చేస్తారా? మొండిగా వైకాపా కార్పొరేటర్లు యాత్రకు వెళ్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట బురిడీ

నమ్మించి రూ.35.15 లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే కనీవినీ ఎరుగని రీతిలో లాభాలు వస్తాయంటూ ఒక వ్యక్తిని నమ్మించి.. రూ.35.15 లక్షలు కొట్టేశారు. చిన్న మొత్తంలో లాభాలు ఇచ్చి.. తర్వాత రూ.లక్షల్లో వసూలు చేసి ష్ గప్‌చుప్ అంటూ గ్రూప్ మూసేశారు. వివరాల్లోకి వెళితే. . విజయవాడ, కరెన్సీనగర్‌కు చెందిన ఒక వ్యక్తి (49)కి ఈ ఏడాది జూన్ 17న గుర్తు తెలియని వాట్సాప్ నంబరు నుంచి 'కో క్రియేషన్ సర్కిల్' అనే గ్రూప్ పేరుతో మెసేజ్ వచ్చింది. సదరు గ్రూప్ అడ్మిన్‌తో పాటు గ్రూప్‌లోని సభ్యులమంటూ పలువురు ఆయనతో మాట్లాడారు. తాము ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి బాగా సంపాదించుకున్నామని ఆకర్షణీయంగా వివరించారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టమని సూచిస్తూ.. ఆయన్ని ఒక గ్రూప్‌లో చేర్చారు. తర్వాత వారు చెప్పిన విధంగా ఒక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆన్‌లైన్ పెట్టుబడులు పేరుతో మొత్తం 6 బ్యాంకు ఖాతాలకు విడతల వారీగా రూ.35.15 లక్షలు పంపించారు. వచ్చిన లాభాలను వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించినా.. కుదరకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

వనదేవత కొలువు.. వసూళ్లకు నెలవు!

ప్రశ్నించేవారిపై దాడులు

“ఇటీవల కేతనకొండ, గుంటుపల్లికి చెందిన కొందరు యువకులు మద్దులమ్మ ఆలయానికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో కొందరు అడ్డగించారు. ఆలయానికి వెళ్లాలంటే టోల్ చెల్లించాలని హుకుం జారీ చేశారు. అడవిలోకి వెళ్లేందుకు మేమెందుకు డబ్బులు కట్టాలని ప్రశ్నించగా కడితేనే దారి వదులుతామన్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. యువకులను ఇష్టమొచ్చినట్లు కొట్టి వెళ్లగొట్టారు.

“తాజాగా ఓ పోలీస్ అధికారి బంధువులు సైతం ఆలయానికి వస్తుండగా టోల్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అడవిలో అనధికారిక వసూళ్లేమిటని ప్రశ్నించినా పట్టించుకోలేదు. సదరు అధికారి స్థానిక నాయకుడి ద్వారా ఫోన్ చేయించడంతో వారికి మినహాయింపు ఇచ్చారు.


ఆలయ మార్గంలో ఏర్పాటు చేసిన అనధికారిక టోల్‌గేట్

ఈనాడు, అమరావతి

కంచికచర్ల మండలం గొట్టుముక్కల మద్దులమ్మ ఆలయ సమీపంలోని అనధికారిక చెక్‌పోస్ట్‌తో కొందరు కాసులు పండించుకుంటున్నారు. అడవి దారికి అడ్డంగా టోల్‌గేట్ పెట్టి వాహనాలకు వసూళ్లు చేయడం వివాదాలకు కారణమవుతోంది. ఇలా ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నా అటవీ సిబ్బంది, పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

లెక్కాపత్రం లేదు..

● చుట్టూ అటవీ ప్రాంతం..ఆకట్టుకునే జలపాతాలు..కట్టి పడేసే ప్రకృతి సోయగాలకు కంచికచర్ల మండలం గొట్టుముక్కలలోని మద్దులమ్మ ఆలయం నెలవు. ఈ ఆహ్లాదకర వాతావరణం, ఆలయ ప్రాముఖ్యత సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కావడంతో కొన్నాళ్లుగా భక్తులు పోటెత్తుతున్నారు. ● తరచూ షార్ట్‌ఫిల్మ్‌లు, ఫొటోషూట్లు జరుగుతుంటాయి. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో తాకిడి పెరిగింది. వనసమారాధనలు మొదలైతే మరింత మంది వస్తారు. ఇదే అదునుగా కొందరు ఆలయానికి కిలోమీటర్ ముందు కర్రలతో టోల్ గేటు ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనానికి రూ.20, ఆటోకు రూ.25, కారుకు 50 వరకు వసూలు చేస్తున్నారు. ● రోజుకు ఇక్కడికి 300 వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, 60 నుంచి 100 వరకు కార్లు వస్తాయి. వారాంతాల్లో రద్దీ మరింత పెరుగుతుంది. టోల్ గేటు దగ్గర 8 మంది విధులు నిర్వహిస్తున్నారంటే తాకిడి ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. సగటున రోజుకు రూ.10వేల చొప్పున నెలకు రూ.3లక్షల వరకు ఆదాయం వస్తోంది. ● ఈ వసూళ్లతో పర్యాటక, అటవీశాఖలకు సంబంధమే లేదు. అడవి దారిలో ప్రయాణిస్తుంటే ఈ వసూళ్లేంటి అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వసూళ్లు ఎవరు చేయమన్నారు..చేసిన వసూళ్లు ఏం చేస్తున్నారు..ఎందుకు ఉపయోగిస్తున్నారన్న లెక్కాపత్రం కూడా లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

ఎలివేటెడ్ కారిడార్.. సాధ్యమయ్యేనా?

విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్‌పై ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు

కలెక్టరేట్‌లో భాగస్వాముల సమావేశం నేడు

ఈనాడు, అమరావతి

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో బెంజ్‌సర్కిల్ నుంచి ఈడ్పుగల్లు వరకు దాదాపు 12 కి.మీ మేర ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయించేందుకు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు నడుంకట్టారు. దీంతో పాటు రహదారుల నిర్మాణం నేపథ్యంలో కావాల్సిన అదనపు సౌకర్యాలపై సమాలోచన చేయనున్నారు. రెండు జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో విజయవాడ కలెక్టరేట్‌లో భాగస్వాముల (స్టేక్ హోల్డర్స్) సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఈ రహదారి గురించి కన్సల్టెన్సీ తయారు చేసిన డీపీఆర్‌ను బుధవారం ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారుల ముందు ఉంచనున్నారు. దీని పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత అవసరాలను సదరు కన్సల్టెన్సీ దృష్టికి తీసుకెళ్తారు. సమావేశంలో విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు, విజయవాడ తూర్పు, పెనమలూరు, పామర్రు, మచిలీపట్నం ఎమ్మెల్యేలు పాల్గొంటారు. టాన్స్‌కో, తాగునీటి సరఫరా ఇలా జిల్లాలో రహదారులకు అనుబంధంగా ఉన్న అన్నిశాఖల అధికారులు పాల్గొంటారు.

అనుమతులు వస్తే పట్టాలెక్కనున్న పనులు..

విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మొత్తం 64 కి.మీ మేర రహదారి ఉంది. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో 2కి.మీ, కృష్ణాలో 62 కిలోమీటర్లు విస్తరించనున్నారు. ఇందులో బెంజ్ సర్కిల్ నుంచి కానూరు వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఈ పరిధిలో ఆరు వరుసలు విస్తరించేందుకు అవకాశం లేదు. సేకరించేందుకు ఆ ప్రాంతంలో భూముల విలువ ఎక్కువ. రెండు సమస్యలకు చక్కని పరిష్కారంగా బెంజ్ సర్కిల్ నుంచి ఈడ్పుగల్లు వరకు దాదాపు 12 కిలోమీటర్ల మేర ఒకే పైవంతెన (ఎలివేటెడ్ కారిడార్) ఏర్పాటు చేయాలని కూటమి ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. ప్రస్తుతం కన్సల్టెన్సీ తయారు చేసిన డీపీఆర్‌లో దీని ప్రస్తావన లేదు. భాగస్వాముల సమావేశంలో ఈ ప్రతిపాదనలను కన్సల్టెన్సీ ముందు ఉంచనున్నారు. దీంతో పాటు ఆ రహదారి పరిధిలోని చాలా కూడళ్లలో పైవంతెన ప్రతిపాదనలే పెట్టలేదు. మొత్తం 13 రహదారులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పెడతారని సమాచారం. ఇంకా ప్రజల అవసరాల మేరకు మరి కొన్ని ప్రతిపాదనలు ఉంటాయి. ఈ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలు, సమస్యలు, మెట్రో, ఓఆర్ఆర్ నిర్మాణం నేపథ్యంలో వచ్చే ప్రతిబంధకాలపై చర్చించనున్నారు. వచ్చిన ప్రతిపాదనలను ఎన్‌హెచ్ఏఐ అధికారులు కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు. అక్కడ అనుమతులు వస్తే సదరు పనులు పట్టాలెక్కుతాయి.

పార్కింగ్ సింగిల్ టెండరుపై సీఎంవో ఆరా..

వివరణ ఇవ్వాలని అధికారులకు ఆదేశం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

పాతబస్తీ బీఆర్టీఎస్ రోడ్డు కార్ల పార్కింగ్, ఒన్‌టౌన్ వీఎంసీ పార్కింగ్‌ల సింగిల్ టెండర్ల ఆమోదానికి యత్నం, బ్లాక్‌లిస్టులోని గుత్తేదారు చక్రం తిప్పి పార్కింగ్ టెండర్లు దాఖలు కాకుండా అడ్డుకుంటున్న తీరుపై 'ఈనాడు'లో మంగళవారం 'ఇది కదా.. నిలువు దోపిడీ' శీర్షిక ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు (సీఎంవో) స్పందించి ఆరా తీశారు. ఈ మేరకు కమిషనర్ ధ్యానచంద్ర, ఎస్టేట్ అధికారి శ్రీధర్‌కు నోటీసులు పంపారు. పార్కింగ్ సింగిల్ టెండరుకు సంబంధించిన వివరాలు, టెండర్లు దాఖలు కాకుండా అడ్డుకున్న గుత్తేదారు వివరాలు, బ్లాక్‌లిస్టులోని గుత్తేదారు సమాచారం పంపాలని ఆదేశించారు. సింగిల్ టెండర్లు దాఖలైనప్పుడు అనుసరించాల్సిన విధానం, టెండర్ల ప్రక్రియ రద్దు, తిరిగి టెండర్లు పిలిచేటప్పుడు తీసుకోవాల్సిన చర్యలను విస్మరించి సింగిల్ టెండర్ ప్రతిపాదన ఆమోదానికి స్థాయి సంఘం ముందు ప్రతిపాదన ప్రవేశపెట్టడం తదితర అంశాలపై తగిన సమాచారం పంపాలని సీఎంవో కార్యాలయం కోరింది.

ఈనాడు కథనానికి స్పందన

★ పార్కింగ్ టెండర్లలో అక్రమాలు, అధికంగా ఫీజుల వసూలు, గుత్తేదారు దారుల పాలకపక్షం వర్గానికి చెందిన వారని వంటి అంశాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరింది. పార్కింగ్ గుత్తేదారు బెదిరింపులు, పాలకపక్షం అనాలోచిత నిర్ణయాలు, నగరపాలక సంస్థకు ఆర్థిక నష్టం వంటి అంశాలపై వివరాలు అడిగారు. రెండు పార్కింగ్ ప్రాంతాల లీజుకు సంబంధించిన అప్‌సెట్ ధరను రూ.49,11,062గా నిర్ణయించగా, సింగిల్ టెండరుదారు కేవలం రూ.20 వేల హెచ్చు మొత్తంతో రూ.49,31,062కు టెండర్ కోట్ చేయడం, ఆమోదానికి స్థాయి సంఘం ముందు ఉంచడం తదితర వివరాల నివేదిక పంపాలని సీఎంవో కార్యాలయం అధికారులు కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. దీనిపై ఎస్టేట్ అధికారి ఎ.శ్రీధర్ మాట్లాడుతూ సీఎంవో కార్యాలయం పార్కింగ్ సింగిల్ టెండరు ప్రతిపాదనపై తమకు పంపిన నోటీసుల ఆధారంగా తగిన వివరణ, వివరాలను లిఖితపూర్వకంగా పంపామని వెల్లడించారు.

వివాహిత మృతదేహం వెలికితీసి పంచనామా

విస్సన్నపేట, న్యూస్‌టుడే : గత నెలలో మృతి చెందిన ఓ వివాహిత మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించిన ఘటన ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల హిందూ శ్మశానవాటికలో మంగళవారం చోటు చేసుకుంది. రెవెన్యూ అధికారులు, హైదరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరువూరు మండలంలోని మల్లేల గ్రామానికి చెందిన అనూష, విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన బండారు రవివర్మలు ప్రేమ వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కొంత కాలానికి ఆమె గర్భందాల్చగా ఏడో నెల రాగానే గతనెల 23వ తేదీన హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ప్రసవించింది. ఈ క్రమంలో అత్యవసర చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో భర్త రవివర్మ తన స్వగ్రామం పుట్రేలలో ఖననం చేశాడు. ఇటీవల అనూష మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆమె సోదరి నీరిమ కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు హైదరాబాద్ పోలీసులు, విజయవాడ ప్రభుత్వాసుపత్రి నుంచి ఫోరెన్సిక్ నిపుణులు, వైద్యులు మంగళవారం పుట్రేలకు చేరుకుని స్థానిక తహసీల్దార్ సమక్షంలో అనూష మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. పోస్ట్ మార్టం రిపోర్ట్ వచ్చిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ ఎస్సై ఎం.రామారావు తెలిపారు. తహసీల్దార్ ఎల్వీ కళ్యాణి, ఆర్ఐ సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ శంకర్, డా జీవన్, డా. షేక్ సాజిద్, డా. అలీ, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.


ఘటనా స్థలంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు, వైద్యులు

8 నుంచి వెటరన్ క్రికెట్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : నున్నలోని గ్రీన్ హిల్స్ మైదానంలో ఈ నెల 8, 9 తేదీల్లో చుక్కపల్లి పిచ్చియ్య స్మారక రాష్ట్రస్థాయి వెటరన్ (45+ వయసు) క్రికెట్ టోర్నీ నిర్వహిస్తామని నిర్వాహకులు ఎ.శ్రీధర్, కె.శ్రీనివాస్ తెలిపారు. విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరుతో పాటు హైదరాబాద్ నుంచి మొత్తం ఆరు జట్లు తలపడతాయని చెప్పారు. టీ 20 ఫార్మాట్‌లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వితరణ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం సారథ్యంలో సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.8 లక్షల విలువైన వైద్య సామగ్రిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఏవీ రావుకు విరాళంగా మంగళవారం అందజేశారు. బ్యాంక్ రీజినల్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎంపీఎన్ రవికాంత్, విజయవాడ రీజినల్ హెడ్ ఎంవీ తిలక్ స్వామి డా. ఏవీ రావుకు అప్పగించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రామవరప్పాడు శాఖ మేనేజర్ వసంత్, ఆసుపత్రి పాథాలజీ విభాగం విభాగాధిపతి డా.రజని, ప్రొఫెసర్ డా.శుభశ్రీ, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


ఏవీ రావుకు వైద్య పరికరాలు అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

ప్రగతి సూచికల లక్ష్యాలు సాధించాలి

పాయకాపురం, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర విజన్-2047కు సంబంధించిన కీలక ప్రగతి సూచికల లక్ష్యాలను అన్ని శాఖలు పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర విజన్-కేపీఐల లక్ష్యాలపై అధికారులతో సమీక్షించారు. కొన్ని శాఖలు బీ, సీ గ్రేడుల్లో ఉన్నాయని, తప్పనిసరిగా ఏ గ్రేడ్‌లోకి రావాలని సూచించారు. మీసేవ, పోలీస్, ఆరోగ్యం, విద్య, సహకార శాఖలు లక్ష్యాలను సాధించాల్సి ఉందని పేర్కొన్నారు. సాధించిన ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు వారానికి ఒకసారి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.ఇలక్కియా, ముఖ్య ప్రణాళిక అధికారి వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

చేతి వృత్తుల వారికి శాశ్వత ఉపాధి

గొల్లపూడి, న్యూస్‌టుడే: కుల, చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ భవన్‌లో రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లతో జరుగుతున్న సమావేశం రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి.. మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కుల, చేతివృత్తిదారులు నిలదొక్కుకునేలా ఆధునిక పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు కుల వృత్తుల వారి గౌరవాన్ని పెంపొందించేలా చర్యలు చేపడతామన్నారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా తెదేపా గుర్తింపు కల్పిస్తుందన్నారు. బీసీల అభ్యున్నతికి తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబులు కృషి చేస్తున్నారని చెప్పారు. బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలను కల్పిస్తున్నామని, నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వారంతా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఉన్నత స్థానాల్లో నిలవాలని ఉద్దేశంతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.వెయ్యి కోట్లతో ఆదరణ-3 పథకానికి శ్రీకారం చుట్టనున్నామన్నారు. కుల వృత్తుల వారికి పరికరాల కేటాయింపు విషయమై అడిగి తెలుసుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సవిత

ఆది దంపతులకు ఊంజల్ సేవ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకృత స్టాండ్‌లో ఆది దంపతులకు ఊంజల్ సేవను మంగళవారం నిర్వహించారు. సహస్ర లింగార్చన, మల్లేశ్వర స్వామికి దీపార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని భక్తులు వీక్షించారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ సహస్ర లింగార్చన పూజలో పాల్గొన్నారు.



విజయవాడలో ఐజేయూ ప్లీనరీ సమావేశాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) ప్లీనరీ సమావేశాలను ఫిబ్రవరి మొదటివారంలో విజయవాడలో నిర్వహించాలని ఏపీయూడబ్ల్యూజే నిర్ణయించింది. యూనియన్ అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో యూనియన్ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జర్నలిస్టుల సమస్యలతోపాటు, ఐజేయూ ప్లీనరీ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఐజేయూ 11వ ప్లీనరీని నిర్వహించే అవకాశం మరోసారి ఏపీయూడబ్ల్యూజేకు వచ్చిందని, విజయవాడలో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో.. జర్నలిస్టు సమస్యలు, వృత్తి విలువల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, పాత్రికేయుల భద్రత, మీడియా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. దేశం నలుమూలల నుంచి దాదాపు 350 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట మహిళకు ఝలక్

విజయవాడ నేరవార్తలు: ఇంటి వద్ద ఉంటూనే రూ.లక్షలు సంపాదించవచ్చంటూ మహిళకు ఆశ చూపిన సైబర్ నేరగాళ్లు.. రూ.6 లక్షలు కొట్టేసిన వైనం మంగళవారం వెలుగు చూసింది. నగరానికి చెందిన ఒక మహిళకు పార్ట్‌టైం ఉద్యోగం ఉందంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆన్‌లైన్‌లో పని చేయాలని, ఆకర్షణీయమైన జీతం ఇస్తామని నమ్మించారు. ముందు లాభాలు ఇచ్చి ఆకర్షించారు. పెట్టుబడులు పెడితే.. అధిక ఆదాయం వస్తుందని చెప్పారు. వారి మాటలు నమ్మిన మహిళ.. రూ.6 లక్షలను పలు ఖాతాలకు పంపించారు. చివరికి మోసపోయినట్లు గుర్తించి మంగళవారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

బెయిల్ పిటిషన్లపై.. విచారణ 7వ తేదీకి వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణంలో నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 7వ తేదీకి వాయిదా పడింది. ఏసీబీ కోర్టులో నిందితులు బాలాజీ కుమార్, నవీన్ కృష్ణ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు వేసిన పిటిషన్లపై ప్రాసిక్యూషన్ కౌంటర్లు దాఖలు చేసేందుకు వీలుగా వాయిదా పడ్డాయి. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంతెన ఆశ్రమంలో వెన్నునొప్పి చికిత్స కోసం అనుమతించాలని వేసిన పిటిషన్‌పై విచారణ నిమిత్తం బుధవారానికి న్యాయాధికారి వాయిదా వేశారు.

నిడిగుంట అరుణను కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఎస్సై, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వృద్ధుడు నుంచి రూ.24.5 లక్షలు వసూలు చేసి మోసం చేసిన నిడిగుంట అరుణను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ విజయవాడ సూర్యారావుపేట పోలీసులు మంగళవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. విజయవాడకు చెందిన రమేష్‌బాబు.. తనకు తెలిసిన ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు గ్రామానికి చెందిన ఇద్దరికి ఉద్యోగాల నిమిత్తం సురేంద్ర అనే వ్యక్తితో 2021 మార్చిలో మాట్లాడారు. ఆయన సూచన మేరకు డీజీపీ కార్యాలయంలో పనిచేసే బంగారి అనే వ్యక్తిని సంప్రదించారు. తర్వాత మొగల్రాజపురంలో బుల్లెట్‌బాబు మరో వ్యక్తితో ఉద్యోగాల కోసం చర్చించారు. ఎస్సై పోస్టుకు రూ.18.5 లక్షలు, అంగన్‌వాడీ పోస్టుకు రూ.6 లక్షలు ఇవ్వాలనటంతో సరేనన్నారు. 2021, మార్చి 19న విజయవాడ స్వరాజ్యమైదానం వద్ద నిడిగుంట అరుణకు రూ.12 లక్షలు, 10 రోజుల తర్వాత బుల్లెట్‌బాబుకు మరో రూ.12.5 లక్షలు రమేష్‌బాబు చెల్లించారు. అయితే ఉద్యోగాలు ఇవ్వకపోగా.. డబ్బులు కూడా చెల్లించకపోవడంతో అక్టోబరు 13న విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఇటీవల పోలీసులు పీటీ వారెంట్ వేసి నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడ ఒకటో ఏసీఎంఎం న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ అనంతరం తిరిగి ఆమెను నెల్లూరు కారాగారానికి తరలించారు.

పూర్తి సమాచారం తెలుసుకోవడానికి.. వృద్ధుడిని మోసగించిన కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు నిడిగుంట అరుణను 4 రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ విజయవాడ న్యాయస్థానంలో మంగళవారం సాయంత్రం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. వృద్ధుడిని మోసగించిన కేసులో ఆమె నుంచి పూర్తి సమాచారం తెలుసుకోవాల్సి ఉందని.. ఈ నేపథ్యంలో కస్టడీకి ఇస్తే ఉద్యోగాల పేరిట చేసిన మోసంలో పూర్తి వివరాలు బయటకు వస్తాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ధర వరలు

వంకాయలు-48/52, టమాటా-28, బెండ-44, పచ్చిమిర్చి-26, కాకర-42, బీర-44/48, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజి-28, క్యారెట్-56/84, దొండ-36, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-44, దోస-22, సొర-25, పొట్ల-28/25, అరటికాయ-5/6, చామదుంప-28, అల్లం-80, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-4/10, కంద-50, బీట్ రూట్-50, కీరదోస-40, బీన్స్-85/95, క్యాప్సికమ్-80, చింతకాయలు-70, నిమ్మ (డజను)-24/30, కొత్తిమీర-13/26, పుదీనా-5/20, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). - **ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

స్పోర్ట్స్ హబ్‌గా విజయవాడ


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ శివనాథ్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : విజయవాడను స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిషనర్ ధ్యానచంద్ర, విభాగాల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్‌లో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరంలోని ఇండోర్ క్రీడా ప్రాంగణాలను సిద్ధం చేయాలని తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, విద్యాధరపురం క్రీడా ప్రాంగణం, మాకినేని బసవ పున్నయ్య క్రీడా ప్రాంగణంను జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఆధునికీకరణ చేపట్టాలని అన్నారు. పలు క్రీడా ప్రాంగణాలను పునరుద్ధరించడంతో పాటు, వివిధ క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ఆధునిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. సమావేశంలో శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, ఎం.డి. ఎస్.భరణి, అధికారులు డి.చంద్రశేఖర్, పి.సత్యకుమారి, ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలి


మాట్లాడుతున్న డీఆర్ఎం మోహిత్ సొనాకియా

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగులు విధి నిర్వహణలో నిజాయతీ, నిబద్ధతతో పని చేయాలని డీఆర్ఎం మోహిత్ సొనాకియా సూచించారు. రైల్వే విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రైల్వే ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విధులు నిర్వహిస్తూ రైల్వే శాఖకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ అధికారులు సీహెచ్ రాకేష్, బి.రామారావు, కె.రవికుమార్ తదితరులు మాట్లాడారు. అన్ని రైల్వే కార్యాలయాల వద్ద విజిలెన్స్‌కు సంబంధించి పూర్తి సమాచారంతో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే వెంటనే సమాచారాన్ని అందించాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్, రాయనపాడు సీడబ్ల్యూఎం ఎస్.శ్రీనివాస్ వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బూడిద లోడింగ్ జరగనివ్వం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: బూడిద చెరువు నుంచి బూడిద లోడింగ్ జరగనివ్వమని స్థానిక లారీ, టిప్పర్ యజమానులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం లోడింగ్ పాయింట్‌కు చేరుకొన్న వాళ్లు గుత్తేదారుని ద్వారా బూడిద లోడింగ్ జరుగుతుండడం గమనించి లోడింగ్‌ను అడ్డుకొని నినాదాలు చేశారు. విషయం తెలుసుకొన్న ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, తెదేపా, జనసేన నాయకులు వీరికి మద్దతుగా నిలిచారు. బూడిదను నమ్ముకొని లారీలు కొనుగోలు చేసి జీవనాధారం ఏర్పాటు చేసుకొన్న తమకు కాకుండా ఇతరులకు బూడిద లోడింగ్ చేయడం అన్యాయమని లారీ ఓనర్స్ వాపోయారు. నెలకు 15 లోడ్లు ఉచితంగా ఇస్తామని చెప్పడంతో దీక్షలను విరమింపజేశామని..ఇప్పుడు గుత్తేదారుడు రూ.850 కడితేనే లోడు ఇస్తాననడం దుర్మార్గమన్నారు. సందర్భంగా అక్కడికి ఎన్టీటీపీఎస్ అధికారులు రావడంతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.


లారీలకు అడ్డుగా కూర్చున్న తెదేపా నాయకులు, ప్రజాప్రతినిధులు

తిరువూరు

● తిరువూరు ● మైలవరం

ఈనాడు మీతోడు — విద్యుత్తు సమస్యలా? తెలియజేయండి

డయల్ యువర్ డీఈఈ నేడు



గ్రామాల్లో ప్రజలు, రైతులు నిత్యం అనేక విద్యుత్తు సమస్యలను ఎదుర్కొంటున్నారు. జనవాసాల మధ్య తీగలు సహా పలు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తాయి. ఇలా ఇబ్బందులను విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవడంలో భాగంగా ఈనాడు ఆధ్వర్యంలో విద్యుత్తుశాఖ మైలవరం సబ్ డివిజన్ డీఈఈ ఐ.సుధాకర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్ పరిధిలో గల మైలవరం, జి.కొండూరు మండలాల్లోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్తే పరిష్కారానికి కృషి చేస్తారు. చేయాల్సిందల్లా కింది సెల్ నంబర్లకు సూచించిన సమయంలో ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, మైలవరం

94910 66103 / 80085 74705

తేదీ: బుధవారం 05-11-2025

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? వెల్లటూరు ఉన్నత పాఠశాల సమీపంలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీరు రావడం లేదు. తక్షణమే బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలి. - డి.శ్రీనివాసరావు (గ్రామస్థుడు)

✓ సమస్య తెలిసింది. సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. - మురళి పంచాయతీ కార్యదర్శి

● వెల్లటూరు గ్రామంలోని ఎస్సీ ఏరియాలో జలీవల కురిసిన వర్షానికి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారై దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్య 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక 4వ తేదీన ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి మురళి సిబ్బందితో కాలువలు పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ● స్థానిక పంచాయతీలోని ఎస్టీఎస్ నగర్ రోడ్డులో గల ఉమా కిరాణా దుకాణం వద్ద గల వీధి కుళాయి చుట్టూ పిచ్చిచెట్లతో అపరిశుభ్రంగా ఉన్న వైనంపై స్థానికుల ఫిర్యాదును 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, కార్మికులతో పిచ్చిచెట్లు తొలగింపు చర్యలు చేపట్టారు. ● స్థానిక పంచాయతీ ఎస్సీవాడలోని డ్రైనేజీలో పూడిక తొలగించకపోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి రామారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మంగళవారం సిబ్బందిని పంపి పూడిక తీయించి ట్రాక్టర్ ద్వారా బయటకు తరలింపజేశారు. ● జలీవల కురిసిన వర్షాలకు గ్రామంలోని మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదుపై గ్రామ కార్యదర్శి మురళి స్పందించారు. ప్రత్యేక సిబ్బందితో మురుగు కాలువలోని పూడికలను తొలగింపజేశారు. జేసీబీతో కచ్చా మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ● పట్టణంలోని 1వ వార్డు కొత్తకాలనీలోని డ్రైనేజీలో మట్టి పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికుడు సుధాకరరావు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ● పట్టణంలోని 2వ వార్డులో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయని స్థానికుడు నరసింహారావు చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, జి.కొండూరు మైలవరం రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, తిరువూరు టౌన్

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే లబ్ధి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటే రైతులు లబ్ధి పొందొచ్చని ఏవో డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మద్దులపర్వ గ్రామంలో యంత్రాలతో వరి కోతలు కోస్తున్న రైతులను ఆయన కలిసి అవగాహన కల్పించారు. ధాన్యం దళారులకు తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు.

కంకర తవ్వకాల పరిశీలన

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని మేడూరు గుట్ట వద్ద కంకర తవ్వకాలు జరుగుతున్న క్వారీని ఆర్డీవో మాధురి మంగళవారం పరిశీలించారు. గుట్ట పోరంబోకుపై అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయని లోకాయుక్తలో అందిన ఫిర్యాదు మేరకు ఆమె తనిఖీ చేశారు. గ్రామంలోని రేషన్ దుకాణం, శివాలయంలో కార్తిక పౌర్ణమి దీపోత్సవానికి చేసిన ఏర్పాట్లను, గంపలగూడెం మార్కెట్ యార్డులో పీపీసీ కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన కలవరింత

మొంథా వరద నీరే పోలేదు.. అక్కడక్కడా వర్షాలు

గంపలగూడెం, తిరువూరు, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మొన్న వచ్చిన మొంథా తుపాను ప్రభావంతో రైతుల కష్టం నీట మునిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసిపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఆ ప్రభావం నుంచి తేరుకోక ముందే మరోమారు గండం మీదకు వస్తుందంటూ కర్షకులు కలవరపడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి..తిరువూరు నియోజకవర్గంలో అక్కడక్కడా వర్షం కురవడంతో ఆందోళనకు గురయ్యారు. మరోవైపు తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఖరీఫ్ వరి నూర్పిళ్లు ఆరంభమవగా నూర్పిడి చేసిన వడ్లు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

పత్తి రైతులది అదే పరిస్థితి: రెండు నెలలుగా ప్రతికూల వాతావరణంతో తెల్ల బంగారం దెబ్బతింది. దిగుబడి లేక దిగులు చెందుతున్న దశలో మొంథా తుపాను నిండా ముంచేసింది. చెట్లకున్న దూది తడిసి నీరు కారిపోయింది. ఇప్పటికే తీసిన దూదికి ప్రైవేటు విపణిలో గిట్టుబాటు ధర లేక పెట్టుబడి నష్టం ఎదుర్కొంటున్నారు. అధికారులు పత్తి నష్టం అంచనాకు సిద్ధం చేస్తుండటంతో ఎంతోకొంత ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం లభిస్తుందన్న ఆశతో ఉన్నారు.



తిరువూరు : చింతలపాడు సమీపంలో వరి పంట నూర్పిడి చేస్తున్న యంత్రం

గ్రామాల్లోని పంట కాలువలకు గండ్లు పడి వరద నీరు పొలాల్లోకి చేరింది. నియోజకవర్గంలో నాలుగు మండలాలతోపాటు గొల్లపూడి, రాయనపాడు, వైరురుపాడు గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న సాగుతోంది. పొలాలు ఆరకపోవడంతో మిషన్ కోత సమయం కూడా పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కోత యంత్రాలను అద్దె చెల్లింపులో రైతులకు వెసులుబాటు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటా ఇంతే..: ఏటా పంటలు చేతికొచ్చే తరుణంలోనే తుపాన్ల తాకిడి అధికంగా ఉంటోంది. అక్టోబరు రెండో పక్షం నుంచి డిసెంబరు వరకు పంటలకు తుపాన్ల గండం తప్పడం లేదు. రెండు నెలలుగా భారీ వర్షాలతో పత్తి, వరి, మిరప, పప్పు ధాన్యాల పంటలను కకావికలం చేస్తున్నాయి. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 53వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశారు.

చేలల్లోనే నీరు: మైలవరం నియోజకవర్గంలో అయితే తుపాను ప్రభావం నుంచి రైతులు ఇంకా కోలుకోలేదు. వరి చేలల్లోనే నీరు నిలబడిపోవడంతో వాటిని బయటకు పంపేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆరేళ్లగా పంట కాలువల్లో ఎక్కడా పూడిక తీయక తూటుకాడ పేరుకుపోయింది. నియోజకవర్గ పరిధిలో అత్యధిక



పొలంలోని నీరు బయటకు పంపేందుకు శ్రమిస్తున్న కర్షకులు

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక జాతీయోన్నత పాఠశాల ప్రాంగణంలోని శాఖా గ్రంథాలయంలో సౌకర్యార్థం పారిశ్రామికవేత్త, మొవ్వ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు కాటంనేని వెంకటేశ్వరరావు 30 కుర్చీలను వితరణ చేశారు. మంగళవారం ట్రస్ట్ సభ్యులతో కలిసి పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నాయకులు ఎ.విద్యాలాల్, అయిర్‌హంజా, కోయ సుధ, జేపీ, బాబూరావు, ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో బైపాస్ ఫీడర్ నందు మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జి.ఉమేష్ బాబు తెలిపారు. స్థానిక సూరిబాబుపేట, బస్టాండ్ ఏరియా, కోతమిషన్ ప్రాంతం, ఎండీవో కార్యాలయం రోడ్డు, రాజాపేట, తహసీల్దార్ కార్యాలయ రోడ్డు, కుమ్మరివీధి, పాతమసీదు నుంచి విజయవాడ రోడ్డు, తారకరామానగర్, చిన ఎస్సీ ఏరియా వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని 11కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8.30 మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు. మునుకుళ్ల రోడ్డు, కుమ్మరి బజారు, ప్రభుత్వ కళాశాల రోడ్డు, బోసుబొమ్మ సెంటర్, మెయిన్ రోడ్డు బోడేదయింగ్ వరకు, జైభాని సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, ఫైర్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో కరెంటు ఉండదన్నారు.

ఆలయాల్లో వసతులపై పర్యవేక్షణ

ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలయాల్లో నెలకొన్న సౌకర్యాలు, అర్చకుల వసతులను పూర్తిగా సమీక్షిస్తున్నామని తహసీల్దారు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జలీవల ఆలయ పరిధిలో తొక్కిసలాట సంభవించి భక్తులు మృతి చెందిన నేపథ్యంలో పురపాలికతో పాటు మండల పరిధిలోని ఆలయాలను ఎంపీడీవో శకుంతలతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులను విచారించి వసతులను నమోదు చేసుకున్నారు. వారాంతాల్లో నిర్వహించే కార్యక్రమాలను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





విజేతలతో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, చిత్రాలు గీస్తున్న విద్యార్థినులు

పోటీల్లో ప్రతిభ చాటాలి

మైలవరం, న్యూస్‌టుడే: పోటీల్లో ప్రతిభ చాటడం ద్వారా నైపుణ్యాలను పెంచుకోవచ్చని మండలంలోని చిలుకూరివారిగూడెం (పుల్లూరు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నే కుసుమకుమారి పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా మంగళవారం ఆ పాఠశాలలో 'మీకు ఇష్టమైన పండగ' అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో సయ్యద్ ఫర్హాన్(9వ తరగతి), ఎస్.రాహుల్(10వ) టి.పుష్పకుమారి(7వ)లు వరుసగా తొలి మూడు స్థానాలు సాధించారు. వారికి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు బి.నాగలక్ష్మి, యు.జ్యోతి, బి.ఉషారాణి, ఎ.విజయ్‌కుమార్ బహుమతులు అందజేసి అభినందించారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

గొల్లపూడి, న్యూస్‌టుడే: మత్స్యకారులకు తెదేపా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గొల్లపూడి మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు పేర్కొన్నారు. తుపాను కారణంగా ఉపాధి కోల్పోయిన గొల్లపూడి సూరాయిపాలెంలోని వంద మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరకులను మంగళవారం పంపిణీ చేశారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు నారదా, నాయకులు వాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం నిత్యావసరాలు అందిస్తున్న పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు తదితరులు

తుపాను బాధితులను ఆదుకోవడమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తుపాను వల్ల ఇబ్బందులకు గురైన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకొనేందుకు సిద్ధంగా ఉందని ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద మత్స్యకారుల కుటుంబాలకు రేషన్ బియ్యాన్ని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణానదీ వరదల కారణంగా ఉపాధి కోల్పోయిన 68 మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరకులను దాములూరు గ్రామంలో తెదేపా నాయకులు పంపిణీ చేశారు. సర్పంచి మధుసూదనరావు, నాయకులు చిట్టిబాబు, నాగేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.



సూరాయిపాలెంలో సరకులు అందిస్తున్న ఛైర్మన్ వాసు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక వికాస్ టెక్నో పాఠశాలలో మంగళవారం జరిగిన మండల స్థాయి జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో వికాస్ టెక్నో పాఠశాల విద్యార్థులు బత్తుల లహరి (10వ), ద్రోణాదుల పవన వెంకట హార్షిక్ (9వ), కొణతం వేద సింధు (8వ)లు ప్రతిభచూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని, శిక్షకులను కరస్పాండెంట్ నరెడ్ల వేమన కుమారి అభినందించారు. మండల జవివే అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ ఆర్.గోపి. వైస్.ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి చెన్నకేశవ పాల్గొన్నారు.

రైతుల పరామర్శ పేరుతో జగన్ అసత్యాలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని

గొల్లపూడి: రైతుల పరామర్శ పేరుతో జగన్ అసత్యాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఐదేళ్ల వైకాపా పాలనలో రైతుల కోసం జగన్ చేసిన పనులు ఏమైనా ఉంటే ధైర్యంగా చెప్పాలన్నారు. మొంథా తుపాను సమయంలో రైతులు ఇబ్బందుల్లో ఉంటే జగన్ తర ప్యాలెస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైకాపా పాలనలో పంట బీమా ఇవ్వకపోవడాన్ని కేంద్ర మంత్రి పార్లమెంటులో ఎండగట్టారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో 60 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా రైతులకు పరిహారం అందలేదని, అబద్ధాల పాలన కొనసాగిందన్నారు. రైతులను కష్టకాలంలో ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, (గుంటుపల్లి), న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం గుంటుపల్లిలో వన్ ఫ్యామిలీ - వన్ అంత్రప్రెన్యూర్‌లో భాగంగా మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆకాంక్షిత మండలమైన ఇబ్రహీంపట్నంలో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధికి మరిన్ని ప్రణాళికల రూపకల్పన, అమలు జరగాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను బట్టి నైపుణ్య శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో చైతన్య, డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శకుంతల పాల్గొన్నారు.

పట్టుదలే లక్ష్య సాధనకు పునాది

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ అన్నారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ సంబరాలు ఇబ్రహీంపట్నం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి చెకుముకి విజేతలకు సైన్స్, చరిత్ర పుస్తకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, మస్తాన్‌వలీ, ఎలమందయ్య, నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక..

మైలవరం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గౌతమ్ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి సైన్సు టాలెంటు టెస్ట్‌లో తమ పాఠశాల విద్యార్థులు ఎం.దుర్విన్‌సాయి శ్రీకర్, పి.లక్ష్మీనరసింహస్వామి, ఎం.అఖిలశ్రీలు ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ వీవీ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.



ఇబ్రహీంపట్నం: చెకుముకి టాలెంట్ టెస్టులో విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు



తిరువూరు: విజేతలతో జవివే ప్రతినిధులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మండల స్థాయిలో జవివే ఆధ్వర్యంలో సైన్సు సంబరాలు మంగళవారం నిర్వహించారు. మండలంలోని 25 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. జవివే సభ్యులు ఎం.హరికృష్ణ, పి.శీనయ్య, ఎం.సుధాకర్, సుధాకర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న తహసీల్దార్‌తో డీపీఆర్టీయూ నాయకులు

తహసీల్దార్ రాజకుమారికి సత్కారం

గంపలగూడెం, న్యూస్‌టుడే: మొంథా తుపాన్ సందర్భంగా మండలంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యుత్తమ సేవలు అందించి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్న తహసీల్దార్ వి.రాజకుమారిని డీపీఆర్టీయూ నాయకులు మంగళవారం సత్కరించారు. సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు బి.జమలయ్య, ఎన్.నరసింహారావు, బి.వెంకటేశ్వర్లు, సీహెచ్.మోహన్‌రావు, ఎం.వీరబాబు, తెదేపా మాజీ మండల అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబైన శివాలయాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం దీపోత్సవాలు నిర్వహించేందుకు తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. వేకువజాము నుంచి ఆలయాల్లో అర్చకులు శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు నిర్వహించి దీపోత్సవాలు ప్రారంభిస్తారు.

ట్రాక్టర్లకు జీపీఎస్ పెట్టించుకోండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ ఉన్న రైతులు తమ వాహనాలకు జీపీఎస్ పెట్టించుకోవాలని రెడ్డిగూడెం తహసీల్దార్ జె.సుశీలాదేవి సూచించారు. మంగళవారం వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో కూనపరాజుపర్వలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జీపీఎస్ పెట్టించుకోవడం వల్ల ధాన్యం రవాణాకు లారీల కోసం ఎదురు చూడకుండా మీరే తరలించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. జీపీఎస్ ఉన్న ట్రాక్టర్‌కు రవాణ ఛార్జీలు కూడా అందిస్తామన్నారు. ఉద్యాన అధికారి నరేంద్ర కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, ఏవో డి.శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని తాతకుంట్లలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ శశికళ రబీ పంటల సాగు, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు మండలంలో మొత్తం 8 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో టిప్పుసుల్తాన్, ఏఈవో ఉషారాణి, పీఏసీఎస్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు



విస్సన్నపేట: తాతకుంట్లలో...

జాగ్రత్తలతో వేరుకుళ్లు దూరం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డికుంట, కూనపరాజుపర్వ గ్రామాల్లోని మామిడి తోటల్లో వేరుకుళ్లు తెగులు బారిన పడి మామిడి చెట్లు చనిపోతున్నట్లు ఉద్యాన శాఖ అధికారి బి.నరేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం రెడ్డికుంట, కూనపరాజుపర్వ గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. 6 నుంచి 7 సంవత్సరాల వయసుగల తోటల్లో దమ్ము చేయడం, పొలాల్లో నీరు నిల్వ ఉండి తేమ ఎక్కువగా ఉండడం వల్ల ఈ తెగులు సంభవిస్తుందన్నారు. ఈ తెగులు నీటి ద్వారా ఇతర చెట్లకు వ్యాప్తి చెందుతుందని తోటలో నీటి నిల్వ లేకుండా చేసి వేర్లు కనపడకుండా మట్టిని తొక్కాలని రైతులకు సూచించారు.



ఎండిపోయిన మామిడి చెట్టును పరిశీలిస్తూ

స్వచ్ఛాంధ్రపై శిక్షణ తరగతులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరువూరు మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో పర్యావరణ, ప్రజారోగ్య కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ నుంచి శిక్షకుడు వెంకటేశ్వరరావు పాల్గొని పరిశుభ్రత, చెత్త వర్గీకరణ, మురుగు నీటి నిర్వహణ, ప్లాస్టిక్ నివారణ వంటి వాటిపై అవగాహన కల్పించారు.

సీజేఐపై దాడికి యత్నం దారుణం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం దారుణమని మంగళవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సంఘటనను వ్యతిరేకిస్తూ నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కొండా రాజకుమార్, గొర్రె లాజర్, పల్లెపాం లక్ష్మయ్య, డా.విజయ్, సూరిరాజు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలని వినతి

గొల్లపూడి, న్యూస్‌టుడే: తూర్పు కాపు, గాజుల కాపులకు భౌగోళిక పరిమితులను తొలగించి రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం నాయకులు కోరారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఆమెకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ప్రస్తుతం తూర్పు, గాజుల కాపు కులస్థులకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో మాత్రమే ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు.

వేలం ప్రకటన

గౌరవనీయ 15వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు - నూజివీడులో

ఇ.పి.నెం. 159/2020 ఇన్ ఎ.సి.నెం. 436/2016

బిట్వీన్:

శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, నూజివీడు బ్రాంచ్. ప్రాతినిధ్యం వహించువారు డివిజినల్ మేనేజర్, విజయవాడ, కృష్ణా జిల్లా (ప్రస్తుతం ఏలూరు జిల్లా) ... డి.హెచ్.ఆర్.

1. టంగుటూరి నానిబాబు, S/o.నాగచారి, డోర్ నెం. 3, పుట్రేల గ్రామం, విస్సన్నపేట మండలం, కృష్ణా జిల్లా. ప్రస్తుతం యన్.టి.ఆర్. జిల్లా

2. గంటల మార్కండేచారి, S/o. క్రిష్ణమాచారి, డోర్ నెం. 3, పుట్రేల గ్రామం, విస్సన్నపేట మండలం, కృష్ణా జిల్లా. ప్రస్తుతం యన్.టి.ఆర్. జిల్లా. ... జె.డి.ఆర్.

కృష్ణా జిల్లా, యన్.టి.ఆర్. జిల్లా, విస్సన్నపేట సబ్ జిల్లా, పుట్రేల గ్రామ పంచాయత్ ఏరియా, ఆర్.ఎస్.నెం. 585/8లో గల 266 చ.గ.ల లేదా 222.4 చ.మీ. ఖాళీ ఇంటి స్థలం, ప్లాట్ నెం. 21 గల పైన తెలిపిన ఒకటవ జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన భుక్తములలో ఉండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు చేయబడి వేలం కావలసిన ఆస్తికి హద్దులు:

తూర్పు: సైటు ఆఫ్ రేగాళ్ళ దామోదరరెడ్డి, 28.5 Ft., **దక్షిణం:** ప్లాట్ నెం. 18 సైటు ఆఫ్ ప్రతివాది భయన్‌కరమ్ ఫణి రాఘవన్ 82.5 Ft., **పశ్చిమం:** 18 Ft వైడ్ జాయింట్ దారి 28.5 Ft., **ఉత్తరం:** సైటు ఆఫ్ టంగుటూరి నానిబాబు 85.5 Ft.

డి.హెచ్.ఆర్. విలువ: 6,00,000/- అమీనా విలువ: 8,00,000/-

పైన తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు ది.11-11-2025వ తేదీన ఉదయం 10.30 ని॥కు బహిరంగ వేలం వేయుదురు. కావున కావలసినవారు పాడుకొనవచ్చును.

నూజివీడు

తేదీ: 04-11-2025

ఇట్లు: కె.జె.డిక్సన్
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది

బాగుచేస్తే బహుప్రయోజనమే

విస్సన్నపేట, న్యూస్‌టుడే



శిథిలమై పిచ్చి చెట్లు, పొదలతో దర్శనమిస్తున్న పాత పోలీస్ స్టేషన్ ఆవరణ

విస్సన్నపేట - సత్తుపల్లి రోడ్డు విస్సన్నపేటలో దాతల వితరణతో సమకూరిన పాత పోలీసు స్టేషన్ ఆవరణ ఎందుకూ పనికిరాకుండా పోయింది. బ్రిటీషు పరిపాలన కాలంలో 1932వ సంవత్సరంలో అప్పటి గ్రామ సర్పంచి, జీసీఎం వైద్య నిపుణులు, పోస్టల్ శాఖలో పోస్టుమాస్టరుగా చేసిన నల్లపాటి నారాయణరావు ఆనాడు 10 సెంట్ల స్థలాన్ని ఠాణాకి వితరణ చేశారు. దానిని పూర్వకాలం నల్లపాటి నారాయణరావు రక్షకభట నిలయంగా పిలిచేవారు. ప్రస్తుతం జనాభా పెరిగిపోవటం, రద్దీతో పాటు శాంతి భద్రతల ఏర్పాట్ల అవసరం మేరకు ఠాణాని తిరువూరు రోడ్డు అంబేడ్కర్ సెంటర్ లోని బిల్డింగ్‌లోకి మార్చారు. దీంతో ఈ భవనం నిరుపయోగంగా మారి భారీ వృక్షాలు, పిచ్చి చెట్లు పెరగడంతోపాటు పొదలు దట్టంగా అల్లుకుపోయి అడవిని తలపిస్తోంది. రాత్రుళ్లు గంజాయి బ్యాచ్‌లకి, మద్యం బాబులకు అడ్డాగా మారింది.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని

దాత నారాయణరావు వారసుడు నల్లపాటి కృష్ణ అర్జునరావు పాత పోలీస్ స్టేషన్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుకి అర్జీ ఇచ్చారు. దీనిపై అంచనాలు కూడా రూపొందించారు. ఈ లోపులో ప్రభుత్వం మారి వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఠాణా కథ కంచికి చేరింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ అధికారులు ఈ ఠాణా స్థల ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే నివాసితుల సమస్య పరిష్కారంతో పాటు అద్దెల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందని కోరుతున్నారు.

రహదారి అభివృద్ధిపై జాప్యం తగదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూల సమీప కట్లేరు వంతెన వద్ద వరదలకు గండ్లు పడిన మళ్లింపు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ.కృష్ణ ఆరోపించారు. ఇక్కడి వంతెన వద్ద వాహనాల రాకపోకలు నిలిచి మూడు నెలలు కావస్తున్నా ప్రజలకు దారి సౌకర్యం కల్పించకుండా ప్రభుత్వం ఎందుకింత జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం వంతెన వద్ద ప్రజల ఇబ్బందులను పరిశీలించి మాట్లాడారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

కంచికచర్ల, న్యూస్‌టుడే : పరిటాల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై పి.విశ్వనాథ్ వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు గ్రామానికి చెందిన కామా ముత్యాలరావు (45) స్థానికంగా చిన్న దుకాణం నిర్వహించేవాడు. మంగళవారం కంచికచర్లలో వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పరిటాల ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో ముత్యాలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎడ్జ్‌లో స్కేర్‌వేర్ బ్లాకర్

సురక్షిత వెబ్ బ్రౌజింగ్ దిశగా మైక్రోసాఫ్ట్ మరో ముందడుగు వేసింది. ఎడ్జ్ యూజర్ల కోసం స్కేర్‌వేర్ బ్లాకర్‌ను పరిచయం చేసింది. ఇదో ఏఐ ఆధారిత రక్షణ ఫీచర్. విండోస్, మ్యాక్‌ఓఎస్ పరికరాల్లో డిఫాల్ట్‌గా అందుబాటులో ఉంటుంది. మోసపూరిత పాపప్స్ లేదా ఫుల్ పేజీ డిజైన్‌ను స్కేర్‌వేర్ అంటారు. ఇది మీ కంప్యూటర్ ఇన్‌ఫెక్షన్‌కు గురైంది, మీ డేటా ప్రమాదంలో పడింది, క్లీనప్ కోసం వెంటనే ఫీజు కట్టండి.. ఇలా రకరకాల రూపాల్లో హెచ్చరికలు జారీ చేస్తుంటుంది. స్కేర్‌వేర్ మోసాలు చాలావరకూ యూజర్‌ను ఫుల్ స్క్రీన్ మోడ్‌లో ఉండేలా చేస్తాయి. భయంకరమైన శబ్దాలను వెలువరిస్తుంటాయి. యూజర్లను ఆందోళనకు గురిచేసి పాపప్స్, పేజీల మీద క్లిక్ చేసేలా పురికొల్పుతాయి. సాధారణంగా తెలిసిన హానికర యూఆర్ఎల్స్‌ను యాంటీవైరస్‌ల వంటివి నిలువరిస్తాయి. అయితే స్కేర్‌వేర్ సైట్స్ వీటిని త్వరగా బురిడీ




కొట్టిస్తుంటాయి. కొత్తరూపాని సంతరించుకొని ప్రత్యక్షమవుతుంటాయి. వీటి నుంచి కాపాడటానికే తాజా స్కేర్‌వేర్ బ్లాకర్‌ను రూపొందించారు. ఇది బ్లాక్‌లిస్టింగ్‌తో పనిలేకుండా ప్రవర్తన, సైట్స్ వంటి విజువల్ చిహ్నాలను గుర్తించటం ద్వారా స్కేర్‌వేర్లను నిలువరిస్తుంది. పరికరంలోని కంప్యూటర్ విజన్ సాయంతో లోకల్ ఆధారిత మెషిన్ లెర్నింగ్ మోడల్ ఈ పనిని నిర్వర్తిస్తుంది. విశ్లేషణ అంతా యూజర్ పరికరంలోనే సాగుతుంది. మైక్రోసాఫ్ట్ సర్వర్లకు స్క్రీన్‌షాట్లు, సున్నిత సమాచారాన్ని పంపించదు. కాబట్టి గోప్యతకు ఎలాంటి భంగమూ కలగదు.

మోటో నాజూకు ఫోన్

మోటొరోలా తమ అతి సన్నటి స్మార్ట్‌ఫోన్‌ను గ్లోబల్‌మార్కెట్‌లో పరిచయం చేసింది. పేరు మోటొరోలా ఎడ్జ్ 70. దీని మందం 5.9 ఎం.ఎం. మాత్రమే. గత మోటొరోలా ఎడ్జ్ 60 మందం కన్నా ఇది 2 ఎం.ఎం. తక్కువ. బరువు 159 గ్రాములు. నాజూకుగా ఉన్నప్పటికీ ఎంఐఎల్-ఎస్‌టీడీ 810హెచ్ మిలిటరీ సర్టిఫికెట్ కలిగుండటం విశేషం. అంటే చాలా దృఢంగా ఉంటుదన్నమాట. విమానాల స్థాయి అల్యూమినియం ఫ్రేమ్‌తో తయారుచేసిన ఇది దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ68, ఐపీ69 రేటింగ్ కలిగుంది కూడా. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 4500 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.67 అంగుళాల 1.5కే తెర.. తడి చేతులతోనూ పనిచేయగల వాటర్ టచ్ టెక్నాలజీ, ఇన్‌డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ స్కానర్, వెనకాల 50 మెగాపిక్సెల్ ఓఐఎస్ లెన్స్, 50 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ లెన్స్, 3 ఇన్ 1 లైట్ సెన్సర్‌తో కూడిన మూడు కెమెరాల వ్యవస్థ.. ముందు 50 మెగాపిక్సెల్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్, 12జీబీ ర్యామ్, 512జీబీ స్టోరేజీ, 4800ఎంఏహెచ్ బ్యాటరీ, 68డబ్ల్యూ ఫాస్ట్ చార్జింగ్, 15డబ్ల్యూ వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. గ్యాడ్జెట్ గ్రే, లిలీ ప్యాడ్, బ్రాంజ్ గ్రీన్ రంగుల్లో అందు బాటులో ఉంటుంది.



యమహా ఏఐ బ్రౌజర్!



వెబ్ బ్రౌజర్ల తీరు మారుతోంది. సంప్రదాయ బ్రౌజర్ల స్థానంలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత బ్రౌజర్లు శరవేగంగా దూసుకొస్తున్నాయి. ప్రముఖ కంపెనీలన్నీ వీటి కోసం పోటీ పడుతున్నాయి. ద బ్రౌజర్ కంపెనీ దయా అనే బీటా వర్షన్‌ను తీసుకొచ్చిన వెంటనే పర్‌ప్లెక్సిటీ సంస్థ కామెట్ బ్రౌజర్‌ను వదిలింది. ఓపెన్ ఏఐ తమ చాట్‌జీపీటీ అట్లాస్ బ్రౌజర్‌ను ప్రకటించటంతోనే మైక్రోసాఫ్ట్ సంస్థ కోపైలట్‌తో ఎడ్జ్‌ను ఏఐ బ్రౌజర్ రూపంలోకి మలిచేసింది. ఇంతకీ ఏఐ బ్రౌజర్లంటే ఏంటి? సంప్రదాయ బ్రౌజర్లకూ వీటికీ తేడా ఏంటి?

అంతర్జాలంలో ఏదైనా వెతకాలంటే మనం ముందుగా బ్రౌజర్‌ను ఓపెన్ చేస్తాం. వెతకాలనుకునే అంశాన్ని టైప్ చేసి, ఎంటర్ చేయగానే దానికి సంబంధించిన వెబ్ పేజీలన్నీ ప్రత్యక్షమవుతాయి. కానీ ఏఐ వెబ్ బ్రౌజర్ల తీరే వేరు. ఇవి నేరుగా కృత్రిమ మేధతో సమ్మిళితమై ఉంటాయి. ప్రాంప్ట్‌ను టైప్ చేస్తే అవి అంతర్జాలాన్ని వడపోసి అవసరమైన విషయాన్ని, సమగ్రంగా ముందుంచుతాయి. అయితే సంప్రదాయ బ్రౌజర్ల మాదిరిగా ఇవి వెబ్ పేజీలను చూపించవు. వాటిని అర్థం చేసుకొని, అవసరమైన సమాచారాన్ని రిఫరెన్స్‌లతో సహా చూపిస్తాయి. ఇవి వెబ్ పేజీలోని కంటెంట్‌ను అప్పటికప్పుడు చదివేసి, దాన్ని అంచనా వేయగలవు. అడిగిన సమాచారాన్ని క్రోడీకరించగలవు. సందర్భానుసారంగా ప్రశ్నలకు జవాబులు ఇవ్వగలవు. కావాలంటే జవాబులను డ్రాఫ్ట్ చేయగలవు కూడా. బిల్టిన్‌గా ఉండే ఏజెంటిక్ సామర్థ్యాల సాయంతో పనులను ఆటోమేటిగ్గా చేసేయటం వీటి ప్రత్యేకత. ఒక్కమాటలో చెప్పాలంటే- బ్రౌజింగ్ టూల్‌గానే కాకుండా అదనపు డిజిటల్ కొలాబరేటర్‌గానూ ఉపయోగపడతాయి.

ఏఐ సమ్మిళిత బ్రౌజర్ల వంటివి కాదు

గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ వంటి బ్రౌజర్లు ఏఐని సమ్మిళితం చేయటం మొదలెట్టిన మాట వాస్తవమే. జెమినీతో క్రోమ్, కోపైలట్‌తో ఎడ్జ్ జతకట్టాయి. కానీ వీటిని ఏఐ బ్రౌజర్లు అనలేం. బ్రౌజర్లలో ఏఐ ఎక్కడ నిక్షిప్తమై ఉంది? అదెలా పనిచేస్తుందనేది? అనేవి కీలకం. క్రోమ్, ఎడ్జ్ వంటి వాటిల్లో బ్రౌజింగ్ వ్యవస్థ మీద ఏఐ టూల్స్ పరచుకొని ఉంటాయి.



అవి అసిస్టెంట్లు, చాట్‌బాట్స్‌గా పనిచేస్తాయంతే. బ్రౌజర్ మూల నిర్మాణంలో అంతర్భాగమైనవి కావు. మనం కోరినప్పుడు పేజీల సారాంశాన్ని గుదిగుచ్చటం, టెక్స్ట్‌ను జనరేషన్ చేస్తుండొచ్చు గానీ బ్రౌజర్ పనితీరుకు సంబంధించిన లోతైన విషయాలు వీటికి తెలియవు. అదే కామెట్, అట్లాస్ వంటి ఏఐ బ్రౌజర్ల రూపకల్పన సమూలంగా ఏఐ మీదే ఆధారపడి ఉంటుంది. ఇవి ఏఐని సహాయక టూల్‌గా భావించవు. బ్రౌజింగ్‌లో అన్ని అంశాల్లో ఏఐని పొందుపరచుకొని ఉంటాయి. ప్రస్తుత పేజీని అర్థం చేసుకోవటం దగ్గరి నుంచి వాటిపై నేరుగా పనిచేయటం వరకూ అన్ని విధాలుగా ఉపయోగపడతాయి. ఉదాహరణకు- ఏఐ ఇంటిగ్రేటెడ్ బ్రౌజర్లను కథనాన్ని సంక్షిప్తీకరించమని అడిగారనుకోండి. అవి పేజీలోని అంశాలతో నేరుగా ఇంటరాక్ట్ కావు. గతవారం మీరేం చేశారో గుర్తుంచుకోవు. అదే ఏఐ బ్రౌజర్ అనుకోండి. సందర్భాన్ని తనకు తానే అర్థం చేసుకుంటుంది. ఆయా సెషన్లను జ్ఞాపకం పెట్టుకుంటుంది. కీలకమైన అంశాలను సేవ్ చేయటం, పనులను ఆటోమేట్ చేయటం, పరిశోధనను ఎక్కడ ఆపారో అక్కడి నుంచి ముందుకు తీసుకెళ్లటం వంటివన్నీ చేసేస్తుంది.

సంప్రదాయ బ్రౌజర్లకు విభిన్నం

క్రోమ్, సఫారీ, ఫైర్‌ఫాక్స్, ఎడ్జ్ వంటి సంప్రదాయ బ్రౌజర్లకూ చాట్‌జీపీటీ అట్లాస్, పర్‌ప్లెక్సిటీ కామెట్ వంటి ఏఐ బ్రౌజర్లకూ మధ్య తేడాలు మూలంలోనే ఉంటాయి. చూడటానికి మాత్రమే కాదు, వీటి పనితీరూ భిన్నమే.

బిల్టిన్ ఇంటెలిజెన్స్: ఏఐ బ్రౌజర్ల వ్యవస్థలో బిల్టిన్‌గా కృత్రిమ మేధ రీజనింగ్ ఉంటుంది. అదే సంప్రదాయ బ్రౌజర్లయితే ఎక్స్‌టెన్షన్ ఆధారిత యాడ్ ఆన్స్ సాయం తీసుకుంటాయి.

వెబ్ మీదే పనులు: ఏజెంటిక్ సామర్థ్యాలు కలిగుండటం వల్ల ఏఐ బ్రౌజర్లు నేరుగా వెబ్‌సైట్ల మీదే పనిచేస్తాయి. ఫారాలు నింపటం, మీటింగ్స్ షెడ్యూల్ వంటివి వెంటనే చేస్తాయి. సంప్రదాయ బ్రౌజర్లు ఇలాంటి పనులేవీ చేయవు.

పేజీలను అర్థం చేసుకోవటం: మనం చూస్తున్న పేజీని ఏఐ బ్రౌజర్లు సంక్షిప్తం చేయగలవు, విశ్లేషించగలవు. సంప్రదాయ బ్రౌజర్లు కేవలం పేజీలోని అంశాలను ఉన్నవి ఉన్నట్టుగా మాత్రమే చూపిస్తాయి.

ఫైల్ నిర్వహణ: ఏఐ బ్రౌజర్లు థర్డ్ పార్టీ వ్యూయర్ల అవసరం లేకుండా ఫైళ్లను నేరుగా చదువుతాయి, వాటిలోని అంశాలను అర్థం చేసుకుంటాయి.

సందర్భ జ్ఞాపకం: ఏఐ బ్రౌజర్లు ఆయా సెషన్ల సమయంలో నిరంతరం జ్ఞాపకం పెట్టుకుంటాయి. మనం ఏమేం వెతికామో, ఏయే అంశాలు రాశామో తెలుసుకొని, మెమరీలో ఉంచుకుంటాయి. వీటిని బట్టి తర్వాతి సెషన్లలో పనులు తేలికగా, త్వరగా పూర్తయ్యేలా చూస్తాయి. సంప్రదాయ బ్రౌజర్లయితే తాత్కాలిక డేటాను మాత్రమే స్టోర్ చేసుకుంటాయి.

రూపకల్పన ఉద్దేశమే భిన్నం: క్రోమ్, ఎడ్జ్ వంటి వాటిని సాధారణ అంతర్జాల వాడకం కోసమే రూపొందించారు. అదే ఏఐ బ్రౌజర్లను పరిశోధన, సృజన, ఉత్పాదకతలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. రచయితలు, డెవలపర్లు, విద్యార్థుల వంటి వారికి సాయం చేయటం వీటి ఉద్దేశం. ఇవి రకరకాల పనులను సమర్థంగా పూర్తిచేసేలా చూస్తాయి.

సమయం ఆదా

ఏఐ బ్రౌజర్లతో చాలా సమయం ఆదా అవుతుంది. ముఖ్యంగా మేధావులకు ఎంతగానో ఉపయోగపడతాయి. బోలెడన్ని ట్యాబ్‌లు ఓపెన్ చేయటం, పరిశోధన పత్రాలతో కుస్తీపట్టటం, మరోవైపు ఈమెయిళ్ల తనిఖీ వంటివన్నీ ఒకే సమయంలో చేసేవారికివి అనువుగా ఉంటాయి. విషయగ్రహణ ఒత్తిడిని తగ్గిస్తాయి. తమ కామెట్ బ్రౌజర్‌తో పెరిగే ఉత్పాదకతను విలువ రూపంలోకి మారిస్తే అది ఏటా ఒకరికి 10వేల డాలర్లతో సమానమవుతుందని పర్‌ప్లెక్సిటీ సీఈఓ చెబుతుండటం గమనార్హం. అంటే ఏఐ బ్రౌజర్లు విస్తృతంగా వాడకంలోకి వస్తే ప్రపంచ జీడీపీకి గణనీయంగా తోడ్పడతాయన్నమాట.

ముప్పులు లేకపోలేదు

ఏఐ బ్రౌజర్లు మనకు అవసరమైన పనులు కచ్చితంగా చేయటానికి తోడ్పడే మాట నిజమే గానీ ముప్పులు పొంచి ఉండే ప్రమాదం లేకపోలేదు. వెబ్‌సైట్లలో అదృశ్య హానికారక సూచనలు 'ప్రాంప్ట్ ఇంజెక్షన్ అటాక్స్'కు దారితీయొచ్చు. ఇవి ఏఐ ఏజెంట్లను ఏమార్చి వాటికి వేరే ఆదేశాలు ఇవ్వచ్చు. ఇదెలా జరుగుతుందో చూద్దాం. అటాకర్లు తెల్ల బ్యాక్‌గ్రౌండ్ మీద తెల్ల టెక్స్ట్ రూపంలో సూచనలను అదృశ్యంగా పొందు పరచి ఉండొచ్చు. లేదా అదృశ్య డేటాతో ఇమేజ్‌లో కూర్చొచ్చు. అలాంటిప్పుడు ఏఐ బ్రౌజర్ ఆ వెబ్‌పేజీని చూసినప్పుడు విశ్వసనీయమైన కంటెంట్‌తో పాటు అదృశ్య సూచనలనూ చదవొచ్చు. ఈ రెండింటి మధ్య తికమకపడొచ్చు. అటాకర్లు ఎలాంటి సూచనలను దాచి ఉంచారో అనే దాన్ని బట్టి అది పాస్‌వర్డ్‌లను దొంగిలించొచ్చు, బ్యాంక్ ఖాతాను ఖాళీ చేయొచ్చు, రహస్య ఈమెయిళ్ల సమాచారాన్ని సంగ్రహించొచ్చు. సామాజిక మాధ్యమ ఖాతాల్లో మీరు చూస్తుండగానే అనుచిత కంటెంట్‌నూ పోస్ట్ చేయొచ్చు. పూర్తిస్థాయిలో పనిచేయటానికి చాలా ఏఐ బ్రౌజర్లు అసాధారణ అనుమతులు ఇవ్వాలని అడుగుతుండటమూ సమస్యే. బ్రౌజింగ్ హిస్టరీ, ఈమెయిల్, క్యాలెండర్, బ్యాంక్ సమాచారం వంటివీ వీటిల్లో ఉంటున్నాయి. ఇవి గోప్యతకు భంగం కలిగించే అవకాశమూ ఉంది. ఏఐ బ్రౌజర్లు ఇలాంటి లోపాలను సవరించు కోవటానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏదేమైనా అనుమతుల విషయంలో ఎవరికివారు అప్రమత్తంగా ఉండటం మంచిది. ప్రస్తుతానికి ఏఐ బ్రౌజర్లతో ముప్పుల కన్నా ప్రయోజనాలే ఎక్కువగా ఉంటున్నాయి. పరిశోధనలు వేగంగా చేసుకోవచ్చు. మాటిమాటికీ చేసే పనులను ఆటోమేట్ చేయొచ్చు. మన అవసరాలు, ప్రాధాన్యాలను అర్థం చేసుకోవటం వల్ల పనులు వేగంగా సాగుతాయి.

జియో యూజర్లకు ఉచితంగా జెమినీ ప్రో

జియో తమ యూజర్లకు రూ.35,000 విలువైన జెమిని ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా పొందే అవకాశం కల్పించింది. రిలయన్స్ ఇంటెలిజెన్స్, గూగుల్ భాగస్వామ్యం ద్వారా ఇది లభించనుంది. ప్రస్తుతానికిది 18-25 ఏళ్ల వయసువారికి అందుబాటులో ఉంటుంది. మున్ముందు మరింత ఎక్కువమందికి విస్తరించనున్నారు. యూజర్లు రూ.349, అంతకన్నా ఎక్కువ 5జీ అన్‌లిమిటెడ్ ప్రిపెయిడ్ లేదా పోస్ట్‌పెయిడ్ ప్లాన్ తీసుకొని ఉండటం తప్పనిసరి. ఈ ప్లాన్ కింద వినియోగదారులు 18 నెలల పాటు జెమినీ 2.5 ప్రో, వియో 3 ఫాస్ట్, నోట్‌బుక్ఎల్ఎం, డీప్ రీసెర్చ్, జెమినీ లైవ్, గూగుల్ వర్క్‌స్పేస్‌లో ఏఐ ఇంటిగ్రేషన్, విస్క్ యానిమేట్ వంటి టూల్స్. 2టీబీ క్లౌడ్ స్టోరేజీ ఉచితంగా వాడుకోవచ్చు. వ్యాసాలు రాయటం, కోడింగ్ సమస్యలు పరిష్కరించటం, పరీక్షలకు సిద్ధం కావటం, జాబ్ ఇంటర్వ్యూలను సాధన చేయటం వంటి పనులకు జెమినీ 2.5 ప్రో ఉపయోగపడుతుంది. వియో 3 ఫాస్ట్‌తో టెక్స్ట్, ఇమేజ్‌ల ద్వారా 8 సెకండ్ల నిడివి వీడియోలు సృష్టించుకోవచ్చు. నిశ్చల ఇమేజ్‌లను వీడియోలుగా మలచుకోవటానికి విస్క్ యానిమేట్ తోడ్పడుతుంది. సవివరమైన అకడమిక్ రిపోర్టులు, పరిశోధన ప్రాజెక్టుల్లో డీప్ రీసెర్చ్ చేయూత అందిస్తుంది. ఇది సంక్లిష్ట ప్రశ్నలకు జవాబులు ఇవ్వగలదు, ప్రాజెక్టుల కోసం సమాచారాన్ని క్రోడీకరించగలదు. జీమెయిల్, డాక్స్, షీట్స్ వంటి యాప్స్‌లో జెమినీ ఏఐని వాడుకోవటానికి ఏఐ ఇంటిగ్రేషన్ ఇన్ గూగుల్ వర్క్‌స్పేస్ ఉపయోగపడుతుంది. అర్హులైనవారు మైజియో యాప్‌లో 'క్లెయిం నౌ' మీద క్లిక్ చేసి ఈ ఆఫర్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఆఫర్ గడువు ముగిసిన తర్వాత గూగుల్ రిమైండర్ మెయిల్‌ను పంపిస్తుంది. అప్పుడు వద్దనుకుంటే సబ్‌స్క్రిప్షన్ రద్దు చేసుకోవచ్చు.

యాప్స్‌కు లొకేషన్ యాక్సెసా?



మొబైల్ యాప్స్‌కు ఎడాపెడా లొకేషన్ యాక్సెస్ ఇస్తున్నారా? మరోసారి ఆలోచించుకోండి. ఇది మన యాక్టివిటీ, పరిసరాలు, చివరికి మనమున్న గది లేఅవుట్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని లీక్ చేసే అవకాశమున్నట్టు ఐఐటీ దిల్లీ అధ్యయనంలో బయటపడింది. ఏసీఎం ట్రాన్సాక్షన్స్ ఆన్ సెన్సర్ నెట్‌వర్క్ పత్రికలో ప్రచురితమైన ఈ అధ్యయనం ఆందోళనకర విషయాలను బయటపెట్టింది. ఇందులో జీపీఎస్ డేటాను నిశితంగా పరిశీలించే ఆండ్రోకాన్ అనే వ్యవస్థ మీద దృష్టి సారించారు. లొకేషన్‌ను కచ్చితంగా గుర్తించటానికి ఆండ్రాయిడ్ యాప్స్ ఇప్పటికే దీన్ని వాడుకుంటున్నాయి. కెమెరా, మైక్రోఫోన్, మోషన్ సెన్సర్స్‌ను వాడుకోకుండానే ఇది తొమ్మిది స్వల్ప స్థాయి జీపీఎస్ ప్రమాణాలను అంచనా వేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. డాప్లర్ షిఫ్ట్, సిగ్నల్ పవర్, మల్టీపాత్ ఇంటర్‌ఫెరెన్స్ వంటి ప్రమాణాల ద్వారా ఆయా వ్యక్తులు కూర్చున్నారా? నిల్చున్నారా? పడుకున్నారా? మెట్రోలో ఉన్నారా? విమానంలో ప్రయాణిస్తున్నారా? పార్కులో లేదా రద్దీ ప్రాంతాల్లో ఉన్నారా? అనే విషయాలను పసిగడుతుండటం గమనార్హం. గది ఖాళీగా ఉందా? చాలామందితో కిక్కిరిసి ఉందా? అనే దాన్నీ ఆండ్రోకాన్ అంచనా వేయగలదని




పరిశోధకులు చెబుతున్నారు. ఇది సంగ్రహిస్తున్న ముడి డేటాను అధునాతన సిగ్నల్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్‌తో సమ్మేళితం చేసి పరిశోధకులు ఈ విషయాలను గుర్తించారు. ఏడాది కాలం పాటు 40వేల కిలోమీటర్ల విస్తీర్ణంలో వేర్వేరు ఫోన్లను ఇందులో పరిశీలించారు. పరిసరాలను 99%, మనుషుల పనులను 87% కచ్చితత్వంతో ఆండ్రోకాన్ అంచనా వేస్తుండటం గమనార్హం. ఫోన్ పక్కన చేయి ఊగటం వంటి స్వల్ప పనులనూ ఇది గుర్తిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. దీన్ని ఇంట్లో గదులు, మెట్లు, లిఫ్టుల వంటి వాటిని ఊహించటానికీ వాడుకోవచ్చని వివరిస్తున్నారు. సందర్భ అవగాహన, గోప్యతకు గౌరవమిచ్చే స్మార్ట్ సేవలకు ఆండ్రోకాన్ ఆసక్తికర అవకాశాలు కల్పిస్తున్న మాట నిజమే అయినా కీలకమైన భద్రత లోపానికి దారితీసే ప్రమాదం లేకపోలేదు. లొకేషన్ యాక్సెస్ పొందిన ఆండ్రాయిడ్ యాప్ ఏదైనా యూజర్ అనుమతి లేకుండా రహస్య సమాచారాన్ని సేకరించే అవకాశముంది. జీపీఎస్ చీకటి కోణాన్ని ఈ అధ్యయనం కళ్లకు కట్టింది. మన నిత్య జీవనంలో భాగమైన మొబైల్ ఫోన్‌ను ఆండ్రోకాన్ అనూహ్యంగా శాస్త్రీయ పరికరంగా మార్చేస్తోందని, హానికర సంస్థలు దీన్ని దుర్వినియోగం చేయొచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

కృత్రిమ ప్రకటన

టీవీల్లో, థియేటర్లలో, కంప్యూటర్లలో, మొబైల్ ఫోన్లలో బోలెడన్ని వాణిజ్య ప్రకటనలు చూసి ఉంటారు. అర నిమిషంలోనే అద్భుతమైన సమాచారాన్ని ఇచ్చి, వస్తువుల పట్ల ఆకర్షణ పెరిగేలా చేస్తాయి. వీటిని చిత్రీకరించటమంటే మాటలు కాదు. డైరెక్టర్, కెమెరామెన్, సహాయ సిబ్బంది, మోడళ్లు ఎంతో కష్టపడితే గానీ ఒక ప్రకటన సిద్ధం కాదు. అలాంటిది వీరెవరూ లేకుండా ఒక్క కృత్రిమ మేధ (ఏఐ) సాయంతోనే వాణిజ్య ప్రకటనలను రూపొందిస్తే? అలాంటి చిత్రాన్నే ప్రదర్శించింది గూగుల్ సంస్థ. పూర్తిగా జనరేటివ్ ఏఐ సాయంతో రూపొందించిన తమ తొలి ప్రకటనను ఇటీవలే విడుదల చేసింది. జస్ట్ ఆస్క్ గూగుల్ ప్రచారంలో భాగంగా క్విక్ గెట్‌ఎవే అనే టైటిల్‌తో దీన్ని తీసుకొచ్చింది. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన టామ్ అనే టర్కీ కోడి గూగుల్ సెర్చ్ ఏఐ మోడ్‌ను ప్రచారం చేస్తుంది. చూడటానికిది అచ్చం యానిమేషన్ చిత్రంగానే అనిపిస్తుంది. ఏఐ సృష్టించిందని ఎక్కడా అనిపించదు. అంత సహజంగా ఉంది మరి.



ఇన్‌స్టాలో వాచ్ హిస్టరీ



యూట్యూబ్ హిస్టరీ గురించి తెలిసిందే. ఇంతకుముందు చూసిన వీడియోల జాబితా ఇందులో కనిపిస్తుంది. అవసరమైనప్పుడు తిరిగి వీడియోలను చూసుకోవటానికిది ఎంతో అనువుగా ఉంటుంది. అలాంటి ఫీచరే ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో అందుబాటులోకి వచ్చింది. దీనిపేరు 'వాచ్ హిస్టరీ'. చూసిన రీల్స్ అన్నీ ఈ ట్యాబ్‌లో కనిపిస్తాయి. సాధారణంగా రీల్స్‌ను తిరిగి చూడటానికి వాటిని సేవ్ చేసుకోవటమో లేదా తమకో, స్నేహితుడికో పంపటమో చేస్తుంటారు. వాచ్ హిస్టరీ ఫీచర్‌తో ఇకపై అలాంటి అవసరముండదు. ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో సెటింగ్స్ ద్వారా యువర్ యాక్టివిటీ విభాగంలోకి వెళ్తే వాచ్ హిస్టరీ ఫీచర్ కనిపిస్తుంది. దీన్ని క్లిక్ చేస్తే గతంలో చూసిన రీల్స్ ప్రత్యక్షమవుతాయి. కావాలంటే పాత, కొత్త రీల్స్‌ను వడపోయొచ్చు కూడా. ప్రస్తుతానికి గత 30 రోజుల్లో చూసిన రీల్స్ మాత్రమే ఇందులో ఉంచుతున్నారు. ఒకవేళ మీ హిస్టరీ జాబితాలో ఏదైనా రీల్ ఉండొద్దనుకుంటే తొలగించుకోవచ్చు కూడా.

విద్యార్థులకు ఐఫోన్ దోస్త్

ఫొటోలు, వీడియోలు, సెల్ఫీలు, సోషల్ మీడియా.. ఫోన్ చేతిలో ఉంటే ఎప్పుడూ ఇవేనా? సరిగ్గా ఉపయోగించుకోవాలే గానీ చదువులకూ ఎంతగానో ఉపయోగపడతాయి. నమ్మకం కలగటం లేదా? అయితే ఐఫోన్‌లో బిల్టిన్‌గా ఉండే స్మార్ట్ టూల్స్ చిట్కాల గురించి తెలుసుకోవాల్సిందే. విద్యార్థుల జీవితాన్ని ఇవెంతో సుగమంగా మార్చగలవు. ఒకసారి వాడకం మొదలెడితే ఇప్పటివరకూ వీటి గురించి ఎందుకు తెలియలేదబ్బా అని అనుకోవటం ఖాయం.

చిటికెలో లెక్కలు




వాట్సప్ చాట్‌లోనో, మెసేజెస్‌లోనో కొన్ని వస్తువుల ధరలో, నంబర్లో కనిపించాయి. వాటిని లెక్కించటానికి యాప్ నుంచి బయటకు వచ్చి కాలిక్యులేటర్ ఓపెన్ చేయాల్సిన పనిలేదు. ఐఫోన్లలో టైప్ చేస్తున్నప్పుడే లెక్కలు చేయగల అదృశ్య ఇన్‌లైన్ కాలిక్యులేటర్ ఉంటుంది. మెసేజెస్, నోట్స్, స్పాట్‌లైట్ సెర్చ్ వంటి యాప్స్‌లో లెక్కని టైప్ చేస్తే చాలు. ఉదాహరణకు- 785+695= అని టైప్ చేయగానే వాటి మొత్తమెంతో ఆటోమేటిగ్గా ప్రత్యక్షమవుతుంది. కాలిక్యులేటర్ యాప్‌ను విడిగా ఓపెన్ చేయాల్సిన పనుండదు. కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం వంటి వాటికిది పనిచేస్తుంది. తరగతిలో తక్షణం లెక్కను సరి చూసుకోవటం, బిల్లులు విభజించుకోవటం, ఖర్చులను లెక్కించుకోవటం వంటి పనులకు దీన్ని వాడుకోవచ్చు.

ఫోనే డాక్యుమెంట్ స్కానర్

స్కానింగ్ కోసం థర్డ్ పార్టీ యాప్‌ల కోసం వెతకటం మానెయ్యండి. ఐఫోన్‌లోని నోట్స్ యాప్‌లో ఇప్పటికే అదృశ్యంగా బిల్టిన్ డాక్యుమెంట్ స్కానర్ ఉంది మరి. నోట్స్ యాప్‌ను ఓపెన్ చేసి, అటాచ్ ఫైల్ గుర్తు మీద తాకి, స్కాన్ డాక్యుమెంట్స్‌ను ఎంచుకొని కెమెరాను పేపర్ మీద ఫోకస్ చేస్తే చాలు. ఐఫోన్ దానంతటదే స్కాన్ చేసేస్తుంది. అసైన్‌మెంట్లు, ఐడీ కార్డులు, చేతిరాత నోట్స్‌ను స్కాన్ చేయటానికిది ఎంతో అనువుగా ఉంటుంది.




తక్షణం పాట గుర్తింపు



కేఫ్‌లో టీ తాగుతున్నారు. లేదా ఏదో పార్టీలో డ్యాన్స్ చేస్తున్నారు. పోనీ రీల్స్‌ను స్క్రోల్ చేస్తున్నారు. ఏదో ఒక పాట మనసును ఆకర్షిస్తుంది. కానీ దాని టైటిలేంటో తెలియదు. ఇలాంటప్పుడు అందరూ చేసే పని గూగులమ్మ తలుపు తట్టటమే. ఐఫోన్ చేతిలో ఉంటే ఈసారి కొత్తగా ప్రయత్నించండి. ఐఓఎస్‌లో బిల్టిన్‌గా ఉండే షాజమ్ సాయం తీసుకోండి. ఇది తక్షణం పాటను గుర్తుపట్టేస్తుంది. ఫోన్ తెర మీద పైనుంచి కిందికి స్వైప్ చేసి కంట్రోల్ సెంటర్‌ను ఓపెన్ చేయండి. సంగీతాన్ని గుర్తించే షాజమ్ గుర్తు మీద తట్టండి. అప్పుడు ఐఫోన్ దాన్ని విని చిటికెలో పాట పేరును తెలియజేస్తుంది. మీరు వెతికిన పాటల హిస్టరీ కూడా ఇందులో ఉంటుంది. తర్వాత యాపిల్ మ్యూజిక్‌లోనో, స్పోటిఫైలోనో వాటిని పట్టుకోవచ్చు. కొత్త ట్రాక్స్‌ను శోధించే జెన్‌జీ విద్యార్థులకిది ఎంతో ఉపయుక్తం.

ఇన్‌స్టంట్‌గా వై-ఫై పాస్‌వర్డ్ షేరింగ్



'వై-ఫై పాస్‌వర్డ్ ఏంటి' అని మాటిమాటికీ అడగాల్సిన పనిలేదు. ఐఫోన్ వై-ఫై పాస్‌వర్డ్‌ను సమీపంలోని యాపిల్ పరికరాలకు ఆటోమేటిగ్గా షేర్ చేయగలదు. రెండు ఐఫోన్లలోనూ బ్లూటూత్, వై-ఫై రెండూ ఆన్ చేసుకొని ఉండాలి. మీ స్నేహితుడు మిమ్మల్ని కాంటాక్ట్ చేయటానికి ప్రయత్నించినప్పుడు తెర మీద 'షేర్ పాస్‌వర్డ్' అనే పాపప్ కనిపిస్తుంది. దాన్ని తాకగానే స్నేహితుడి ఫోన్ వై-ఫైతో కనెక్ట్ అవుతుంది. గ్రూప్ ప్రాజెక్ట్స్, హాస్టల్ బృందంలో ఉన్నప్పుడు ఈ ఫీచర్‌తో పని తేలికవుతుంది. సమయం ఆదా అవుతుంది.

బుక్స్ నుంచి నేరుగా టెక్స్ట్ కాపీ



టెక్స్ట్‌బుక్ నుంచి పెద్ద పేరాలను టైప్ చేయటం ఒకప్పటి మాట. లైవ్ టెక్స్ట్ ఫీచర్‌తో ఇప్పుడిది చిటికెలో పని. దీని సాయంతో ఐఫోన్ కెమెరా ద్వారా బుక్స్, వైట్‌బోర్డ్స్, ఫొటోల నుంచి టెక్స్ట్‌ను కాపీ చేయొచ్చు. కెమెరా యాప్‌ను ఓపెన్ చేసి టెక్స్ట్ మీద కేంద్రీకరించాలి. లైవ్ టెక్స్ట్ గుర్తు మీద తాకి సెలెక్ట్ ద్వారా కాపీ చేసుకోవాలి. దాన్ని నోట్స్‌లోనో వాట్సప్‌లోనో పేస్ట్ చేసుకోవటమే తరువాయి. ఎక్కడికైనా వెళ్లినప్పుడు కోట్స్ వంటి వాటిని త్వరగా సంగ్రహించుకోవటానికీ ఇది బాగా ఉపయోగపడుతుంది.

పాస్‌కీతోనే వాట్సప్ చాట్ బ్యాకప్



వాట్సప్ కొత్త పాస్‌కీ ఆధారిత ఎన్‌క్రిప్షన్ వ్యవస్థను అమల్లోకి తేనుంది. ఇది పొడవైన పాస్‌వర్డ్‌లు, ఇబ్బందికరమైన ఎన్‌క్రిప్షన్ కీస్‌తో పనిలేకుండా బయోమెట్రిక్స్, స్క్రీన్‌లాక్ ద్వారా చాట్ బ్యాకప్‌ను భద్రంగా ఉంచుకోవటానికి వీలు కల్పిస్తుంది. అంటే ఫింగర్‌ప్రింట్, ఫేషియల్ రికగ్నిషన్ లేదా తేలికైన పిన్ ద్వారా బ్యాకప్‌ను ఎన్‌క్రిప్ట్ చేసుకోవచ్చన్నమాట. ఇది ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలు రెండింటికీ అందుబాటులో ఉంటుంది. ఇందులో ప్రైవేట్, పబ్లిక్ క్రిప్టోగ్రాఫిక్ కీస్ ఉంటాయి. ప్రైవేట్ కీ యూజర్ పరికరంలో స్టోర్ అయితే, పబ్లిక్ కీ యాప్‌తో షేర్ అవుతుంది. ప్రైవేట్ కీ పరికరంలోనే ఉండటం వల్ల డేటా ఉల్లంఘనకు తావుండదు. సెటింగ్స్‌లోని చాట్స్ విభాగంలో చాట్ బ్యాకప్‌లో ఉండే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ బ్యాకప్ ద్వారా ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవచ్చు. ఒకసారి యాక్టివేట్ చేసుకుంటే మున్ముందు చేసే చాట్స్ అన్నీ పరికరాలను బట్టి ఐక్లౌడ్ లేదా గూగుల్ డ్రైవ్‌లో బ్యాకప్ అవుతాయి. క్రమంగా దీన్ని అందరికీ విస్తరించనున్నారు.

అకాల మరణాల నివారణకు
8 రోజులు గ్రామానికి కంచె!




ఒడిశాలోని కొరాపుట్ జిల్లా నారాయణ్‌పట్నా బ్లాకు పరిధిలోని గడబగూడ వంద గడపలున్న చిన్న గిరిజన గ్రామం. గత రెండేళ్లలో ఈ గ్రామంలో ఎక్కువ సంఖ్యలో యువకులు పలు కారణాలతో మృత్యువాతపడ్డారు. పంటల దిగుబడి కూడా బాగా లేదు. గ్రామ దేవతకు కోపం రావడం వల్లే ఇలా జరుగుతోందని భావించిన గ్రామస్థులు ఉపశమనం కోసం తాంత్రిక పూజలు మొదలుపెట్టి, ఊరి చుట్టూ కంచె వేశారు. 8 రోజులపాటు గ్రామస్థులు బయటకు వెళ్లకుండా, బయటివారు గ్రామంలోకి రాకుండా కట్టడి చేశారు. గ్రామ ప్రవేశమార్గంలో ఈ మేరకు బ్యానరు కూడా కట్టారు. గురువు ఆజ్ఞ మేరకు గ్రామస్థులంతా నదీస్నానం చేసి, ఇళ్లకు మామిడాకులు అలంకరించారు. గ్రామదేవతను శరణు కోరుతూ మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తున్నారు. అమ్మోరికి కోపం తగ్గితే అరిష్టాలు తొలగిపోతాయన్నది వారి విశ్వాసం.

ఈటీవీ భారత్

వేడుకల పేరుతో మద్యం
హిమగిరుల్లో ఉద్యమ శంఖం



హిమాలయ పర్వతశ్రేణుల్లో వెలసి దేవభూమిగా పిలిచే ఉత్తరాఖండ్‌లోనూ మద్యం వినియోగం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. పెళ్లిళ్లలో మద్యం మత్తులో వివాదాలు సర్వసాధారణంగా మారుతున్నాయి. ఈ మహమ్మారి కట్టడికి ఉత్తరకాశీ జిల్లాలోని లోదాడా గ్రామస్థులు స్వీయ నియంత్రణ చర్యలు చేపట్టారు. 'నషా ముక్త్ అభియాన్' (వ్యసన విముక్తి ఉద్యమం) పేరుతో గ్రామస్థులంతా ఏకమై వివాహాలు, పండుగల వంటి వేడుకల్లో మద్యం వినియోగంపై పూర్తి నిషేధం విధించారు. ఈ మేరకు గ్రామ నాయకురాలు కవితా బుటోలా అధ్యక్షతన గ్రామస్థులు సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ నియమాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.51,000 జరిమానా, సాంఘిక బహిష్కరణ శిక్ష విధించాలని నిర్ణయించారు. యువతను ఈ ఊబి నుంచి బయటకు తీసుకువచ్చి.. చదువు, ఉపాధి మార్గాల వైపు మళ్లించటమే ప్రధాన లక్ష్యమని కవిత తెలిపారు.

ఈటీవీ భారత్



పట్నాలో మంగళవారం ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలింగు కేంద్రాలకు బయలుదేరిన సిబ్బంది

బిహార్ తొలిదశ ప్రచారానికి తెర
రేపు 121 నియోజకవర్గాల్లో పోలింగు

పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల తొలిదశ ప్రచార గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. గురువారం 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో పోలింగు జరగనుంది. దీనికి ఎన్నికల సంఘం తరఫున ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. చివరిరోజు ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ సహా వివిధ పార్టీల అగ్రనేతలు పెద్దఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విడతలో తేజస్వీ యాదవ్, ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ, జానపద గాయని మైథిలీ ఠాకుర్ సహా 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. మలివిడతలో ఈ నెల 11న మిగతా 122 స్థానాల్లో పోలింగు జరగనుంది.



ప్రతికూల పరిస్థితులను ఎదిరించండి

మీరు ప్రతికూల పరిస్థితులతో ఇబ్బంది పడుతుంటే.. బయటపడేందుకు వాటిని ఎదుర్కోవడమే పరిష్కారం. మీ కోపాన్ని అణచుకోవడం, మిమ్మల్ని బెదిరించే వ్యక్తుల నుంచి తప్పించుకోవడం, ఎల్లప్పుడూ రాజీపడేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు మీ పతనానికి దారి తీస్తాయి.
– రాబర్ట్ గ్రీన్, రచయిత

9 రాష్ట్రాలు, 3 యూటీల్లో సర్ ప్రారంభం

- తీవ్రంగా వ్యతిరేకించిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు ప్రభుత్వాలు
- కోల్‌కతాలో మమత భారీ ర్యాలీ

దిల్లీ, కోల్‌కతా: ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) రెండో విడత మంగళవారం ప్రారంభమైంది. 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో (యూటీల్లో) దీనికి ఎన్నికల సంఘం (ఈసీ) శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియను పశ్చిమ బెంగాల్, తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకించాయి. సర్‌కు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇదొక నిశ్శబ్ద, కనిపించని రిగ్గింగ్‌కు సాధనంగా మారిందని ఆమె ఆరోపించారు. ఒక్క అర్హుడి పేరును తొలగించినా అది మోదీ ప్రభుత్వ పతనానికి కారణమవుతుందని హెచ్చరించారు. సర్‌ను వ్యతిరేకిస్తున్న తమిళనాడు సోమవారమే సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది.

సర్ ప్రారంభమైన రాష్ట్రాలు
తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్.

కేంద్రపాలిత ప్రాంతాలు
అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి.

రంగంలోకి బీఎల్‌వోలు

పాక్షికంగా నింపిన ఫారాలను బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఓటర్లకు పంపిణీ చేయడం ప్రారంభించారు. దీంతోపాటు ఆ ఫారాలను నింపేందుకు ఓటర్లకు సహాయం చేస్తున్నారు. ఈ ప్రక్రియ డిసెంబరు 4వ తేదీ వరకూ జరగనుంది. డిసెంబరు 8న ఓటర్ల జాబితాల ముసాయిదాలను ప్రకటించనుంది. తుది జాబితాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న వెల్లడించనుంది. పశ్చిమ బెంగాల్‌లో 80 వేల మంది బీఎల్‌వోలు సర్‌లో పాల్గొంటున్నారు.

51 కోట్ల మంది ఓటర్ల తనిఖీ

సర్‌లో భాగంగా 321 జిల్లాల్లోని 1,843 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 51 కోట్ల మంది ఓటర్లను ఈసీ తనిఖీ చేయనుంది. ఇందులో 5.3 లక్షల మంది బీఎల్‌వోలు పాల్గొంటున్నారు.



మమత నిరసన

సర్‌కు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మంగళవారం రోడ్డుపైకి వచ్చి నిరసన జరిపారు. మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ వెంటరాగా.. ధర్మతలా నుంచి జోరాసంకో (రవీంద్రనాథ్ ఠాకూర్ పూర్వీకుల ఇల్లు) వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఓటర్లను తొలగించాలని భాజపా, ఈసీ కుట్ర పన్నాయని ఆరోపించారు. అస్సాంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయని, కానీ అక్కడ సర్ చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో 2 కోట్ల మంది ఓటర్లను తొలగించాలని భాజపా కుట్ర పన్నుతోందన్నారు.

2026లో ఎన్నికలు జరిగేవి..

తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. 2026లోనే ఎన్నికలు జరిగే అస్సాంలో సర్‌ను పౌరసత్వంపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత చేపడతారు.

■ తమిళనాడులో డీఎంకే, దాని మిత్ర పక్షాలు సర్‌ను వ్యతిరేకిస్తుండగా.. భాజపా భాగస్వామి ఏఐఏడీఎంకే సమర్థించింది.

■ కేరళలో సర్‌పై చర్చించడానికి బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఏర్పాటు చేశారు.

క్యూఎస్ ఆసియా టాప్ 100లో 5 ఐఐటీలు
దిల్లీ వర్సిటీ, ఐఐఎస్సీకీ చోటు

దిల్లీ: క్యూఎస్ ఆసియా ర్యాంకింగుల్లో మన దేశంలోని 5 ఐఐటీలు, దిల్లీ విశ్వవిద్యాలయం, బెంగళూరులోని ఐఐఎస్సీ.. టాప్ 100లో నిలిచాయి. దిల్లీ, మద్రాస్, బాంబే, కాన్పుర్, ఖరగ్‌పుర్ ఐఐటీలు ఈ జాబితాలో చోటు సంపాదించిన వాటిలో ఉన్నాయి. ఈ ర్యాంకులు మంగళవారం విడుదలయ్యాయి. ర్యాంకుల జాబితా లింకును ప్రధాని మోదీ షేర్ చేశారు. 2016లో ఈ జాబితాలో భారత్ నుంచి 24 సంస్థలే ఉండేవని, ప్రస్తుతం 294 సంస్థలకు చోటు లభించిందని వివరించారు. 'క్యూఎస్ ఆసియా టాప్ 100 ర్యాంకుల్లో 7 భారతీయ విద్యా సంస్థలు చోటు సంపాదించాయి. టాప్ 200లో 20 సంస్థలకు చోటు దక్కింది. టాప్ 500లో 66 భారతీయ విద్యా సంస్థలు ఉన్నాయి' అని లండన్ కేంద్రంగా పని చేసే క్యూఎస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే 36 విద్యా సంస్థలు తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నాయని, 105 సంస్థల ర్యాంకులు దిగజారాయని వివరించింది.

■ ఆసియాలో 59వ స్థానంలో నిలిచిన ఐఐటీ-దిల్లీ.. దేశంలో అత్యుత్తమ ర్యాంకును సాధించింది. ఇలా దేశంలో టాప్ ర్యాంకును ఈ సంస్థ సాధించడం వరుసగా ఇది ఐదోసారి.

మమ్‌దానీ గెలిస్తే న్యూయార్క్ నాశనం: ట్రంప్



న్యూయార్క్/వాషింగ్టన్: భారత సంతతికి చెందిన న్యూయార్క్ నగర మేయర్ అభ్యర్థి జొహ్రాన్ మమ్‌దానీ (డెమోక్రటిక్ పార్టీ)పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆయన గెలిస్తే న్యూయార్క్ నగరం ఆర్థిక, సామాజిక విధ్వంసానికి గురవుతుందని, నగర మనుగడకే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. "కమ్యూనిస్టు భావజాలం కలిగిన మమ్‌దానీ న్యూయార్క్ మేయర్‌గా గెలిస్తే నేను కనీస అవసరాలకు సరిపడినంత స్థాయిలోనే నిధులు కేటాయిస్తాను" అని ట్రంప్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

8వ వేతన సవరణ సంఘం ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్

- జస్టిస్ రంజనా దేశాయ్ నేతృత్వం
- 18 నెలల్లోగా కేంద్రానికి సిఫార్సులు



జస్టిస్ రంజనా దేశాయ్

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేస్తూ కేంద్ర ఆర్థికశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సంఘం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లోని వివిధ విభాగాలు, ఏజెన్సీల్లో పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన నగదు, ఇతరత్రా రూపాల్లో అందించే వేతనాలు, భత్యాలు, ఇతర సౌకర్యాలు, ప్రయోజనాల హేతుబద్ధీకరణపై పరిశీలన జరిపి వాటిలో చేయాల్సిన మార్పులు, విభిన్న విభాగాలకు కావాల్సిన ప్రత్యేక అవసరాల గురించి సిఫార్సు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పారిశ్రామిక, పారిశ్రామికేతర ఉద్యోగులు, అఖిల భారత సర్వీసు అధికారులు, రక్షణ దళాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఇండియన్ ఆడిట్, అకౌంట్స్ సర్వీసెస్ అధికారులు, పార్లమెంటు చట్టం ఆధారంగా ఏర్పాటైన రెగ్యులేటరీ సంస్థల సభ్యులు (ఆర్‌బీఐ మినహా), సుప్రీంకోర్టు ఉద్యోగులు, అధికారులు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోకి వచ్చే హైకోర్టులు, కింది కోర్టుల ఉద్యోగులు, అధికారులకు సంబంధించిన వేతన సవరణ గురించి ఈ సంఘం అధ్యయనం చేస్తుంది. దిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. 18 నెలల్లోపు సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది.

■ ప్రతిభావంతులను ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఆకర్షించి, సామర్థ్యం, జవాబుదారీతనం, పని సంస్కృతిలో బాధ్యతను ప్రోత్సహించే విధంగా వేతన నిర్మాణాన్ని రూపొందించడం వేతన సవరణ సంఘం ప్రధాన బాధ్యత.

■ ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు వీలుగా ప్రస్తుతం అమల్లో ఉన్న బోనస్ పథకాలను పరిశీలిస్తుంది. మంచి పని తీరు కనబరిచిన వారిని ప్రోత్సహించేలా ఆర్థిక కొలమానాలు నిర్దేశిస్తుంది.

■ ప్రస్తుతం అమల్లో ఉన్న భత్యాలు, వాటిని అనుమతించడానికి అమలుచేస్తున్న షరతులను పరిశీలించి వాటి హేతుబద్ధీకరణకు సిఫార్సు చేస్తుంది.

అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు డిక్ చెనీ కన్నుమూత



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా డిక్ చెనీగా ప్రసిద్ధుడైన అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు రిచర్డ్ బ్రూస్ చెనీ(84) అనారోగ్య సమస్యలతో కన్నుమూశారు. చిరకాలంగా బాధిస్తున్న గుండె సమస్యలకు న్యుమోనియా తోడు కావడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మరణం జాతికి తీరని లోటని, ఆయన సన్నిహితులకు విషాదాన్ని మిగిల్చిందని అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ.బుష్ అన్నారు. 9/11 ఉగ్రదాడుల అనంతరం అఫ్గానిస్థాన్, ఇరాక్‌లపై అమెరికా చేపట్టిన భీకర యుద్ధాలకు నిర్మాతగా ప్రసిద్ధి పొందిన డిక్ చెనీ అమెరికా చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన ఉపాధ్యక్షుడిగా ఖ్యాతి గడించారు. 2001 నుంచి 2009 వరకూ జార్జ్ డబ్ల్యూ.బుష్ అధ్యక్షునిగా ఉండగా ఆయన ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. చెనీ... చివరి సంవత్సరాల్లో తన పార్టీ సహచరుడైన ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించారు.

కేంద్ర మంత్రి లలన్ సింగ్‌పై కేసు

పట్నా: కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) కొత్త వివాదంలో చిక్కుకున్నారు. అరెస్టయిన జేడీయూ అభ్యర్థి అనంత్‌సింగ్ తరఫున బిహార్‌లోని మోకామాలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటింగు రోజు ప్రత్యర్థులను బెదిరించాలని ఎన్డీయే మద్దతుదారులకు చెబుతున్నట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడంతో పోలీసులు లలన్‌పై కేసు నమోదు చేశారు.

నాకు ఏం జరిగిందో మీకు గుర్తులేదా..?

- థరూర్‌ను హెచ్చరించిన భాజపా నేత షెహజాద్



షెహజాద్




శశిథరూర్

ఇంటర్నెట్‌డెస్క్: వారసత్వ రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. దీనిపై భాజపా నేత షెహజాద్ పూనావాలా స్పందించారు. 'నాకు ఏం జరిగిందో మీకు గుర్తులేదా..?' అని హెచ్చరించారు. "భారత రాజకీయాలు ఒక కుటుంబ వ్యాపారం" అనే శీర్షికతో థరూర్ రాసిన మీడియా కథనం వివాదాస్పదమైంది. ఈ కథనం భారతదేశంలోని వివిధ కుటుంబ రాజకీయ పార్టీలపై దృష్టిపెట్టింది. అందులో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ ఉన్నాయి. "కుటుంబ రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పును కలిగిస్తాయి. ఇది పాలన నాణ్యతను దెబ్బతీస్తుంది. ప్రతిభ ఆధారంగా నాయకులను ఎన్నుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించాలి" అని పేర్కొన్నారు. దీనిపై భాజపా నేత పూనావాలా ఎక్స్ వేదికగా స్పందించారు. "థరూర్ నిప్పుతో చెలగాటమాడుతున్నారు. ఆయన నేరుగా నెపో కిడ్స్ (రాజకీయ వారసులు) గురించి ప్రస్తావించారు. 2017లో వారసత్వం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన రాహుల్ గాంధీని నేను ప్రశ్నించినప్పుడు నాకు ఏం జరిగిందో మీకు గుర్తులేదా సర్..? నేను మీకోసం ప్రార్థిస్తున్నాను. ఆ కుటుంబం ప్రతీకారంతో వ్యవహరిస్తుంది" అని గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆ ఏడాది కాంగ్రెస్‌లో జరిగిన అంతర్గత ఎన్నికల ప్రక్రియను పూనావాలా ప్రశ్నించారు. ఆ వ్యవహారం తర్వాత ఆయన భాజపాలో చేరి, పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు.

అమెరికాలో హైర్ చట్టం అమలైతే..
భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్



దిల్లీ: తమ దేశంలో ఔట్‌సోర్సింగ్ విదేశీయులపై 25% పన్ను విధించాలని అమెరికా సెనెట్‌లో ప్రవేశపెట్టిన అంతర్జాతీయ ఉపాధి తరలింపు నిలిపివేత (హైర్) చట్టంపై మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. "బ్లూకాలర్ ఉద్యోగాలు చైనాకు తరలిన నేపథ్యంలో.. వైట్‌కాలర్ ఉద్యోగులు భారత్‌కు వెళ్లిపోకూడదనే ఈ బిల్లు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అక్టోబరు 6న సెనెటర్ బెర్నీ మోరెనో ప్రవేశపెట్టిన హైర్ బిల్లు సెనెట్ కమిటీ ఆన్ ఫైనాన్స్‌కు పంపింది. దీని ప్రకారం, అమెరికాలో ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలు చేస్తున్న విదేశీయులు తమ మొత్తం జీతంలో 25% అక్కడి ప్రభుత్వానికి పన్ను కట్టాల్సి ఉంటుంది. ఈ బిల్లు భారత ఐటీ సేవలు, బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ), కన్సల్టింగ్, జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)పై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ఐర్లాండ్, ఇజ్రాయెల్, ఫిలిప్పీన్స్ వంటి పలు దేశాలు దీనికి ప్రభావితమవుతున్నాయి. కానీ అధిక తీవ్రత మన దేశంపైనే ఉంటుంది" అని జైరాం పేర్కొన్నారు.

ఫిలిప్పీన్స్ టైఫూన్‌లో 26 మంది మృతి

- సహాయక చర్యల్లో కుప్పకూలిన హెలికాప్టర్



సెబూ నగరంలో వరదలో కొట్టుకొచ్చి ఒకదానిపై ఒకటి పడిపోయిన కార్లు

మనీలా: 'కల్మేగీ' టైఫూన్ ఫిలిప్పీన్స్‌లో విధ్వంసం సృష్టించింది. కనీసం 26 మందిని పొట్టనపెట్టుకుంది. అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. పెద్దసంఖ్యలో ప్రజలు తమ ఇళ్ల పైకప్పులపైకి చేరుకుని ప్రాణాలు కాపాడుకుంటున్నారు. అనేక కార్లు నీటమునిగాయి. తుపాను బాధిత ప్రజల్ని రక్షించడానికి వెళ్తూ ఫిలిప్పీన్స్ వాయుసేన హెలికాప్టర్.. దక్షిణ అగుసాన్ డెల్‌సర్ ప్రావిన్సులో కుప్పకూలిపోయింది. దానిలో ఐదుగురు సిబ్బంది ఉన్నారు. వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఏడాది ఫిలిప్పీన్స్‌పై విరుచుకుపడిన 20వ తుపాను ఇది.

పాకిస్థాన్‌లో బయటపడిన 1,200 ఏళ్ల నాటి గుడి

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్ పంఖ్తుంఖ్వాలో కొన్ని నెలలుగా జరుపుతున్న పురాతన తవ్వకాల్లో కీలక పురోగతి కనిపించింది. స్వాత్ ప్రాంతం నుంచి తక్షశిల వరకు జరిపిన తవ్వకాల్లో పురాతన కాలానికి చెందిన ఎనిమిది ప్రాంతాలను కొత్తగా కనుగొన్నారు. ఇందులో స్వాత్‌లోని బరికోట్‌లో 1,200 ఏళ్ల నాటి ఓ చిన్న ఆలయాన్ని గుర్తించారు. ఖైబర్ పంఖ్తుంఖ్వా పురావస్తు శాఖతో కలిసి ఇటాలియన్ ఆర్కియాలజిస్టులు తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటివరకు వీరు 50 వరకు పురాతన కాలానికి చెందిన ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

నేపాల్‌లో హిమపాతం.. 9 మంది పర్వతారోహకుల మృతి

కాఠ్‌మాండూ: నేపాల్‌లోని హిమాలయ పర్వత ప్రాంతాల్లో జరిగిన రెండు వేర్వేరు హిమపాతాల్లో ఇద్దరు నేపాలీ గైడ్‌లతో సహా తొమ్మిది మంది మృతి చెందారు. సోమవారం ఉదయం 10గంటల సమయంలో గౌరీశంకర్ మున్సిపాలిటీ పరిధిలోని యాలుంగ్ రి పర్వతాన్ని ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా ఏడుగురు పర్వతారోహకులు మంచులో కూరుకుపోయారు. మృతదేహాలను బయటకు తీయడానికి రక్షణ బృందాలు ప్రయత్నిస్తున్నాయని డీఎస్పీ జ్ఞాన్ కుమార్ మహతో తెలిపారు. మృతుల్లో ముగ్గురు నేపాలీలు, ఇద్దరు ఫ్రెంచ్, ఒకరు జర్మన్ వ్యక్తి ఉన్నారని వెల్లడించారు. మరో ఘటనలో మానస్లు ప్రాంతంలోని పాంబారీ వద్ద అక్టోబరు 28న తప్పిపోయిన ఇద్దరు ఇటాలియన్ పర్వతారోహకుల మృతదేహాలను గుర్తించారు.

అస్సాంలో రూ.3 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

గువాహటి: అస్సాంలోని ఉదల్‌గుడీ జిల్లాలో 310 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. దాన్ని తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

విమానయాన సంస్థలతో డీజీసీఏ నెలవారీ సమీక్షలు!

దిల్లీ: విమానయాన సంస్థల కార్యనిర్వాహకులతో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) సమావేశాలు నిర్వహించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విమానాల పనితీరు, సిబ్బంది విధుల సమయాలు, ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారాలు సహా పలు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపాయి. ఇవి డీజీసీఏ నిర్వహిస్తున్న నెలవారీ సమీక్షలు అని వివరించాయి. ఎయిరిండియా, ఇండిగో విమాన సంస్థలతో మంగళవారం భేటీ జరగనున్నట్లు వెల్లడించాయి.

ప్రధానిది నకిలీ డిగ్రీ

- అందుకే విద్యారంగాన్ని పట్టించుకోరు
- రీల్స్‌లో యువత తలమునకలై ఉండాలనేదే ఆయన యోచన
- బిహార్ సభల్లో రాహుల్ ఆరోపణలు



ఔరంగాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలతో రాహుల్ కరచాలనం

ఔరంగాబాద్: విద్య, ఉద్యోగం, ఆరోగ్యం వంటి ముఖ్యమైన సమస్యల నుంచి యువత దృష్టి మళ్లించడానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. యువత నిరంతరం సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చేసుకుంటుంటే కీలక సమస్యలపై నిలదీయరనే ఉద్దేశంతోనే ఆయన దీన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. బిహార్‌లో తొలిదశ ఎన్నికల ప్రచారానికి చివరిరోజైన మంగళవారం రాహుల్.. ఔరంగాబాద్, గయాజీలలో ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. "రీల్స్‌కు బానిసలై యువతీయువకులు ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌లలో గడపాలని మోదీ కోరుకుంటున్నారు. 21వ శతాబ్దంలో ఇదొక కొత్త మత్తు. ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయకుండా యువత ఆలోచనల్ని పక్కదారి పట్టించే ఎత్తుగడ. మోదీది నకిలీ డిగ్రీ. అందుకే విద్యారంగంపై ఆయన అనాసక్తితో ఉంటారు. నలంద విశ్వవిద్యాలయం గొప్పతనం ఆయనకు తెలియదు" అని చెప్పారు.

ఓట్లచోరీతో అశాంతికి ఆజ్యం

"మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా కలిసి బిహార్‌లో ఓటుచోరీకి పాల్పడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని వారికి తెలుసు. కాంగ్రెస్-ఆర్జేడీ గానీ అధికారంలోకి వస్తే ఆటవిక రాజ్యం మళ్లీ వస్తుందని మోదీ చెబుతారు. నిజానికి ఓట్లచోరీ ద్వారా అశాంతిని ప్రోత్సహిస్తున్నదే ఆయన" అని రాహుల్ విమర్శించారు.

మీరు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనా?

"నీతీశ్ గత 20 ఏళ్లుగా ప్రభుత్వాన్ని నడుపుతున్నా బిహార్ అభివృద్ధి చెందట్లేదు. నేను కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అసోం, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ ఇలా ఎక్కడికి వెళ్లినా అక్కడ బిహార్ యువతను గమనిస్తున్నాను. మీరందరూ కష్టపడి పనిచేస్తారు. భారీ భవనాలు, వంతెనలు, సొరంగాలను నిర్మించేది బిహార్ యువతే. ఎక్కడికి వెళ్లినా మీరు కార్మికులుగానే పనిచేయాలి. మీరు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనా? జీవితాంతం శ్రమతోనే గడపాలనుకుంటున్నారా?" అని యువతను రాహుల్ ప్రశ్నించారు.

43ఏళ్లు జైలు శిక్ష అనుభవించిన భారత సంతతి వ్యక్తికి ఊరట
డిపోర్ట్ చేయొద్దన్న అమెరికా న్యాయస్థానాలు

ఫిలడెల్ఫియా: చేయని నేరానికి 43ఏళ్లుగా జైలు శిక్ష అనుభవించిన భారత సంతతి వ్యక్తి వేదం సుబ్రమణ్యం(64)కు ఊరట లభించింది. ఆయన్ను అమెరికా నుంచి బహిష్కరించొద్దని అగ్రరాజ్యానికి చెందిన రెండు న్యాయస్థానాలు ఇమిగ్రేషన్ అధికారులను ఆదేశించాయి. ప్రస్తుతం సుబ్రమణ్యం లూసియానాలోని ఓ నిర్బంధ కేంద్రంలో ఉన్నారు. ఆయన్ను భారత్‌కు తిరిగి పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సుబ్రమణ్యం డిపోర్టేషన్‌పై జడ్జి స్టే విధించారు. ఆయన కేసును సమీక్షించాలా, వద్దా అనే దానిపై బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అప్పీల్స్ నిర్ణయం తీసుకునే వరకు దేశం నుంచి బహిష్కరించొద్దని న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు పెన్సిల్వేనియాలోని జిల్లా కోర్టు కూడా బహిష్కరణపై స్టే విధించింది.



వేదం సుబ్రమణ్యం

బంగ్లా పాఠశాలల్లో సంగీతం, పీఈటీ టీచర్ల నియామకాలు రద్దు

ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లోని పాఠశాలల్లో మ్యూజిక్, పీఈటీ టీచర్ల నియామకాల ప్రణాళికను రద్దు చేస్తున్నట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సంగీత, నృత్య ఉపాధ్యాయులను నియమించాలని అక్కడి విద్యా శాఖ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నియామకాలను రద్దు చేయాలని బంగ్లా ఇస్లాం ఛాందసవాదులు యూనస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో మ్యూజిక్, పీఈటీ టీచర్ల నియామకాలను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారి మసూద్ అక్తర్ ఖాన్ ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులు రద్దు చేయడానికి గల కారణాలను మీడియా ప్రశ్నించగా.. ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు.



ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్

- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా, చైనాలతో పాటు ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్ నిలవనుందంటూ ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రపంచశక్తిగా ఎదుగుతోన్న భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించకపోవడాన్ని తప్పుబట్టారు. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "భారత్‌కు గొప్ప అభిమానిని. విదేశీ వ్యవహారాల్లో భారత్ అనుసరిస్తున్న విధానాలు సరైనవి. యూఎన్ వంటి వేదికపై భారత్ వంటి దేశాల పాత్ర ఉండాలి. యూఎన్ భద్రతా మండలిని విస్తరించాలని జనరల్ అసెంబ్లీలో రెండుసార్లు వెల్లడించాను. అందులోని సభ్యత్వాలను పెంచాలన్నాను. లాటిన్ అమెరికా నుంచి ఒక సభ్యుడు, ఆఫ్రికా నుంచి ఇద్దరు.. ఆసియా నుంచి ఇద్దరు సభ్యులు ఉండాలి. భారత్‌కు అందులో స్థానం లేకపోతే ఆ సంస్థ మరింత బలహీనపడుతుంది" అని స్టబ్ అభిప్రాయపడ్డారు.

బావిలో పడిన 3 ఏనుగులు

- బయటకు తీసిన అధికారులు



బలోదాబజార్: ఛత్తీస్‌గఢ్‌లోని బార్నవపర అభయారణ్యంలో మంగళవారం మూడు ఏనుగులు బావిలో పడిపోయాయి. దాదాపు మూడు గంటల పాటు సహాయక చర్యలు చేపట్టిన అధికారులు వాటిని సురక్షితంగా బయటకు తీశారు. ఒక ఆడ ఏనుగు, దాని పిల్ల, ఓ చిన్న మగ ఏనుగు సమీప గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలోని బావిలో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. తెల్లవారుజామున బావిలో ఏనుగులు ఉండటాన్ని, అవి బయటకు రావడానికి ఇబ్బంది పడుతుండటాన్ని స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు గజరాజులను సురక్షితంగా బయటకు తీశాయి.

ఛాంపియన్

రవూఫ్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం


హారిస్ రవూఫ్

సూర్యకు జరిమానా


సూర్యకుమార్

దుబాయ్: ఆసియాకప్ సందర్భంగా టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాకిస్థాన్ పేసర్ హారిస్ రవూఫ్ ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్లు ఐసీసీ తేల్చింది. సూర్యకు మ్యాచ్ ఫీజులో 30 శాతాన్ని జరిమానాగా విధించింది. రవూఫ్‌కు 30 శాతం చొప్పున రెండు మ్యాచ్ ఫీజుల్లో కోత పెట్టింది. రెండేసి చొప్పున నాలుగు అయోగ్యత పాయింట్లు కూడా రవూఫ్ ఖాతాలో చేరాయి. ఓ ఆటగాడు 24 నెలల వ్యవధిలో 4 పాయింట్లు పొందితే రెండు మ్యాచ్‌ల నిషేధానికి గురవుతాడు. దీంతో రవూఫ్.. దక్షిణాఫ్రికాతో తొలి రెండు వన్డేలకు దూరమయ్యాడు. సూర్యకూ 2 అయోగ్యత పాయింట్లు ఇచ్చారు. బుమ్రా, పాకిస్తాన్ బ్యాటర్ ఫర్హాన్ చెరో అయోగ్యత పాయింట్ పొందారు.

ఉల్లంఘనలిలా..: పాకిస్థాన్‌తో సెప్టెంబరు 14న జరిగిన మ్యాచ్ అనంతరం భారత సాయుధ దళాలకు మద్దతుగా మాట్లాడినందుకు, పహల్గాం ఉగ్రదాడి బాధితులకు సంఘీభావం తెలిపినందుకు సూర్య జరిమానాకు గురయ్యాడు. అదే మ్యాచ్‌లో రవూఫ్.. భారత్‌ను రెచ్చగొట్టేలా ప్రవర్తించాడు. ఆరు భారత యుద్ధ విమానాలను కూల్చామనే అర్థం వచ్చేలా సైగలు చేశాడు. సెప్టెంబరు 28నూ ఫైనల్లోనూ రవూఫ్ అదే చర్యను పునరావృతం చేయడంతో నాలుగు అయోగ్యత పాయింట్లు పొందాడు. ఆసియా కప్ ఫైనల్లో రవూఫ్‌ను బౌల్డ్ చేయగానే.. విమానం దూసుకొస్తున్నట్టుగా సంజ్ఞ చేసినందుకు బుమ్రా, భారత్‌తో మ్యాచ్‌లో అర్ధసెంచరీ చేసిన అనంతరం 'గన్ ఫైర్' సంబరాలు చేసుకున్నందుకు ఫర్హాన్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్యకు దిగిన సంగతి తెలిసిందే.

మనోళ్లు ముగ్గురు

ఐసీసీ ప్రపంచకప్ జట్టులో స్మృతి, జెమీమా, దీప్తి


స్మృతి


జెమీమా


దీప్తి

దుబాయ్: మహిళల వన్డే ప్రపంచకప్‌ను తొలిసారి దక్కించుకున్న భారత జట్టు నుంచి ముగ్గురు సభ్యులు ఐసీసీ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'లో చోటు సంపాదించారు. మంగళవారం ప్రకటించిన ఈ జట్టులో స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ ఉన్నారు. స్మృతి 434 పరుగులతో టోర్నీ టాప్ స్కోరర్లలో రెండో స్థానంతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగా.. జెమీమా సెమీఫైనల్లో అద్భుత శతకం (127 నాటౌట్)తో ఆస్ట్రేలియాపై భారత్‌కు చిరస్మరణీయ విజయాన్నందించింది. దీప్తి టోర్నీ ఆద్యంతం బంతితో, బ్యాటుతో నిలకడగా రాణించింది. 22 వికెట్లతో ప్రపంచకప్‌లో నంబర్‌వన్ బౌలర్‌గా నిలిచిన దీప్తి.. 215 పరుగులు కూడా చేసి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది. 571 పరుగులతో ఒక ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పిన దక్షిణాఫ్రికా కెప్టెన్, ఓపెనర్ లారా వోల్వార్ట్.. ఐసీసీ ప్రపంచకప్ జట్టుకూ సారథిగా ఎంపికైంది. ఆ దేశం నుంచి ఆల్‌రౌండర్లు మరిజేన్ కాప్, నదైన్ డిక్లెర్క్‌లకూ ఈ జట్టులో అవకాశం దక్కింది. ఆస్ట్రేలియా నుంచి ఆల్‌రౌండర్లు ఆష్లీ గార్డ్‌నర్, అనాబెల్ సదర్లాండ్.. స్పిన్నర్ అలానా కింగ్ ఎంపికయ్యారు. ఇంగ్లాండ్ సీనియర్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్, పాకిస్థాన్ వికెట్ కీపర్ సిద్రా నవాజ్ జట్టులోని మిగతా సభ్యులు. ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ 12వ ప్లేయర్‌గా ఎంపికైంది.

కలలు కనడం ఆపకండి


హర్మన్‌ప్రీత్

దిల్లీ: కలలు కనడం ఆపొద్దని ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ యువతకు సలహా ఇచ్చింది. "ఎప్పుడూ కలలు కనడం ఆపకండి. విధి మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్తుందో తెలియదు" అని సోషల్ మీడియాలో బీసీసీఐ పోస్ట్ చేసిన వీడియోలో హర్మన్ చెప్పింది. "చిన్నప్పటి నుంచీ నా చేతిలో బ్యాటు ఉంది. మా నాన్న కిట్ బ్యాగులోని బ్యాటుతో మేం ఆడుకోవడం నాకింకా గుర్తుంది. ఆ బ్యాటు చాలా పెద్దగా ఉండేది. ఓ రోజు మా నాన్న.. తన పాత బ్యాట్లలోని ఓ బ్యాటును చెక్కి, చిన్నగా మార్చాడు. దాంతో మేం ఆడేవాళ్లం" అని హర్మన్‌ప్రీత్ చెప్పింది. "టీవీలో భారత్ మ్యాచ్ లేదా ప్రపంచకప్ చూసిన ప్రతిసారీ నాకూ అలా ఆడే అవకాశం వస్తే బాగుండు అనుకునేదాణ్ని. మహిళల క్రికెట్ ఉందని కూడా అప్పుడు నాకు తెలియదు" అని వివరించింది. క్రికెట్ ఆడడం మొదలు పెట్టినప్పటి నుంచే ప్రపంచకప్ గెలవడం తన కల అని హర్మన్ పేర్కొంది. "కలలు కనడం ఆపొద్దు. అనుకున్నది ఎప్పుడు జరుగుతుంది, ఎలా జరుగుతుంది అని ఆలోచించొద్దు. జరుగుతుందని మాత్రమే అనుకోవాలి" అని చెప్పింది. హర్మన్‌ప్రీత్ తండ్రి హర్మందర్ సింగ్ బుల్లర్ క్రికెట్, ఫుట్‌బాల్‌లో అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. కానీ ఆ తర్వాత స్థానిక కోర్టులో క్లర్క్ ఉద్యోగంతో సంతృప్తి చెందాడు.

దిల్లీ చేరిన హర్మన్‌ప్రీత్ సేన

దిల్లీ: ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టు మంగళవారం దిల్లీ చేరుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం క్రికెటర్లతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా వారిని ప్రధాని సన్మానిస్తారు. ఆదివారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు.. 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి, తొలిసారి మహిళల ప్రపంచకప్ సాధించిన సంగతి తెలిసిందే.

మాకు ప్రచారం చేసి పెట్టరూ..

ప్రపంచకప్ విజేతల వెంట బ్రాండ్లు

ముంబయి: ఒకప్పుడు కనీస వసతులు లేక, చెప్పుకోదగ్గ మ్యాచ్ ఫీజులూ అందక ఇబ్బంది పడ్డ భారత మహిళా క్రికెటర్లు.. గత కొన్నేళ్లలో కోట్లు ఆర్జించే స్థాయికి చేరుకున్నారు. తాజాగా ప్రపంచకప్ విజయంతో వారి జీవితాల్లో మరింత గొప్ప మార్పు రాబోతోంది. పురుష క్రికెటర్లతో సమానంగా వారికి డిమాండ్ ఏర్పడి.. పెద్ద ఎత్తున బ్రాండ్లు అమ్మాయిల వెంట పడుతున్నాయి. ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులోని స్టార్ల బ్రాండ్ విలువ 25 నుంచి 100 శాతం వరకు పెరిగిందట. ప్రపంచకప్ గెలిచిన వెంటనే పదుల సంఖ్యలో కంపెనీల నుంచి వాణిజ్య ప్రచారం కోసం జట్టులో పలువురికి విజ్ఞప్తులు వచ్చినట్లు సమాచారం. జట్టులో అత్యంత ఖరీదైన క్రికెటరైన స్మృతి మంధాన ఇప్పటికే రెండంకెల సంఖ్యలో బ్రాండ్లకు ప్రచారం చేస్తోంది. కోట్లు ఆర్జిస్తోంది. తన కోసం మరిన్ని సంస్థలు వరుస కడుతున్నాయి! ఆమె బ్రాండ్ విలువ 25-30 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఇక ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ దక్కించుకున్న జెమీమాకు కూడా మంచి డిమాండే కనిపిస్తోంది. ఆమె ఇప్పటికే మూడు బ్రాండ్లకు ప్రచారం చేస్తుండగా.. వాటికి కనీసం పది బ్రాండ్లు తోడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక్కో బ్రాండు ప్రచారానికి ఇప్పటిదాకా పుచ్చుకుంటున్న మొత్తం రెట్టింపు కాబోతోందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, ఓపెనర్లు షెఫాలి వర్మ, ప్రతీక రావల్, వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్‌లకు కూడా మంచి డిమాండే నెలకొన్నట్లు తెలుస్తోంది.

ఆ క్షణం కన్నీళ్లు ఆగలేదు



మోగా, ఈటీవీ భారత్: హర్మన్‌ప్రీత్ ప్రపంచకప్ అందుకున్న క్షణంలో తమకు కన్నీళ్లు ఆగలేదని ఆమె తండ్రి హర్మందర్ సింగ్ బుల్లర్ తెలిపారు. ముంబయిలో భారత జట్టు గెలుపు సంబరాల్లో భాగమైన హర్మన్ తల్లిదండ్రులు.. పంజాబ్‌లోని స్వస్థలం మోగాలోకి అడుగుపెట్టడంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఆ గ్రామ ప్రజలు హర్మన్ ఇంటి బయట పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. "క్రీడల్లో ఒడుదొడుకులు ఉంటాయి. మా అమ్మాయి హర్మన్ కూడా అలాంటి సవాళ్లను చాలా ఎదుర్కొంది. పట్టుదల, అంకితభావంతో ప్రపంచకప్ విజేతగా నిలిచింది. కచ్చితమైన నిర్ణయాలతో జట్టును సమర్థంగా నడిపించింది. చిన్నప్పటి నుంచి హర్మన్ ఎంతో కష్టపడింది. ఆమె క్రికెట్‌ను ఇష్టపడితే మేం కాదనలేదు. ఇప్పుడు దేశంలో ప్రతి అమ్మాయికి ఆమె స్ఫూర్తిగా నిలిచింది. అందరు తల్లిదండ్రులను నేను కోరుకునేది ఒక్కటే. అమ్మాయిలను చదివించండి.. ఆడించండి. వాళ్ల ఇష్టాలను గౌరవించండి. అప్పుడు కచ్చితంగా గర్వకారణంగా నిలుస్తారు" అని హర్మందర్ చెప్పారు. క్రీడల పట్ల ఎంతో ఇష్టం ఉన్న ఆయన.. హర్మన్‌ను క్రికెట్, ఫుట్‌బాల్‌లో ప్రోత్సహించారు. కోచ్ కమల్‌దీష్ సోధి ప్రోత్సాహంతో ఆమె క్రికెట్లో ఎదిగి జాతీయ జట్టుకు ఎంపికైంది.

అదరగొట్టిన అభిరత్

హిమాచల్‌పై హైదరాబాద్ విజయం


అభిరత్

నదౌన్: ఓపెనర్ అభిరత్‌రెడ్డి (175 నాటౌట్; 200 బంతుల్లో 19×4, 3×6) భారీ శతకం బాదడంతో హిమాచల్ ప్రదేశ్‌తో రంజీ మ్యాచ్ (గ్రూప్-డి)లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో గెలిచింది. 344 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 8/0తో చివరిదైన నాలుగో రోజు, మంగళవారం హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. మరో రెండు పరుగులకే తన్మయ్ అగర్వాల్ (5) ఔటైనా.. మరో ఓపెనర్ అభిరత్ చెలరేగిపోయాడు. ఎడాపెడా బౌండరీలు కొట్టిన అతడు.. రాహుల్ రాధేశ్ (66)తో రెండో వికెట్‌కు 145 పరుగుల భాగస్వామ్యంతో జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. అభిరత్ ఆ తర్వాత రాహుల్ సింగ్ (24)తో మూడో వికెట్‌కు 74, హిమతేజ (33)తో నాలుగో వికెట్‌కు 53, తనయ్ త్యాగరాజన్ (29)తో అయిదో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. అతడికే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో హిమాచల్ 318, హైదరాబాద్ 278 పరుగులు చేశాయి. హిమాచల్ రెండో ఇన్నింగ్స్‌లో 303 పరుగులు సాధించింది.

● ఆంధ్ర ఇన్నింగ్స్ విజయం

కటక్: ఒడిశాతో రంజీ (గ్రూప్-ఎ) మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్ 50 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫాలో ఆన్ ఆడుతూ ఓవర్‌నైట్ స్కోరు 190/2తో ఆఖరి రోజు, మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా.. 274 పరుగులకు ఆలౌటైంది. సౌరభ్ కుమార్ (3/37), విజయ్ (3/89) ఆ జట్టును దెబ్బతీశారు. ఓపెనర్ గౌరవ్ చౌదరి (80) తన ఓవర్‌నైట్ స్కోరుకు ఒక్క పరుగు మాత్రమే జోడించి ఔటయ్యాడు. రాజేశ్ ధూపర్ 38 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 475/7 వద్ద డిక్లేర్ చేయగా.. ఒడిశా 151 పరుగులకే కుప్పకూలింది.

● జైస్వాల్ సెంచరీ


జైస్వాల్

జైపుర్: టీమ్‌ఇండియా బ్యాటర్ యశస్వి జైస్వాల్ రంజీ మ్యాచ్‌లో సత్తా చాటాడు. రాజస్థాన్‌తో డ్రాగా ముగిసిన మ్యాచ్‌లో అతను ముంబయి తరఫున రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (156; 174 బంతుల్లో 18×4, 1×6) కొట్టాడు. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 56తో చివరి రోజు, మంగళవారం బ్యాటింగ్ కొనసాగించిన జైస్వాల్.. అలవోకగా బౌండరీలు బాదేశాడు. ముంబయి తరఫున 21 ఇన్నింగ్స్‌ల్లో అతడికిది అయిదో శతకం. ముషీర్ ఖాన్ (63) కూడా రాణించడంతో ఆట చివరికి ముంబయి 3 వికెట్లకు 269 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబయి 254 పరుగులు చేయగా.. రాజస్థాన్ 617/6 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్ ఆధిక్య ఆధారంగా రాజస్థాన్‌కు 3 పాయింట్లు దక్కాయి.

భారత్-ఎ కెప్టెన్‌గా జితేశ్

రైజింగ్ స్టార్స్ ఆసియాకప్


జితేశ్

దిల్లీ: రైజింగ్ స్టార్స్ ఆసియాకప్ టీ20లో పాల్గొనే భారత్-ఎ జట్టుకు జితేశ్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. నవంబర్ 14న దోహాలో ఆరంభమయ్యే ఈ టోర్నీలో ఐపీఎల్ స్టార్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాంశ్ ఆర్య, నమన్ ధీర్, నేహాల్ వధేరా, రమణ్‌దీప్ సింగ్ కూడా ఆడుతున్నారు. గుంటూరు కుర్రాడు షేక్ రషీద్ స్టాండ్ బైగా ఎంపికయ్యాడు. గ్రూప్-ఎలో ఒమన్, యూఏఈ, పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. గ్రూప్-బిలో హాంకాంగ్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, శ్రీలంక ఉన్నాయి. 14న తొలి మ్యాచ్‌లో యూఏఈతో ఆడే భారత్.. నవంబర్ 16న పాకిస్థాన్‌ను ఢీకొంటుంది. ఈ జట్టుకు కోచ్‌గా భారత్ మాజీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సునీల్ జోషి నియమితుడయ్యాడు. జోషి ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్పిన్ విభాగానికి ప్రధాన కోచ్‌గా ఉన్నాడు. **భారత్-ఎ జట్టు:** జితేశ్ శర్మ (కెప్టెన్), ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, నేహాల్ వధేరా, నమన్ ధీర్, సుయాంశ్ షెడ్గే, రమణ్‌దీప్, హర్ష్ దూబె, అశుతోష్ శర్మ, యశ్ ఠాకూర్, గురుజాప్‌నీత్ సింగ్, విజయ్‌కుమార్ వైశాఖ్, యుధ్‌వీర్ సింగ్, అభిషేక్ పొరెల్, సుయాశ్ శర్మ; స్టాండ్ బైస్: గుర్నూర్ సింగ్, కుమార్ కుశాగ్ర, తనూష్ కొటియాన్, సమీర్ రిజ్వి, షేక్ రషీద్.

ఛాలెంజర్ ట్రోఫీలో అన్వయ్ ద్రవిడ్

దిల్లీ: భారత దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ ద్రవిడ్ అండర్-19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీలో ఆడబోతున్నాడు. బుధవారం నుంచి హైదరాబాద్‌లో ఈ టోర్నీ జరగనుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్, వికెట్‌కీపర్ అయిన అన్వయ్.. టీమ్-సి జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ జట్టుకు ఆరోన్ జార్జి కెప్టెన్. అన్వయ్ తమ్ముడు సమిత్ ద్రవిడ్ ఇటీవలే మహారాజా టీ20 కేఎస్‌సీఏ టోర్నీలో ఆడాడు.

సీన్ విలియమ్స్‌పై శాశ్వత వేటు


సీన్ విలియమ్స్

హరారె: జింబాబ్వే క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సీన్ విలియమ్స్ శాశ్వతంగా ఆ జట్టుకు దూరమయ్యాడు. 39 ఏళ్ల సీన్.. మాదక ద్రవ్యాలకు బానిస కావడంతో అతడిపై ఆ దేశ క్రికెట్ బోర్డు వేటు వేసింది. తాను చాన్నాళ్లుగా మాదక ద్రవ్యాలు తీసుకుంటున్నట్లు అతను అంగీకరించాడు. దీని వల్లే సీన్.. కొన్ని మ్యాచ్‌లకు దూరమైనట్లు తేలడంతో అతడిని ఇంకెప్పుడూ జింబాబ్వే జట్టుకు ఎంపిక చేయకుండా ఆ దేశ క్రికెట్ బోర్డు నిషేధం విధించింది. ఆల్‌రౌండరైన సీన్ విలియమ్స్.. జింబాబ్వేకు 24 టెస్టులు, 164 వన్డేలు, 85 టీ20ల్లో ప్రాతినిధ్యం వహించాడు.

మీరా.. 49 నుంచి 53కు

2028 ఒలింపిక్స్‌లో కొత్త బరువు విభాగంలోకి


మీరాబాయి

దిల్లీ: భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను.. తన బరువు విభాగాన్ని మార్చుకోనుంది. ఆమె ఇప్పటి దాకా 49 కేజీల విభాగంలో పోటీ పడుతోంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఈ విభాగంలోనే రజతం గెలిచింది. కానీ 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ నుంచి 49 కేజీల విభాగాన్ని తొలగించడంతో మీరాబాయి బరువు పెరగాల్సిన అవసరం ఏర్పడింది. ఆ ఒలింపిక్స్‌లో కనీస బరువు విభాగం 53 కేజీల నుంచే మొదలవుతుంది. కాబట్టి ఆమె అందులోకి మారాల్సిందే. అయితే వచ్చే ఏడాది ఆసియా క్రీడల వరకు మీరా 49 కేజీల విభాగంలోనే కొనసాగనుంది. తర్వాత 53 కేజీలకు మారుతుంది. ఈ మార్పు మీరాకు కలిసొచ్చే విషయమే అని జాతీయ ప్రధాన కోచ్ విజయ్ శర్మ అభిప్రాయపడ్డాడు. బరువు తగ్గాలంటే ఇబ్బంది కానీ.. పెరగడంలో సమస్యేమీ లేదని విజయ్ అన్నాడు. 2028 క్రీడల్లో పురుషులు, మహిళలకు కలిపి మొత్తం 12 వెయిట్‌లిఫ్టింగ్ ఈవెంట్లు ఉండబోతున్నాయి.

విదిత్‌ను నిలువరించిన చెస్ మెస్సి!


ఒరో ఫాస్టినో

పంజిమ్: అర్జెంటీనాలో 'మెస్సి ఆఫ్ చెస్'గా పేరు తెచ్చుకున్న 12 ఏళ్ల ఒరో ఫాస్టినో.. భారత సీనియర్ క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతిని నిలువరించి ఆశ్చర్యపరిచాడు. ఫిడే ప్రపంచకప్‌లో మంగళవారం రెండో రౌండ్ తొలి గేమ్‌లో అతను.. విదిత్‌తో పాయింట్లు పంచుకున్నాడు. ఈ టోర్నీ ఆరంభ రౌండ్లో ఫాస్టినో.. తన కంటే మెరుగైన ర్యాంకింగ్ ఉన్న ఆంట్ బ్రెకిక్ (క్రొయేషియా)ను ఓడించి సంచలనం రేపాడు. విదిత్‌తో తన గేమ్ 28 ఎత్తుల పాటు సాగింది. బుధవారం వీరి మధ్య రెండో గేమ్ జరుగుతుంది. మరోవైపు తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి.. పెట్రోవ్ మార్టిన్ (బల్గేరియా)ను ఓడించాడు. సీనియర్ క్రీడాకారుడు పెంటేల హరికృష్ణ.. ఆర్సెనియ్ (ఫిన్లాండ్)తో పాయింట్లు పంచుకున్నాడు. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు.. నాగర్బెక్ (కజకిస్థాన్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ప్రజ్ఞానంద-టెమూర్ (ఆస్ట్రేలియా), కార్తీక్ నారాయణన్- అరవింద్ చిదంబరం, కార్తికేయన్ మురళి-ఇదాని పౌయా (ఐర్లాండ్), నారాయణన్-నికిత (ఇంగ్లాండ్), ప్రణేశ్-దిమిత్రిజ్ (జర్మనీ) గేమ్‌లు డ్రా అయ్యాయి.

'సన్నీ సార్.. నేను సిద్ధం'

ముంబయి: దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్‌తో కలిసి ప్రదర్శన ఇచ్చేందుకు గిటార్‌తో సిద్ధంగా ఉన్నట్లు స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ చెప్పింది. వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే తాను జెమీమాతో కలిసి పాట పాడతానని సన్నీ అన్న నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది. 'సునీల్ గావస్కర్ సార్ మీ సందేశం చూశాను. భారత్ ప్రపంచకప్ గెలిస్తే నాతో కలిసి పాట పాడతానని మీరు అన్నారు. నేను నా గిటార్‌తో సిద్ధంగా ఉన్నా. మీరు మీ మైక్‌తో సిద్ధమా.." అని జెమీమా గిటార్‌తో ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో పోస్టు చేసింది. బీసీసీఐ అవార్డుల కార్యక్రమం సందర్భంగా సన్నీతో కలిసి పాట పాడిన వీడియోను కూడా ఈ సందర్భంగా ఆమె పంచుకుంది.

స్మృతి రెండో స్థానానికి..


దుబాయ్: వన్డే ర్యాంకింగ్స్‌లో చాలా రోజులుగా అగ్రస్థానంలో కొనసాగుతున్న భారత స్టార్ స్మృతి మంధాన ఆ ర్యాంకు కోల్పోయింది. వన్డే ప్రపంచకప్‌లో అదిరే ఫామ్‌తో పరుగుల వరద పారించిన దక్షిణాఫ్రికా స్టార్ లారా వోల్వార్ట్ (814 రేటింగ్) నంబర్‌వన్ ర్యాంకును చేజిక్కించుకుంది. స్మృతి (811) రెండో స్థానంలో ఉంది. ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడిన జెమీమా రోడ్రిగ్స్ (658) ఒక ర్యాంకు మెరుగై పదో స్థానంలో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (634) నాలుగు ర్యాంకులు మెరుగుపరుచుకుని 14వ స్థానాన్ని దక్కించుకుంది. బౌలర్లలో దీప్తి శర్మ (657) అయిదో స్థానంలో నిలిచింది. సోఫీ ఎకిల్‌స్టోన్ (747, ఇంగ్లాండ్) అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆల్‌రౌండర్లలో దీప్తి (392) ఒక ర్యాంకు మెరుగై నాలుగో స్థానంలో ఉండగా.. ఆష్లీ గార్డ్‌నర్ (498, ఆస్ట్రేలియా) అగ్రస్థానంలో కొనసాగుతోంది.

డిసెంబర్ 28న కిర్గియోస్‌తో సబలెంకా పోరు


సబలెంకా, కిర్గియోస్

దుబాయ్: టెన్నిస్‌లో అమ్మాయి, అబ్బాయి మధ్య ఓ ఆసక్తికర పోరు చూడబోతున్నాం. డిసెంబర్ 28న జరిగే ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మహిళల ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా.. ఆస్ట్రేలియా స్టార్ నిక్ కిర్గియోస్‌తో తలపడనుంది. 17 వేల మంది అభిమానులు కూర్చునే కోకాకోలా ఎరీనాలో సబలెంకా-కిర్గియోస్ తలపడనున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు డిసెంబర్ 8న ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో సబలెంకా, కిర్గియోస్ వేర్వేరు ప్రత్యర్థులతో ఆడనున్నారు. ఒసాకాతో సబలెంకా.. టామీ పాల్‌తో కిర్గియోస్ తలపడతారు. సబలెంకా నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ కాగా.. కిర్గియోస్ ఇప్పటిదాకా ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ కూడా సాధించలేదు.

పాక్‌దే తొలి వన్డే


నసీమ్ షా

ఫైసలాబాద్: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో పాకిస్థాన్ బోణీ కొట్టింది. మంగళవారం తొలి వన్డేలో ఆ జట్టు 2 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టు 49.1 ఓవర్లలో 263 పరుగులకే ఆలౌటైంది. డికాక్ (63; 71 బంతుల్లో 6×4, 2×6), ప్రిటోరియస్ (57; 60 బంతుల్లో 7×4, 1×6) అర్ధసెంచరీలతో సత్తా చాటారు. బ్రీట్జ్‌కే (42), బోష్ (41) కూడా రాణించారు. నసీమ్ షా (3/40), అబ్రార్ అహ్మద్ (3/53), సయీమ్ (2/39) ప్రత్యర్థిని కట్టడి చేశారు. లక్ష్యాన్ని పాక్ 49.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి అందుకుంది. సల్మాన్ ఆఘా (62; 71 బంతుల్లో 5×4, 1×6), మహ్మద్ రిజ్వాన్ (55; 74 బంతుల్లో 6×4), ఫకార్ జమాన్ (45; 57 బంతుల్లో 4×4, 2×6) పాక్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఇదే విజయ రహస్యం



ఏదైనా ఓ అంశంలో విజయం సాధించిన వ్యక్తులు మీ కంటే సమర్థులు కాకపోయి ఉండొచ్చు. అయితే వారు ఆ అంశంపై మీరు సిద్ధం కావడానికంటే చాలా ముందే ఆ దిశగా ప్రయత్నం మొదలుపెట్టి ఉంటారు. ఎన్నో దఫాలు పరాజయం పాలై ఉంటారు. విజయం సాధించేవరకూ తమ పట్టును విడిచిపెట్టకుండా ఉండి ఉంటారు. ఇదే వారి విజయ రహస్యం.

–జాన్ బ్రోసియో, వ్యాపారవేత్త

గుటుక్కుమనిపిస్తే... గాబరా పడకుండా!

చిన్నారులు ఆటవస్తువులు, బొమ్మల విడిభాగాలు, బ్యాటరీలు, నాణేలు నోట్లో పెట్టుకుని శ్వాస ఆడక అత్యవసర చికిత్స వరకు వెళ్లడం, మరణించడం వంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. పిల్లలు ఆ ప్రమాదాలబారిన పడకుండా ఏం చేయాలి?



ఈ వస్తువులు పిల్లలకు దూరంగా..

నాణేలు, బటన్ బ్యాటరీలు, బొమ్మల విడిభాగాలు, చిన్న ఆభరణాలు, పెన్సిల్ కొనలు, రబ్బరు ముక్కలు, పిన్నులు, చాక్‌పీస్‌లు, జామ, యాపిల్ వంటి పండ్ల ముక్కలు

చిన్న నిర్లక్ష్యం... పెద్ద ప్రమాదం



- చాలా మంది తల్లిదండ్రులు పిల్లలు ఆడుకునేందుకు వస్తువులు పక్కన పెట్టి వెళ్లి పనుల్లో నిమగ్నమవుతారు. అలా చేయొద్దు. ఆహారనాళాల్లో అల్సర్లకు దారితీసే అయస్కాంతం, బ్యాటరీలు, పిన్నీసులు దూరంగా ఉంచాలి.
- విడిభాగాలు ఊడిపోవడానికి అవకాశం ఉన్న ఆట బొమ్మలు, మూతలు లూజుగా ఉన్న వస్తువులు దూరంగా పెట్టాలి. నోటిలో పట్టేంత చిన్న బొమ్మలు, రేడియం బంతులు, ప్లాస్టిక్ ముక్కలుంటే వాటిని దూరంగా ఉంచాలి.
- ఆటలాడుకునే నెలల పిల్లల నుంచి 5ఏళ్లలోపు చిన్నారులను తరచూ గమనిస్తుండాలి. మీ బొమ్మలపై చొకింగ్ హజార్డ్ లేబుల్ ఉందా ..లేదా చూసుకోండి. చిన్నారుల మెడలో సన్నటి గొలుసులు, పూసలు ఉన్న దండలు వేయకూడదు.
- మాంసాహారం పెట్టేటప్పుడు ముక్కను చేత్తో చిదిమి ఎముకలు లేకుండా చూసి పెట్టాలి.



-ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జటిలం చేయొద్దు

- పిల్లల గొంతు, ఆహార నాళాల్లో ఏదైనా ఇరుక్కుపోయిందని గమనించిన వెంటనే బలవంతంగా తీసేందుకు ప్రయత్నించకూడదు.
- అవకాశం ఉంటే సున్నితంగా బయటకు వచ్చేలా చూడండి. గొంతులో ఇరుక్కుని ఉంటే గట్టిగా దగ్గడం వల్ల బయటకు వచ్చే అవకాశం ఉంటుంది.
- పిల్లలు వస్తువులు మింగారని అవి బయటకు వచ్చేందుకు, వాంతి అయ్యేలా ఏదైనా ఆహారాన్ని ఇస్తుంటారు. ఇంకొందరు పిల్లలు ఏదైనా మింగితే పొట్టపై గట్టిగా రద్దుతుంటారు. దీనివల్ల పొట్టలోపల గాయాలు కావచ్చు.
- తలపైనా తట్టకూడదు. ఇలాంటివి చేసి పరిస్థితిని మరింత జటిలం చేయొద్దు. వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–ఎంపీవీ నాయక్, చిన్నపిల్లల వైద్యనిపుణులు, ఎన్టీఆర్ ప్రభుత్వ వైద్యశాల, అనకాపల్లి



హైదరాబాద్ ట్రాఫిక్ మ్యాన్.. లోకేంద్రసింగ్

ఉద్యోగ జీవితంలో బిజీబిజీగా గడిపే వారు... వారాంతం వచ్చిందంటే.. విశ్రాంతి తీసుకోవడమో.. కుటుంబంతో సరదాగా ట్రిప్‌లు వేయడమో చేస్తుంటారు. హైదరాబాద్‌లో నివాసముండే లోకేంద్రసింగ్ అందుకు భిన్నం. వృత్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయినా.. ప్రవృత్తి రీత్యా నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలపై అవగాహన కల్పిస్తూ 'హైదరాబాద్ ట్రాఫిక్ మ్యాన్'గా పేరుగాంచారు. "మా స్వస్థలం రాజస్థాన్. నాన్న వ్యాపారం నిమిత్తం కొన్నేళ్ల క్రితమే హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డాం. 18వ ఏట డ్రైవింగ్ స్కూల్‌లో చేరినప్పుడు.. కేవలం డ్రైవింగ్ అంశాలపైనే శిక్షణ ఇచ్చారు. ఇతర ట్రాఫిక్ నిబంధనల జోలికి వెళ్లలేదు. దీంతో రహదారి నియమాలు, మోటార్ వెహికిల్ యాక్ట్ గురించి తెలుసుకోవాలనే ఆత్రుత పెరిగింది. రోడ్డు భద్రత, బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ తీసుకున్నా. నీతి ఆయోగ్ సర్వే ప్రకారం దేశంలో సుమారు 80శాతం అక్షరాస్యులున్నారు. 1.5 శాతం మందికి మాత్రమే ట్రాఫిక్ రూల్స్ గురించి తెలుసు. 2021లో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో ట్రాఫిక్ వాలంటీర్‌గా చేరాను. నాలాంటి ఆలోచన కలిగిన సుమారు 15 మంది ఓ సమూహంగా ఏర్పడ్డాం. హైదరాబాద్ వ్యాప్తంగా శిబిరాలు నిర్వహిస్తున్నాం. సీటు బెల్టు పెట్టుకోవడం దగ్గర నుంచి.. స్టాప్ లైన్, లైన్ క్రమశిక్షణ, హారన్ ప్రాధాన్యం గురించి వివరిస్తాం. మా పనితీరును మెచ్చిన తెలంగాణ పోలీసు అధికారులు.. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో మా సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ పోలీసుల ద్వారా ట్రాఫిక్ వాలంటీర్‌గా పలు అవార్డులు అందుకున్నా" అని లోకేంద్రసింగ్ చెబుతున్నారు.

–ఈనాడు డిజిటల్, హైదరాబాద్


అడవికెళ్లిపోతాం మామా..



పామును చూస్తే చాలామంది అంత దూరం పరిగెడతారు. ఈయనేంటి ఇన్ని పాములను పట్టుకున్నారని చూస్తున్నారా? ఈయనో స్నేక్ క్యాచర్. పేరు రొక్కం కిరణ్. విశాఖ నగరంలో పలు ప్రాంతాల్లో ఇటీవల జనావాసాల్లోకి వచ్చిన పాములను పట్టుకున్నారు. వాటన్నింటినీ తన ఇంటి వద్దే భద్రంగా ఉంచారు. చాలా పాములు పోగయ్యే సరికి మంగళవారం తన బృందంతో కలిసి పరవాడ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. మొత్తానికి 20కి పైగా పాములు క్షేమంగా అడవి బాట పట్టాయి.

–ఈనాడు, విశాఖపట్నం

భళా విద్యార్థులు భలే విన్యాసాలు..



నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు మల్లఖంబ్ విన్యాసాలతో అదరగొట్టారు. యోగా, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్‌ల కలయికతో కూడిన ఈ ప్రాచీన యుద్ధ క్రీడలో తమ ప్రావీణ్యం ప్రదర్శించి ఔరా అనిపించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మల్లఖంబ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్-2025 పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 14, 17 ఏళ్ల విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహిస్తున్న పోటీల్లో పలు ఉమ్మడి జిల్లాలకు చెందిన రెండొందల మంది క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే పోటీలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు.

–న్యూస్‌టుడే, చౌటుప్పల్

2025 సోగ్గాడు జోనాథన్ బెయిలీ



'వికెడ్', 'బ్రిడ్జర్టన్' వంటి హాలీవుడ్ చిత్రాలు, టెలివిజన్ సీరియళ్ల నటుడు జోనాథన్ బెయిలీ (37)ని అమెరికాకు చెందిన 'పీపుల్' మేగజైన్ 2025 ఏడాదికి గాను అత్యంత ఆకర్షణీయమైన వ్యక్తి (సెక్సీయస్ట్ మ్యాన్ అలైవ్)గా ఎంపిక చేసింది. గత 40 ఏళ్లుగా ఈ టైటిలు ప్రకటిస్తున్న ఆ పత్రిక సోమవారం రాత్రి తాజా ప్రకటన చేసింది. దీనిపై జోనాథన్ స్పందిస్తూ.. ఇది జీవితకాల గౌరవం. చాలా సంతోషంగా ఉందన్నారు. గత జులై నెలలో థియేటర్లలో విడుదలైన 'జురాసిక్ వరల్డ్: రీబర్త్'లో డాక్టర్ హెన్రీ లూమిస్ పాత్రను జోనాథన్ పోషించారు.

–లాస్‌ఏంజెలెస్



గండికోటకు స్వర్ణకిరీటం

చేయితిరిగిన చిత్రకారుడు వేసిన పెయింటింగ్‌లా కనువిందు చేస్తున్న ఈ దృశ్యం వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం గండికోటలోది. గ్రాండ్ కెనాన్‌గా పేరొందిన గండిపేట లోయ.. దక్షిణాయన కాలంలో ఇలా బంగారు వర్ణంలో వెలుగులీనుతుంది. పడమటి గూటికి చేరుకుంటున్న సూర్యుడు పాలకొండల మీదుగా పెన్నా నదిలో ప్రతిబింబిస్తుంటే.. చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఈ మనోహర దృశ్యాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు ఎక్కడెక్కడి నుంచో తరలివస్తుంటారు. గండికోటలోని జామా మసీదు సమీపం నుంచి కనిపిస్తున్న సౌందర్యాన్ని ఈ చిత్రంలో చూడొచ్చు.

–ఈనాడు, కడప; న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణం



సలామ్ సైనికా..!

51 ఏళ్లుగా నిత్యం సైకిల్‌పై తిరుగుతూ సైన్యం గొప్పతనాన్ని వివరిస్తున్నారో విశ్రాంత జవాన్. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పసుపులేటి మోహనరావు 1963 నుంచి 1974 వరకు సైన్యంలో పని చేశారు. సిపాయిగా అడుగుపెట్టి నాయక్ హోదాలో రిటైర్ అయ్యారు. సరిహద్దుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు పలు పతకాలు అందుకున్నారు. సైన్యం నుంచి వచ్చాక తెనాలిలో విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘాన్ని నెలకొల్పారు. సైన్యం నుంచి విరమణ పొంది తెనాలి వచ్చింది మొదలు ఈరోజు వరకు 51 ఏళ్లుగా ఆయన వాహనం సైకిలే. ప్రస్తుతం మోహనరావు వయస్సు 88 కాగా, ఇప్పటికీ రోజూ 6 కిలోమీటర్లు సైకిల్‌పై తిరుగుతుంటారు. "సైనిక దుస్తులు లేదా తెల్లటి దుస్తులు ధరించే ఇంటి నుంచి బయటకు వస్తా. సైకిల్‌కు జాతీయ జెండా, దుస్తులకు సాధించిన పతకాలను కట్టుకుని రోజూ అందరినీ పలకరిస్తాను. యువతకు సైన్యం గొప్పతనం, క్రమశిక్షణ చెబుతాను" అని మోహనరావు పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, తెనాలి టౌన్

కొడవళ్ల కార్ఖానా.. పేటేరు



బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని పేటేరు గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. వ్యవసాయ అవసరాలకు వినియోగించే కొడవళ్లకు ఇది పేరుగాంచింది. గ్రామంలోని శ్రామికనగర్‌లో ఉంటున్న వంద కుటుంబాలు 80 ఏళ్లుగా కొడవళ్లు తయారుచేస్తూ జీవనోపాధి పొందుతున్నాయి. వరి, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి పంట కోతలకు ఉపయోగించే కొడవళ్లను ఇక్కడ తయారుచేస్తున్నారు. నాణ్యమైన కొడవళ్లు లభ్యం అవుతుండటంతో వాటిని కొనేందుకు వ్యాపారులు, రైతులు పేటేరుకు వస్తుంటారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. ఏటా 20 లక్షల కొడవళ్లు తయారుచేస్తుండగా వ్యవసాయ సీజన్‌లో డిమాండ్‌ను బట్టి ఆర్డర్లు వస్తుంటాయి. ప్రభుత్వం దీన్ని కుటీర పరిశ్రమగా గుర్తించి రాయితీ రుణాలు అందించేలా చూడాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్



దువ్వెనతో సరాగాలు

మనిషి తపనకు సృజనాత్మకత తోడైతే సాధారణ వస్తువులు కూడా అసాధారణ రూపం దాలుస్తాయి. ఝార్ఖండ్‌లోని దేవ్‌ఘర్ జిల్లా బిలాసీ పట్టణానికి చెందిన ధనంజయ్ ఖవాడే దీన్ని నిరూపించారు. తల దువ్వుకునేందుకు వాడే ఓ మామూలు దువ్వెనను ఆయన సంగీత పరికరంగా మార్చేసి సుమధుర సరాగాలు పలికిస్తున్నారు. దువ్వెనపై ఆ చేతి వేళ్లు కదులుతుంటే సరిగమలు పలుకుతున్నాయి. బాల్యంలో తన మావయ్య ఇచ్చిన ప్రేరణతో ధనంజయ్ ఈ సాధన చేసి పట్టు సాధించారు. ఎన్నో ప్రయోగాలు కూడా చేశారు. దేశవ్యాప్తంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. దిగ్గజ గాయకుడు, సంగీత దర్శకుడు కిశోర్‌కుమార్‌తో కలిసి పనిచేసిన ఓ సీనియర్ సంగీత కళాకారుడు ఈ ప్రతిభను చూసి అభినందించారు.

–ఈటీవీ భారత్

ఆలయానికి ముస్లిం వ్యాపారి రూ.కోటి విరాళం



హిందూ ముస్లిం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఘటన ఇది. కర్ణాటకలోని బెంగళూరు దక్షిణ జిల్లా చెన్నపట్టణ మంగళవారపేటలో శ్రీబసవేశ్వర స్వామి ఆలయం ఉంది. దీని జీర్ణోద్ధరణ పనులకు ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ ఉల్లా సఖాఫ్ రూ.కోటి విరాళం ఇచ్చారు. పూర్తిగా తన సొంత ఖర్చుతో పనులన్నీ చేయించారు. మూడు రోజుల క్రితం ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మరోవైపు ఈ ఆలయ విస్తరణకు వీలుగా స్థానికులైన కెంపమ్మ, మోటేగౌడ తమ స్థలం కేటాయించారు. సయ్యద్ ఉల్లా సఖాఫ్ గతంలోనూ మోగేనహళ్లి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి ఆలయాన్ని కట్టించారు. మనం చేసే మంచి పనులతోనే తదుపరి తరాలు బాగుంటాయని, తాను ఈ ఒక్క సిద్ధాంతాన్నే నమ్ముతానని సఖాఫ్ తెలిపారు. –న్యూస్‌టుడే, రామనగర

రోజుకు... రూ. 5.48 ▶ భరోసా 40 లక్షలు!

హోటల్‌కి వెళ్లి... ఓ దోసె తింటే...రూ.60, కాఫీ తాగితే... రూ.20 అవుతుంది. మరి మన జీవితానికి భరోసాకోసం ఎంత ఖర్చవుతుందో తెలుసా... రోజుకు రూ.5.48

. . . .

మన సేవింగ్స్ ఎకౌంట్ ఉన్న బ్యాంకుల్లో ఈ సదుపాయాన్ని పొందొచ్చు. దీనికోసం మనం చేయాల్సింది ... ప్రీమియం మినహాయించుకునేందుకు బ్యాంకుకు అనుమతినివ్వడమే..!

ఓ రోజు సోమయ్య పొలం పని చేస్తుండగా విద్యుదాఘాతంతో మరణించారు. ఇంటి యజమాని ఆకస్మిక మరణంతో రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. అప్పటికే కుదిరిన ఆయన కుమార్తె వివాహం ఆగిపోవడంతో పాటు కుమారుడి చదువు అర్ధంతరంగా నిలిచిపోయింది. బీమా ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదేమోనని, ఆ కుటుంబ సభ్యులు బాధపడని రోజు లేదు. ఎవరి పరిస్థితి ఎప్పుడెలా మారుతుందో చెప్పలేం. మన వారికీ పరిస్థితి రాకుండా ముందే జాగ్రత్త పడదాం. ఇంతకీ పొదుపు (సేవింగ్స్) ఖాతా ఉన్న వారికి బ్యాంకు రూ.40 లక్షల వరకూ ప్రమాద బీమా కల్పిస్తుందని మీకు తెలుసా?

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో పొదుపు ఖాతా ఉన్నవారు ఏడాదికి కేవలం రూ.2 వేల చొప్పున ప్రీమియం చెల్లిస్తే ఏకంగా రూ.40 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగినా... ఆఖరికి పాముకాటుతో మరణించినా బాధితుని నామినీకి ఏకంగా రూ.40 లక్షలను బ్యాంకు నేరుగా చెల్లిస్తుంది. ఈ పథకంలో తమ పేరు చేరాలంటే బ్యాంకుకు వెళ్లి ఖాతాదారుడు తన పొదుపు ఖాతా నుంచి ప్రీమియం సొమ్మును తీసుకోమని బ్యాంకుకు అనుమతినిస్తే సరిపోతుంది. ఎస్‌బీఐతో పాటు ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ వంటి ప్రైవేట్ బ్యాంకులు కూడా ఈ తరహా బీమా పథకాలను ఖాతాదారులకు అమలుచేస్తున్నాయి.

బ్యాంకు ఖాతాదారుల కోసం కొన్ని బీమా పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. వాటిని ప్రతి ఖాతాదారుడికీ వివరించి ప్రీమియం వసూలు చేసి, అమలు చేయాలని కేంద్రం పదే పదే బ్యాంకులకు చెబుతోంది. అవేంటంటే...


ఏటా రూ.20 కట్టినా చాలు...

పీఎం సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై)

18 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్న ఖాతాదారుల కోసం కేంద్రం ఈ పథకాన్ని బ్యాంకుల ద్వారా అమలుచేస్తోంది. పొదుపు ఖాతా నుంచి ఏడాదికి కేవలం రూ.20 తీసుకోమని బ్యాంకులో లేఖ ఇస్తే ఖాతాదారుడికి ప్రమాద, వైకల్య బీమా పరిహారం లభిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణం, రెండు చేతులు, కాళ్లు, కళ్లు పోతే రూ.2 లక్షలు, అవయవాలు పాక్షికంగా దెబ్బతిని దివ్యాంగులైతే రూ.లక్ష పరిహారం ఇస్తారు.

పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)

ఈ పథకం కింద పొదుపు ఖాతాదారులు ఏడాదికి రూ.436 చొప్పున ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల జీవిత బీమా పరిహారం లభిస్తుంది. 18 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుంది. ఏ కారణంతో మరణించినా నామినీకి రూ.2 లక్షలను బ్యాంకు అందజేస్తుంది.



అటల్ పెన్షన్ యోజన

బ్యాంకులో పొదుపు ఖాతా ఉన్న 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు వారికి 60 ఏళ్ల తరవాత కనీస పింఛను ఇవ్వడానికి ఈ పథకాన్ని కేంద్రం అమలుచేస్తోంది. నెలకు రూ.వెయ్యి నుంచి 5 వేల వరకూ పింఛను పొందడానికి నెలనెలా కొంత ప్రీమియం బ్యాంకు ఖాతా నుంచి చెల్లించాలి.

ఉదాహరణకు.. బ్యాంకు ఖాతాదారుడి వయసు 40 ఏళ్లు ఉంటే నెలకు రూ.1,454 చొప్పున చెల్లిస్తే 60 ఏళ్ల వయసు వచ్చినప్పటి నుంచి నెలకు రూ.5 వేల చొప్పున పింఛను ఇస్తారు. ఖాతాదారుడు మరణిస్తే నామినీకి రూ.8.50 లక్షలు చెల్లిస్తారు. ప్రీమియం చెల్లింపు మధ్యకాలంలో ఖాతాదారుడు హఠాత్తుగా మరణిస్తే జీవిత భాగస్వామి మిగిలిన కాలానికి అదే ప్రీమియం కట్టొచ్చు. జీవిత భాగస్వామికి 60 ఏళ్లు రాగానే రూ.5 వేల పింఛను ఇస్తారు. జీవితభాగస్వామి కూడా మరణిస్తే నామినీగా ఉన్నవారికి రూ.8.50 లక్షలు ఇస్తారు. పింఛను నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేలలోపు ఎంత కావాలనేది నిర్ణయించుకుంటే దాని ప్రకారం ప్రీమియం ఉంటుంది.

డెబిట్‌కార్డు బీమా..

ఖాతాదారులకు బ్యాంకులన్నీ డెబిట్ కార్డులిస్తున్నాయి. పరిమితులకు అనుగుణంగా బీమా పరిహారం లభిస్తుంది. ఉదాహరణకు ఎస్‌బీఐ డెబిట్‌కార్డు ప్రపంచ వ్యాప్తంగా వినియోగించే అవకాశముంటే రూ.10 లక్షల ప్రమాదబీమా అందిస్తారు. విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.20 లక్షలు ఇస్తారు.

రూ.1,556లకే రూ.20 లక్షలు..

సహకార బ్యాంకుల్లో రూ.1,556 చెల్లిస్తే రూ.20 లక్షల ప్రమాద బీమా పథకం అమలవుతుంది. గ్రూప్ హెల్త్ షీల్డ్ (జీహెచ్‌ఎస్) కోసం ఖాతాదారుడు, నామినీల వ్యక్తిగత వివరాలతో దరఖాస్తు నింపి ఇవ్వవచ్చు. ఏటా ప్రీమియం కట్టే తేదీ నాటికి పొదుపు ఖాతాలో రూ.1,556ల నగదు నిల్వ ఉంచుకోవాలి. బ్యాంకు ఆ సొమ్మును తీసుకొని బీమా పథకం కింద ఖాతాదారుడి పేరు చేరుస్తారు. డెంగీ వంటి జ్వరాల బారిన పడి ఆసుపత్రిలో చేరితే వైద్య ఖర్చుల కోసం రోజుకు రూ.10 వేల చొప్పున బ్యాంకు చెల్లిస్తుంది. ● పంజాబ్ నేషనల్ బ్యాంకు ఖాతాదారులకు జీవిత, ప్రమాద బీమా పథకాలను అమలుచేస్తోంది. ఏ వయసు వారికి ఎంత ప్రీమియం చెల్లించాలనేది బ్యాంకుకు వెళ్లినప్పుడు ఖాతాదారులు అడిగి తెలుసుకోవచ్చు.

- ఈనాడు, హైదరాబాద్

అమ్మకు మనసెలా ఒప్పిందో!

- పేడదిబ్బలో పురిటి బిడ్డ
- చిత్తూరు జిల్లాలో అమానవీయ ఘటన



ఎర్రంవారిపల్లె సమీపంలో దొరికిన శిశువు

పుట్టగానే.. నీ చేతుల స్పర్శకు పులకించాలనుకున్నా. నీ ఒడిలో చేరి.. జోలపాట మాధుర్యాన్ని ఆస్వాదించాలనుకున్నా. నా ప్రతి క్షణాన్నీ నీతో గడపాలనుకున్నా. నా లేలేత బుగ్గలు నిమురుతూ.. నాపై కొండంత ప్రేమను కురిపిస్తావనుకున్నా. నేను భూమ్మీద పడగానే ఎందుకమ్మా పేడదిబ్బలో వేశావ్? ఎందుకమ్మా... నీ మమకారాన్ని చంపుకోవాలనుకున్నావ్?


సోమల, న్యూస్‌టుడే: అప్పుడే పుట్టిన ఆడబిడ్డను పేడదిబ్బలో పడేసి వెళ్లిపోయిందో తల్లి. ఈ విషాద ఘటన చిత్తూరు జిల్లా సోమల మండలం ఎస్.నడింపల్లె పంచాయతీ ఎర్రంవారిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... చంద్రకళ అనే గిరిజన మహిళ మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని అటుగా వెళ్తుండగా పేడదిబ్బలో పురిటి బిడ్డ ఏడుపు వినిపించింది. వెళ్లి చూడగా అప్పుడే పుట్టిన ఆడబిడ్డ రక్తపు మడుగులో కనిపించింది. చంద్రకళ శిశువును ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించారు. స్థానిక ఏఎన్ఎం సరస్వతి, మహిళా పోలీస్ గౌతమి, అంగన్‌వాడీ కార్యకర్త రెడ్డికుమారి, ఆశా కార్యకర్త జానకిరాణిల సహాయంతో శిశువును సోమల పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు హరిత 108 వాహనంలో బుజ్జాయిని చిత్తూరులోని శిశువిహార్‌కు తీసుకెళ్లారు.



చిన్నారిని 108 వాహనంలో చిత్తూరు శిశువిహార్‌కు తీసుకెళ్తున్న ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు హరిత, వైద్యసిబ్బంది తదితరులు

భాజపా, ఆర్జేడీ హోరాహోరీ!

- తిర్హుత్ ప్రాంతంలో ఈ 2 పార్టీలే ప్రధాన ప్రత్యర్థులు
- మిగిలిన పార్టీల పోటీ తక్కువే..



బిహార్‌లో ఉత్తరాన, నేపాల్ సరిహద్దుల్లో ఉన్న తిర్హుత్ ప్రాంతంలోని చాలా నియోజకవర్గాల్లో భాజపా, ఆర్జేడీ మధ్యే హోరాహోరీ పోరు సాగుతోంది. ఎక్కువ సీట్లలో ఈ రెండు ప్రధాన పార్టీలే బరిలో నిలుస్తాయి. మిగిలిన పార్టీలు పెద్దగా పోటీలో ఉండవు. ఈ ప్రాంతంలోని 6 జిల్లాల్లో 49 నియోజకవర్గాలున్నాయి. ఇందులో ఈస్ట్ చంపారణ్‌లో అత్యధికంగా 12 ఉన్నాయి. ముజఫర్‌పుర్‌లో 11, వెస్ట్ చంపారణలో 9, వైశాలీ, సీతామడీలలో 8 చొప్పున, శివ్‌హర్‌లో ఒక సీటున్నాయి.

గత ఎన్నికల్లో..

2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో 33 సీట్లను ఎన్డీయే కూటమి గెలుచుకుంది. అందులో 25 సీట్లు భాజపాకే దక్కాయి. మహాగఠ్‌బంధన్ 18 సీట్లలోనే విజయం సాధించింది. అందులో 13 ఆర్జేడీకే దక్కాయి.

- 2015లో ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయగా.. మహాగఠ్‌బంధన్ 26 చోట్ల గెలిచింది. ఎన్డీయే 20 చోట్ల నెగ్గింది.
- ఈసారీ భాజపా, ఆర్జేడీలే అధిక సీట్లలో ఇక్కడ తలపడుతున్నాయి.

కీలక నియోజకవర్గాలు..

తిర్హుత్ ప్రాంతంలో తేజస్వీ పోటీ చేసే రాఘోపుర్‌తో పాటు మహువా, నౌతన్, బేతియా, శివ్‌హర్ వంటి కీలక నియోజకవర్గాలున్నాయి. లాలూ ఇద్దరు కుమారులు తేజస్వీ, తేజ్ ప్రతాప్ ఈ ప్రాంతంలోనే పోటీలో ఉన్నారు. అయితే ఇద్దరూ వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేస్తున్నారు. వివాదాస్పద నేత షాబుద్దీన్ కుమారుడు ఒసామా షాబుద్దీన్ కూడా ఇక్కడే బరిలో ఉన్నారు. భాజపా కీలక నేత సామ్రాట్ చౌధరీ ఇక్కడే పోటీ చేస్తున్నారు.

- ఈస్ట్, వెస్ట్ చంపారణ్ జిల్లాల్లో ఎన్డీయే బలంగా ఉంది. అందులోనూ భాజపాకు మద్దతు అధికంగా ఉంటుంది. ముజఫర్‌పుర్‌లో ఓబీసీ అనుబంధ పార్టీలు బలంగా ఉంటాయి. ఆర్జేడీకి మొగ్గు ఉంటుంది.



యువతలో తీవ్ర అసంతృప్తి

నేపాల్ సరిహద్దుల్లో ఉన్న సీతామడీ జిల్లాలోని యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. చాలా మంది అక్కడి నుంచి పొరుగునే ఉన్న నేపాల్ వెళ్లి చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. సీతామడీలో ఎక్కువ మంది యువ ఓటర్లున్నారు. వారిలో ఎక్కువ మంది ప్రభుత్వం మారాలనే కోరుకుంటున్నారు. అయితే ఎన్నికల తర్వాతా బిహార్‌లో పెద్దగా మార్పులు వస్తాయనే ఆశ వారిలో లేదు. వలసలే బిహార్‌కు అతి పెద్ద సమస్యని, దానిని అరికట్టడానికి అవకాశాలు తక్కువని ఈ ప్రాంత యువత అభిప్రాయపడుతున్నారు.

- మహిళల్లో మాత్రం ఎన్డీయే పట్ల ఆదరణ కనిపిస్తోంది. వారి ఖాతాల్లో నేరుగా నగదు బదిలీ చేయడం ప్రభావితం చూపుతుందని అంటున్నారు. వారిలో ఎక్కువ మంది నీతీశ్‌వైపే ఉన్నారని చెబుతున్నారు.
- ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నా ఈ ప్రాంతంలో కుల సమీకరణాలూ ప్రభావితం చేస్తుంటాయి. యువత కూడా మార్పు కోరుతున్నారుగానీ అది ఎంతవరకు ఫలితమిస్తుందో చూడాలి.
- నీతీశ్ వయసుపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆయన వైదొలగి యువకులకు అవకాశం ఇవ్వాలని కొంత మంది కోరుకుంటున్నారు. కుల సమీకరణాలవల్ల ఎన్నికల ఫలితాలు ప్రభావితం అవుతుండటంపట్ల యువత అసంతృప్తితో ఉన్నారు.

అభ్యర్థులపై వ్యతిరేకత

ఈసారి రెండు కూటములు నిలిపిన అభ్యర్థులపై తిర్హుత్‌లో వ్యతిరేకత ఉంది. ముఖ్యంగా యువ ఓటర్లు అభ్యర్థులను అంగీకరించడం లేదు. కొంత మంది అభ్యర్థులు ఒక్కసారి కూడా తమ ప్రాంతాలకు రాలేదని పలువురు తెలిపారు.

- నేషనల్ డెస్క్

పదవీవిరమణ ప్రయోజనాల చెల్లింపులో జాప్యమేంటి?

- కేడీసీసీ బ్యాంక్‌ను తప్పుబట్టిన హైకోర్టు
- టెర్మినల్ ప్రయోజనాలు ఉద్యోగులకు దాతృత్వంతో ఇచ్చేవి కాదు
- పిటిషనర్లకు 10 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: పదవీ విరమణ తర్వాత ఉద్యోగులకు అంతిమ ప్రయోజనాలు (టెర్మినల్ బెనిఫిట్స్) చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీబీ) పరిధిలోని పెనమలూరు, తదితర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పెయిడ్ సెక్రటరీలుగా పనిచేసి పదవీవిరమణ చేసిన 70-90 ఏళ్ల వయసున్న వయోవృద్ధులు నలుగురికి ఇప్పటికీ టెర్మినల్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ప్రయోజనాలను ఎట్టి పరిస్థితుల్లో నిలిపి ఉంచడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఈ ప్రయోజనాలు ఉద్యోగులకు దాతృత్వంతో ఇచ్చేవి కాదని, అవి పొందడం వారి హక్కని స్పష్టం చేసింది. యజమాని సకాలంలో టెర్మినల్ ప్రయోజనాలు చెల్లించడంలో విఫలమైతే 10% వడ్డీతో రాబట్టుకునే అధికారం ఉద్యోగులకు ఉందని పేర్కొంది. పీఏసీఎస్‌ల ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో అవి వాటాను చెల్లించలేకపోయాయని, దీంతో టెర్మినల్ ప్రయోజనాలను ఇవ్వలేకపోయామన్న కేడీసీసీబీ, పీఏసీఎస్‌ల వాదనలను తోసిపుచ్చింది. ఉద్యోగ విరమణ చేసి 14 ఏళ్లు దాటినా వారికి రావాల్సిన మొత్తాల్ని చెల్లించకపోవడం చట్టవిరుద్ధమని, రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను అధికారులు ఉల్లంఘించారని తేల్చిచెప్పింది. పిటిషనర్లకు టెర్మినల్ ప్రయోజనాలను 10 శాతం వడ్డీతో 8 వారాల్లో చెల్లించాలని కేడీసీసీ బ్యాంక్ ఉన్నతాధికారులను ఆదేశించింది. పిటిషనర్లకు రూ.10 వేల చొప్పున ఖర్చులు చెల్లించాలని ప్రతివాదులకు ఆదేశాలిచ్చింది. పిటిషనర్లకు ప్రయోజనాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా ఉందని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

పుష్కరకాలం దాటినా ఇవ్వలేదు

కేడీసీసీ బ్యాంక్ పరిధిలోని పెనమలూరు, అవిడిరావులపాడు, తక్కెళ్లపాడు, పెదకళ్లేపల్లి పీఏసీఎస్‌లలో పెయిడ్ సెక్రటరీలుగా పనిచేసిన సీహెచ్ భారతరావు, చంద్రమౌళీశ్వరరావు, శివరామకృష్ణప్రసాద్, సాయిబాబు 2009, 2011, 2010, 2013ల్లో పదవీ విరమణ చేశారు. వారికి టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లించకపోవడంతో 2016లో హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. వారి తరఫున న్యాయవాది పీటా రామన్ వాదనలు వినిపించారు. పీఏసీఎస్‌ల వాటాలు చెల్లించకపోవడంతో టెర్మినల్ ప్రయోజనాలు చెల్లించలేకపోయామని కేడీసీసీ బ్యాంక్ అధికారులు చెప్పడం చట్ట విరుద్ధమన్నారు. పుష్కరకాలం దాటిపోయినా ప్రయోజనాలు చెల్లించలేదని చెప్పారు. పిటిషనర్లు వయోభారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పదవీ విరమణ ప్రయోజనాలను వారికి వెంటనే అందించాలని ఆదేశించారు.

సమాజంలో వృద్ధులపట్ల గౌరవం తగ్గిపోతోంది

పిటిషనర్లందరూ వయోవృద్ధులయ్యారని, ఈ వయసులో వారు అనారోగ్య సమస్యలతో ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారని హైకోర్టు పేర్కొంది. జీవితం చివరి దశలో హక్కుల సాధన కోసం, పదవీ విరమణ ప్రయోజనాల కోసం వయోవృద్ధులు హైకోర్టు తలుపులు తడుతున్న సందర్భాలను ఎన్నో చూస్తున్నామని గుర్తుచేసింది. వృద్ధుల పట్ల గౌరవ మర్యాదలు చూపించే సంప్రదాయాలు, నైతిక, సాంస్కృతిక విలువలు సమాజంలో కాలక్రమేణా తగ్గిపోతుండటం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేసింది.

బాలికలతో కాళ్లు నొక్కించుకున్న ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు) ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తూ సీతంపేట ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఈనాడులో 'టీచరమ్మా ఇది తగునా..!' శీర్షికతో వార్త రాగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన చర్యలు తీసుకున్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న వై.సుజాత విద్యార్థులతో సేవలు చేయించుకోవడంతో పాటు నిబంధనలకు వ్యతిరేకంగా మొబైల్ వినియోగించడంపై పీవోకు గతనెల 23న ఫిర్యాదు అందింది. దీనిపై అధికారులు 24న మెమో జారీ చేశారు. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతోపాటు, మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తను పరిగణనలోకి తీసుకున్న పీవో చర్యలు చేపట్టారు.

సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురు నిందితులపై కాల్పులు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తమిళనాడులో కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు కోయంబత్తూరు పోలీసు కమిషనర్ శరవణ సుందర్ తెలిపారు. 'కోయంబత్తూరు విమానాశ్రయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై దర్యాప్తునకు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. నిందితులు తుడియలూరు వద్ద వెళ్లలూరులో దాక్కునట్లు తెలిసింది. అక్కడికెళ్లి అరెస్టు చేయడానికి ప్రయత్నించగా పోలీసులపై దాడిచేసి తప్పించుకోవాలని చూశారు. పోలీసులు నిందితుల కాళ్లపై కాల్పులు జరపడంతో వారు గాయపడ్డారు. అనంతరం వారిని అరెస్టు చేశారు. ప్రస్తుతం నిందితులు, గాయపడిన పోలీసులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితులు సతీశ్ (30), అతడి తమ్ముడు కాళీశ్వరన్ (21), బంధువు తవసి (20) భవన నిర్మాణం, చెట్లు నరికే పనులు చేస్తుంటారు. ఓ దొంగతనం కేసులో ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. ముగ్గురూ మద్యం మత్తులో ఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె ప్రియుడిపై కొడవలితో దాడి చేసి కారు అద్దాలను పగలగొట్టారు' అని పోలీసు కమిషనర్ వివరించారు.

రైలులో పురిటి నొప్పులు

ప్రయాణికుల సాయంతో మహిళ ప్రసవం



108 వాహనంలో తల్లీబిడ్డలను ఆసుపత్రికి తరలిస్తున్న రైల్వే సిబ్బంది

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం ఓ మహిళ ప్రసవించి పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గర్భిణి సునిక ఛత్తర్.. భర్తతో కలిసి భువనేశ్వర్ వెళ్లేందుకు అనంతపురం జిల్లా గుత్తిలో రైలు ఎక్కారు. మార్గమధ్యలో ఆమెకు నొప్పులు మొదలయ్యాయి. తోటి ప్రయాణికుల సాయంతో రైలులోనే సునిక మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ మేరకు రైల్వే అధికారులకు ప్రయాణికులు సమాచారం అందించారు. రైలు అనకాపల్లి స్టేషన్‌కు చేరుకోగానే అప్పటికే ఆర్పీఎఫ్ ఏఎస్సై టి.వెంకటనాయుడు ఆధ్వర్యంలో సిద్ధంగా ఉన్న పోలీసులు, వైద్య సిబ్బంది.. తల్లీబిడ్డలను 108 వాహనంలో అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. సునిక ఛత్తర్‌కు ఏడో నెలకే కాన్పు అయిందని, ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

మోసపోయి.. బిడ్డను కన్న బాలిక

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కంభంవారిపల్లె, న్యూస్‌టుడే: అభమూశుభమూ తెలియని బాలిక.. ఒకరి చేతిలో మోసపోయి గర్భం దాల్చింది. సోమవారం రాత్రి మగబిడ్డను ప్రసవించింది. అన్నమయ్య జిల్లాలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. సుండుపల్లె మండలానికి చెందిన బాలిక తల్లిదండ్రులు మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం విదేశానికి వెళ్లారు. బాలిక కంభంవారిపల్లె మండలంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ పీలేరులో చదువుకుంటోంది. కళాశాలకు రాకపోకలు సాగిస్తున్న బాలికను.. ఓ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.వి.పల్లె పంచాయతీ అగ్గివారిపల్లెకు చెందిన దినేశ్ పరిచయం చేసుకున్నాడు. మాయమాటలు చెప్పి మోసగించాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. బాధితురాలు.. రెండు నెలల కిందట వేరే గ్రామంలోని పెద్దమ్మ వద్దకు వెళ్లి, అక్కడే ఉంటోంది. సోమవారం సాయంత్రం కడుపు నొప్పి అని చెప్పడంతో బాలికను సుండుపల్లె పీహెచ్‌సీకి పెద్దమ్మ తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి, బాలికకు పురిటి నొప్పులు వచ్చాయని చెప్పి ప్రసవం చేశారు. మగ బిడ్డ పుట్టాడు. బాలిక పెద్దమ్మ ఫిర్యాదు మేరకు దినేశ్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

హైవేపై వ్యాన్, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీ

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారి కూడలిలో మంగళవారం తెల్లవారుజామున జబ్బార్ ట్రావెల్స్ బస్సు ముందు వెళుతున్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో బస్సులోని మహిళ మృతిచెందారు. జబ్బార్ ట్రావెల్స్ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 30 మంది ప్రయాణికులతో బయలుదేరింది. దామాజిపల్లి సమీపంలోకి రాగానే కూడలిలో వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న బస్సు దాన్ని ఢీకొట్టి, అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న సురక్ష(32), మీనజ్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురక్ష మృతి చెందారు. మీనజ్‌ను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సురక్ష ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, భర్త ఈవీ వినీత్ హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సురక్ష వర్క్ ఫ్రం హోమ్‌లో ఉన్నారు. భర్త, మూడేళ్ల కుమార్తెతో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలం నుంచి బస్సును తొలగించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని, సురక్ష భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



బోల్తా పడిన బస్సు



సురక్ష



తీవ్రంగా గాయపడిన మీనజ్

చదవలేక పోతున్నా.. మార్కులు రావడం లేదు!

మనోవేదనతో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



కార్తీక్

తుని, న్యూస్‌టుడే: చదవలేక పోతున్నాననే మనోవేదనతో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఉదంతం కాకినాడ జిల్లాలో చోటుచేసుకుంది. తుని మండలం లోవకొత్తూరు పంచాయతీ సీతయ్యపేటకు చెందిన కొండ్ర కార్తీక్(15) తునిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు రాత్రి వేళల్లో పాఠశాలలోనే ఉండి చదువుకునేలా వసతి ఏర్పాట్లుచేశారు. మేడపైన వసతిగృహం గదిలో సోమవారం రాత్రి 9 గంటలప్పుడు ఫ్యాన్‌కు కార్తీక్ ఉరేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన విద్యార్థులు, వార్డెన్.. కార్తీక్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు చెప్పారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు రమణమ్మ, శ్రీను కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. తాను సరిగా చదవలేకపోతున్నానని, మార్కులు రావడం లేదని కార్తీక్ తరచూ బాధపడేవాడని శ్రీను చెప్పారు.

కళాశాల పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య



రుద్రమూర్తి

చిత్తూరు (నేరవార్తలు), తిరుచానూరు, న్యూస్‌టుడే: కళాశాల భవనం పైనుంచి దూకి ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చిత్తూరులో చోటుచేసుకుంది. కొంగారెడ్డిపల్లికి చెందిన శశికుమార్, తులసిల కుమారుడు రుద్రమూర్తి(19) మురకంబట్టులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మూడో అంతస్తుపైకి వెళ్లి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు ప్రేమ వ్యవహారమే కారణమని కళాశాల యాజమాన్యం, పోలీసులు చెబుతున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు కళాశాల వద్దకు చేరుకుని విలపించారు. కళాశాల లోపలికి ఎవరినీ రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. రుద్రమూర్తి పిన్ని ధనలక్ష్మి లోపలికి వెళ్లబోగా చిత్తూరు సీఐ నిత్యబాబు ఆమెను నెట్టేయడంతో కిందపడిపోయారు. కళాశాల ఆస్తులను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా సీఐ అడ్డుకున్నారని ఈ క్రమంలో ధనలక్ష్మి పడిపోయినట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు.



సీఐ నిత్యబాబు నెట్టడంతో కిందపడిపోయిన ధనలక్ష్మి

మరో విద్యార్థి బలవన్మరణం: తిరుపతి-రేణిగుంట మార్గంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుంటున్న చందు(20) ఆత్మహత్య చేసుకున్నాడు. చందుది నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట. అతను మంగళవారం కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం కళాశాల భవనంపైకి వెళ్లి అక్కడ ఉరివేసుకున్నాడు. చందు మరణానికి కారణం ప్రేమ వ్యవహారమా? మరేదైనా ఉందా? అనే కోణంలో తిరుచానూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు కొడతారనే భయంతో డ్రైవర్ బలవన్మరణం



మల్లికార్జున

చక్రాయపేట, న్యూస్‌టుడే: పోలీసులకు తన జీపు తగిలి గాయాలుకావడంతో స్టేషన్‌కు తీసుకెళ్లి కొడతారేమోననే భయంతో డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈఘటన వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండలంలో మంగళవారం జరిగింది. సురభి గ్రామం కుప్పగుట్టపల్లెకు చెందిన మల్లికార్జున(49) జీపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి చక్రాయపేట సమీపంలోని ఓ పెట్రోలు బంకువద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. వేంపల్లె నుంచి వస్తున్న మల్లికార్జున జీపును ఆపకుండా వెళ్లారు. ఈ క్రమంలో పోలీస్ సిబ్బంది ఇద్దరు జీపు తాకి గాయపడ్డారు. మంగళవారం ఉదయానికి మల్లికార్జున భయపడి తన గ్రామంలో విషం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆయనను బంధువులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయారు.

EENADU Vol: 52, Issue: 85 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

వాట్సప్‌నకు కాస్త ఊరట

సీసీఐ నిషేధాజ్ఞల్లో కొంత భాగాన్ని పక్కనపెట్టిన ఎన్‌సీఎల్ఏటీ

దిల్లీ: వాట్సప్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జారీ చేసిన నిషేధాజ్ఞల్లో కొంత భాగాన్ని అప్పిలేట్ ట్రైబ్యునల్ అయిన ఎన్‌సీఎల్ఏటీ పక్కనపెట్టింది. దీంతో వాట్సప్‌కు కొంత ఊరట లభించినట్లయింది. 2024 నవంబరు 18న సీసీఐ జారీ చేసిన ఆదేశాల్లో ఎన్‌సీఎల్ఏటీ మార్పు చేసింది. 158 పేజీల ఆదేశాల్లోని రూ.213 కోట్ల పెనాల్టీని, మిగతా ఆదేశాలను కొనసాగించింది. 'ఈ ఆదేశాలు అందిన అయిదేళ్ల కాలం పాటు ఇతర డేటా కంపెనీలు లేదా వ్యాపార ప్రకటనల అవసరాల కోసం తన వినియోగదార్ల డేటాను వాట్సప్ పంచుకోరాదంటూ తెలిపే 247.1 పేరాగ్రాఫ్‌ను పక్కన పెట్టాల'ని చైర్‌పర్సన్ జస్టిస్ అశోక్‌భూషణ్, సభ్యులు అరుణ్ బరోకాలతో కూడిన ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ తన మౌలిక ఆదేశాల్లో పేర్కొంది. దీనికి సంబంధించి సవివర ఆదేశాలు రావాల్సి ఉంది. ఎన్‌సీఎల్ఏటీ ఆదేశాల్ని మెటా ప్రతినిధి స్వాగతిస్తూ 'మేం ఈ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నామ'ని అన్నారు.

హ్యుందాయ్ వెన్యూలో కొత్త వెర్షన్



దిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా, తన కాంపాక్ట్ ఎస్‌యూవీ వెన్యూలో కొత్త వెర్షన్‌ను మంగళవారం విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.7.89 లక్షలు (ఎక్స్-షోరూమ్). పెట్రోల్, డీజిల్ రకాల్లో మాన్యువల్, ఆటోమేటిక్ పవర్‌ట్రెయిన్స్‌లో ఈ కార్లు లభ్యమవుతాయి.

విజయ డయాగ్నొస్టిక్ లాభం రూ.43 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: విజయ డయాగ్నొస్టిక్ సెంటర్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.201.56 కోట్ల ఆదాయం, రూ.43.28 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.182.95 కోట్లు, నికర లాభం రూ.42.12 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ఈసారి ఆదాయం 10.2%, నికరలాభం 2.7% పెరిగాయి. స్థిరమైన ఆదాయాలు సాధిస్తున్నట్లు సంస్థ ఎండీ, సీఈఓ సుప్రితా రెడ్డి వివరించారు. మెడినోవా డయాగ్నొస్టిక్ సర్వీసెస్ లిమిటెడ్‌ను తమ సంస్థలో విలీనం చేయడానికి ఎన్‌సీఎల్‌టీ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు.

ఏఐ చిప్స్ కోసం ఇజ్రాయెల్ కంపెనీతో బ్లూక్లౌడ్ సాఫ్టెక్ ఒప్పందం

హైదరాబాద్: పారిశ్రామిక, రక్షణ, ఏఐఓటీ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆఫ్ థింగ్స్) అప్లికేషన్ల కోసం అధునాతన ఏఐ చిప్‌సెట్ల తయారీకి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి ఇజ్రాయెల్ కంపెనీతో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్లూక్లౌడ్ సాఫ్టెక్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు కావాల్సిన ప్రధాన హార్డ్‌వేర్ ఆర్కిటెక్చర్, రిఫరెన్స్ డిజైన్‌ను ఇజ్రాయెల్ సంస్థ అందిస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్ పూర్తిస్థాయి స్టాక్‌ను బ్లూక్లౌడ్ కలిగి ఉంటుంది. భారత్‌లో దీనికి సంబంధించి మేధో హక్కులు కూడా బ్లూక్లౌడ్‌కే ఉంటాయి. దేశీయంగా ప్రోడక్ట్ అభివృద్ధి, తయారీ జరిగేందుకు వీలుగా అయిదేళ్ల కాలానికి ఈ ఒప్పందం ఉందని బ్లూక్లౌడ్ ఛైర్మన్ జానకి యార్లగడ్డ తెలిపారు. ఇందుకు 15 కోట్ల డాలర్లు (రూ.1300 కోట్లకు పైగా) చెల్లిస్తున్నట్లు వివరించారు.

కోడి గుడ్లు

5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	570
వరంగల్	572
విజయవాడ	575
తూ/ప గోదావరి	585
విశాఖపట్నం	570
చిత్తూరు	603

రూ.100 లక్షల కోట్లకు ఎస్‌బీఐ వ్యాపారం



- ప్రపంచంలోనే 43వ స్థానం
- 23,050 శాఖలు.. మార్చిలోపు మరో 500
- బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మొత్తం వ్యాపారం రూ.100 లక్షల కోట్ల మైలురాయికి చేరింది. ఆస్తుల పరంగా ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంక్‌గా ఎస్‌బీఐ నిలిచిందని బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలను వెల్లడిస్తూ, ఆయన ఈ వివరాలు తెలిపారు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు, వడ్డీరేట్లపై ఆర్‌బీఐ నిర్ణయాల కారణంగా 2025-26లో రుణాల వృద్ధి లక్ష్యాన్ని 11% నుంచి 12-14 శాతానికి సవరించాం. జీఎస్‌టీ రేట్ల కోత తర్వాత రుణాలు అద్భుతంగా పుంజుకున్నాయని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3% నికర వడ్డీ మార్జిన్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అమెరికా టారీఫ్‌ల ప్రభావంపై ప్రస్తుత త్రైమాసికంలో స్పష్టత వస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం ఎస్‌బీఐకు 23,050 శాఖలుండగా, 2025-26లో మరో 500 ప్రారంభిస్తామని శెట్టి పేర్కొన్నారు.

సెప్టెంబరు త్రైమాసిక లాభం రూ.21,137 కోట్లు: ఎస్‌బీఐ, జులై- సెప్టెంబరులో రూ.21,137 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.19,743 కోట్లతో పోలిస్తే, ఇది 6.84% ఎక్కువ. యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయం ద్వారా రూ.4,593 కోట్లు ఆర్జించడం ఇందుకు ఉపకరించింది. మొత్తం ఆదాయం రూ.1,63,802 కోట్ల నుంచి రూ.1,75,898 కోట్లకు చేరింది.

✦ స్టాండలోన్ ప్రాతిపదికన.. బ్యాంక్ నికరలాభం రూ.18,331 కోట్ల నుంచి 10% అధికమై రూ.20,160 కోట్లకు చేరింది. మొత్తం స్టాండలోన్ ఆదాయం రూ.1,29,141 కోట్ల నుంచి రూ.1,34,979 కోట్లకు వృద్ధి చెందింది. ఇందులో వడ్డీ ఆదాయం రూ.1,13,871 కోట్ల నుంచి రూ.1,19,654 కోట్లకు పెరిగింది. రుణాలు 12.73% పెరిగాయి. కీలక నికర వడ్డీ ఆదాయం 3.28% అధికమై రూ.42,984 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ 2.97 శాతంగా నమోదైంది.

✦ ఆస్తుల నాణ్యత చూస్తే.. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2.13% నుంచి 1.73 శాతానికి పరిమితమయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు 0.53% నుంచి 0.42 శాతానికి తగ్గాయి. అయితే మొత్తం కేటాయింపులు రూ.4505 కోట్ల నుంచి రూ.5400 కోట్లకు పెరిగాయి.

ఇండిగోకు రూ.2,582 కోట్ల నష్టం

దిల్లీ: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.2,582.10 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. విదేశీ మారకపు నష్టాలు, వ్యయాలు ఇందుకు నేపథ్యం. 2024-25 ఇదే త్రైమాసికంలో నష్టం రూ.986.7 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం మాత్రం రూ.17,759 కోట్ల నుంచి రూ.19,599.5 కోట్లకు పెరిగింది. కరెన్సీ విలువ ప్రభావాన్ని లెక్కలోకి తీసుకోకపోతే, సమీక్షా త్రైమాసికంలో రూ.103.9 కోట్ల లాభం నమోదై ఉండేదని ఇండిగో తెలిపింది. 2024 సెప్టెంబరు త్రైమాసిక నష్టం కూడా రూ.753.9 కోట్లకు పరిమితమై ఉండేదని వివరించింది. సరైన చర్యల వల్లే కంపెనీ ఆదాయం 10% వృద్ధి చెందిందని కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. లాంగ్ రేంజ్ (సుదూర ప్రయాణానికి అక్కరకొచ్చే) ఎయిర్‌బస్ ఏ321 ఎక్స్ఎల్ఆర్ విమానం వచ్చే నెలలో తమకు చేరొచ్చని కంపెనీ అంచనా వేస్తోంది.

48 గంటల్లోగా రద్దు చేసుకుంటే రుసుములుండవ్!



విమాన టికెట్లపై డీజీసీఏ ప్రతిపాదన

ఈనాడు వాణిజ్య విభాగం: విమాన టికెట్ల బుకింగ్, రిఫండ్‌లకు సంబంధించి వినియోగదారులకు మేలు చేసే పలు చర్యలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రతిపాదించింది. టికెట్ బుక్ చేసుకున్న 48 గంటల్లోగా, ఎటువంటి అదనపు ఛార్జీ లేకుండా టికెట్ రద్దు చేసుకోవడం లేదా మార్పులు చేసుకోవడానికి వీలుగా లుక్- ఇన్ విండో తీసుకురావాలన్నది ఇందులో ప్రధానమైనది. ఇంకా పలు అంశాలనూ ప్రతిపాదించింది. వీటిపై ఈనెల 30లోగా స్పందనలు తెలియజేయాల్సిందిగా సంబంధిత వర్గాలను డీజీసీఏ కోరింది. ఆ తర్వాత తుది విధానాన్ని ప్రకటించనుంది. ప్రయాణాన్ని రద్దు చేస్తున్నప్పుడు - ప్రయాణం రద్దయినప్పుడు రిఫండ్‌ల ప్రక్రియ నిర్దేశిత సమయంలో, క్యాన్సిల్ చేసుకున్న టికెట్లపై విమానయాన సంస్థలు వసూలు చేసే మొత్తానికి పరిమితి, రిఫండ్ విధానాల్లో మరింత పారదర్శకత తేవడమే లక్ష్యంగా డీజీసీఏ ప్రతిపాదనలున్నాయి.

ముఖ్య ప్రతిపాదనలు..

✦ టికెట్ బుక్ చేసుకున్న 48 గంటల పాటు 'లుక్- ఇన్ ఆప్షన్'ను సంస్థలు అందించాలి. ఈ సమయంలో ప్రయాణికులు ఎటువంటి ఛార్జీ లేకుండా టికెట్ రద్దు లేదా మార్పులు చేసుకోవచ్చు. అయితే కొత్తగా దీలో ఉన్న టికెట్ ధరలో మార్పులుంటే, ఆ మేరకు చెల్లింపులు జరపాల్సి ఉంటుంది.

✦ అయితే కంపెనీ వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్ బుక్ చేసుకుంటే.. దేశీయ విమానాల్లో ప్రయాణానికి 5 రోజులు, అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణానికి 15 రోజుల్లోపు ఈ లుక్-ఇన్ విండో సౌకర్యం లభించదు. టికెట్ బుక్ చేసుకున్న 48 గంటల తర్వాత కనుక, ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలనుకుంటే క్యాన్సిలేషన్ ఛార్జీలను ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది.

✦ టికెట్ బుక్ చేసుకున్న 24 గంటల్లోగా ప్రయాణికుల పేర్లలో తప్పులు సరిచేసుకోవచ్చు.

✦ క్రెడిట్ కార్డు చెల్లింపుల ద్వారా టికెట్ బుక్ చేసుకున్నవారు, టికెట్ రద్దు చేసుకుంటే.. 7 రోజుల్లోగా రిఫండ్ మొత్తాన్ని క్రెడిట్ కార్డుదారుడి ఖాతాలో జమ చేయాలి. నగదు లావాదేవీలైతే, కంపెనీ కార్యాలయం లేదా టికెట్ కొనుగోలు చేసిన దగ్గర తక్షణం రిఫండ్ ఇవ్వాలి.

✦ ట్రావెల్ ఏజెంట్/ పోర్టల్ ద్వారా టికెట్ కొనుగోలు చేస్తే రిఫండ్‌ను విమానయాన సంస్థలు 21 పనిదినాల్లోగా పూర్తి చేయాలి.


✦ టికెట్లు రద్దు లేదా వినియోగించని పక్షంలో యూడీఎఫ్, ఏడీఎఫ్/పీఎస్ఎఫ్ వంటి పన్నులు, ఫీజులను పూర్తిగా వెనక్కి ఇవ్వాలి.

✦ వైద్య అత్యవసర పరిస్థితుల కారణంగా టికెట్‌ను రద్దు చేసుకుంటే రిఫండ్ అందించాలి.

టాటా ట్రస్ట్స్ నుంచి వైదొలగిన మెహ్లీ మిస్త్రీ

ముంబయి: టాటా ట్రస్ట్స్ నుంచి వైదొలగుతున్నట్లు మెహ్లీ మిస్త్రీ మంగళవారం ప్రకటించారు. టాటా ట్రస్ట్స్‌లో తనను పునర్ నియమించకపోవడంపై మహారాష్ట్రలో ట్రస్టుల కార్యకలాపాలను పర్యవేక్షించే, ఛారిటీ కమిషనర్ వద్ద మెహ్లీ మిస్త్రీ సవాలు చేశారని వార్తలు వచ్చిన నేపథ్యంలో, తాజాగా ఆయన ఈ ప్రకటన చేశారు. అక్టోబరు 28న ట్రస్టీగా మెహ్లీ నియామకాన్ని పునరుద్ధరించడానికి టాటా ట్రస్ట్స్ నిరాకరించాక ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. టాటా ట్రస్ట్స్ గౌరవానికి భంగం వాటిల్లకుండా, తాను తప్పుకుంటున్నట్లు మెహ్లీ వివరించారు.

హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ కన్నుమూత



లండన్: అంతర్జాతీయంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందుజా (85) లండన్‌లో కన్నుమూశారు. వ్యాపార వర్గాల్లో 'జీపీ'గా ప్రఖ్యాతులైన ఆయన, అనారోగ్యంతో గత కొన్ని వారాలుగా లండన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సన్నిహితులు వెల్లడించారు. ఈయన 1940లో జన్మించారు. నలుగురు హిందుజా సోదరుల్లో ఆయన రెండో వారు. హిందుజా గ్రూప్ ప్రస్తుతం వాహన, ఇంధన, బ్యాంకింగ్, మౌలిక సదుపాయాల కల్పన వ్యాపారాలను నిర్వహిస్తోంది. ఆయన పెద్ద సోదరుడు శ్రీచంద్ హిందుజా 2023లో మరణించిన తర్వాత 35 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.4,05,000 కోట్ల) హిందుజా గ్రూప్ ఛైర్మన్‌గా గోపీచంద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు భార్య సునీత, ఇద్దరు కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు.

అశోక్ లేలాండ్‌ను తీర్చిదిద్దింది ఈయనే: ముంబయిలోని జైహింద్ కళాశాల నుంచి గోపీచంద్ హిందుజా గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. టెహ్రాన్‌లోని కుటుంబ ట్రేడింగ్ వ్యాపారంలో తన కెరీర్‌ను ప్రారంభించారు. తర్వాత తమ వ్యాపార సామ్రాజ్యాన్ని అన్ని ఖండాలకు విస్తరించారు. ఆయన నాయకత్వంలోనే హిందుజా గ్రూప్ 1984లో గల్ఫ్ ఆయిల్‌ను కొనుగోలు చేసింది. 1987లో కష్టాల్లో ఉన్న అశోక్ లేలాండ్‌ను చేజిక్కించుకుని, లాభదాయక సంస్థగా తీర్చిదిద్దారు. మనదేశంలో అతి పెద్ద తొలి ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐ) పెట్టుబడి ఇదే. స్వీడన్‌కు చెందిన గన్‌ల తయారీ సంస్థ ఏబీ బోఫోర్స్‌కు భారతీయ కాంట్రాక్టు లభించేందుకు రూ.64 కోట్ల కమీషన్ పొందారని గోపీచంద్, ఇద్దరు సోదరులు శ్రీచంద్, ప్రకాష్ హిందుజాలపై ఆరోపణలు వచ్చాయి. 2005లో ఆ ముగ్గురిని దిల్లీ హైకోర్టు నిర్దోషులుగా తేల్చింది.

బ్రిటన్‌లో అగ్రగామి కుబేరులు: ది సండే టైమ్స్ తాజా రిచ్ లిస్ట్ ప్రకారం.. గత ఏడాదితో పోలిస్తే గోపీచంద్, అతని కుటుంబ సంపద విలువ 37.2 బిలియన్ పౌండ్ల (రూ.4.3 లక్షల కోట్ల) నుంచి 35.3 బి.పౌండ్ల (రూ.4.05 లక్షల కోట్ల)కు తగ్గినా బ్రిటన్‌లో అత్యంత సంపన్నులుగా తమ స్థానాన్ని నిలుపుకున్నారు.

ప్రముఖుల సంతాపాలు: గోపీచంద్ మృతితో దూరదృష్టి కలిగిన ఒక మహోన్నతుని కోల్పోయినట్లు పలువురు ప్రముఖులు సంతాపాలు తెలియజేశారు. లండన్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్.. గోపీచంద్ హిందుజా మృతిపై తీవ్ర సంతాపం వెలిబుచ్చారు.

లెన్స్‌కార్ట్ ఐపీఓకు రూ.1 లక్ష కోట్ల బిడ్‌లు



లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓకు మదుపర్ల నుంచి 28.2 రెట్లు అధిక బిడ్లు లభించాయి. ఇష్యూలో భాగంగా 9.97 కోట్ల షేర్లు జారీ చేయనుండగా, 281 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలు అయ్యాయి. ఇష్యూ ధరల శ్రేణి అయిన రూ.382- 402లోని గరిష్ఠ ధర ప్రకారం చూస్తే.. దాఖలైన మొత్తం బిడ్‌ల విలువ దాదాపు రూ.1.1 లక్షల కోట్ల వరకు ఉంటుంది. కంపెనీ విలువ విషయంలో కొంత ఆందోళన ఉన్నప్పటికీ.. వ్యాపార వృద్ధికి ఉన్న అవకాశాలు, కళ్లద్దాల వ్యాపారంలో అగ్రగామి సంస్థగా ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల మదుపర్లు ఈ ఐపీఓపై ఎక్కువ ఆసక్తి కనబర్చినట్లు చెబుతున్నారు. చిన్న మదుపర్ల విభాగంలో 7.54 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి. ఈ ఐపీఓ ద్వారా రూ.7,278 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈనెల 10న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ షేర్లు నమోదవుతాయి.

✦ స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో మాతృసంస్థ అయిన **బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్** ఐపీఓ మొదటి రోజున 57% స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 1.91 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
మహీంద్రా అండ్ మహీంద్రా	3,673	2,867	46,106	37,924
అదానీ ఎంటర్‌ప్రైజెస్	3,199	1,742	21,844	23,196
అదానీ పోర్ట్స్	3,120	2,413	10,004.06	7,372.37
బెర్జర్ పెయింట్స్	206.38	267	2,827.49	2,774.61
అరవింద్ స్మార్ట్‌స్పేసెస్	14.17	40.68	144.03	269.28
అక్మే సోలార్ హోల్డింగ్స్	115.06	15.2	601.36	295.14
కన్సాయ్ నెరోలాక్	133.31	119.76	1,954.18	1,951.37
వన్ మొబిక్విక్	(28.6)	(3.59)	270.21	290.64
అలైడ్ బ్లెండర్స్	62.91	47.56	1,952.59	2,029.10
ఇండియన్ హోటల్స్	318.26	582.71	2,040.89	1,826.12
ఎన్ఎల్‌సీ	2098.00	3137.00	4160.00	5023.00
వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా	41.80	53.53	1697.10	1759.89
అలెంబిక్ ఫార్మా	185.00	153.00	1910.00	1648.00
ఆదిత్య బిర్లా లైఫ్‌స్టైల్	23.44	58.77	2037.90	1964.93
క్యాస్ట్రాల్ ఇండియా	228.00	207.00	1363.00	1288.00
మెట్రోపొలిస్	53.00	47.00	429.00	350.00
ఆదిత్య బిర్లా ఫ్యాషన్	(295.09)	(174.99)	1981.66	1760.51
పేటీఎం	211	----	2061	1659

మన 1% కుబేరుల సంపద 62% పెరిగింది

- 2000 నుంచి 2023 మధ్య
- జీ20 నివేదిక



మన దేశంలోని అగ్రగామి 1% మంది కుబేరుల సంపద 2000 నుంచి 2023 మధ్య 62% పెరిగిందని దక్షిణాఫ్రికా అధ్యక్షతన ఏర్పాటైన జీ20 నివేదిక వెల్లడించింది. ప్రపంచంలో ఆర్థిక అసమానతలు 'అత్యయిక' స్థాయిలకు చేరాయని, ప్రజాస్వామ్యం, ఆర్థిక స్థిరత్వం, వాతావరణ మార్పులకు ముప్పుగా మారాయని నివేదిక పేర్కొంది. నోబెల్ గ్రహీత జోసెఫ్ స్టిగ్లిట్జ్ నేతృత్వంలో అధ్యయనం చేసి, ఈ నివేదిక రూపొందించారు. అంతర్జాతీయ అసమానతలపై ఏర్పాటైన స్వతంత్ర నిపుణుల జీ20 అసాధారణ కమిటీలో ఆర్థికవేత్తలు జయతి ఘోష్, విన్నీ బ్యానిమా, ఇమ్రాన్ వలోడియా ఉన్నారు.

✦ 2000 నుంచి 2023 మధ్య కొత్తగా సృష్టించిన సంపదలో 41% అగ్రగామి 1% ప్రపంచ కుబేరుల చేతిలోకి వెళ్లింది. దిగువన ఉన్న 50% మంది సాధారణ ప్రజలు కేవలం 1 శాతమే అందుకున్నారు.

✦ చైనా, భారత్ వంటి అధిక జనాభా కలిగిన కొన్ని దేశాల్లో తలసరి ఆదాయం పెరగడం వల్ల, దేశాల మధ్య అసమానతలు తగ్గాయి. ప్రపంచ జీడీపీలో అధిక ఆదాయ దేశాల వాటాను ఇది కొంతమేర తగ్గించింది.

✦ 2000-2003 మధ్య ప్రపంచంలో 74 శాతానికి సమానమైన అన్ని దేశాల్లో సంపన్నులు తమ సంపదను పెంచుకున్నారు. భారత కుబేరుల్లో అగ్రగామి 1% మంది సంపద విలువ 62% పెరగ్గా, చైనాలో ఇది 54 శాతంగా ఉంది.

దేశాల సమన్వయంతోనే అసమానతలు తగ్గించొచ్చు: తీవ్రమైన అసమానతలు అనివార్యం కాదని, రాజకీయ నిర్ణయాలతో ఎదుర్కోవచ్చని నివేదిక తెలిపింది. అంతర్జాతీయ దేశాల సమన్వయంతో సులభంగా అసమానతలను తగ్గించొచ్చని, జీ20 ఇందులో కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేసింది. అంతర్జాతీయ ధోరణులను పర్యవేక్షించడానికి, విధానపరమైన నిర్ణయాల కోసం ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆన్ ఇన్ఈక్వాలిటీ (ఐపీఐ)ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.

అసమానతలతో ప్రజాస్వామ్యానికీ చేటు: అధిక అసమానతలు ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్యం క్షీణించే అవకాశం 7 రెట్లు అధికంగా ఉంది. 2020 తర్వాత అంతర్జాతీయ పేదరిక నిర్మూలన ప్రక్రియ నెమ్మదించింది. దీంతో 230 కోట్ల మందికి ఆహార భద్రత లేకుండా పోయింది. 130 కోట్ల మంది ఆరోగ్య ఖర్చులు చేయలేని పేదరికంలో ఉన్నారు.

'ఫోర్బ్స్' వరల్డ్ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాలో అమరరాజా

ఈనాడు, హైదరాబాద్: 'ఫోర్బ్స్' వరల్డ్ బెస్ట్ ఎంప్లాయర్స్ 2025 జాబితాలో అమరరాజా గ్రూపు స్థానం సంపాదించింది. ప్రపంచ వ్యాప్తంగా 31 సంస్థలతో ఈ జాబితాను రూపొందించారు. ఇందులో 28వ స్థానంలో అమరరాజా గ్రూపు నిలిచింది. ఈ ఏడాది జాబితాలో మనదేశానికి చెందిన 6 కంపెనీలు ఇందులో ఉన్నాయి. దీనిపై అమరరాజా గ్రూపు ఛైర్మన్ జయదేవ్ గల్లా సంతోషం వెలిబుచ్చారు. మానవ వనరుల అభివృద్ధికి తాము ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నందునే, ఈ గుర్తింపు లభించిందని ఆయన వివరించారు. అమరరాజా గ్రూపు సంస్థల్లో 21,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

నవీ ముంబయి విమానాశ్రయంలో అపోలో హాస్పిటల్స్ సేవలు

ముంబయి: నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం (ఎన్ఎంఐఏ) టెర్మినల్-1లో అపోలో హాస్పిటల్స్ వైద్య సేవలు అందించనుంది. ఇందుకోసం రెండు సంస్థలూ మంగళవారం ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ప్రయాణికులు, ఉద్యోగులకు ఈ కేంద్రం పూర్తి స్థాయిలో 24 గంటలూ వైద్య సేవలను అందిస్తుంది. అత్యవసర వైద్య సేవలతోపాటు, విపత్తు నిర్వహణకు అవసరమైన సదుపాయాలు ఇందులో ఉంటాయని పేర్కొంది. ఎన్ఎంఐఏ రెండు ఐసీయూ అంబులెన్సులను అందుబాటులో ఉంచనుంది.

పబ్లిక్ ఇష్యూ నిధుల దుర్వినియోగం

ఈడీ దర్యాప్తులో వెలుగులోకి




పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను దుర్వినియోగం చేయడం ద్వారా మదుపర్లను వరేనియం క్లౌడ్ లిమిటెడ్ అనే సంస్థ మోసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో తేలింది. 2022లో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన ఈ సంస్థ రూ.40 కోట్లు సమీకరించింది. ఐపీఓ సమీకరించే నిధులతో చిన్న పట్టణాల్లో డేటా కేంద్రాలు, డిజిటల్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పబ్లిక్ ఇష్యూకు రావడానికి ముందు చెప్పింది. దీనికి భిన్నంగా, ఆ నిధులను నకిలీ లావాదేవీల ద్వారా కంపెనీ షేరు ధరను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించినట్లు ఈడీ తెలిపింది. తద్వారా మదుపర్లను తప్పుదోవ పట్టించి.. వాళ్లు మరింతగా ఈ కంపెనీ షేర్లు కొనేలా ఆసక్తి పెంచారని వివరించింది. ఆ తర్వాత అధిక ధర వద్ద తన దగ్గరున్న షేర్లను కంపెనీ ప్రమోటరు ఒక్కసారిగా అమ్మేయడంతో.. షేరు ధర పడిపోయి మదుపర్లకు తీవ్ర నష్టాన్ని కలగజేసిందని ఈడీ వివరించింది.

వచ్చే వేసవిలో భారత్‌కు నార్టన్ ద్విచక్రవాహనాలు



టీవీఎస్ మోటార్ కంపెనీలో భాగంగా ఉన్న బ్రిటిష్ మోటార్‌సైకిల్ బ్రాండ్ నార్టన్ 2026 వేసవిలో భారత విపణిలోకి అడుగుపెట్టనుంది. మ్యాన్స్ఎక్స్, అట్లాస్ మోడళ్లను ఇటీవల ఓ అంతర్జాతీయ ద్విచక్ర వాహన ప్రదర్శనలో నార్టన్ ప్రదర్శించింది. వచ్చే ఏడాది మార్చి- ఏప్రిల్‌లో నార్టన్ ఉత్పత్తులు బ్రిటన్, ఐరోపాలో; వేసవిలో భారత్‌లో విడుదల అవుతాయని టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ సుదర్శన్ వేణు తెలిపారు.

ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎస్. శంకరసుబ్రమణియన్



ఈనాడు, హైదరాబాద్: ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఏఐ) ఛైర్మన్‌గా కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎండీ, సీఈఓ ఎస్. శంకరసుబ్రమణియన్ నియమితులయ్యారు. హిందూస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్ ఎండీ శివ ప్రసాద్ మహంతి కో-ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎరువుల రంగంలో మనదేశం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తానని శంకరసుబ్రమణియన్ అన్నారు. 1955లో ఏర్పాటైన ఎఫ్ఏఐలో ఎరువుల కంపెనీలు, పంపిణీదార్లు, దిగుమతిదార్లు, యంత్రపరికరాలు ఉత్పత్తి చేసే సంస్థలు, పరిశోధనా సంస్థలు, ముడిపదార్థాలు సరఫరా చేసే సంస్థలకు సభ్యత్వం ఉంటుంది.

ఏజీఆర్ ఉపశమనం మాకూ కావాలి: ఎయిర్‌టెల్

సర్దుబాటు చేసిన స్థూల బకాయిల (ఏజీఆర్) కేసు వ్యవహారంలో.. వొడాఫోన్‌ఐడియాకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో.. ఏజీఆర్ బకాయిలపై పునఃగణన అడిగేందుకు ప్రభుత్వం వద్దకు మరోసారి భారతీ ఎయిర్‌టెల్ వెళ్లనుంది. 2016-17 ఆర్థిక సంవత్సరానికే పరిమితం కాకుండా వొడాఫోన్‌ఐడియాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఏజీఆర్ బకాయిలన్నింటినీ పునఃలెక్కింపు చేయాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

వొడాఫోన్‌కు మరో ఊరట: వొడాఫోన్ ఇండియా కాల్ సెంటర్ వ్యాపార విక్రయానికి సంబంధించి రూ.8,500 కోట్ల ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ కేసును ఆదాయపు పన్ను విభాగం ఉపసంహరించుకుంది. ఈ వివాదం కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఏజీఆర్ బకాయిల వ్యవహారంలో సుప్రీంకోర్టు అనుకూల తీర్పు తర్వాత.. వొడాఫోన్‌ఐడియాకు ఈ పరిణామం మరో ఊరటగా చెప్పొచ్చు.

విదేశీ మార్కెట్ల సంకేతాలతో డీలా

రూ.2.71 లక్షల కోట్లు తగ్గిన సంపద విలువ

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.1067.01 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.1202.90 కోట్లు

సెన్సెక్స్ ▼519 83459 | నిఫ్టీ ▼166 25598



అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల ప్రభావంతో మన స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలు ప్రభావం చూపాయి. ఐటీ, లోహ, విద్యుత్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పుంజుకుని రూ.88.70 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.2% నష్టంతో 64.10 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.71 లక్షల కోట్లు తగ్గి రూ.469.80 లక్షల కోట్ల (5.30 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

స్వల్ప లాభంతో మొదలై..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,978.49) స్వల్ప లాభంతో 84,000.64 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుని, చివర వరకు అదే ఒరవడిని కొనసాగించింది. ఒక దశలో 83,412.77 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసినా, చివరకు 519.34 పాయింట్ల నష్టంతో 83,459.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 165.70 పాయింట్లు కోల్పోయి 25,597.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,578.40 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 25,787.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

రాణించిన టైటన్, ఎయిర్‌టెల్: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 షేర్లు మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 3.13%, ఎటర్నల్ 2.79%, టీఎంపీవీ 2.53%, టాటా స్టీల్ 1.86%, మారుతీ సుజుకీ 1.76%, భెల్ 1.69%, ఎల్అండ్‌టీ 1.48% చొప్పున తగ్గాయి. జులై- సెప్టెంబరులో ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసిన టైటన్ షేరు 2.28%, భారతీ ఎయిర్‌టెల్ షేరు 1.8% పెరిగాయి. బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు కూడా లాభపడ్డాయి.

✦ ఏబీ ఫైనాన్స్‌లో 100%, త్రి ఫాల్కన్స్ నోటింగ్ హిల్‌లో 50%, జావా ఫైల్ హాస్పిటాలిటీలో 49%, లెవో బ్యూటీలో 49%, నిర్వాణా గ్రాండ్ గోల్ఫ్ డెవలపర్స్‌లో 49% చొప్పున వాటాలను కొనుగోలు చేసేందుకు **ఈజ్‌మైట్రిప్** ఒప్పందాలను కుదుర్చుకుంది.

నేడు మార్కెట్లకు సెలవు: గురునానక్ జయంతి సందర్భంగా ఈ రోజు స్టాక్ మార్కెట్లకు సెలవు. కమొడిటీ మార్కెట్లు సాయంత్రం గం.5 నుంచి పనిచేస్తాయి.

నిండు పున్నమిలా వెలుగుదాం!


కార్తికపౌర్ణమి సందర్భంగా...

ఆకాశానికి చంద్రుడు ఆభరణమైతే... ఆ జాబిల్లికే శోభ తెచ్చేది పున్నమి. కార్తికంలో పూర్ణకళతో వెలిగే చంద్రుడి సౌందర్యాన్నైతే వర్ణించడమూ కష్టమే! అలాంటి కార్తిక పౌర్ణమి... పూర్ణత్వానికీ విజయానికీ సంకేతం. ప్రతి మహిళా తమ జీవితంలో అలాంటి పరిపూర్ణత్వానికి ప్రయత్నించాలన్న సందేశమిస్తుంది కార్తికపౌర్ణమి.

కార్తిక పౌర్ణమి అనగానే 'ఆరనీకుమా ఈ దీపం...' అంటూ దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన గీతం గుర్తురాక మానదు. అక్కడ ఆ దీపాన్ని ఆశాదీపం, ఆనంద దీపమంటూ అభివర్ణిస్తూనే... మహిళ జీవితం నిండుపున్నమిలా వెలగాలంటే ఆశావాదం ప్రధానమని చెప్పారా కవి. దీపం ఆత్మవిశ్వాసానికీ ప్రతీక. దాని సాయంతో అసాధ్యాల్నీ సుసాధ్యం చేయొచ్చు. ఆ సంగతిని నిరూపిస్తున్న యువతులూ ఎందరో! ఎప్పటికైనా పున్నమి గడియలు వస్తాయన్న నమ్మకంతో అమావాస్య చీకటిలాంటి దుర్భర పరిస్థితుల్నీ నిబ్బరంగా దాటాలన్న సందేశమివ్వడమే ఆశాదీపం పరమార్థం. అలాగే ఆనంద జీవనానికీ దీపమే దారి. సంతోషం లేనినాడు ఎన్ని సుఖాలు, సౌకర్యాలు లభించినా, అందలాలు ఎక్కినా లాభం లేదు. బతుకంతా నిరాసక్తంగానే సాగిపోతుంది. కొన్నిచోట్ల ఈరోజు గంగకు హారతులు పడతారు. గాంభీర్యానికీ, సహనానికీ, అమేయమైన శక్తికీ నిదర్శనమైన గంగమ్మ... ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిరాటంకంగా, తన అస్తిత్వానికి భంగం వాటిల్లనీయకుండా ప్రవహిస్తూనే ఉంటుంది. అందుకే శివుడూ గంగను తన తలపై ధరించాడు. మహిళలు పట్టుదలలో, అచంచల దీక్షలో ఆ గంగని స్ఫూర్తిగా తీసుకోవాలన్న సూచన కనిపిస్తుందక్కడ.

నిత్యం 'దేవదీపావళి'...

ప్రతి మహిళా తన జీవితం వేయిరేకల కలువలా వికసించాలి, పూర్ణచంద్రుడిలా శోభించాలనే కోరుకుంటుంది. అయితే ఇందుకామె తగ్గ శక్తి సామర్థ్యాలనూ ఆవిష్కృతం చేసుకోవాలి. అలాగని తనకోసమే ఆలోచించకూడదు. సమాజ శ్రేయస్సుకీ ప్రాధాన్యమివ్వాలి. పరమశివుడు క్షీరసాగర మథన సమయంలో హాలాహలం స్వీకరించేందుకు పార్వతి అనుమతిని అడిగాడు. ఆమె ఏమాత్రం సందేహించకుండా లోకక్షేమం కోసం అంగీకరించింది. ఆమె ధీరత్వాన్నీ, విశాల హృదయాన్నీ అభినందిస్తూ దేవతా స్త్రీలంతా కార్తిక పౌర్ణమినాడు దీపాల హారతిని పట్టి, దీపాల పల్లకిలో ఊరేగించారట. అందుకే ఈ పున్నమికి దేవదీపావళి అనీ పేరు. నేను, నా కుటుంబం అనేకాదు... పక్కవారికీ సాయపడాలన్న సందేశమిస్తోంది కార్తిక పౌర్ణమి. దాన్ని అనుసరిస్తే నిత్యం మనకూ దేవదీపావళే!

జ్వాలాతోరణం అభినందనే!

కార్తికపౌర్ణమి మరో ప్రత్యేకత 'జ్వాలాతోరణ ఉత్సవం'. ఆ రోజు సాయంకాలం శివాలయ ప్రాంగణాల్లో రెండు ఎత్తయిన కర్రలను పాతి... ఆ రెంటినీ కలుపుతూ ఎండుగడ్డితో తాడును పేని, దాన్ని నిప్పుతో వెలిగిస్తారు. ఆ ఎగిసిపడే జ్వాలల కిందుగా పల్లకిలో శివపార్వతుల విగ్రహాలను ఉంచి మూడుసార్లు తిప్పుతారు. రాక్షసులతో యుద్ధం చేసి విజయం సాధించివచ్చిన మహేశ్వరుడు, వినాయకుడు, కుమారస్వాములను స్వాగతిస్తూ... వాళ్ల విజయానికి చిహ్నంగా పార్వతీదేవి ఈ జ్వాలాతోరణాలు ఏర్పాటు చేసేదని పురాణ కథ. ఒకరకంగా తనవారిని ఉత్సాహపరచడానికి పార్వతీదేవి చేసిన ప్రయత్నమిది. తన వారి విజయాన్నీ తనదానిగా భావించే మగువలు అందరి మనసుల్నీ చూరగొంటారు అని చెప్పడమూ దీని ఉద్దేశమే. అయితే ఇక్కడ సహచరులు, మిత్రులు, బంధువులు... ఇలా ఎవరి విజయాన్నైనా మనసారా అభినందించగలగాలి. సంకుచితత్వం వీడి అందరి ప్రతిభనూ ప్రోత్సహించగలగాలి. జీవన గమనంలో అన్ని పాత్రలకీ మగువ ప్రాధాన్యమివ్వాలి. కార్తికపౌర్ణమిని ఇలా వ్యక్తిగత జీవితానికి అన్వయించుకుంటే మగువలు పరిపూర్ణ మహిళలుగా శోభిస్తారు. కాబట్టి, దీన్ని కేవలం దీపాలు వెలిగించే పండుగగానే కాకుండా మన వ్యక్తిత్వానికి వెలుగునిచ్చే పర్వదినంగా మలుచుకుందాం. ప్రతిభా కాంతుల్ని వెదజల్లుతూ మన జీవితాల్ని నిండుపున్నమిలా మార్చుకుందాం.

– మనోజ్ఞ

వసుంధర

vasundhara@eenadu.in



ఓ సెల్ఫీ తీసుకుందామా?

అమ్మాయిలను సెల్ఫీ తీసుకోమని చెప్పాలా ఏంటి? ఉదయం లేవగానే 'మై మార్నింగ్ లుక్, కాఫీ కప్పుతో' అని మొదలుపెడతారు. కాలేజీ లేదా ఆఫీస్ లుక్, స్నేహితులతో, ప్రయాణం, వేడుక... చెబుతూ పోతే చాంతాడంత జాబితా. మళ్లీ కొత్తగా ఎందుకు చెబుతున్నారు అనుకోకండి. 20, 30ల్లో ఉన్నవాళ్లకి చెప్పక్కర్లేదు నిజమే. మరి ఆ వయసు దాటిన వాళ్ల సంగతేంటి? ఎవరో ఎప్పుడో వేడుకల్లో తీస్తే తప్ప... వాళ్లంతట వాళ్లు దిగరు. కావాలంటే గమనించండి. ఆత్మన్యూనతే కారణమంటే నమ్ముతారా? తిరిగి ఆనందం దరిచేరాలన్నా... ఆత్మవిశ్వాసం పెరగాలన్నా ఓ సెల్ఫీ కావాలి మరి.

సాగుతున్న చర్మం, పలకరించే ముడతలు, కాస్త పెరిగిన బరువు... ముందు మనల్ని మనమే స్వీకరించం. పొరపాటున ఏదైనా ఫొటో పెట్టినా ఎదుటివాళ్లూ వాటి తాలూకూ ప్రశ్నలే వేస్తారు. అందుకే మొక్కలు, పిల్లల ఫొటోలు... లాంటివాటికి ఇచ్చిన ప్రాధాన్యం తమ సెల్ఫీలకు ఇవ్వరు. కానీ పర్లేదు తీసుకోండి. చక్కగా నలుగురితోనూ షేర్ చేసుకోండి. ప్రతి వయసుకీ తనదైన అందం వచ్చి చేరుతుంది. మిమ్మల్ని మీరే స్వీకరించలేకపోతే ఎలా? ఒక్కసారి దాన్నీ స్వీకరించండి. మీకు మీరు కొత్తగా కనిపించడమే కాదు... ఆత్మవిశ్వాసమూ దరిచేరుతుంది. ఎప్పుడైనా బోర్ కొట్టిందా... ఓసారి ఫోన్‌లో పాత ఫొటోలను తిరగేయండి. ఎన్నెన్ని జ్ఞాపకాలు వచ్చి చేరతాయో! తెలియకుండానే మూడ్ అంతా మారిపోతుంది. చిరునవ్వు పెదవుల మీదకు వచ్చి తీరుతుంది. ఫోన్ పక్కన పడేసి వీటన్నింటికీ దూరమవుతున్నట్లేగా? ఇవీ మంచివే! మన విలువనీ, విజయాల్నీ గుర్తుచేసేవే! అయినా ఇదే అందమని ఒకరు చెప్పేదేంటి? మనం ప్రత్యేకం. ఫొటో మన ఆలోచనలనీ చెప్పే మార్గం. ఇదిచ్చే ఆత్మవిశ్వాసం మరొకటి ఇవ్వదు. అంతేనా? సోషల్‌మీడియాలో పంచుకుంటామా? మన స్నేహితురాళ్లు, బంధువుల నుంచి ఎన్నెన్ని కామెంట్లు, మనల్ని చూసి వాళ్లూ ఫాలో అవుతుంటారు. చక్కగా ఆలోచనలు, అనుభవాలు పంచుకోవచ్చు. నెట్‌వర్క్‌ని పదిలంగా ఉంచుకున్నట్టేగా! దీనివల్ల మనసూ తేలికపడుతుంది, ఉత్సాహంగానూ ఉంటుంది. అంటే మానసిక ఆరోగ్యం కూడా! ఇవన్నీ ఎందుకు చెప్పండి దూరం చేసుకోవడం. అందుకే చక్కగా సెల్ఫీ తీసుకోండి. ఈ వయసులో అని ఎవరేమన్నా పట్టించుకోకుండా మీ కెమెరా నైపుణ్యాలకు పని చెప్పేయండి.

ఆమెలో ధైర్యం పెంచేదెలా..!

డియర్ వసుంధర


కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

నేనో అధికారిణి ఆధ్వర్యంలో పనిచేస్తున్నా. పై అధికారి ఎప్పుడూ ఆమెను తిడుతూనే ఉంటారు. దీనివల్ల పని వాతావరణం పాడవుతోంది. ఈమధ్య ఇలానే కోప్పడుతోంటే నేను జోక్యం చేసుకున్నా. పైవాళ్లకు ఫిర్యాదు చేస్తానని చెప్పా. మా బాస్ నన్ను ఆపి, కాస్త సహనంగా ఉండమన్నారు. నా మాటల్ని ఆమె తప్పుగా భావించారేమో అన్న భయం నాలో మొదలైంది. అలా అని చూస్తూ ఊరుకోలేను. నేను ఆమెకు సహాయం చేయలేనా? – ఓ సోదరి

మీరు చెప్పినదాని ప్రకారం... మీ పైవాళ్ల ఘర్షణల వల్ల పని వాతావరణం దెబ్బతింటోందని అర్థమవుతోంది. దీనిప్రభావం ఉద్యోగులందరి ఉత్పాదకత మీదా పడుతుంది. మీ స్పందన మంచిదే అయినా... ప్రత్యక్షంగా దీంతో మీకు ఎలాంటి సంబంధం లేదు. ఆమె బాధనూ ఆఫీస్ పనితీరునూ చూడలేక మాట్లాడారు. మీ పై అధికారిణి చెప్పినట్లు ఈ విషయంలో సహనంగా ఉంటేనే మంచిది. లేదూ పరిస్థితులు ఆమెకు అనుకూలంగా లేవు అనుకుంటే... రెండు విషయాల్లో స్పష్టత తెచ్చుకోండి. ఒకటి సమస్య మీద మీకు పూర్తి అవగాహన ఉందా? మీ సహాయం ఆమెకు నిజంగానే అవసరమా? అనేవి తెలుసుకోండి. ఏ తప్పూ లేకుండా వ్యక్తిగత కారణాల వల్లే ఆమెను నిందిస్తున్నట్లయితే... మీ చర్యకు భయపడాల్సిన అవసరం లేదు. మీ మాటలు ఆమెకు సాంత్వన కలిగిస్తాయి. రెండోది... పనిలో ఆయన వంకలు పెట్టడానికి అవకాశం లేకుండా నివేదికలన్నీ పక్కాగా ఉండేలా ఆమెకు సహాయం చేయండి. అలానే సందర్భానుసారంగా వాళ్ల గొడవలు మిగిలిన ఉద్యోగుల పనిని ఎలా ప్రభావితం చేస్తున్నాయో మీ బాస్‌కు వివరించండి. పైవాళ్లతో మాట్లాడేటప్పుడు మీతోపాటు మిగతావాళ్ల మద్దతూ ఉంటుందని తెలపండి. మీ మాటలు ఆమెను రెచ్చగొట్టేట్లు కాకుండా... పరిస్థితిని తెలిపేలా ఉండాలని గమనించుకోండి. ఉదాహరణలతో సమస్యను వివరిస్తే... మీ బాస్ అర్థం చేసుకునే అవకాశం ఉంది.

డిజిటల్ నైపుణ్యాల్లో... గ్రామీణం మెరిసేలా!

ప్రపంచమంతా టెక్నాలజీ దిశగా పరుగెడుతోంది. కానీ ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు దాని ఓనమాలూ తెలియకపోవడం గమనించింది నయనాల అశ్రిత. అందుకే 'ఆత్మీయ కోడ్ క్లబ్' ప్రారంభించి వారికి సాయపడుతోంది.



అశ్రిత వాళ్లది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు. అమ్మానాన్నలు బిందుప్రియ, వెంకట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వీళ్ల కుటుంబం అమెరికాలో స్థిరపడింది. ప్రస్తుతం టెన్త్ గ్రేడ్ చదువుతోంది అశ్రిత. తను గర్ల్ స్కౌట్ హార్ట్ ఆఫ్ న్యూజెర్సీలో సభ్యురాలు. ఒకరకంగా ఇది మన ఎన్‌సీసీ లాంటిదే. దీనిలో బ్రౌన్, సిల్వర్, గోల్డ్ అనే 3 దశలుంటాయి. వీటిలో భాగంగా విద్యార్థులు కొన్ని ప్రాజెక్టులు చేయాలి. అయితే వీళ్ల ప్రమేయం లేకుండా అవి కొనసాగేలానూ చూడాలి. అలా అశ్రిత తన అయిదో తరగతిలో పార్కులో 'లిటిల్ లైబ్రరీ' ప్రారంభించింది. పార్కుకి వెళ్లినవారు అందులోని పుస్తకాలను చదువుకోవచ్చు. వెళ్లేటప్పుడు తిరిగి పెట్టేయాలి. ఎవరైనా ఇంట్లో పనికిరాని పుస్తకాలనూ అక్కడ పెట్టొచ్చు. రెండో ప్రాజెక్టుగా అరుదైన పక్షిరకాలకు గూళ్లు కట్టించి ఇచ్చింది. వాటి నిర్వహణ బాధ్యత స్థానిక మున్సిపల్ సంస్థ తీసుకునేలా చేసింది. ఇవి రెండూ బృందంతో కలిసి చేసింది. మూడోదాన్ని ఒంటరిగా, అంతర్జాతీయ స్థాయిలో చేయాలి. అశ్రితకి రోబోటిక్స్ అంటే ఇష్టం. నాలుగో తరగతి నుంచే సంబంధిత కోర్సులు చదువుతోంది. అలాంటిది భారత్‌లోని గ్రామీణ విద్యార్థులకు హైస్కూలు స్థాయికి చేరినా పరిచయం కాకపోవడం అశ్రితను ఆశ్చర్యపరిచింది. అందుకే వాళ్లకు దాన్ని పరిచయం చేయాలన్న ఉద్దేశంతో 'ఆత్మీయ కోడ్ క్లబ్' ప్రారంభించింది. దీన్నే తన గోల్డ్ అవార్డు ప్రాజెక్టుగానూ మార్చుకుంది. తన ఆలోచనను గర్ల్ స్కౌట్‌తో పంచుకుని అంగీకారాన్నీ అందుకుంది.


అశ్రిత

దీనికోసం కొందరు వలంటీర్లను నియమించుకుంది. సంకురాత్రి, ఆత్మీయ, ఒక యూకే ఆధారిత ఎన్‌జీఓలతో ఒప్పందం చేసుకుంది. వాళ్ల తరగతులకు అవసరమైన సామగ్రితోపాటు కొన్ని నిధుల్నీ అందించారు. వాటితో రోబోటిక్ కిట్స్‌ని సమకూర్చింది. కాకినాడలోని పెనుమర్తిలో ఒక పాఠశాలను ఎంచుకుని... ఇటీవల అక్కడి విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన, వాటి గురించి నేర్చుకోవడం ద్వారా వచ్చే ఉద్యోగావకాశాలు వంటివాటిపై తరగతులు తీసుకుంది. ఆసక్తి ఉన్న 8, 9, 10 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసి, వారానికి రెండు చొప్పున ఆన్‌లైన్ తరగతులు తీసుకుంటోంది. 'భారత్‌కి వచ్చే ముందే నేను సొంతంగా కొన్ని ప్రొటోటైప్‌లను చేసుకుని తీసుకొచ్చా. అవి ఇక్కడి విద్యార్థులని ఆకర్షించాయి. తరగతుల్లో భాగంగా ఒకరోజు కాన్సెప్టు చెబుతాం. వారం చివర్లో దాని ఆధారంగా నచ్చిన ప్రాజెక్టు చేసి చూపించేలా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు కావాల్సిన రోబోటిక్ కిట్‌లనీ అందించాం. గ్రామీణ విద్యార్థులకూ టెక్నాలజీపై ఆసక్తి కలగాలన్నదే నా తాపత్రయం' అంటోంది అశ్రిత.

– కె. త్రినాథస్వామి, మామిడికుదురు

మీ పనీర్ మంచిదేనా?

రుచిలోనూ, ప్రొటీన్ అందించడంలోనూ మాంసాహారానికి ప్రత్యామ్నాయంగా పనీర్‌ని ఎంచుకోవడం పెరిగింది. ఇదే అదనుగా నకిలీ పనీర్ అమ్మకాలూ పెరిగాయంటున్నాయి ఆహార భద్రతా నివేదికలు. మరి ఇంతకీ మీరు వాడుతోన్న పనీర్ మంచిదేనా? దాన్ని ఎలా తెలుసుకోవాలి?

స్వచ్ఛమైన పనీర్‌ని పాలల్లో నిమ్మరసం, వెనిగర్ వంటి ఆమ్ల గుణం ఉన్న వాటిని కలపడం ద్వారా తయారు చేస్తారు. ఇందులో ఆరోగ్యానికి ఉపయోగకరమైన ప్రొటీన్లూ, కాల్షియం, కొవ్వులు ఉంటాయి. నకిలీ పనీర్‌ని వెజిటబుల్ ఆయిల్, మిల్క్‌పౌడర్, డిటర్జెంట్ లేదా యూరియా వంటి హానికారక పదార్థాలతో తయారుచేస్తారు. వీటి రుచి ఎలా ఉన్నా... పోషణ తక్కువ ఉండటంతోపాటు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి.



- స్వచ్ఛమైన పనీర్ ముట్టుకుంటే మృదువుగానే కాదు కాస్త గట్టిగానూ ఉంటుంది. పాల వాసన వస్తుంది. కానీ, నకిలీది తేలికగా పొడి అవుతుంది. రబ్బరు లేదా రబ్బర్ టెక్స్చర్లానూ కనిపిస్తుంది. అయితే దాన్ని అలానే నీటిలో వేస్తే కాసేపటికి చిన్న చిన్న ముక్కలుగా విడిపోతే మంచి పనీరే. అలాకాకుండా పూర్తిగా కరిగిపోతే నాణ్యమైనది కాదని గుర్తించండి.
- పనీర్ స్వచ్ఛతను గుర్తించాలంటే... బాగా మరిగిన నీళ్లలో పనీర్ వేసి... ఆపై బెటాడిన్ లేదా అయోడిన్ చుక్కలు కలపండి. అసలైనది రంగు మారదు. అది నీలం, నలుపు రంగుల్లోకి మారుతుంటే మాత్రం అది నకిలీదే.
- పనీర్‌ని మరిగించిన నీళ్లల్లో కాస్త కందిపప్పు లేదా సోయా పౌడర్ చిటికెడు వేసి పదినిమిషాలు వదిలేయండి. అసలైనదైతే నీళ్లు స్పష్టంగా ఉంటాయి. నకిలీదైతే ఎరుపు రంగులోకి మారతాయి. అప్పుడు డిటర్జెంట్ లేదా యూరియా కలిసిందని అర్థం చేసుకోవాలి.
- సహజమైన పాలపదార్థాలకు వచ్చే వాసనతో పాటు కొద్దిగా పులుపూ ఉంటుంది. అదే కృత్రిమమైనది అయితే రసాయన వాసన, రబ్బరు లాంటి టెక్స్చర్, ఎక్కువ పుల్లగా ఉంటాయి.
- వేడిచేస్తే పనీర్ ఆకారం మారకుండా సమంగా రంగు మారితే పరవాలేదు. అదే ఆర్టిఫిషియల్ రకమైతే కరిగిపోవడంతో పాటు నూనె, నీళ్లూ వస్తాయి.

మీకు తెలుసా?



తొలి మహిళా క్రికెట్ మ్యాచ్ 1745లో ఇంగ్లండ్‌లోని సర్రేలో జరిగింది. 1800ల చివరలో మహిళా క్లబ్‌లు ఏర్పడటం మొదలైంది. కానీ అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించడానికి విమెన్స్ క్రికెట్ అసోసియేషన్‌ను 1926లో నెలకొల్పారు. ఆ తరవాత తొలి టెస్ట్‌మ్యాచ్ 1934లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాల మధ్య జరిగింది. ఇక, పురుషుల టోర్నమెంట్ ప్రారంభానికి రెండేళ్ల ముందే 'విమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్' 1973లో జరగడం విశేషం. ఆ ఏడాది మొత్తం 7 టీమ్స్ పాల్గొనగా... ఫైనల్లో ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ గెలిచి కప్ అందుకుంది. సరిగ్గా ఆ ఏడాదే మనదేశంలో విమెన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాను లఖ్‌నవూలో నెలకొల్పారు.

బంగారం - వెండి



04న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,22,600	1,12,650	1,48,688
విజయవాడ	1,20,340	1,12,250	1,51,200
ప్రొద్దుటూరు	1,20,800	1,11,140	1,50,000
రాజమహేంద్రవరం	1,22,460	1,12,250	1,65,000
విశాఖపట్నం	1,22,000	1,12,250	1,55,000
తమిళనాడు	-----	1,12,500	1,65,000

అన్నీ పని సులభం చేసేవే..!

స్మార్ట్ కిచెన్

స్మార్ట్ కిచెన్‌ని మెచ్చని వారుంటారా! అందులోనూ ఈతరం అమ్మాయిలకు దీని అవసరం మరీ ఎక్కువ. చకచకా పని పూర్తవుతుంది. అక్కడ కేటాయించే సమయాన్ని నచ్చిన వ్యాపకాల మీదకు మళ్లించొచ్చు అనుకుంటారు. అందుకే పాతతరం వస్తువులన్నింటికీ ప్రత్యామ్నాయాల్ని వెతుకుతూ... స్మార్ట్ పరికరాల్ని ఎంపిక చేసుకుంటారు. అలాంటి వారికి ఉపయోగపడే గ్యాడ్జెట్లే ఇవి.

ఇంట్లోనే బ్రెడ్ చేయొచ్చు...



ఇప్పుడు డైటింగ్ పేరుతో చాలా మంది బ్రెడ్‌నే అల్పాహారంగా తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. టోస్ట్‌లు, గార్లిక్, చిల్లీ, డ్రైఫ్రూట్ రొట్టెలంటూ వీటిల్లో ఎన్ని రకాలో. కానీ బయటి నుంచి తెచ్చుకుని తినే వాటిలో తాజాదనం ఉండదు. గ్లూటెన్ కలుపుతారు. తొందరగా పాడవుతాయి కూడా. పైగా తయారీ విధానం ఎలా ఉంటుందో అన్న అనుమానం. ఈ సమస్యలన్నింటికి చెక్ పెట్టడానికి వచ్చిందే ఈ 'బ్రెడ్ మేకర్'. దీనికి జతగా వచ్చే బౌల్‌లో రొట్టె తయారీకి కావాల్సిన పదార్థాలన్నీ వేసి దాన్ని మేకర్‌లో ఉంచి మూత పెట్టేయాలి. మెనూలో బేసిక్ బ్రెడ్, ఫ్రెంచ్, స్వీట్ బ్రెడ్ లాంటి ఆప్షన్లు ఉంటాయి. కావాల్సిన దాన్ని ఎంపిక చేసుకుని ఆన్ బటన్ నొక్కితే సరి. పిండి కలపడం నుంచి రొట్టె తయారీ వరకూ అన్నీ అదే చేసుకుపోతుంది. రెండు నుంచి మూడు గంటల్లో వేడివేడి బ్రెడ్‌ను అందిస్తుంది.



పని అయ్యాక మూసేయొచ్చు...



వంటింట్లో వాడే సింక్ గిన్నెలు కడగడం దగ్గర్నుంచి బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు అన్నింటి శుభ్రం అక్కడే. చేయిజారి ఏ కాస్త దానిలో పడినా, వాటిని ఉపయోగించలేం. సింక్‌ని ఎంత శుభ్రంగా ఉంచినా ఈ విషయంలో రాజీ పడలేం. అలా కాకుండా పాత్రల శుభ్రతకి, ఆహారపదార్థాలు కడగడానికి వేరువేరుగా సింక్‌లు ఉంటే... రెండింటిని పెట్టే స్థలం ఉంటుందా వంటగదిలో అని ఆలోచిస్తున్నారా! ఈ 'కాంపాక్ట్ సింక్'లను ఉపయోగించి చూడండి. వీటిని కూడా మనం రోజువారి వాడుకునే సింకుల్లానే రూపొందించారు. కాకపోతే, భారీ సెట్టింగులు, కనెక్షన్లు అవసరం లేకుండా బకెట్‌కు అమర్చుకున్నా వినియోగించగలిగే వీలుండే సింక్‌లివి. మన పని అయ్యాక వీటిని మూసేస్తే సరి. స్టెయిన్ లెస్ స్టీల్‌తో తయారుచేయడం వల్ల శుభ్రం చేయడమూ సులభమే. క్లౌడ్ కిచెన్‌లు, చిన్నచిన్న ఫుడ్ స్టాల్స్‌లో వీటిని ఇప్పటికే వినియోగిస్తున్నారు. ఈ మధ్య వంటింట్లోకి ఇవి అందుబాటులోకి వచ్చాయి.



నిమిషాల్లో శాండ్‌విచ్ రెడీ...

శాండ్‌విచ్‌ని ఇష్టపడని పిల్లలుంటారా! కానీ బయట దొరికే వాటిని వాళ్లకి కొని ఇవ్వాలంటే ఆలోచనలో పడతారు తల్లులు. ఇంట్లో తయారుచేద్దాం అంటే ఓ పట్టాన రాదు. సరైన ఆకారంలో రాకపోతే తినడానికి ఇష్టపడరు గడుగ్గాయిలు. ఈ పనిని సులభం చేయడానికి వచ్చిందే ఈ 'పోర్టబుల్ శాండ్‌విచ్ మేకర్'. దీనిలో బౌల్ రూపంలో రెండు పాత్రల్లాంటివి ఉంటాయి. వాటిలో శాండ్‌విచ్ తయారీకి కావాల్సిన పదార్థాలన్నీ ఒక్కొక్కటిగా పేర్చాలి. మూతపెట్టి, స్విచ్ ఆన్ చేస్తే సరి. నిమిషాల్లో శాండ్‌విచ్ తయారైపోతుంది.



మా మంచి సుమతి టీచర్!



ఆ పిల్లలు మహా మొండి. ఎన్నిసార్లు చెప్పినా మాట వినరే! మామూలుగా అయితే ఏ టీచర్‌కి అయినా కోపం వచ్చేస్తుంది. కానీ సుమతి టీచర్ అలా కాదు. ఓపిగ్గా పదే పదే చెబుతుంటారు. అందుకే ఆమె క్లాస్ అంటే ఆ పిల్లలూ చాలా ఇష్టపడుతున్నారు. ఇంతకీ ఆమేం బోధిస్తారంటే...


సుమతి

సుమతి కాదంబరిది కేరళలోని కన్నూర్. డ్యాన్స్ టీచర్‌గా పాతికేళ్ల అనుభవం. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు కూడా. ఓసారి ఎవరో 'బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకి బోధించడం మహా కష్టం. వాళ్లకి నేర్పించడమూ వృథా' అనడం విన్నారట సుమతి. 'ఆ పిల్లలకీ ఎందుకు నేర్పించకూడదు?' అనుకున్నారట సుమతి. అప్పట్నుంచీ ఆమె స్పెషల్ డ్యాన్స్ ప్రయాణం మొదలైంది. బుద్ధిమాంద్యం ఉన్న పిల్లల స్కూళ్లకు వెళ్లి వాళ్లకు శిక్షణివ్వడం ప్రారంభించారు. 'ముందు పాటని వినిపిస్తా. తరవాత కలిసి పాదం కలపడం లాంటివి చేయిస్తా. దాన్ని బట్టి, ఎవరికెలా నేర్పాలో నిర్ణయించుకుంటా' అంటారు సుమతి. ఈమెకి చాలా నృత్యరీతులు వచ్చు. ప్రదర్శనలూ ఇచ్చారు.

'వయసు ఎంతైనా ఈ పిల్లలు పసివాళ్లతో సమానమే. త్వరగా ఏకాగ్రత కోల్పోతుంటారు. ఓపిగ్గా చెప్పాలి. అదే చేస్తున్నా' అనే సుమతి తన ప్రయత్నంతో పిల్లల మనసు గెలుచుకున్నారు. అంతేకాదు, ఎంతోమంది పిల్లల్లో ప్రవర్తన, ఏకాగ్రత పరంగా ఎన్నో మార్పులకూ కారణమయ్యారట. అంతేకాదు, ఆమె ఎన్నో ఏళ్ల కష్టం ఫలించింది. తాజాగా తన విద్యార్థులు ఇప్పుడు సోలో, బృందాలుగా నృత్యప్రదర్శనలు ఇస్తున్నారు. 'ఒకప్పుడు వీళ్లు చేయగలరా? కచ్చితంగా చేయలేరు అనుకున్నవాళ్లంతా ఆశ్చర్యపోతున్నారు. తాజాగా ఓ ప్రోగ్రామ్‌లో పిల్లలు వేదిక మీద డ్యాన్స్ చేస్తోంటే... కిందనున్న ప్రేక్షకులూ వాళ్లతోపాటు పాదం కదిపారు. అది చూసినప్పుడు నా ఆనందానికి అవధుల్లేవు' అనే సుమతి ఈ క్రమంలో ఎన్నో అవార్డులూ అందుకున్నారు. కానీ వాటికన్నా పిల్లల్లో సానుకూల మార్పు రావడం, వాళ్ల భవిష్యత్తు దిశగా ముందుకు సాగడంలోనే తనకు సంతృప్తి అంటారు సుమతి.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఈనాడు సినిమా

వదంతులు నమ్మొద్దు.. సంక్రాంతికి పక్కా


ప్రభాస్

ప్రభాస్ 'ది రాజాసాబ్' సంక్రాంతి బరిలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. కానీ, ఇది మరోసారి వాయిదా పడనున్నట్లు కొన్నిరోజులుగా ప్రచారం వినిపిస్తున్న నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ స్పందించింది. ఇప్పటికే ప్రకటించినట్లుగానే 2026 జనవరి 9న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్పష్టం చేశారు. నిర్మాణానంతర పనులు ఎలాంటి జాప్యం లేకుండా అత్యున్నత సాంకేతిక ప్రమాణాల్ని కాపాడుతూనే వేగంగా సాగుతున్నాయని.. ఈ సంక్రాంతికి తెచ్చే పెద్ద సినిమాటిక్ ఉత్సవాన్ని ఆనందించి, ఆస్వాదించాలని.. ఎలాంటి వదంతులను పట్టించుకోవద్దని ప్రకటనలో పేర్కొన్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ రెండు గెటప్పుల్లో కనువిందు చేయనున్నారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను డిసెంబరులో అమెరికాలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తుండగా.. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఆర్కియాలజిస్ట్ దక్ష వచ్చింది


మీనాక్షి చౌదరి

నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ మిథికల్ థ్రిల్లర్ చిత్రం రూపొందుతోంది. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఆమె ఇందులో దక్ష అనే ఆర్కియాలజిస్ట్‌గా కనిపించనుందని తెలియజేస్తూ మంగళవారం ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో తను ఓ గుహలో పురాతన వస్తువుల్ని పరిశీలిస్తున్నట్లు ఆసక్తికరంగా కనిపించింది. ఈ కథలో మీనాక్షి పాత్ర ఎంతో కీలకంగా ఉండనుందని.. ధైర్యం, భావోద్వేగాల మేళవింపుతో నటనా ప్రాధాన్య పాత్రగా ఉంటుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఇక ఈ సినిమాలో చైతన్య నిధి అన్వేషకుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. స్పర్శ్ శ్రీవాస్తవ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్ చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ సినిమాకి సంగీతం: అజనీశ్ బి లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: రగుల్ డి హెరియన్.

శివ ఎప్పటికీ నిలిచిపోతుంది


నాగార్జున

"దర్శకుడు రాజమౌళి చెప్పినట్లు 'శివ ముందు.. ఆ తర్వాత' అన్నట్లుగానే 'శివ' ఎప్పటికీ నిలిచిపోతుంది'' అన్నారు కథానాయకుడు నాగార్జున. ఆయన.. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ కలయికలో రూపొందిన ఈ కల్ట్ క్లాసిక్ చిత్రం 1989లో విడుదలై ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా ఇప్పుడు 4కె డాల్బీ ఆట్మాస్ వెర్షన్‌లో ఈనెల 14న తిరిగి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర రీరిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ.. "36ఏళ్ల క్రితం దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నాతో ఈ 'శివ' తీసి.. నన్ను పెద్ద స్టార్‌ను చేశారు. తాజాగా ఈ సినిమా మళ్లీ చూశా. అద్భుతంగా అనిపించింది. వర్మ దాదాపు ఆరు నెలలు కష్టపడి ప్రతి సౌండ్ ట్రాక్‌ని మళ్లీ ఒరిజినల్ సినిమా చేసినట్లుగా అద్భుతంగా డిజైన్ చేశాడు. దీన్ని చూశాక ఇప్పుడెందుకు ఇలాంటి సౌండ్ డిజైన్‌తో నేను చేస్తున్న సినిమాలు రావట్లేదనిపించింది. ఈ చిత్రం నిజంగా డాల్బీ ఆట్మాస్‌లో అదిరిపోతుంది. ఈనెల 14న ఈ సినిమాని కొత్తగా అనుభూతి చెందండి" అన్నారు. "36ఏళ్ల క్రితం తీసిన చిత్రమిది. ఇన్నేళ్ల తర్వాత మేమిద్దరం మళ్లీ ఇలా ఒకే వేదికపై నిలబడి.. రీ రిలీజ్ ట్రైలర్ విడుదల చేస్తూ మాట్లాడతామని నేనెప్పుడూ ఊహించలేదు. ఆరోజు నాగార్జున నాకు విజువల్‌గా, సౌండ్ పరంగా చాలా స్వేచ్ఛ ఇచ్చారు. ఇప్పుడూ అలాగే అండగా నిలిచారు. ఈ రీరిలీజ్ వెర్షన్ కోసం కొత్త సాంకేతికతను వాడి సౌండ్‌ను అద్భుతంగా డిజైన్ చేశాం. ఇది అందరికీ ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ.

శంబాల.. ఏ ఒక్కర్నీ నిరాశపరచదు


అర్చన, ఆది, యుగంధర్

"అందర్నీ ఆకట్టుకునే ఆసక్తికర కథాంశంతో రూపొందిన చిత్రం 'శంబాల'. ఇది కచ్చితంగా ఏ ఒక్కరినీ నిరాశపరచదు" అన్నారు ఆది సాయికుమార్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని యుగంధర్ ముని తెరకెక్కించారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. అర్చన అయ్యర్, స్వాసిక కథానాయికలు. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆది సాయికుమార్ మాట్లాడుతూ.. "ఇలాంటి సినిమాలకు ప్రచారం ఎక్కువ కావాలి. అందుకే నెలన్నర ముందుగానే ట్రైలర్ విడుదల చేశాం. దీన్ని ప్రభాస్ విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన అభిమానులు దీన్ని తమ సొంత చిత్రంగా భావిస్తున్నారు. రానా కూడా ట్రైలర్ చూశాక ఫోన్ చేసి మెచ్చుకున్నారు. నాకు ఏ సాయం కావాలన్నా చేస్తానన్నారు. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమాని అందరూ ఆదరిస్తారని నమ్ముతున్నా" అన్నారు. "ఇది థియేటర్‌లో చూడాల్సిన సినిమా. ట్విస్ట్‌లు, మలుపులు అన్నీ అద్భుతంగా కుదిరాయి. దీంట్లోని ప్రతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది" అన్నారు దర్శకుడు యుగంధర్ ముని. ఈ కార్యక్రమంలో అర్చనా అయ్యర్, రవి వర్మ, ఇంద్రనీల్, మధు నందన్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తుకి సిద్ధమైన.. మేడమ్‌సార్ బృందం!


'దిల్లీ క్రైమ్' సీజన్ 3

వాస్తవ సంఘటనల ఆధారంగా నిర్భయ అత్యాచారం కేసు ఇన్వెస్టిగేషన్, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని సాగే హత్యలకు సంబంధించిన కేసుల దర్యాప్తు కథాంశాలతో రూపొందీ గత రెండు సీజన్లుగా ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచింది 'దిల్లీ క్రైమ్' వెబ్‌సిరీస్. ఇప్పుడు హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడే ఓ మహిళను డీసీపీ ఎలా పట్టుకున్నారనే కథాంశంతో మూడవ సీజన్ రూపొందింది. షెఫాలీ షా, హ్యూమా ఖురేషి, రసికా దుగ్గల్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కి తనూజ్ చోప్రా దర్శకత్వం వహించారు. ఈ సీజన్ ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ నెల 13నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా నెట్‌ఫ్లిక్స్ ఇన్‌స్టా వేదికగా "సరిహద్దులను దాటే నేరం..హద్దులు లేని నేరస్థుడు. అయినప్పటికీ మేడమ్‌సార్ బృందం బడీ దీదీని ఎదుర్కొంటుంది" అంటూ అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది. "ఆయుధ రవాణాను ట్రాక్ చేస్తున్నపుడు మేము 30మంది అమ్మాయిల రవాణాను కనుగొన్నాము. వారిని దిల్లీ తీసుకువెళ్తున్నారు. మనం దర్యాప్తు కొనసాగించాలి. ట్రక్కు మార్గంలో ఉన్న అన్ని రాష్ట్రాలను సంబంధిత కేసు ఫైళ్లను పంచుకోవాలని అభ్యర్థించాను" లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ప్రేక్షకులలో సిరీస్‌పై ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఈ సీజన్‌లో షెఫాలీ షా.. డీసీపీ వర్తికా చతుర్వేది పాత్రలో తనదైన శైలిలో కేసు దర్యాప్తు చేస్తూ ప్రేక్షకుల్ని అలరించనుంది.

రాంబాయి నీ మీద నాకు మనసాయే


మనోజ్, భూమా మౌనిక, తేజస్వినీ, అఖిల్


ఇటీవలే ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్స్ నుంచి వచ్చిన 'లిటిల్ హార్ట్స్' సినీ ప్రియుల్ని కడుపుబ్బా నవ్వించి.. ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడీ సంస్థ నుంచి రానున్న కొత్త చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్ ఉడ్డేమారి, తేజస్వినీ రావ్ జంటగా నటించిన ఈ సినిమాని సాయిలు కంపాటి తెరకెక్కించారు. రాహుల్ మోపిదేవితో కలిసి దర్శకుడు వేణు ఊడుగుల నిర్మించారు. ఇది నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాస్ ద్వారా ఈ నెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమాలోని "రాంబాయి నీ మీద నాకు మనసాయనే" అనే గీతాన్ని హీరో మంచు మనోజ్ - భూమా మౌనిక దంపతులు మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చగా.. మిట్టపల్లి సురేందర్ సాహిత్యమందించారు. అనురాగ్ కులకర్ణి, జయశ్రీ పల్లెం ఆలపించారు. మంచు మనోజ్ మాట్లాడుతూ.. "నా కెరీర్‌లో 2.ఓ ఈటీవీ విన్‌లో 'ఉస్తాద్' అనే షోతో మొదలైంది. మంచి కంటెంట్‌తో సినిమాలు, షోలు చేస్తూ విన్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఓ పల్లెటూరిలో జరిగిన వాస్తవ సంఘటనతో ఈ చిత్రం రూపొందించారు. ఈ చిత్ర ముగింపు హృదయాన్ని బరువెక్కించేలా ఉంటుంది. ఒక ప్రేమ జంటకు జరిగిన అన్యాయాన్ని ఓ ఊరంతా బయటకు రాకుండా తొక్కి పెట్టిందంటే అదెంత దారుణమైన విషయమో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమా విడుదలయ్యాక దర్శకుడు సాయిలుకు బెదిరింపు కాల్స్ వస్తాయి. తనిలాంటి అంశాన్ని సినిమాగా చేశాడంటే హాట్సాఫ్. ఇలాంటి మంచి చిత్రాన్ని థియేటర్లలో చూసి ఆశీర్వదించండి" అన్నారు. "ఈ ప్రేమకథలో సంతోషం ఉంది, విషాదం ఉంది. గతించిన చరిత్రకు.. వర్తమానానికి ఈ సినిమా ఓ సాక్ష్యంగా నిలుస్తుంది" అన్నారు నిర్మాత వేణు ఊడుగుల. దర్శకుడు సాయిలు మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని చూసి ప్రేక్షకులు నవ్వుతారు, ఏడుస్తారు" అన్నారు. '15ఏళ్లుగా బయటకు రాకుండా సమాధి చేసిన ఓ నిజాన్ని ఈ చిత్రంతో ప్రేక్షకులకు చూపించనున్నాం" అన్నారు ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్. ఈ కార్యక్రమంలో శివాజీ, చైతు జొన్నలగడ్డ, వంశీ, తేజస్వినీ, అఖిల్, మిట్టపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీలానే ఉండాలనుకుంటున్నా.. ప్రియా


రకుల్ ప్రీత్ సింగ్, మీజాన్ జాఫ్రీ

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'దే దే ప్యార్ దే 2'. ఈ సినిమాకి అన్షుల్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, లవ్ ఫిల్మ్స్ లవ్ రంజన్, అంకుర్ గార్గ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆర్ మాధవన్, మీజాన్ జాఫ్రీ, గౌతమి కపూర్, జావేద్ జాఫ్రీ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానున్న నేపథ్యంలో తాజాగా చిత్రబృందం 'ఇంట్లో దలేర్ పంజాబీలు' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టా వేదికగా '3షాక్' అనే గీతాన్ని విడుదల చేసింది. ఈ పాట "నిజమేంటంటే మామలు చెవిటివాళ్లు.. కానీ వారు ధైర్యానికి సింహం, సత్యానికి నాడి లాంటి వాళ్లు.. నా ప్రియా నేను నీకు బానిసను..నా జీవితంలో యవ్వనం రోజూ వృథా కాదు.. నేను నీలాగే ఉండాలనుకుంటున్నా"అంటూ సాగుతూ రకుల్, మీజాన్‌లు వేసే స్టెప్పులతో ఆకట్టుకునేలా ఉంది. విజయవంతమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దే దే ప్యార్ దే'కు కొనసాగింపుగా ఈ చిత్రం రూపొందుతోంది.

ప్రత్యేకంగా గుర్తుండిపోయే విజయం


జైన్స్ నాని, రాజేశ్ దండా, ఏపీ ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, కిరణ్, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శివ బొమ్మకు

"దీపావళి పండక్కి అందరికీ వినోదం అందించాలనే లక్ష్యంతో 'కె-ర్యాంప్' చేశాం. ఆ నమ్మకం నిజమైనందుకు చాలా ఆనందంగా ఉంది" అన్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన.. యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కించిన ఈ చిత్రాన్ని రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మించారు. ఇది ఈ మధ్య విడుదలైన నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఏపీ శాసనసభ్యుడు పత్తిపాటి పుల్లారావు, నిర్మాత బండ్ల గణేశ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. "నేను రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల్ని కోరుకునేది ఒక్కటే. చిన్న చిత్రాల్ని ఆదరించండి" అన్నారు. ""ఈ చిత్రం విజయవంతమవుతుందని ఓ వేడుకలో చెప్పా. ప్రేక్షకులు ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ బ్లాక్‌బస్టర్ ఇచ్చారు" అన్నారు నిర్మాత రాజేశ్ దండా. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "నాకు భవిష్యత్తులో ఇంకా పెద్ద విజయాలు రావొచ్చు గానీ ఈ 'కె-ర్యాంప్' విజయం ఎప్పటికీ ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో జైన్స్ నాని, బ్రహ్మ కడలి, పృథ్వీ మాస్టర్, చేతన్ భరద్వాజ్, ఛోటా కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో.. అలా మొదలైంది


రాజేంద్ర ప్రసాద్

పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన మహేశ్ చంద్ర చాలా విరామం తర్వాత దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్న పూర్ణమ్మ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్ పటేల్, ఎఫ్ఎం మురళీ (గోదారి కిట్టయ్య) సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను చేసుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మహేశ్ మాట్లాడుతూ.."కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు, ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదోక సందర్భంలో ఈ కథకి కనెక్ట్ అవుతారు. పిఠాపురం నేపథ్యంలో సినిమా అంతా సాగుతుంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం" అని తెలిపారు.

మీరే కనులే వెతికేటి నా తోడు


తరుణ్ భాస్కర్


కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో హరీశ్ రెడ్డి ఉప్పుల తెరకెక్కించిన చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "మీరేలే.. కనులే వెతికేటి నా తోడే" అంటూ సాగిన ఈ పాటకు కమ్రాన్ స్వరాలు సమకూర్చగా.. హరీశ్ రెడ్డి సాహిత్యమందించారు. ఏక్‌నాథ్ ఆలపించారు. "వినోదాత్మకంగా సాగే రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్ ఇది. స్నేహం ప్రధానాంశంగా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. కూర్పు: చాణక్య రెడ్డి, ఛాయాగ్రహణం: ఈశ్వరాదిత్య.

ఆశ్చర్యపరిచేలా ధన పిశాచి సీక్వెన్స్


ప్రేరణ అరోరా

'ప్రేక్షకులకు ఓ గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందించే సినిమా 'జటాధర'. దీంట్లో ధన పిశాచి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌లన్నీ అందర్నీ ఆశ్చర్యపరుస్తాయి'' అన్నారు నిర్మాత ప్రేరణ అరోరా. ఆమె.. జీస్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తున్న ఈ తెలుగు, హిందీ ద్విభాషా చిత్రంలో సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ కల్యాణ్ - అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా తెరకెక్కించారు. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా ఈనెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రేరణ అరోరా విలేకర్లతో మాట్లాడుతూ.. "ఆధ్యాత్మిక అంశాలు, బ్లాక్ మ్యాజిక్, కుటుంబ భావోద్వేగాలు మేళవింపుగా ఈ కథను సిద్ధం చేశారు. అనంత పద్మనాభస్వామి ఆలయ స్ఫూర్తి ఈ కథలో కనిపిస్తుంది. ఈ స్క్రిప్ట్ విన్నప్పుడే దీన్ని తెలుగు, హిందీ భాషల్లో నిర్మించాలని అనుకున్నా. విజువల్‌గా ఓ కొత్త అనుభూతిని అందించే చిత్రమిది" అన్నారు.

మమ్ముట్టి లాంటి వారికి ఆ అవార్డులు అవసరం లేదు


ప్రకాశ్ రాజ్

ఇటీవల కేరళ ప్రభుత్వం 55వ రాష్ట్రీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో దర్శకుడు రాహుల్ సదాశివన్ తెరకెక్కించిన 'భ్రమయుగం' సినిమాకుగాను అగ్రహీరో మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అయితే వీటి ప్రకటన అనంతరం విలేకర్ల సమావేశంలో నటుడు ప్రకాశ్ రాజ్ జాతీయ అవార్డుల జ్యూరీని ఉద్దేశిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. "జాతీయ చలనచిత్ర అవార్డుల విషయంలో జ్యూరీ సభ్యులు రాజీ పడుతున్నారని చెప్పడానికి నాకు అభ్యంతరం లేదు. కేరళ రాష్ట్ర అవార్డుల జ్యూరీ కమిటీకి నేను ఛైర్‌పర్సన్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ఎందుకంటే వాళ్లు నాకు ఫోన్ చేసి .. అవార్డుల ఎంపిక కోసం అనుభవజ్ఞులైన బయటి వ్యక్తులు కావాలని అడిగారు. ఇందులో తాము జోక్యం చేసుకోబోమని చెప్పారు. మీరు నిర్ణయం తీసుకోవడానికి మేము అనుమతిస్తామన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా ఉండేందుకు వాళ్లు తీసుకున్న ఈ నిర్ణయం నచ్చి నేను అంగీకరించాను. అయితే జాతీయ అవార్డుల విషయంలో అలా జరగడం లేదు. పక్షపాతంతో తీసుకునే నిర్ణయాల కారణంగా జాతీయ స్థాయిలో కొందరికి అవార్డులు అందుతున్నాయి. అలాంటి జ్యూరీ, అలాంటి ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులు మమ్ముట్టి లాంటి గొప్ప వ్యక్తులకు అవసరం లేదు''అని ప్రకాశ్ రాజ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశంగా మారాయి.

మమ్ముట్టి గతంలో మూడు సార్లు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. కానీ ఆ తర్వాత ఆయన నటించిన ఎన్నో గొప్ప సినిమాలకు అవార్డులు రాలేదని అభిమానులు నిరాశ వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా...మమ్ముట్టికి ఉత్తమ నటుడిగా కేరళ రాష్ట్ర పురస్కారం వరించింది. దీంతో రాష్ట్ర స్థాయిలో అత్యధిక సార్లు ఉత్తమ నటుడి విభాగంలో అవార్డు అందుకుని మమ్ముట్టి రికార్డు సృష్టించారు.

వేసవికి ఆల్ఫా అమ్మాయిల రాక!


శార్వరీ వాఘ్


అలియా భట్


ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా తెరపైకి రావాల్సిన ఆల్ఫా అమ్మాయిలు వచ్చే ఏడాది వేసవికి అలరించడానికి సన్నద్ధమవుతున్నారట. బాలీవుడ్ అందాల తార అలియా భట్, శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'ఆల్ఫా' సినిమా గురించే ఇదంతా. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ రూపొందిస్తున్న మొదటి మహిళా గూఢచారి చిత్రమిది. శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు. దీన్ని డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. కానీ ఇప్పుడు వీఎఫ్ఎక్స్‌కు ఎక్కువ సమయం పట్టేలా ఉందని వచ్చే ఏడాది ఏప్రిల్ 17న థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే. ఈ స్పైయాక్షన్ చిత్రంలో షారుక్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది.

ప్రతికూలమైనా.. ప్రయత్నాలు ఆగకూడదు! — లైఫ్‌స్కిల్స్



విద్యా సంబంధ వార్షిక పరీక్షలు లేదా పోటీ పరీక్షలు ఏవైనా విద్యార్థులు, ఉద్యోగార్థులు ఉత్తమ మార్కుల కోసమే కృషి చేస్తుంటారు. కానీ ఫలితం మాత్రం ఎక్కువసార్లు ప్రతికూలంగానే వస్తుంటుంది. అందుకని ప్రయత్నం ఆపకూడదు. పెద్ద లక్ష్యాన్ని సాధించాలంటే ప్రణాళిక పక్కాగా ఉండాలి. స్టడీ ప్లాన్ వేసుకుని దానిని నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలి. రోజుకు, వారానికి, నెలకు తగిన ప్రణాళికలు ఉండాలి. వాయిదాల పద్ధతికి స్వస్తి పలకాలి. ఈ ప్రక్రియలో మొదట ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ మధ్యలో వదిలేయకుండా, విజేతగా నిలవడం ఎలాగో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



■ భారతదేశ ఎన్నో ఉపరాష్ట్రపతిగా చంద్రపురం పొన్ను సామి రాధాకృష్ణన్ (సీపీ రాధాకృష్ణన్) 2025, సెప్టెంబరు 12న ప్రమాణ స్వీకారం చేశారు? (ఆరోగ్య సమస్యల కారణంగా జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేసిన తర్వాత 2025, జులై 21 నుంచి ఉపరాష్ట్రపతి పదవి ఖాళీగా ఉంది.) జ: 15

■ 2025 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 8న కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన ప్రసంగం ప్రకారం భారతదేశ అక్షరాస్యత రేటు 2023-24 నాటికి ఎంత శాతంగా ఉంది? (జాతీయ అక్షరాస్యత రేటు 2011లో 74 శాతంగా ఉంది.) జ: 80.9 శాతం

■ భారతదేశపు మొదటి విదేశీ అటల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఐటీ వల ఏ దేశంలో ప్రారంభించారు?
జ: యూఏఈ (ఐటీ దిల్లీ అబుదాబి క్యాంపస్‌లో దీన్ని ప్రారంభించారు.)

■ 'డిఫరెంట్, బట్ నో లెస్' పుస్తకాన్ని ఇటీవల ఏ ప్రముఖ నటుడు రచించారు? (ఇది ఈయన నాలుగో రచన.)
జ: అనుపమ్ ఖేర్

మరింత సమాచారం

సమితిలోని విలువలకు సరైన ప్రాతినిధ్యం!

సగటు/సరాసరి

★ $\text{సగటు} = \frac{\text{రాశుల మొత్తం}}{\text{రాశుల సంఖ్య}}$

★ రాశుల మొత్తం = సగటు × రాశుల సంఖ్య

★ m అంశాల సరాసరి a, n అంశాల సరాసరి b అయితే మొత్తం అంశాల సరాసరి $= \frac{ma + nb}{m + n}$

★ మొదటి n సహజ సంఖ్యల సరాసరి $= \frac{n+1}{2}$

★ మొదటి n సరి సంఖ్యల సరాసరి = n + 1

★ మొదటి n బేసి సంఖ్యల సరాసరి = n

నోట్: అంశాల మధ్య అంతరం సమానంగా ఉన్నప్పుడు

$\text{సరాసరి} = \frac{\text{మొదటి సంఖ్య} + \text{చివరి సంఖ్య}}{2} = \frac{f + l}{2}$

a యొక్క మొదటి n గుణిజాల సరాసరి $= a \times \frac{n+1}{2}$



క్రికెట్‌లో ఆటగాళ్ల ఆటతీరును అంచనా వేయడానికి, ఇంట్లో లేదా వ్యాపారంలో నెలవారీ ఖర్చుల పరిస్థితిని పరిశీలించి నిర్వహణను మెరుగుపరుచుకోడానికి, విద్యార్థులు సాధించిన మార్కులతో వారి ప్రతిభను గుర్తించడానికి, వాతావరణానికి సంబంధించి ఉష్ణోగ్రత, వర్షపాతం తదితరాలను అర్థం చేసుకోడానికి, వివిధ ప్రాంతాల్లో వస్తువుల ధరలను పోల్చడానికి అంకగణితంలో ఒక విలువ సాయపడుతుంది. అదే ఒక సంఖ్యాసమితిలోని విలువలన్నింటికీ ప్రాతినిధ్యం వహించే సగటు లేదా సరాసరి. ఒక్క చూపుతో దత్తాంశం తీరును వివరించేస్తుంది. దాదాపు అన్ని పోటీ పరీక్షల్లో దీనిపై ప్రశ్నలు వస్తున్నాయి. వాటికి వేగంగా, కచ్చితమైన జవాబులను గుర్తించాలంటే సంబంధిత నిర్వచనాలను, సూత్రాలను, గణన పద్ధతులను తెలుసుకోవాలి. వర్గీకృత, అవర్గీకృత దత్తాంశాలపై అవగాహన పెంచుకోవాలి. మధ్యగతం, బాహుళకం మొదలైన కేంద్రస్థాన కొలతలకు, సగటుకు మధ్య తేడాను అర్థం చేసుకోవాలి.

జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్

మాదిరి ప్రశ్నలు

1. మొదటి 10 ప్రధాన సంఖ్యల సరాసరి ఎంత?
1) 12.5 2) 12.9 3) 11.5 4) 11.9

వివరణ: మొదటి 10 ప్రధాన సంఖ్యలు
2, 3, 5, 7, 11, 13, 17, 19, 23, 29

$\text{సరాసరి} = \frac{\text{రాశుల మొత్తం}}{\text{రాశుల సంఖ్య}}$

$= \frac{2+3+5+7+11+13+17+19+23+29}{10}$

$= \frac{129}{10} = 12.9$ జ: 2

2. మొదటి 30 సహజ సంఖ్యల సరాసరి ఎంత?
1) 15 2) 15.5 3) 16 4) 16.5

వివరణ: మొదటి n సహజ సంఖ్యల సరాసరి

$= \frac{n+1}{2} = \frac{30+1}{2} = 15.5$ జ: 2

3. మొదటి 30 సరి సంఖ్యల సరాసరి ఎంత?
1) 31 2) 15.5 3) 30 4) 15

వివరణ: మొదటి n సరిసంఖ్యల సరాసరి
= n + 1 = 30 + 1 = 31 జ: 1

4. 7 యొక్క మొదటి 20 గుణిజాల సరాసరి ఎంత?
1) 70.5 2) 71.5 3) 72.5 4) 73.5

వివరణ: పద్ధతి-1: 7 యొక్క 20 గుణిజాలు
7, 14, 21, ... 140 (అంతరం సమానం)

$\text{సరాసరి} = \frac{f + l}{2} = \frac{7 + 140}{2} = \frac{147}{2} = 73.5$

పద్ధతి 2: 7 యొక్క 20 గుణిజాల సరాసరి

$7 \times \frac{20+1}{2} = 7 \times 10.5 = 73.5$ జ: 4

5. మొదటి 100 పూర్ణాంకాల సరాసరి ఎంత?
1) 50.5 2) 55 3) 49.5 4) 50

వివరణ: మొదటి 100 పూర్ణాంకాలు
0, 1, 2, 3, ... 99 (100వ పూర్ణాంకం → 99)
(అంతరం సమానం కాబట్టి)

$\text{సరాసరి} = \frac{f + l}{2} = \frac{0 + 99}{2} = 49.5$ జ: 3

6. 4 అంశాల సరాసరి 15. అందులో 3 అంశాలు 16, 10, 14 అయితే 4వ సంఖ్య ఏది?
1) 18 2) 16 3) 22 4) 20

వివరణ: పద్ధతి-1: $\text{సగటు} = \frac{\text{రాశుల మొత్తం}}{\text{రాశుల సంఖ్య}}$

$15 = \frac{16 + 10 + 14 + x}{4}$

$60 = 40 + x \Rightarrow x = 60 - 40 \Rightarrow x = 20$


పద్ధతి-2: 16 10 14
−1 +5 +1
⇒ సగటు 15 + 5
= 20 → 4 వ సంఖ్య జ: 4



7. 5 సంఖ్యల సరాసరి 60. అందులో చివరి 4 సంఖ్యల సరాసరి 64 అయితే మొదటి సంఖ్య ఎంత?
1) 44 2) 42 3) 40 4) 38

వివరణ:
$5 \xrightarrow{\text{సరాసరి}} 60 \xrightarrow{\text{మొత్తం}} 5 \times 60 = 300$
$4 \longrightarrow 64 \longrightarrow 4 \times 64 = 256$
44
44 → మొదటి సంఖ్య జ: 1

8. 20 అంశాల సరాసరి 27. ప్రతి అంశాన్ని 3తో గుణించి, 4 కలిపితే వచ్చే నూతన అంశాల సరాసరి ఎంత?
1) 90 2) 85 3) 95 4) 80



వివరణ: నూతన అంశాల సరాసరి
= ఇచ్చిన అంశాల సరాసరి × 3 + 4
= 27 × 3 + 4 = 81 + 4 = 85 జ: 2

9. 40 మంది విద్యార్థుల సగటు వయసు 15 ఏళ్లు. ఉపాధ్యాయుడి వయసును కూడా పరిగణనలోకి తీసుకున్నట్లయితే వారందరి సరాసరి ఒక ఏడాది పెరుగుతుంది. అయితే ఉపాధ్యాయుడి వయసు ఎంత?
1) 56 ఏళ్లు 2) 60 ఏళ్లు
3) 46 ఏళ్లు 4) 50 ఏళ్లు

వివరణ: 40 మంది విద్యార్థుల సగటు వయసు = 15
టీచర్‌ని కూడా కలిపితే మొత్తం = 41 మంది
టీచర్ వయసు = 15 + 41 × 1 = 15 + 41
= 56 సంవత్సరాలు జ: 1

10. ఒక క్రికెట్ ఆటగాడు తన 10వ ఇన్నింగ్స్‌లో 75 పరుగులు చేయడం వల్ల అతడి సరాసరి 5 పరుగులు మెరుగుపరుచుకున్నాడు. అయితే ఆ క్రీడాకారుడి సరాసరి 10వ ఇన్నింగ్స్ ముందు ఎంత?
1) 30 2) 23 3) 24 4) 25

వివరణ: 10వ ఇన్నింగ్స్‌లో చేసిన పరుగులు = 75
10 ఇన్నింగ్స్‌లకు మెరుగుపరుచుకున్న పరుగులు } 10 × 5 = 50
కాబట్టి 10వ ఇన్నింగ్స్‌కు ముందు సరాసరి
= 75 − 50 = 25
నోట్: 10వ ఇన్నింగ్స్ తర్వాత సరాసరి



= 25 + 5 = 30 జ: 4

11. సోమవారం నుంచి శుక్రవారం వరకు సగటు ఉష్ణోగ్రత 30°C. మంగళవారం నుంచి శనివారం వరకు సగటు ఉష్ణోగ్రత 28°C. సోమవారం ఉష్ణోగ్రత 34°C అయితే శనివారం ఉష్ణోగ్రత ఎంత?
1) 26°C 2) 24°C 3) 28°C 4) 30°C

వివరణ: సోమ నుంచి శుక్ర $\xrightarrow{\text{సగటు}}$ 30°C
$\xrightarrow{\text{మొత్తం}}$ 5 × 30 = 150
మంగళ నుంచి శని → 28°C → 5 × 28 = 140
సోమవారం − శనివారం = 10°C
34°C − శనివారం = 10°C
శనివారం = 34°C − 10°C = 24°C జ: 2

12. మూడు సంఖ్యల్లో మొదటి, రెండో సంఖ్యల నిష్పత్తి 4 : 5. 2వ, 3వ సంఖ్యల నిష్పత్తి 2 : 3. ఈ మూడు సంఖ్యల సరాసరి 77. అయితే అందులో చిన్న సంఖ్య ఎంత?
1) 52 2) 54 3) 56 4) 58

వివరణ: 3 సంఖ్యలు $\xrightarrow{\text{సరాసరి}}$ 77 $\xrightarrow{\text{మొత్తం}}$
3 × 77 = 231
(1) : (2) = 4 : 5
(2) : (3) = 2 : 3
$\frac{4}{5} \rightleftarrows \frac{2}{3}$
(1) : (2) : (3)
8 : 10 : 15
3 సంఖ్యల మొత్తం 33 $\xrightarrow{\times 7}$ = 231
చిన్న సంఖ్య 8 ⟶ ? 56 జ: 3



ప్రాక్టీస్ ప్రశ్నలు

1. 11 అంశాల సరాసరి 30. అందులో మొదటి 5 రాశుల సరాసరి 25, చివరి 5 రాశుల సరాసరి 28. అయితే 6వ రాశి విలువ?
1) 45 2) 55 3) 65 4) 75

2. మొదటి 50 బేసి సంఖ్యల సరాసరి?
1) 25 2) 25.5 3) 50 4) 51

3. 20 మంది సభ్యులున్న ఒక గ్రూపు నుంచి 80 కేజీలు బరువు ఉన్న ఒక వ్యక్తిని మార్చి వేరొకరిని తీసుకోవడం వల్ల వారందరి సరాసరి ఒక కేజీ తగ్గింది. కొత్తగా వచ్చిన వ్యక్తి బరువు ఎన్ని కిలోలు?
1) 55 2) 65 3) 60 4) 70

4. 2, 7, 6, x ల సగటు 5. 18, 1, 6, x, y ల సగటు 10. అయితే y విలువ?
1) 5 2) 10 3) 20 4) 30

5. ఒక క్రికెట్ ఆటగాడి బౌలింగ్ సగటు 12.4 పరుగులు/వికెట్. 26 పరుగులకు 5 వికెట్లు తీయడం ద్వారా అతడి బౌలింగ్ సగటు 0.4 తగ్గింది. ఆఖరి మ్యాచ్ వరకు అతడు తీసిన వికెట్ల సంఖ్య ఎంత?
1) 95 2) 90 3) 80 4) 85

సమాధానాలు
1-3; 2-3; 3-3; 4-3; 5-2.



రచయిత: పిరాది నరేష్

అప్పటి ఆదేశాల్లో అవకతవకలపై విచారణ!




జాతీయ అత్యవసర పరిస్థితి సందర్భంలో ఆందోళన

దేశంలో యుద్ధం, అల్లకల్లోలం, దురాక్రమణ, ఆర్థిక సంక్షోభం తదితర అనుకోని పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించేందుకు అసాధారణ అధికారాలు అవసరమవుతాయి. అలాంటి సంకట స్థితి నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడేందుకు రాజ్యాంగం రాష్ట్రపతికి అత్యవసర అధికారాలను ఇచ్చింది. దేశ సమగ్రతను కాపాడేందుకు, రాజ్యాంగబద్ధ పాలనను పునరుద్ధరించేందుకు వాటిని ఉపయోగించాలని నిర్దేశించింది. భారతదేశం ఏకకేంద్ర లక్షణాన్ని సంతరించుకోడానికి, రాష్ట్రాల కార్యనిర్వహణాధికారంతో పాటు పౌరుల ప్రాథమిక హక్కులను కూడా పరిమితం చేయడానికి దోహదపడే ఆ విశేష అధికారాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వాటికి ఉన్న ప్రాధాన్యాన్ని ఇప్పటి వరకు వినియోగించిన వివిధ సందర్భాలను, ఆనాటి ఉద్దేశాలను, సంబంధిత రాజ్యాంగ సవరణలనూ అర్థం చేసుకోవాలి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

రాష్ట్రపతి అత్యవసర అధికారాలు
(జాతీయ అత్యవసర పరిస్థితి)

1. రాష్ట్రపతి అత్యవసర పరిస్థితి అధికారాల గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?
1) 18వ భాగం, ఆర్టికల్ 351 నుంచి 360
2) 18వ భాగం, ఆర్టికల్ 352 నుంచి 360
3) 19వ భాగం, ఆర్టికల్ 352 నుంచి 356
4) 20వ భాగం, ఆర్టికల్ 350 నుంచి 360



2. రాజ్యాంగంలో పేర్కొన్న అత్యవసర అధికారాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) జాతీయ అత్యవసర పరిస్థితి - ఆర్టికల్ 352
బి) రాష్ట్రపతి పాలన - ఆర్టికల్ 356
సి) రాజ్యాంగ అత్యవసర పరిస్థితి - ఆర్టికల్ 358
డి) ఆర్థిక అత్యవసర పరిస్థితి - ఆర్టికల్ 360
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

3. జాతీయ అత్యవసర పరిస్థితికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) యుద్ధం లేదా విదేశీ దురాక్రమణ వల్ల విధిస్తారు.
బి) యుద్ధం కారణంగా విధించే అత్యవసర పరిస్థితిని 'బహిర్గత జాతీయ అత్యవసర పరిస్థితి' అంటారు.
సి) సాయుధ తిరుగుబాటు వల్ల విధించే అత్యవసర పరిస్థితిని 'అంతర్గత అత్యవసర పరిస్థితి' అంటారు.
1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

4. రాష్ట్రపతి విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటనను పార్లమెంటు ఆమోదించే అంశానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) పార్లమెంటు ఉభయ సభలు విడివిడిగా 2/3వ వంతు మెజార్టీతో ఆమోదించాలి.
బి) 30 రోజుల్లోగా ప్రకటనను ఆమోదించాలి.
సి) లోక్‌సభ రద్దయి ఉన్న సందర్భంలో రాజ్యసభ ఆమోదంతో అమల్లోకి వస్తుంది.
డి) పార్లమెంటు ఉభయసభల మధ్య అభిప్రాయ భేదాలు వస్తే ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఆమోదిస్తారు.
1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

5. కేంద్ర కేబినెట్ లిఖితపూర్వక సలహా మేరకు మాత్రమే రాష్ట్రపతి ఆర్టికల్ 352ను ప్రయోగించి జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటన చేయాలని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్ణయించారు?
1) 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976
2) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
3) 52వ రాజ్యాంగ సవరణ చట్టం, 1985
4) 43వ రాజ్యాంగ సవరణ చట్టం, 1977

6. జాతీయ అత్యవసర పరిస్థితి కాలపరిమితికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) పార్లమెంటు ఆమోదిస్తే ఆరు నెలలు అమలులో ఉంటుంది.



పార్లమెంటు భవనం

బి) పార్లమెంటు ఆమోదంతో ఆరు నెలలకు ఒకసారి చొప్పున మూడేళ్లు కొనసాగించవచ్చు.
సి) పార్లమెంటు ఆమోదంతో ఆరు నెలలకోసారి చొప్పున ఎంతకాలమైనా కొనసాగించవచ్చు.
1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి

7. జాతీయ అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు జరిగే పరిణామాన్ని గుర్తించండి.
ఎ) రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపై అయినా పార్లమెంటు చట్టం చేయగలదు.
బి) పార్లమెంటు చేసిన చట్టం జాతీయ అత్యవసర పరిస్థితి ముగిసిన ఆరు నెలల వరకు అమల్లో ఉంటుంది.
సి) పార్లమెంటు సమావేశాలు అందుబాటులో లేనప్పుడు రాష్ట్ర జాబితాకు సంబంధించిన అంశాలపై రాష్ట్రపతి ఆర్డినెన్స్‌ను జారీ చేస్తారు.
1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

8. జాతీయ అత్యవసర పరిస్థితి కారణంగా ఏ లోక్‌సభ పదవీకాలాన్ని ఒక సంవత్సరం పొడిగించారు?
1) మూడో లోక్‌సభ 2) నాలుగో లోక్‌సభ
3) ఐదో లోక్‌సభ 4) ఆరో లోక్‌సభ

9. జాతీయ అత్యవసర పరిస్థితిని బహిర్గత కారణాలతో విధిస్తే ఏ ఆర్టికల్‌లో పేర్కొన్న ఆరు రకాల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు వెంటనే రద్దు అవుతాయి?
1) ఆర్టికల్ 19 2) ఆర్టికల్ 20
3) ఆర్టికల్ 21 4) ఆర్టికల్ 22

10. జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పటికీ 1978 నాటి 44వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం ఏ ఆర్టికల్స్‌లో పేర్కొన్న ప్రాథమిక హక్కులు రద్దు కావు?
1) ఆర్టికల్స్ 20, 21 2) ఆర్టికల్స్ 21, 22
3) ఆర్టికల్స్ 21, 23 4) ఆర్టికల్స్ 21, 31


11. భారత్‌పై చైనా దురాక్రమణ జరిపిన కారణంగా 1962లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ సిఫార్సుల మేరకు జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన రాష్ట్రపతి ఎవరు?
1) డాక్టర్ బాబూరాజేంద్రప్రసాద్
2) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్
3) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
4) జాకీర్ హుస్సేన్



సర్వేపల్లి రాధాకృష్ణన్

12. మన దేశంలో తొలిసారిగా 1962లో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి ఎప్పటినుంచి ఎప్పటి వరకు కొనసాగింది?
1) 1962, అక్టోబరు 26 నుంచి 1968, జనవరి 10
2) 1962, నవంబరు 26 నుంచి 1966, ఫిబ్రవరి 3
3) 1962, డిసెంబరు 3 నుంచి 1964, జులై 18
4) 1962, డిసెంబరు 31 నుంచి 1964, జనవరి 13

13. బంగ్లాదేశ్ అవతరణ సందర్భంగా 1971లో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో ఇందిరా గాంధీ ప్రభుత్వ సిఫార్సుల మేరకు జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన రాష్ట్రపతి ఎవరు?
1) శంకర్ దయాళ్ శర్మ 2) జాకీర్ హుస్సేన్
3) వి.వి.గిరి 4) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్



వి.వి. గిరి

14. మన దేశంలో 1971లో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి కొనసాగిన కాలాన్ని గుర్తించండి.
1) 1971, జులై 18 నుంచి 1975, ఫిబ్రవరి 18
2) 1971, డిసెంబరు 3 నుంచి 1977, మార్చి 21
3) 1971, డిసెంబరు 31 నుంచి 1976, జనవరి 9
4) 1971, డిసెంబరు 18 నుంచి 1975, నవంబరు 26

15. అంతరంగిక అల్లకల్లోలాల కారణంగా 1975లో ఇందిరా గాంధీ ప్రభుత్వ సిఫార్సుల మేరకు జాతీయ అత్యవసర పరిస్థితి విధించిన రాష్ట్రపతి ఎవరు?
1) జ్ఞానీ జైల్‌సింగ్ 2) నీలం సంజీవరెడ్డి
3) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ 4) శంకర్‌దయాళ్ శర్మ

16. అంతరంగిక కారణాలతో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి కొనసాగిన కాలాన్ని గుర్తించండి.
1) 1975, జూన్ 25 నుంచి 1977, మార్చి 21
2) 1975, ఆగస్టు 18 నుంచి 1976, ఫిబ్రవరి 26
3) 1975, నవంబరు 8 నుంచి 1977, ఆగస్టు 19
4) 1975, డిసెంబరు 15 నుంచి 1977, ఏప్రిల్ 30

17. రాజ్‌నారాయణ్ Vs ఇందిరా గాంధీ కేసు సందర్భంగా ఏ హైకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా 1975లో అంతరంగిక అల్లకల్లోలాల పేరుతో జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు?
1) దిల్లీ హైకోర్టు 2) అలహాబాద్ హైకోర్టు
3) మద్రాస్ హైకోర్టు 4) అహ్మదాబాద్ హైకోర్టు

18. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) జాతీయ అత్యవసర పరిస్థితిని దేశవ్యాప్తంగా విధించవచ్చు లేదా దేశంలోని ఏదైనా ఒక ప్రాంతంలో విధించవచ్చు.
బి) జాతీయ అత్యవసర పరిస్థితిని రాష్ట్రపతి ఒక ప్రకటన ద్వారా ఉపసంహరించవచ్చు. దీనికి పార్లమెంటు ఆమోదం అవసరం లేదు.
సి) జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటన 'న్యాయసమీక్ష' పరిధిలోకి వస్తుందని 1980లో మినర్వా మిల్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి, 4) ఎ, బి, సి

19. జాతీయ అత్యవసర పరిస్థితిపై న్యాయసమీక్ష జరిపే అవకాశం లేదని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్దేశించారు?
1) 38వ రాజ్యాంగ సవరణ చట్టం, 1975
2) 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976
3) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
4) 73వ రాజ్యాంగ సవరణ చట్టం, 1992

20. జాతీయ అత్యవసర పరిస్థితిపై న్యాయసమీక్ష జరపవచ్చని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్దేశించారు?
1) 42వ రాజ్యాంగ సవరణ చట్టం 1976
2) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
3) 36వ రాజ్యాంగ సవరణ చట్టం 1975
4) 43వ రాజ్యాంగ సవరణ చట్టం 1977


21. ఆర్టికల్ 352 ప్రకారం అంతరంగిక కారణాలతో జాతీయ అత్యవసర పరిస్థితి విధించరాదని, సాయుధ దళాల తిరుగుబాటుతో మాత్రమే జాతీయ అత్యవసర పరిస్థితిని విధించాలని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్ణయించారు?
1) 44వ రాజ్యాంగ సవరణ చట్టం 1978
2) 97వ రాజ్యాంగ సవరణ చట్టం 2012
3) 52వ రాజ్యాంగ సవరణ చట్టం 1985
4) 65వ రాజ్యాంగ సవరణ చట్టం 1984

22. రాష్ట్రపతి అత్యవసర పరిస్థితి అధికారాలను వినియోగించినప్పుడు భారతదేశం సమాఖ్య లక్షణాన్ని కోల్పోయి ఏకకేంద్ర లక్షణాన్ని సంతరించుకుంటుందని ఎవరు పేర్కొన్నారు?
1) హెచ్.సి.ముఖర్జీ 2) పాల్ ఆపిల్ బీ
3) నానీ పాల్కీవాలా
4) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

23. 'అత్యవసర పరిస్థితి అధికారాలు రాజ్యాంగ సమతౌల్యతను కాపాడే రక్షక కవాటాలు' అని ఎవరు పేర్కొన్నారు?
1) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
2) మహావీర్‌త్యాగి
3) టి.టి.కృష్ణమాచారి 4) కె.టి.షా

24. కింది వాటిలో సరైన జవాబును గుర్తించండి.
ఎ) అత్యవసర పరిస్థితి అధికారాలను మన రాజ్యాంగ నిర్మాతలు భారత ప్రభుత్వ చట్టం, 1935 నుంచి గ్రహించారు.
బి) అత్యవసర పరిస్థితి అధికారాలను ప్రయోగించినప్పుడు ప్రాథమిక హక్కులను రద్దు చేసే విధానాన్ని జర్మనీ రాజ్యాంగం నుంచి గ్రహించారు.
సి) అత్యవసర పరిస్థితి అధికారాలను ప్రయోగించినప్పటికీ జీవించే హక్కును రద్దు చేయకూడదనే విధానాన్ని జపాన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.
1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి

25. మన దేశంలో రెండు సార్లు జాతీయ అత్యవసర పరిస్థితిని విధించడానికి సిఫార్సు చేసిన ప్రధాని ఎవరు?
1) జవహర్‌లాల్ నెహ్రూ
2) ఇందిరా గాంధీ
3) రాజీవ్ గాంధీ
4) చరణ్ సింగ్



ఇందిరా గాంధీ

26. 1975లో అంతరంగిక కారణాలతో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి సందర్భంగా అవకతవకలు జరిగాయనే కారణంతో ఇందిరా గాంధీ ఏ కమిషన్ విచారణను ఎదుర్కొన్నారు?
1) జె.సి.షా 2) కె.టి.షా
3) కృష్ణమీనన్ 4) నటరాజన్



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు
1-2; 2-3; 3-4; 4-2; 5-2; 6-1; 7-4; 8-3; 9-1; 10-1; 11-2; 12-1; 13-3; 14-2; 15-3; 16-1; 17-2; 18-4; 19-1; 20-2; 21-1; 22-4; 23-2; 24-4; 25-2; 26-1.

భిన్న పరీక్ష

సూచన (ప్ర. 1 – 18): దిగువ ఇచ్చిన ప్రశ్నల్లో భిన్నమైనదాన్ని గుర్తించండి.

1. 1) 253 2) 473 3) 143 4) 633

సాధన: 633 తప్ప మిగతావన్నీ 11తో భాగించవచ్చు.

సమాధానం: 4

2. 1) పారిస్ 2) ఒట్టావా 3) క్యాట్ 4) కైరో

సాధన: క్యాట్ అనేది మయన్మార్ కరెన్సీ కాగా, కైరో, పారిస్, ఒట్టావా అనేది వరసగా ఈజిప్ట్, ఫ్రాన్స్, కెనడాల రాజధాని నగరాలు.

సమాధానం: 3

3. 1) YXW 2) FGH 3) NML 4) TSR

సాధన: $Y \xrightarrow{-1} X \xrightarrow{-1} W$

$F \xrightarrow{+1} G \xrightarrow{+1} H$


$N \xrightarrow{-1} M \xrightarrow{-1} L$

$T \xrightarrow{-1} S \xrightarrow{-1} R$

సమాధానం: 2

4. 1) MZLY 2) IVHU 3) KXJW 4) GESO

సాధన:



సమాధానం: 4

5. 1) 339 2) 326 3) 428 4) 338

సాధన: $339 \Rightarrow 3 \times 3 = 9$

$326 \Rightarrow 3 \times 2 = 6$

$428 \Rightarrow 4 \times 2 = 8$

$338 \Rightarrow 3 \times 3 = 9 \neq 8$

సమాధానం: 4

6. 1) చెట్టు : కాండం 2) మొక్క : పువ్వు
3) ముఖం : కన్ను 4) కుర్చీ : సోఫా

సాధన: కుర్చీ - సోఫా తప్ప మిగతా జతల్లో రెండోది మొదటి దానిలో భాగం.

సమాధానం: 4

7. 1) సర్వేపల్లి రాధాకృష్ణన్ 2) సి. రాజగోపాలాచారి
3) ఆచార్య కృపలానీ 4) సి.వి.రామన్

సాధన: ఆచార్య కృపలానీ తప్ప మిగిలినవారు భారతరత్న అవార్డు గ్రహీతలు.

సమాధానం: 3

8. 1) బెవిన్ 2) విన్‌స్టన్ చర్చిల్
3) నెవిల్లే చాంబర్లిన్ 4) క్లెమెంట్ అట్లీ


సాధన: బెవిన్ తప్ప అందరూ యూకే ప్రధానమంత్రులు కాగా బెవిన్ యూకే విదేశాంగ కార్యదర్శి.

సమాధానం: 1

9. 1) 1942 2) 1925 3) 1935 4) 1985

సాధన: 1942 తప్ప మిగతావన్నీ బేసి సంఖ్యలు, అంతేకాకుండా వాటన్నింటినీ 5తో నిశ్శేషంగా భాగించవచ్చు.

సమాధానం: 1



పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి భిన్న పరీక్ష అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. ఇందులో వచ్చే ప్రశ్నలు ఇంగ్లిష్ అక్షరమాల, అంకెలు, సంఖ్యలు, చిత్రాలు, దేశాలు, కరెన్సీ, క్రీడలు, ప్రముఖ వ్యక్తులు, ఇతర అనేక రూపాల్లో ఇస్తారు. నాలుగు లేదా అయిదు ఐచ్ఛికాలను ఇచ్చి వాటిలో భిన్నమైంది ఏదో కనుక్కోమంటారు. వీటిలో ఒకటి తప్ప మిగతావన్నీ ఒకే రకమైన క్రమపద్ధతిని పాటిస్తాయి. ఏదైతే వీటన్నింటికీ భిన్నంగా ఉంటుందో అదే జవాబు అవుతుంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

అన్నింటిలో భిన్నం.. అదే అసలైన సమాధానం!

10. 1) (47, 49) 2) (29, 31) 3) (11, 13) 4) (5, 7)

సాధన: (47, 49) తప్ప మిగతావన్నీ ప్రధాన సంఖ్యలు

సమాధానం: 1

11. 1) 1234 2) 1189 3) 9100 4) 8110

సాధన: $1234 \Rightarrow 1 + 2 + 3 + 4 = 10$

$1189 \Rightarrow 1 + 1 + 8 + 9 = 19 \neq 10$

$9100 \Rightarrow 9 + 1 + 0 + 0 = 10$

$8110 \Rightarrow 8 + 1 + 1 + 0 = 10$

సమాధానం: 2

12. 1) $140 \longrightarrow 45$ 2) $80 \longrightarrow 25$
3) $110 \longrightarrow 35$ 4) $100 \longrightarrow 30$

సాధన: $45 \times 3 + 5 = 140$

$25 \times 3 + 5 = 80$

$35 \times 3 + 5 = 110$

$30 \times 3 + 10 = 100$

సమాధానం: 4

13. 1) 36 – 145 2) 64 – 255 3) 91 – 363 4) 16 – 63

సాధన: $36 \times 4 + 1 = 145$

$64 \times 4 - 1 = 255$

$91 \times 4 - 1 = 363$

$16 \times 4 - 1 = 63$

సమాధానం: 1

14. 1) 248 2) 3612 3) 4810 4) 51020

సాధన: $248 \Rightarrow 2 \times 2 = 4 \Rightarrow 4 \times 2 = 8$

$3612 \Rightarrow 3 \times 2 = 6 \Rightarrow 6 \times 2 = 12$

$4810 \Rightarrow 4 \times 2 = 8 \Rightarrow 8 \times 2 = 16 \neq 10$

$51020 \Rightarrow 5 \times 2 = 10 \Rightarrow 10 \times 2 = 20$

సమాధానం: 3

15. 1) 1, 0.75, 0.5, 1.25 2) 4, 3, 2, 5
3) 1, 4, 2, 8 4) 2, 1.5, 1, 2.5

సాధన: మూడో సంఖ్య × 2 = మొదటి సంఖ్య

మూడో సంఖ్య × 1.5 = రెండో సంఖ్య

మూడో సంఖ్య × 2.5 = నాలుగో సంఖ్య

సమాధానం: 3

16. 1) 125 2) 512 3) 1331 4) 1728

సాధన: $125 \Rightarrow 1 + 2 + 5 = 8$

$512 \Rightarrow 5 + 1 + 2 = 8$

$1331 \Rightarrow 1 + 3 + 3 + 1 = 8$

$1728 \Rightarrow 1 + 7 + 2 + 8 = 18 \neq 8$

సమాధానం: 4

17. 1) ANBP 2) CPDQ 3) IVJW 4) FSGT

సాధన: $C \xrightarrow{+13} P;\ D \xrightarrow{+13} Q$

$F \xrightarrow{+13} S;\ G \xrightarrow{+13} T$

$I \xrightarrow{+13} V;\ J \xrightarrow{+13} W$

$A \xrightarrow{+13} N;\ B \xrightarrow{+14} P$

సమాధానం: 1

18. 1) PRSQ 2) UWXV 3) LONM 4) CEFD

సాధన: P R $\xrightarrow{+1}$ S Q (P $\xrightarrow{+1}$ Q)

U W $\xrightarrow{+1}$ X V (U $\xrightarrow{+1}$ V)

L O $\xrightarrow{-1}$ N M (L $\xrightarrow{+1}$ M)

C E $\xrightarrow{+1}$ F D (C $\xrightarrow{+1}$ D)

సమాధానం: 3



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

Word of the Day

821

Gaffe

Telugu meaning: పొరపాటు, తప్పటడుగు

English meaning: The word gaffe (గ్యాఫ్) is a noun that refers to an unintentional act or remark causing embarrassment; a social or public mistake.


Synonyms: Blunder, Slip

Antonyms: Accuracy, Perfection

Usage: **1.** The politician's gaffe during the live debate became viral within minutes.

2. He realized his gaffe only after everyone in the meeting started laughing.

కరెంట్ అఫైర్స్



పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగంలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రూ.లక్ష కోట్ల నిధిని ప్రధాని నరేంద్ర మోదీ 2025, నవంబరు 3న ప్రారంభించారు. 'శాస్త్ర సాంకేతికతల నవకల్పనల సమ్మేళనం' (ఎస్టిక్-2025)ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఇకపై ఏటా దీన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.



మన దేశ బయోఎకానమీ రంగం 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల (సుమారు రూ.26.40 లక్షల కోట్లు) స్థాయికి చేరుతుందని నీతి ఆయోగ్ నివేదిక అంచనా వేసింది. వ్యవసాయం, అటవీ, మత్స్య సంపద, ఆక్వా కల్చర్‌లను కలుపుకుని, మన దేశంలో బయోఎకానమీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని వెల్లడించింది. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దార్శనికతకు, వ్యవసాయ పరివర్తన కేంద్రంగా ఉందని 'రీఇమాజినింగ్ అగ్రికల్చర్: ఎ రోడ్‌మ్యాప్ ఫర్ ఫ్రంటియర్ టెక్నాలజీ లీడ్ ట్రాన్స్‌ఫర్మేషన్' పేరుతో విడుదల చేసిన నివేదికలో నీతి ఆయోగ్ వివరించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన ఎస్.బొజ్జిరెడ్డిని 2025, నవంబరు 3న ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా గొర్ల సునీత, కద్రక మల్లేశ్వరరావు, కె.లక్ష్మి, సాయిరాం కిల్లో, పి.వెంకటప్పలను నియమించింది. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా 2025, అక్టోబరులో 2,070 కోట్ల లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. వీటి మొత్తం విలువ రూ.27.28 లక్షల కోట్లు. 2016లో యూపీఐ సేవలు ప్రారంభమయ్యాక, ఒక నెలలో ఇంతటి స్థాయిలో లావాదేవీలు జరగడం ఇప్పుడే.

✦ 2025 సెప్టెంబరులో 1,963 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. వీటి విలువ రూ.24.9 లక్షల కోట్లు. వీటితో పోలిస్తే అక్టోబరులో లావాదేవీల సంఖ్య 5.6%, విలువ 10% పెరిగింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవం

నవంబరు 5
చరిత్రలో ఈనాడు

సముద్ర అంతర్భాగంలో భూకంపాలు ఏర్పడినప్పుడు అలలు భారీ పరిమాణంలో ఎగసిపడి, తీర ప్రాంతానికి చేరడాన్ని సునామీ అంటారు. అత్యంత ఎక్కువగా ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగించి, తీవ్ర విధ్వంసాన్ని సృష్టించి, పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే ప్రకృతి వైపరీత్యాల్లో సునామీ ఒకటి. మహాసముద్రాలు, సముద్రాలు, నదులు, సరస్సుల్లోనూ సునామీలు ఏర్పడతాయి. ఈ విపత్తు గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా **నవంబరు 5న 'ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవం'గా** (World Tsunami Awareness Day) నిర్వహిస్తారు. సునామీ సమయంలో ప్రభావ తీవ్రతను తగ్గించడం, సహజ సంసిద్ధతను మెరుగుపరచడం లాంటి విషయాలపై ప్రధానంగా ఈ రోజు దృష్టి సారిస్తుంది.

సునామీ

సముద్ర ఉపరితల నీరు తరంగాల ద్వారా ఉప్పొంగడమే సునామీ.

- 1963లో అమెరికాలోని హవాయి దీవుల్లో జరిగిన అంతర్జాతీయ శాస్త్రవేత్తల మహాసభ 'సునామీ' అనే పదాన్ని అధికారికంగా నిర్ణయించింది.
- ఐక్యరాజ్యసమితి (యూఎన్‌ఓ) ప్రకారం, గత శతాబ్ద కాలంలో (1925-2025) 58 సునామీలు సంభవించగా, వాటి వల్ల 2,60,000 మందికి పైగా మరణించారు. సగటున ఒక్కో ఘటనకు 4,600 మంది చనిపోయినట్లు యూఎన్‌ఓ వెల్లడించింది.

కారణాలు

సముద్రం లోపల లేదా దగ్గర కొండ చరియలు విరిగి, జారిపడి నీటి కదలికలతో సునామీ ఏర్పడొచ్చు. దీన్ని భూపాతం అంటారు. 1958లో అలస్కాలోని లిటుయాబే ప్రాంతంలో భూపాతం కారణంగా సునామీ ఏర్పడింది.

☛ తీరానికి సమీపంలో లేదా సముద్రం లోపల ఉన్న అగ్నిపర్వతాలు విస్ఫోటం చెందినప్పుడు సముద్ర నీరు పెద్ద ఎత్తున ఎగసి, సునామీగా మారవచ్చు. 1983లో ఇండోనేసియాలోని క్రాకటోవా అగ్నిపర్వతం విస్ఫోటం చెంది 40 మీటర్ల ఎత్తులో సునామీ కెరటాలు ఏర్పడ్డాయి.




☛ సముద్ర భూతలం కింద లేదా తీరానికి సమీపంలో సంభవించే భూకంపాల కారణంగా సముద్ర భూతలం కదలి సునామీకి దారితీస్తుంది. సాధారణంగా సముద్ర గర్భంలో రిక్టర్ స్కేలుపై 7.5 పాయింట్ల తీవ్రత ఉన్న భూకంపాలు వస్తేనే సునామీలు సంభవిస్తాయి.

సునామీల వ్యాప్తితోపాటు 2025 ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవ నినాదం గురించి తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

భారత జాతీయోద్యమం (1935-39)

గాంధీజీ నాయకత్వంలో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమం భారతదేశ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టం. ఇది ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను బలంగా రగిల్చింది. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అనేక రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకుంది. ఆ పార్టీపై మహాత్మా గాంధీ ప్రభావం అలాగే నిలిచిపోయింది. అయినప్పటికీ సామ్యవాదం, కమ్యూనిజం మొదలైన సిద్ధాంతాల ఆవిర్భావంతో కాంగ్రెస్‌లో కొంత మార్పు వచ్చింది. 1935-39 మధ్యకాలంలో భారతదేశంలో జరిగిన జాతీయవాద రాజకీయాలు, 'భారత ప్రభుత్వ చట్టం-1935', కాంగ్రెస్ మంత్రివర్గాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



భారత ప్రభుత్వ చట్టం–1935

సైమన్ కమిషన్ నివేదిక, మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో వచ్చిన సూచనలన్నీ కలిపి 1933లో ఒక శ్వేతపత్రంగా వెలువడ్డాయి.

☛ వీటిని పరిశీలించేందుకు లార్డ్ లిన్‌లిత్‌గో నాయకత్వంలో పార్లమెంట్ ఒక జాయింట్ సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేసింది. దీని నివేదిక ఆధారంగా బ్రిటిష్ పార్లమెంట్ 'భారత ప్రభుత్వ చట్టం-1935'ను ప్రవేశపెట్టింది.

కాంగ్రెస్ అధ్యక్షులుగా నెహ్రూ, 1937లో సాధారణ ఎన్నికలు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ స్థాపన, రెండో ప్రపంచ యుద్ధం - భారత జాతీయ కాంగ్రెస్, ఆగస్టు ప్రతిపాదన, క్రిప్స్ రాయబారం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Junior Resident Jobs

The All India Institute of Medical Sciences (AIIMS Raebareli) in Raebareli is temporarily conducting interviews for the Junior Resident. There are 16 posts in total. The interview date is 10 November 2025.

Executive Posts

NTPC Mining Limited invites applications to fill the Coal Mining Projects/Offices posts in the states of Jharkhand, Chhattisgarh, and Odisha on a fixed-term basis. The total no. of posts is 21. The last date for online applications is 15 November 2025.

Senior Resident Jobs

All India Institute of Medical Sciences (AIIMS) in Gorakhpur is conducting interviews for the Senior Resident posts on a contract basis. The total no. of posts is 55. The application fee is Rs.500. Eligible candidates can appear for the interview on 12 November 2025.

Did You Apply..?

Today (November 5) is the last date for the following Jobs

☛ 47 Trainee Engineer posts at BEL Bangalore.
Eligibility: BE/BTech/BSc.

☛ 15 Engineering Assistant Trainee posts in BEL.
Eligibility: Inter, ITI, Diploma.

☛ 20 Officer Trainee posts in Power Grid Corporation.
Eligibility: CA, ICWA (CMA).

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Synonyms

Directions (Qs. 1 - 10): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with five options to choose from. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

1. The CEO's **astute** handling of the economic downturn not only saved the organization from losses but also expanded its market reach.
A) Foolish B) Slow C) Rigid
D) Clever E) Hesitant

2. Despite facing severe challenges, her **indomitable** spirit kept her moving forward with unwavering determination.
A) Weak B) Conquerable
C) Unyielding D) Fragile
E) Doubtful

3. The crowd's **boisterous** cheers echoed through the stadium as the winning goal was scored in the final minute.
A) Lively B) Calm C) Quiet
D) Boring E) Gloomy

4. Every document was reviewed with **meticulous** care to avoid even the slightest error in the final report.
A) Careless B) Precise
C) Rough D) Indifferent E) Casual

5. Her **benevolent** attitude toward the underprivileged made her a symbol of compassion in the entire community.
A) Selfish B) Harsh C) Greedy
D) Proud E) Kind

6. The arbitrator was praised for his **impartial** judgment that brought both parties to a fair resolution.
A) Biased B) Hasty C) Harsh
D) Kind E) Neutral

7. His **melancholy** tone during the farewell speech made everyone realize how deeply he would miss the team.
A) Joyful B) Cheerful C) Amused
D) Sad E) Excited

8. A **pragmatic** leader focuses on practical outcomes rather than getting lost in idealistic visions or lengthy theories.
A) Impractical B) Idealistic
C) Realistic D) Theoretical
E) Dreamy

9. The firefighter's **valiant** efforts during the massive blaze saved dozens of lives and properties.
A) Brave B) Cowardly C) Timid
D) Lazy E) Fearful

10. The professor's **lucid** explanation of complex financial theories helped students understand the concepts effortlessly.
A) Confusing B) Clear
C) Complicated D) Abstract
E) Difficult

Directions (Qs. 11 - 20): In each of the questions given below, a word is given in bold letters and five options are presented. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.

11. Inimical
A) Hostile B) Friendly
C) Helpful D) Neutral
E) Benevolent

12. Conciliate
A) Antagonize B) Appease
C) Irritate D) Enrage
E) Alienate

13. Exculpate
A) Incriminate B) Condemn
C) Acquit D) Blame
E) Sentence

14. Expedite
A) Delay B) Procrastinate
C) Stall D) Hasten
E) Hamper

15. Obviate
A) Cause B) Permit
C) Create D) Encourage
E) Preclude

16. Parsimonious
A) Stingy B) Extravagant
C) Generous D) Lavish
E) Magnanimous

17. Quell
A) Incite B) Ignite
C) Suppress
D) Aggravate E) Inflame

18. Sanctimonious
A) Sincere B) Hypocritical
C) Humble D) Modest
E) Genuine


19. Solicitous
A) Indifferent B) Neglectful
C) Aloof D) Caring
E) Unconcerned

20. Torpid
A) Energetic B) Agile
C) Animated
D) Sprightly
E) Lethargic

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

రోబోటిక్స్‌లో ఉన్నత విద్య...



బీటెక్ (ఈసీఈ) 2013లో చేశాను. తర్వాత జాబ్ చేయలేదు. రోబోటిక్స్ మెయింటెనెన్స్, రిపేర్‌పై ఆసక్తి ఉంది. ఈ సబ్జెక్టుతో ఎంటెక్‌లో ఏదైనా ప్రోగ్రామ్ ఉందా? - పమ్మీ



■ మీరు 2013లో బీటెక్ పూర్తి చేశారు. అంటే, మీ ప్రస్తుత వయసు దాదాపు 34 సంవత్సరాలు ఉండొచ్చు. గత పన్నెండేళ్లగా ఏ ఉద్యోగమూ చేయలేదని చెప్పారు. ఇప్పుడు ఎంటెక్ చదవాలంటే గేట్‌లో అర్హత పొందాలి. ఈ పరీక్ష ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. దీనికి జాతీయ స్థాయిలో చాలా ఎక్కువ పోటీ ఉంటుంది. కాబట్టి, గేట్ కోసం కనీసం ఏడాది పాటు పూర్తి సన్నద్ధత అవసరం. రోబోటిక్స్ అనేది ఆధునిక శాస్త్ర సాంకేతిక ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఒకటి. పరిశ్రమలు, వైద్య రంగం, వ్యవసాయం, రక్షణ, అంతరిక్ష పరిశోధన, ఎడ్యుటెక్, సర్వీస్ సెక్టర్ వంటి అనేక రంగాల్లో రోబోట్స్ వినియోగం వేగంగా పెరుగుతూ ఉండటంతో, ఈ రంగంలో నైపుణ్యం ఉన్నవారికి భారీ డిమాండ్ ఉంది.

రోబోటిక్స్‌లో ఉన్నత విద్య కొనసాగించాలంటే, ముఖ్యంగా ఎంబెడెడ్ సిస్టమ్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాల సమన్వయం చాలా అవసరం. మీరు బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదివారు కాబట్టి, రోబోటిక్స్ రంగంలోకి ప్రవేశించడం సులువవుతుంది. ఎంటెక్‌లో.. ఎంబెడెడ్ సిస్టమ్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ.. మొదలైనవి ఎంచుకోవచ్చు. ఆసక్తి ఉంటే, ఈ సబ్జెక్టుల్లో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు కూడా పూర్తి చేసుకోవచ్చు. రోబోటిక్స్ మెయింటెనెన్స్, రిపేర్ రంగంలో రాణించాలంటే.. అకడమిక్ సర్టిఫికెట్లతో పాటు నైపుణ్యాలూ చాలా ముఖ్యం.

–ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ప్రాజెక్ట్ అసిస్టెంట్: 03
అర్హత: సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.25,000 - రూ.35,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ నవంబరు 9.
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.iith.ac.in/careers/

కొలువుల నెలవులు.. డేటా సెంటర్లు

మనుషులకు ఆక్సిజన్ మాదిరిగా వ్యాపార సంస్థలకు డేటా సెంటర్లు ఆయువు పట్టుగా నిలుస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా వీటికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఇటీవలే వైజాగ్‌లో భారీ పెట్టుబడితో ఏ.ఐ. ఆధారిత డేటా సెంటర్ స్థాపన ఉద్యోగార్థుల్లో ఎంతో జోష్ తీసుకొచ్చింది. గూగుల్ జన్మస్థలమైన అమెరికా వెలుపల మరో సంస్థ ఇదేనని, భవిష్యత్తులో లక్షకు పైగా ఉద్యోగాలు యువతకు స్వాగతం పలుకుతాయని ఆ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్ ప్రకటించారు. ఉద్యోగ ప్రపంచంలో నిత్యం డేటా సెంటర్, డేటా సైన్స్ గురించి వింటున్న వేళ గూగుల్ ఏఐ-డేటా సెంటర్ కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.



ఏమిటీ కేంద్రాలు?

ఐటీ మౌలిక వసతుల భౌతిక వ్యవస్థ. సర్వర్లు, డేటా నిల్వలు, నెట్‌వర్కింగ్ సరంజామాలతో కూడిన భౌతిక ఉపకరణాల వ్యవస్థనే డేటా సెంటర్‌గా పిలుస్తారు. సమాచారాన్ని భద్రపరచడం, అవసరమైనప్పుడు ప్రాసెస్ చేయడం, దాన్ని అవసరాలకు తగ్గట్టు వినియోగించడం కోసం డేటా సెంటర్ నెలకొల్పుతారు.

డేటా సెంటర్ ఐటీ కంపెనీలకు మానవ దేహంలో మెదడు వంటిది. అదే అసలైన ఆస్తి. డేటా సెంటర్ ఎంత బలంగా, ఎంత భద్రంగా ఉంటే ఆ కంపెనీకి అంత విలువ ఉంటుంది. ఇటువంటి డేటా సెంటర్లలో గూగుల్ విశాఖలో నెలకొల్పుతున్న డేటా సెంటర్ పెద్దన్న లాంటిది. కంపెనీల వాణిజ్య కార్యకలాపాలకు డేటా సెంటర్లు ఎంతో కీలకం. డిజిటల్ సేవలకు ఇవి పునాదిలా నిలుస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, వివిధ రకాల సేవలు, డేటా విభిన్న రకాలుగా వినియోగానికి ఈ కేంద్రాలు ఆయువుపట్టులా రూపొందుతున్నాయి. ప్రస్తుతం విస్తృతంగా వినియోగంలో ఉన్న క్లౌడ్ కంప్యూటింగ్ సమర్థ నిర్వహణ కోసం డేటా సెంటర్లే మూలం.

ఇవి ఏం చేస్తాయి?

మనం నేటి ఆధునిక జగత్తులో చూస్తున్న ప్రతి డిజిటల్ సేవల వెనుక డేటా సెంటర్ సహకారం ఉంటుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, భారీ రిటైల్ చెయిన్ నిర్వహణ, వందలాది విమానాలతో వేలాది సర్వీసులు నడిపే పౌర విమానయాన సంస్థల కార్యకలాపాలు.. ఇలా ఏ భారీ వాణిజ్య వ్యవహారాలనైనా నిశితంగా పరిశీలిస్తే దాని వెనుక సపోర్టింగ్ వ్యవస్థ డేటా సెంటరే. ఈ మధ్యనే ప్రపంచ వ్యాప్తంగా రెస్టారెంట్ల చెయిన్ మెక్ డోనాల్డ్స్ డేటా హబ్ కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంచుకున్నట్టు, ఇక్కడ వాణిజ్య కార్యకలాపాల చోదక కేంద్రాన్ని నెలకొల్పుతున్నట్టు ప్రకటించింది. దేశ, విదేశాలలో ఉన్న తమ 42 వేల స్టోర్లు, ఆరున్నర కోట్ల కస్టమర్ల సేవల మెరుగుదలకు హైదరాబాద్‌లోని డేటా హబ్ కృషి చేస్తుందని మెక్ డోనాల్డ్స్ వెల్లడించింది. దీనిని బట్టి ఒక డేటా సెంటర్ శక్తి సామర్థ్యాలను అంచనా వేయొచ్చు.

వీటిలో ఏముంటాయి?

డేటా సెంటర్ వ్యవస్థాపనకు భారీ పెట్టుబడులు అవసరం. వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్ కోసం రూ.54వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపింది. డేటా సెంటర్‌లో పెద్ద సర్వర్లు, డేటా భద్రపరిచే వ్యవస్థ, రూటర్లు, ఫైర్‌వాల్స్ ఉంటాయి. వీటికి నిరంతర విద్యుత్ సరఫరా, కూలింగ్ (శీతల) వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు... వీటన్నింటినీ కలిపి చూస్తేనే డేటా సెంటర్ అవుతుంది. ఇంతటి భారీ వ్యవస్థను ఇరవై నాలుగు గంటలూ నిర్వహించేందుకు, పర్యవేక్షించేందుకు, నిత్య సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎంతమంది సిబ్బంది అవసరమో అంచనా వేయవచ్చు. గూగుల్ సంస్థ వీటికి తోడు ఖండాంతరాలకు డేటా రవాణాకు సముద్ర గర్భంలో కేబుళ్లనూ వేస్తామని తెలిపింది.

ఎన్నో రకాలు..

విస్తృతార్థంలో అన్నింటికీ మనం డేటా సెంటర్ అంటున్నప్పటికీ ఇందులో వాటి ప్రయోజనాలను బట్టి వేర్వేరు డేటా సెంటర్లు ఉన్నాయి.

▲ ఒక వాణిజ్య సంస్థ వేర్వేరు ప్రాంతాలలో కార్యకలాపాలు సాగిస్తుంటే తమ డేటా నిర్వహణకు తమ నియంత్రణలోనే ఒక డేటా సెంటర్ ఏర్పాటు చేసుకుంటుంది. ఇది సొంత అవసరాల కోసం ఏర్పాటు చేసుకునే డేటా సెంటర్.

▲ రెండో తరహా డేటా సెంటర్‌లలో బయటి కంపెనీల సర్వర్లు, ఇతర సదుపాయాలను అద్దె చెల్లించే ప్రాతిపదికపై తీసుకొని, తమ నిపుణులతో నిర్వహించడం. పూర్తి డేటా సెంటర్ స్థాపన, నిర్వహణ వ్యయ ప్రయాసలతో కూడుకొని ఉంటుందన్న ఉద్దేశంతో 'లీజు' విధానానికి సంస్థలు మొగ్గు చూపుతాయి.

▲ ఎవరైనా రుసుము చెల్లించి, వాడుకోగల క్లౌడ్ ఆధారిత డేటా సెంటర్‌లు మూడో తరహావి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) అజర్, గూగుల్ క్లౌడ్ ఈ కోవకు చెందుతాయి. ఇంటర్నెట్ ద్వారా ఎప్పటికప్పుడు చెల్లింపు విధానం ద్వారా వినియోగదారులు సేవలు పొందవచ్చు. డిజిటల్ సర్వీసులు వేగంగా విస్తరిస్తున్నందున అన్ని రకాల డేటా సెంటర్లకూ డిమాండ్ ఉంది. ఇలా బడా కార్పొరేట్ సంస్థలు డేటా సెంటర్ల నిర్మాణంపై దృష్టి పెడుతున్నాయి. తమ రిజర్వ్ నిధులను ఈ దిశగా మళ్లిస్తున్నాయి.

ఉద్యోగాల కల్పతరువు

డేటా సెంటర్లు మానవ ప్రమేయం లేని అనేక పనులను క్షణాలలో చక్కబెడుతున్నప్పటికీ, వాటి నిర్మాణం నుంచి నిర్వహణ వరకు పుష్కలంగా ప్రొఫెషనల్స్ అవసరం ఉంది. డేటా సెంటర్ అనేది ఒక 'హార్డ్‌వేర్ వ్యవస్థ'. దీని నుంచి ఆశించిన ఫలాలను అందించేందుకు సమర్థమైన సాఫ్ట్‌వేర్ వ్యవస్థ అనివార్యం. ఈ రెండింటిలోనూ ఐటీ ప్రొఫెషనల్స్ అవసరం ఉంటోంది.

▲ డేటా సెంటర్‌లోని సర్వర్లు, రౌటర్లు, నెట్‌వర్కింగ్ ఉపకరణాల నిర్వహణకు హార్డ్‌వేర్ నిపుణులు అవసరం. కాగా డేటా సెంటర్ ఆధారంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీలో సేవలందించేందుకు సాఫ్ట్‌వేర్ నిపుణులు కీలకం.

▲ భారతదేశం డేటా సెంటర్ల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలిచ్చే ఇండస్ట్రీగా రూపాంతరం చెందుతోంది. ప్రస్తుతం దేశంలో పేరెన్నికగన్న 138 డేటా సెంటర్లు ఉండగా, డేటా సెంటర్ల మార్కెట్ పరిమాణం 200 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతోంది.

▲ శరవేగంగా ఎదుగుతున్న పరిశ్రమలను గుర్తించడం, అందులోని ఉద్యోగాలు, హోదాలు, కావాల్సిన అర్హతలను అవగాహన చేసుకొని, అందుకు తగ్గ నైపుణ్యాలను సాధించే యువతకు అవకాశాలు ఎప్పుడూ ఎదురొస్తాయి.



– యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

వర్క్ ఫ్రమ్ హోమ్

ఇంటర్న్‌షిప్స్

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)
సంస్థ: డిజిటల్ నోట్‌బుక్
నైపుణ్యాలు: గూగుల్ అనలిటిక్స్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ https://shorturl.at/EBXV5

ట్యాలెంట్ అక్విజిషన్
సంస్థ: క్లుపెన్ బిజినెస్ సొల్యూషన్స్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.2,000-3,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/glulU

ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్
సంస్థ: ల్యూనకల్ నైపుణ్యాలు: సీఎస్ఎస్, నెక్స్ట్.జేఎస్, రియాక్ట్, టెయిల్‌విండ్ సీఎస్ఎస్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: నవంబరు 10
☛ https://shorturl.at/JvUMw

డిజిటల్ మార్కెటింగ్ ట్రెయినీ
సంస్థ: ఛాలెంజింగ్ కోడర్
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వర్డ్‌ప్రెస్ స్టైపెండ్: రూ.2,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ https://shorturl.at/DrRXd

వెబ్‌సైట్ బిల్డింగ్
సంస్థ: కిమ్ టొట్లాని
నైపుణ్యాలు: డిజైన్ థింకింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వర్డ్‌ప్రెస్
స్టైపెండ్: రూ.3,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ https://shorturl.at/SQ98a

అకడమిక్ అడ్మిన్ అసిస్టెంట్
సంస్థ: అచీవ్ గ్రేడ్ 9
నైపుణ్యాలు: అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్, మైక్రోసాఫ్ట్ 365, ఎంఎస్-వర్డ్, టీచింగ్
స్టైపెండ్: రూ.14,000-17,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ https://shorturl.at/A3clK

లీడ్ జనరేషన్ ఎగ్జిక్యూటివ్
సంస్థ: అలోర్ నైపుణ్యం: ఈమెయిల్ మార్కెటింగ్ స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: నవంబరు 20
☛ https://shorturl.at/tEjHn

హైదరాబాద్‌లో

మార్కెటింగ్
సంస్థ: టీ-హబ్ ఫౌండేషన్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, కేన్వా, ఫిగ్మా స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/9dfTu

ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్
సంస్థ: టెక్‌డోమ్ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, షెడ్యూలింగ్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 26
☛ https://shorturl.at/Yl80i

డిజైన్ & బ్రాండ్ డాక్యుమెంటేషన్
సంస్థ: గ్రీన్‌స్టేక్స్ నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, కేన్వా, కోరల్‌డ్రా, గూగుల్ స్కెచప్ స్టైపెండ్: రూ.10,000-12,000 దరఖాస్తు గడువు: నవంబరు 20
☛ https://shorturl.at/g5Edg

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: దేవశ్రీ దే నైపుణ్యాలు: కంప్యూటర్ స్కిల్స్, డిజిటల్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.2,500-3,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/NaKRD

గేట్ స్కోరుతో... ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (నీప్కో).. 30 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. గేట్–2025 స్కోరుతో ఎంపిక చేస్తారు.

విభాగాల వారీ.. ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఎలక్ట్రికల్/ మెకానికల్)-18, సివిల్-10, ఐటీ-2 ఖాళీలు ఉన్నాయి. గేట్-2025 స్కోరుతో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు ఉండవు. ఎంపికైనవారికి ఏడాది శిక్షణ ఉంటుంది. సంస్థకు చెందిన పవర్ స్టేషన్లు/ ప్రాజెక్టులు/ ఆఫీసుల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించాలి.

గమనించాల్సినవి: ఇంజినీరింగ్ చివరి ఏడాదిలో ఉన్నవారు, ఫలితాల కోసం చూస్తున్నవారు దరఖాస్తుకు అనర్హులు.
● గేట్-2025 స్కోరు కార్డును తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి.
● ప్రస్తుతం ఉపయోగిస్తోన్న ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లను మాత్రమే దరఖాస్తులో రాయాలి.



ముఖ్యాంశాలు:
అర్హతలు: ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ మెకానికల్ అండ్ ఆటోమేషన్/ సివిల్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజినీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులు సాధించాలి.
వయసు: 01.07.2025 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు రూ.560. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, మహిళలకు ఫీజు లేదు.
వేతన శ్రేణి: నెలకు రూ.50,000-1,60,000. మూలవేతనానికి అదనంగా హెచ్‌ఆర్ఏ, డీఏ, లొకేషన్ బేస్డ్ అలవెన్స్, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే, పీఎఫ్, వైద్య సదుపాయాలుంటాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.11.2025
వెబ్‌సైట్: https://neepco.co.in/

లోకల్ బ్యాంక్ ఆఫీసర్లు

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)..దేశ వ్యాప్తంగా వివిధ శాఖల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ల భర్తీకి ప్రకటన వెలువరించింది.
✦ లోకల్ బ్యాంక్ ఆఫీసర్ (ఎల్‌బీఓ): 750 పోస్టులు (ఆంధ్రప్రదేశ్‌లో 5, తెలంగాణలో 88 ఖాళీలున్నాయి)
విద్యార్హత: ఏదైనా డిగ్రీ, కనీసం ఏడాది బ్యాంకింగ్ అనుభవం, సంబంధిత రాష్ట్ర స్థానిక భాష చదవడం, రాయడం, మాట్లాడటంలో ప్రావీణ్యం ఉండాలి.
వయసు: 20-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.48,480 - రూ.85,920.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, స్థానిక భాష పరీక్షలతో.
ఆన్‌లైన్ పరీక్ష: రీజనింగ్ (25 ప్రశ్నలు 25 మార్కులు), డేటా ఇంటర్‌ప్రెటేషన్ (25 ప్రశ్నలు 25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు 25 మార్కులు), ఇంగ్లిష్ (25 ప్రశ్నలు 25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (50 ప్రశ్నలు 50 మార్కులు) మొత్తం 200 మార్కులకు నిర్వహిస్తారు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు.
దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.59, మిగిలిన అందరికీ రూ.1180.
తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.11.2025.
ఆన్‌లైన్ పరీక్ష: డిసెంబర్ 2025/జనవరి 2026లో.
వెబ్‌సైట్లు: https://www.pnbindia.in/
https://ibpsreg.ibps.in/pnboct25/

సెబీలో.. అసిస్టెంట్ మేనేజర్లు



సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ).. 110 ఆఫీసర్ గ్రేడ్–ఏ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పరీక్షలు, ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు.

మొత్తం ఖాళీల్లో జనరల్ విభాగంలో 56, లీగల్ 20, ఐటీ 22, రిసెర్చ్ 4, అఫీషియల్ లాంగ్వేజ్ 3, ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్)-2, సివిల్-3 ఉన్నాయి. మూడు దశల్లో ఎంపిక చేస్తారు. మొదటి దశలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, రెండో దశలో ఆన్‌లైన్ టెస్ట్, మూడో దశలో ఇంటర్వ్యూ ఉంటాయి.

ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్: మల్టిపుల్ ఛాయిస్ విధానంలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్‌లకు సంబంధించి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. వ్యవధి 60 నిమిషాలు.

పేపర్-2లో కామర్స్, అకౌంటెన్సీ, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, కాస్టింగ్, లీగర్, రిసెర్చ్, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు ఇస్తారు. వంద ప్రశ్నలకు వంద మార్కులు. వ్యవధి 40 నిమిషాలు. పేపర్-1లో 30 శాతం, పేపర్-2లో 40 శాతం చొప్పున కనీసార్హత మార్కులు సాధించినవారిని రెండో దశకు ఎంపిక చేస్తారు.

● రెండో దశలోని ఆన్‌లైన్ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో అన్ని విభాగాలవారికి ఇంగ్లిష్ (డిస్క్రిప్టివ్ టెస్ట్) ఉంటుంది. ఇందులో భాగంగా అభ్యరుల డ్రాఫ్టింట్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు.
● పేపర్-2లో విభాగాలవారీగా సబ్జెక్టు సంబంధిత 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి 60 నిమిషాలు.
● పేపర్-1లో 30 శాతం, పేపర్-2లో 40 శాతం చొప్పున కనీసార్హత మార్కులు సాధించినవారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో ఉంటుంది. ఇంటర్వ్యూలో కూడా ఈ రెండు భాషల్లో ఒక దాన్ని ఎంచుకోవచ్చు.
● ఫేజ్-2కు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు.
● ఫేజ్-2, ఇంటర్వ్యూ మార్కులతో కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.
● ప్రకటనలో సిలబస్ వివరాలను తెలియజేశారు.
● లీగల్, ఇంజినీరింగ్ విభాగాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.
● ఎంపికైనవారికి రెండేళ్ల ప్రొబేషన్ ఉంటుంది.

సన్నద్ధత

● విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టులపై పట్టు సాధిస్తే రాత పరీక్షలో ఎక్కువ మార్కులు పొందవచ్చు. పోటీ పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం వల్ల పేపర్-1 సన్నద్ధత సులభం అవుతుంది.
● మాక్ టెస్టులు రాస్తే.. సమయ నిర్వహణపై స్పష్టత వస్తుంది. ఏ అంశాల్లో బలంగా ఉన్నారో, ఎక్కడ బలహీనంగా ఉన్నారో తెలుసుకుని, సన్నద్ధత మెరుగుపరచుకోవచ్చు.
● వెనకబడిన అంశాలకు అదనపు సమయాన్ని కేటాయిస్తే, స్కోరు పెంచుకోవచ్చు.

ముఖ్యాంశాలు

అర్హతలు: జనరల్ విభాగంలోని ఖాళీలకు.. ఏదైనా మాస్టర్స్ డిగ్రీ/ రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా. లీగల్ విభాగంలో.. బీఎల్, అడ్వకేట్‌గా రెండేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. ఐటీ విభాగంలో.. కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ.

వయసు: 30.09.2025 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1,000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.100. ఫీజుకు 18 శాతం జీఎస్టీ అదనం.

వేతన శ్రేణి: నెలకు రూ.62,500-1,26,100. హెచ్‌ఆర్ఏ, టీఏ, డీఏ, లోకల్, ఫ్యామిలీ, లెర్నింగ్, స్పెషల్‌గ్రేడ్ అలవెన్స్, ఎన్‌పీఎస్, వైద్య, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి.

పరీక్ష తేదీలు: ఫేజ్-1 జనవరి 10, ఫేజ్-2 ఫిబ్రవరి 21

ఫేజ్–1 పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు, రాజమహేంద్రవరం, విజయనగరం, తిరుపతి, శ్రీకాకుళం, నెల్లూరు, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.

ఫేజ్–2 పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.11.2025

వెబ్‌సైట్: sebi.gov.in

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి రెగ్యులర్ ప్రాతిపదికన 12 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ అసిస్టెంట్ ప్రొఫెసర్-10
✦ అసోసియేట్ ప్రొఫెసర్-02
విభాగాలు: యోగా, ఆగమం, ధర్మశాస్త్రం, విశిష్టాద్వైత వేదాంతం, సాహిత్యం, జ్యోతిషం & వాస్తు, రిసెర్చ్ & పబ్లికేషన్స్, వ్యాకరణం..మొదలైనవి. **అర్హత:** సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో పీజీ/పీహెచ్‌డీతో పాటు నెట్/సెట్ స్కోరు
గరిష్ఠ వయసు: 65 ఏళ్లు మించరాదు.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.800. ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.11.2025. ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://nsktu.ac.in/index.php/vacancies/

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మం., రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

రష్యాలోకి ఉక్రెయిన్ డ్రోన్లు

1,300 కి.మీ.లు చొచ్చుకుపోయి దాడి

మాస్కో: ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్లు రష్యన్ భూభాగంలోకి దాదాపు 1,300 కిలోమీటర్ల మేర చొచ్చుకుపోయి ఓ పరిశ్రమపై దాడికి పాల్పడ్డాయి. రష్యా అధికారులు మంగళవారం వెల్లడించారు. ఉక్రెయిన్‌కు చెందిన రెండు డ్రోన్లు రష్యాలోని బష్కోర్తోస్థాన్ ప్రాంతంలో ఉన్న స్టెర్లిటమాక్ నగరంలోని పరిశ్రమపై దాడికి పాల్పడ్డాయని ప్రాంతీయ గవర్నర్ రాడీ హబిరోవ్ వెల్లడించారు. అయితే ఆ రెండు డ్రోన్లనూ గాలిలోనే పేల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని.. పరిశ్రమ యథావిధిగా పని చేస్తోందని గవర్నర్ తెలిపారు. మరోవైపు స్టెర్లిటమాక్‌లోని పెట్రోకెమికల్ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిందని నగర పరిపాలక విభాగం ప్రకటించింది. పేలుడుకు కారణం తెలియదని వివరించింది. ఉక్రెయిన్ దేశీయంగా తయారుచేసిన దీర్ఘశ్రేణి డ్రోన్లు వేలాది కిలోమీటర్ల మేర రష్యా భూభాగంలోకి చొచ్చుకురావడం మాస్కోకు ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు.. తూర్పు దొనెట్స్క్ ప్రాంతంలోని పొక్రొవ్స్క్ నగరంలోకి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న రష్యా సైనికులను నిలువరించేందుకు ఉక్రెయిన్ బలగాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

కిమ్ రాజవంశ విధేయుడు కిమ్ యోంగ్ నామ్ మృతి



సియోల్: రెండు దశాబ్దాల పాటు ఉత్తర కొరియాకు అత్యుత్తమ అధికారిగా వ్యవహరించిన కిమ్ యోంగ్ నామ్ (97) అనారోగ్య సమస్యలతో మృతిచెందినట్లు ఆ దేశ మీడియా తెలిపింది. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారని, గురువారం అంత్యక్రియలు జరగనున్నట్లు తెలిపింది. ఉత్తర కొరియా అధ్యక్షుడైన కిమ్ జోంగ్ ఉన్ వంశానికి గత కొన్ని దశాబ్దాలుగా కిమ్ యోంగ్ నామ్ విధేయుడిగా ఉన్నారు. రబ్బర్ స్టాంపుగా పేరొందిన ఆ దేశ 'సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ'కి 1998 నుంచి 2019 ఏప్రిల్ వరకు అధ్యక్షుడిగా కొనసాగారు. దేశంలో కిమ్ జోంగ్ ఉన్, ఆయన తండ్రి కిమ్ జోంగ్-2కు సంబంధించిన అధికారిక కార్యక్రమాల్లో ఉత్సాహభరితమైన ప్రసంగాలకు కిమ్ యోంగ్ నామ్ పేరొందారు.

ఎన్నడూ ముందుగా అణుపరీక్షలు చేయలేదు

పాకిస్థాన్ స్పష్టీకరణ

ఇంటర్నెట్ డెస్క్: రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలకు పాల్పడుతున్నాయంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్థాన్ స్పందించింది. ఈ విషయంపై ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడూ ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలు నిర్వహించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం పాక్ కాదని.. అదేవిధంగా అణు పరీక్షలను తిరిగి ప్రారంభించిన మొదటి దేశం కూడా కాదని స్పష్టంచేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు.

జేడీ వాన్స్ వ్యాఖ్యలు దేశంలో హిందూ వ్యతిరేకతను ఎగదోస్తున్నాయి

అమెరికన్ చట్టసభ సభ్యుడు రాజా కృష్ణమూర్తి

ఇంటర్నెట్‌డెస్క్: తన సతీమణి ఉషా వాన్స్ మతం మార్చుకునే విషయంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలను భారతీయ- అమెరికన్ అయిన కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి తీవ్రంగా ఖండించారు. ఉపాధ్యక్షుడి వ్యాఖ్యలు అమెరికాలో హిందూ వ్యతిరేకతను మరింత ఎగదోస్తున్నాయన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "అమెరికాలో భారతీయ- అమెరికన్లపై పెరుగుతున్న పక్షపాతం, సామూహిక బహిష్కరణలు ఆందోళన కలిగిస్తున్నాయి. హిందూ వ్యతిరేక భావాలు పెరుగుతున్న సమయంలో సొంత పార్టీ సభ్యుడైనా వాన్స్ వ్యాఖ్యలు తీవ్ర నిరాశపరిచాయి. ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూ వ్యతిరేకతకు ఆజ్యం పోసినట్లుగా ఉన్నాయి" అని పేర్కొన్నారు. ఉషా వాన్స్ భారతీయ అమెరికన్ అయిన విషయం తెలిసిందే.

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ బరిలో.. హైదరాబాదీ మహిళ గజాలా హాష్మీ



న్యూయార్క్: అమెరికాలో మంగళవారం అనేక పదవులకు జరిగిన ఎన్నికలు ప్రత్యేకతను చాటుకున్నాయి. హైదరాబాద్‌లో జన్మించి అమెరికాకు వలస వచ్చిన గజాలా హాష్మీ వర్జీనియా రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి పోటీ పడ్డారు. నాలుగేళ్ల ప్రాయంలో తన తల్లి, సోదరుడితో కలిసి గజాలా అమెరికాలోని జార్జియాకు వెళ్లారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆమె తండ్రి ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. చదువుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ అనేక స్కాలర్‌షిప్పులు ప్రోత్సాహకాలు అందుకున్న గజాలా.. జార్జియా సదరన్ విశ్వవిద్యాలయంలో బీఏ ఆనర్స్ చదివారు. అట్లాంటాలోని ఎమరి వర్సిటీ నుంచి సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. అజహర్‌తో వివాహం అనంతరం గజాలా 1991లో రిచ్‌మండ్ ప్రాంతానికి మారారు. 30 ఏళ్ల పాటు ఆమె అక్కడే రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2019లో ఆమె తొలిసారిగా అమెరికా ఎన్నికల్లో గెలుపొందారు. 2024లో ఆమె సెనేట్ విద్య, వైద్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా డెమోక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

ఖర్గేజీ.. రాహుల్ పెళ్లి జరిగితే మమ్మల్ని పిలవండి: భాజపా

ఇంటర్నెట్ డెస్క్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెళ్లి ఎప్పుడు జరుగుతుందో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పాలని కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ కోరారు. "ఖర్గేజీ! మీ కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ) పెళ్లి ఎప్పుడైనా జరిగితే పిలవండి. దానికి మేం కచ్చితంగా హాజరవుతాం" అని చెప్పారు. సొంత కుమారుడి పెళ్లి అన్నట్లుగా బిహార్ ఎన్నికల్లో ప్రధాని మోదీ ప్రచారం చేస్తున్నారని ఖర్గే ఇటీవల చేసిన వ్యాఖ్యపై మంత్రి స్పందించి, ఎక్స్‌లో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.

నలుగురిలో ముగ్గురికి తిరస్కరణ

- భారత విద్యార్థి వీసాలపై కెనడా ధోరణి
- ఆగస్టు దరఖాస్తుల్లో 74 శాతం వెనక్కు



ఈటీవీ భారత్: కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురవుతున్నాయి. ఉన్నత విద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థుల వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. ఇలా ఆగస్టు నెలలో 74 శాతం దరఖాస్తులు ఆమోదం పొందనట్లు కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంటు గణాంకాలు పేర్కొంటున్నాయి. 2023లో ఈ మొత్తం 32 శాతంగా ఉంది. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తున్న తరుణంలో వీసాల తిరస్కరణలు భారీగా పెరిగాయి. చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా, మిగతా దేశాల సగటు రేటు 40 శాతం ఉంది. భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా గతేడాది దాదాపు 10 లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41 శాతం భారత్ నుంచే ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం ఉన్నాయి. 2022లో భారతీయ విద్యార్థులకు అమెరికా (19 శాతం), కెనడా (18 శాతం) ప్రధాన గమ్యస్థానాలుగా ఉన్నట్లు ఎడ్‌టెక్ కంపెనీ అప్‌గ్రాడ్ పేర్కొంది. 2023లోనూ అమెరికాకు దరఖాస్తులు భారీగా పెరిగినప్పటికీ, ఆ తర్వాత మారిన పరిస్థితుల కారణంగా విద్యార్థులు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నట్లు వివరించింది. అటు కెనడాకు కూడా 2022లో 18 శాతం మేర వచ్చిన దరఖాస్తులు 2025 నాటికి 9 శాతానికి తగ్గినట్లు వెల్లడించింది. భారీస్థాయిలో విద్యార్థి వీసా దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకొంటున్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామంతో విదేశీ విద్యార్థుల ట్యూషన్ ఫీజులపైనే ఆధారపడి నడుస్తున్న కెనడాలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వాటిలో కొన్నింటిని పెద్ద యూనివర్సిటీల్లో విలీనం చేస్తుండగా, మరికొన్ని మూసివేత ముప్పును ఎదుర్కొంటున్నాయి.

ప్రత్యామ్నాయంగా జర్మనీ

అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు ఐడీపీ ఎడ్యుకేషన్ నివేదికలో వెల్లడైంది. జర్మనీ ఆర్థికవ్యవస్థ బలంగా ఉండటంతోపాటు అక్కడి యూనివర్సిటీలు, కళాశాలలకు సరిపడా ప్రభుత్వ నిధులు అందుతున్నాయి. విదేశీ విద్యార్థుల రాకను జర్మనీ సర్కారు సైతం ప్రోత్సహిస్తోంది. ఆంగ్లంపై పట్టున్న భారతీయ విద్యార్థులకు సులభంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఫలితంగా జర్మనీ విద్యాసంస్థల్లో భారతీయ విద్యార్థుల అడ్మిషన్లు బాగా పెరిగాయి. 2023లో జర్మనీలో భారతీయ విద్యార్థుల అడ్మిషన్లు 49,500 ఉండగా, 2025లో ఇప్పటికే దాదాపు 60,000కు చేరాయి. కెనడా, అమెరికాలతో పోలిస్తే జర్మనీలో చదువు ఖర్చులతోపాటు జీవనవ్యయాలు సైతం తక్కువే ఉంటాయి.

ఉగ్రవాద వ్యతిరేక సహకారం, వాణిజ్యంపై దృష్టి

- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి భేటీ



జైశంకర్‌తో గిడియాన్ సార్

దిల్లీ: భారత పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య ఉగ్రవాద వ్యతిరేక సహకారం, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అదేవిధంగా మరికొన్ని నెలల్లో జరగనున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన విషయమై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఇండియా-పశ్చిమాసియా- యూరప్ వాణిజ్య కారిడార్ (ఐఎమ్‌ఈసీ) ప్రాజెక్టు అమలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా అమెరికా మధ్యవర్తిత్వాన కుదిరిన గాజా శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మెరుగుపడతాయని భారత్ ఆశాభావం వ్యక్తం చేసింది. "అత్యంత కఠిన సమయంలో కూడా భారత్-ఇజ్రాయెల్ కలిసి నిలబడ్డాయి. నమ్మకం, విశ్వసనీయతతో ఉన్నతస్థాయి సంబంధాన్ని ఏర్పరచుకున్నాయి. రెండు దేశాలు ఉగ్రవాదమనే సవాలును ప్రధానంగా ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అడ్డుకోవడానికి ప్రపంచ విధానాన్ని నిర్ధారించే దిశగా ఇరు దేశాలు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరం" అని జైశంకర్ వ్యాఖ్యానించారు. గాజా శాంతి ఒప్పందం కుదిరినప్పుడు తొలుత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేసి అభినందనలు తెలిపింది ప్రధాని మోదీనే అని, ఈ విషయాన్ని తాము గుర్తుంచుకుంటామని గిడియాన్ పేర్కొన్నారు.

షాబుద్దీన్ తనయుడి గెలుపు.. హిందువులకు ఓటమి: హిమంత

సివాన్: బిహార్‌లో ఆర్జేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఒసామా షాహబ్ గెలిస్తే అది హిందువుల ఓటమే అవుతుందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెప్పారు. ఒసామా షాహబ్ పేరే ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌లా ఉందని అన్నారు. గ్యాంగ్‌స్టర్‌గా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చి ఎంపీ అయిన షాబుద్దీన్ తనయుడు ఈసారి ఎన్నికల్లో రఘునాథ్‌పుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో మంగళవారం అక్కడ బహిరంగ సభలో బిశ్వశర్మ ప్రసంగించారు. "హత్యలు చేయడంలో ఒసామా తండ్రి షాబుద్దీన్‌ది ఓ రికార్డు. అందువల్ల ఒసామా చిన్నప్పుడు బొమ్మల బదులు ఏకే-47 తుపాకులతో ఆడుకుని ఉంటాడు. అలాంటి వ్యక్తి గెలిస్తే హిందువులు ఓడిపోయినట్లే. ఫలితాలు వెలువడే రోజు కామాఖ్య ఆలయంలో కూర్చొని నేను ఈ నియోజకవర్గ ఫలితాలను చూస్తుంటా. షాబుద్దీన్ తదనంతరం అతని భార్యను లోక్‌సభ ఎన్నికల్లో ఓడించినట్లే ఈ ఎన్నికల్లోనూ మీరు తీర్పు ఇస్తారని నాకు నమ్మకం ఉంది" అని చెప్పారు.

తూటాకు తూటాతోనే జవాబు

- భారత్‌పై దుస్సాహసం చేస్తే దీటుగా బదులిస్తాం
- పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు అమిత్‌షా స్పష్టీకరణ



బిహార్‌లోని తూర్పు చంపారన్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా

దర్భంగా, మోతీహారి: భారత్‌పై మళ్లీ దుస్సాహసానికి ఒడిగడితే తూటాకు తూటాతోనే సమాధానమిస్తామని పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. బిహార్‌లో ప్రతిపాదిత రక్షణరంగ పరిశ్రమల నడవాలో తయారయ్యే పేలుడు పదార్థాలనే ఆ ఉగ్రవాదులపై వాడతామని చెప్పారు. పహల్గాంలో పౌరుల ప్రాణాలు బలిగొన్న ముష్కరులకు వారి నేలపైనే మన సైన్యం దీటైన జవాబు ఇచ్చిందని గుర్తుచేశారు. మంగళవారం బిహార్‌లోని దర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమారుడు తేజస్వి సీఎం కాలేరని, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తనయుడు రాహుల్ పీఎం కాబోరని చెప్పారు. ఓటు ఎవరికి వేయాలనే విషయంలో బిహార్ ఓటర్లు తప్పుచేస్తే హత్యలు, లూటీలు, అపహరణలు, బెదిరింపులు నిత్యకృత్యమవుతాయని హెచ్చరించారు. ప్రధాని మోదీని, ఆయన తల్లిని ఆర్జేడీ-కాంగ్రెస్ అవమానించిందని, ఎన్నికల్లో బిహార్ ప్రజలు దీనికి ప్రతీకారం తీర్చుకుంటారని చెప్పారు. ఆటవిక పాలన తిరిగి రావద్దంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలని కోరారు. ఇటీవల బిహార్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమచేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలని ఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆ సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారని, లాలూ తాతలు దిగొచ్చినా అది సాధ్యం కాదని చెప్పారు. ఆర్జేడీ పాలనలో బిహార్ ఎలా రక్తసిక్తమైందో గుర్తుచేసుకోవాలన్నారు. అక్రమ వలసదారుల్ని రక్షించేందుకు రాహుల్‌గాంధీ ఎన్ని సభలు నిర్వహించినా తాము మాత్రం వారిని తరిమికొట్టడం ఖాయమని తేల్చిచెప్పారు.

ఎన్డీయేతోనే బిహార్ అభివృద్ధి: రాజ్‌నాథ్

ఎన్డీయే పాలనలోనే బిహార్ అభివృద్ధి బాటలో నడుస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వైశాలీ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆర్జేడీ నేతలు తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి కావాల్సిన డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు.

పేదల హక్కుల్ని దోచుకుని భారీ వాగ్దానాలు చేస్తున్నారు: యోగి

సమస్తీపుర్: బిహార్‌కు ఏదేదో చేసేస్తామని పెద్దపెద్ద వాగ్దానాలు చేస్తున్నవారు 20 ఏళ్ల క్రితం యువత ఉద్యోగాలను దోచుకుని, పేదల హక్కుల్ని లాక్కొన్నారని, ఆటవిక రాజ్యం తెచ్చారని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. 2005లో నీతీశ్‌కుమార్ అధికారంలోకి వచ్చాకే సుపరిపాలన సాధ్యమైందని మంగళవారం సమస్తీపుర్, లఖిసరాయ్ సభల్లో మాట్లాడుతూ తెలిపారు. ఎన్డీయే ఏలుబడిలో అన్ని రంగాల్లో బిహార్ అభివృద్ధి చెందిందన్నారు. యూపీలో మాఫియాలను బుల్డోజర్లతో అణచివేసి, వారి ఆస్తుల్ని పేదలకు పంచినట్టే బిహార్‌లోనూ చేస్తామని చెప్పారు.

అధిక ఉష్ణోగ్రతల నియంత్రణ నగరాల జాబితాలో అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు

- 'సీ40 సిటీస్' సంస్థ వెల్లడి

దిల్లీ: వాతావరణ మార్పుల వల్ల పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి ప్రజలను కాపాడటానికి నడుం కట్టిన 33 నగరాల జాబితాలో అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు కూడా చేరాయి. రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ మద్దతుతో నడిచే సీ40 సిటీస్ సంస్థ ఏర్పరచిన 'కూల్ సిటీస్ యాక్సిలరేటర్' పథకంలో ఈ మూడు భారతీయ నగరాలు భాగస్వాములయ్యాయి. ఈ విషయాన్ని బ్రెజిల్‌లోని రియో డి జనైరో నగరంలో మంగళవారం ప్రారంభమైన 'సీ 40 ప్రపంచ మేయర్ల శిఖరాగ్ర సభ'లో ప్రకటించారు. యాక్సిలరేటర్‌లో రియో, లండన్, న్యూయార్క్, సింగపూర్, జకార్తాలతోపాటు మొత్తం 33 నగరాలు చేరాయి. ఈ నగరాల్లో 14.5 కోట్లమంది నివసిస్తున్నారు. 2030కల్లా ఈ నగరాలను అత్యుష్ణాన్ని తట్టుకునే విధంగా మలచాలని లక్షిస్తున్నారు. మరి రెండేళ్లలో ముందస్తు వాతావరణ హెచ్చరికలు, శీతల వాతావరణ కల్పన, వడ దెబ్బ నుంచి రక్షణ, వైద్య చికిత్స సదుపాయాలను కల్పించడం యాక్సిలరేటర్ పథకంలో అంతర్భాగం. ముఖ్యంగా వయోధికులు, ఆరుబయట పని చేసే కార్మికులు, ఏసీ సౌకర్యం లేనివారిపై ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తారు. అత్యుష్ణం నుంచి నగరాల ప్రజలను కాపాడటానికి సాంకేతిక పరిజ్ఞానపరంగా, భవన నిర్మాణ పరంగా ఇతరత్రా చర్యలు తీసుకోవడానికి రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ ఒక్కో నగరానికి 10 లక్షల డాలర్ల చొప్పున నిధులిస్తుంది. ప్రధాన నగరాల్లో గడచిన రెండు దశాబ్దాలలో పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌ను దాటిన దినాలు 54 శాతం పెరిగాయని సీ 40 కార్యనిర్వాహక డైరెక్టర్ మార్క్ వాట్స్ వివరించారు. ప్రపంచంలో అత్యుష్ణం వల్ల సంభవించే మరణాలు ఏటా 5 లక్షలకు చేరాయి. వెంటనే నివారణ చర్యలు తీసుకోకపోతే 2050కల్లా ఈ మరణాలు ఐదు రెట్లు పెరుగుతాయని అంచనా.

ప్రతి 40 రోజులకు ఓ కొత్త యుద్ధనౌక

- నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి



దిల్లీ: ప్రతి 40 రోజులకు ఒక కొత్త స్వదేశీ యుద్ధ నౌకను లేదా జలాంతర్గామిని భారత నౌకాదళంలోకి చేర్చుతున్నట్లు నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి వెల్లడించారు. సముద్ర జలాల్లో భద్రతా సవాళ్లను మరింత సమర్థంగా ఎదుర్కొనేలా సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించినట్లు తెలిపారు. నౌకాదళంలో 'స్వావలంబన'ను ఓ వ్యూహంగానే కాకుండా, భవిష్యత్తు భరోసాకు పెట్టుబడిగా చూస్తున్నట్లు చెప్పారు. "2035 నాటికి 200కుపైగా యుద్ధనౌకలు, జలాంతర్గాములు కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రస్తుతం ఆర్డర్ చేసిన 52 నౌకలన్నీ మన షిప్‌యార్డ్‌లలోనే నిర్మాణ దశలో ఉన్నాయి" అని దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తెలిపారు. గత దశాబ్ద కాలంలో దేశీయ రక్షణ ఉత్పత్తుల విలువ మూడు రెట్లు పెరిగి గత ఏడాది రూ.1.5 లక్షల కోట్లు దాటిందన్నారు. ఏ నౌకాదళానికైనా స్వావలంబన, సమన్వయం, భద్రత అనేవి మూడు ప్రధాన స్తంభాలని త్రిపాఠి పేర్కొన్నారు. ప్రస్తుత పారిశ్రామిక వ్యవస్థలో సెమీకండక్టర్లు కూడా సబ్‌మెరైన్‌ల మాదిరి కీలకంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

ఎన్నికలను వీక్షించనున్న విదేశీ ప్రతినిధులు

దిల్లీ: బిహార్ శాసనసభకు తొలిదశలో గురువారం జరిగే ఎన్నికలను ఏడు దేశాలకు చెందిన 14 మంది ప్రతినిధులు ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. అంతర్జాతీయ సందర్శకుల కోసం ఎన్నికల సంఘం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా వీరంతా మన దేశానికి వచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్ వివేక్ జోషి మంగళవారం వీరితో ముచ్చటించారు. ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా, బెల్జియం, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్, కొలంబియాల నుంచి వచ్చిన ప్రతినిధులకు ఈవీఎంల పనితీరు గురించి అధికారులు వివరించారు. బుధవారం వీరంతా బిహార్‌లో ఈవీఎంల తరలింపు కేంద్రాలను చూస్తారు. గురువారం పోలింగును పరిశీలిస్తారు.


తగ్గిన భూతాప వృద్ధి అంచనాలు

దిల్లీ: ప్రపంచ దేశాలు వాతావరణ మార్పు నిరోధానికి సంబంధించి తాము చేసిన ప్రతిజ్ఞల మేరకు చర్యలు చేపడితే ఈ శతాబ్దంలో భౌగోళిక ఉష్ణోగ్రత 2.3 నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ వరకూ పెరగొచ్చని ఐక్యరాజ్య సమితి పర్యావరణ పథకం (యూఎన్‌ఈపీ) నివేదిక వెల్లడించింది. అయితే.. గత సంవత్సరం ఈ ఉష్ణోగ్రత పెరుగుదల 2.6 డిగ్రీల సెల్సియస్ నుంచి 2.8 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉండొచ్చని అంచనా వేశారు. కానీ ఏడాది కాలంలో ఉష్ణోగ్రత పెరుగుదల అంచనాల్లో తరుగుదల శుభసూచకమని పర్యావరణ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న ప్రస్తుత విధానాలు భౌగోళిక ఉష్ణోగ్రతను 2.8 డిగ్రీల సెల్సియస్ మేరకు పెంచే అవకాశం ఉందని యూఎన్‌ఈపీ నివేదిక తెలిపింది. భూతాప పెరుగుదల 1.5 డిగ్రీలు మించరాదని పారిస్ ఒప్పందం నిర్దేశించింది.

మణిపుర్‌లో నలుగురు మిలిటెంట్ల హతం

ఇంఫాల్, చురాచాంద్‌పుర్: మణిపుర్‌లోని చురాచాంద్‌పుర్ జిల్లాలో భద్రతా బలగాలతో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిషేధిత సంస్థకు చెందిన నలుగురు మిలిటెంట్లు హతమయ్యారు. ఖాన్పీ గ్రామంలో తెల్లవారుజామున యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీకి (యూకేఎన్‌ఏ) చెందిన మిలిటెంట్లను కాల్చి చంపినట్లు పోలీసులు వెల్లడించారు. మిగిలిన వారు పారిపోయారని తెలిపారు.

బిహార్‌లో ముమ్మాటికీ మాదే గెలుపు: మోదీ



దిల్లీ: బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో జేవీనిని ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. 'ఆటవిక రాజ్యం' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆయన చెప్పారు. తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లోని భాజపా-ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' (నా పోలింగ్ బూత్ అన్నింటికంటే బలమైంది) అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. "బిహార్ ఎన్నికలను నేనెంతో శ్రద్ధగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయే గెలుపు అని ఖాయంగా చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరచడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంది" అని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చెప్పిన ఓ మహిళతో మోదీ మాట్లాడుతూ- పేదలు, దళితులు, మహా దళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన తరగతుల వారి తరఫున ఉండని అన్నారు.

మతమార్పిళ్లపై విచారణలో నా వాదనా వినండి

సుప్రీంకోర్టుకు దళిత యువకుడి విజ్ఞప్తి

దిల్లీ: మత మార్పిడులకు సంబంధించి దాఖలైన అభ్యర్థనలపై జరిగే విచారణలో తన వాదనను వినిపించేందుకు అనుమతించాలని కోరుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. మధ్యప్రదేశ్‌లోని ఒక షెల్టర్ హోమ్‌లో తనను మోసపూరితంగా, బలవంతంగా మతమార్పిడికి గురి చేశారని అభిషేక్ ఖటీక్ అనే ఆ యువకుడి ఆరోపణ. షెల్టర్ హోమ్‌లో తనను బలవంతంగా క్రైస్తవ ప్రార్థనల్లో పాల్గొనేలా చేసేవారని, ఆలయాలు దర్శించకుండా నిరోధించేవారని ఖటీక్ ఆరోపించాడు. బాధితుడి తరఫున న్యాయవాది అశ్వనీ దుబె పిటిషన్ దాఖలు చేశారు. జాతీయ బాలల హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో మధ్యప్రదేశ్‌లోని మాధవ్ నగర్‌లో ఒక బాలల సంరక్షణ కేంద్రంపై జరిపిన ఆకస్మిక తనిఖీ సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ఈ తన పిటిషన్‌కు ప్రాతిపదిక అని పిటిషనర్ పేర్కొన్నారు. నాటి ఆకస్మిక తనిఖీల సందర్భంగా సంరక్షణ కేంద్రానికి చెందిన నలుగురు పిల్లల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆ నలుగురు బాలల్లో ఖటీక్ కూడా ఉన్నాడు. తాము హిందువులమే అయినా తమను ఆలయాలు దర్శించడానికి అనుమతించకుండా క్రైస్తవ ప్రార్థనల్లో పాల్గొనేలా చేసేవారని వాంగ్మూలమిచ్చిన బాలలు ఆరోపించారు.

రైతులకు పరిహారం చెల్లింపు తీర్పును సమీక్షించాలంటూ ఎన్‌హెచ్‌ఏఐ పిటిషన్

విచారణకు అంగీకరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చట్టం(2015) ప్రకారం రైతుల నుంచి సేకరించిన భూములకు వెనుకటి తేదీతో వర్తించేలా వడ్డీతో సహా పరిహారం చెల్లించాలన్న తీర్పును సమీక్షించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును.. అది వెలువడిన 2019 సెప్టెంబరు 19వ తేదీ తర్వాత నుంచే వర్తింపజేయాలని, అంతకు ముందు జరిగిన భూ సేకరణలను దీని పరిధిలోకి తీసుకురావద్దని ఎన్‌హెచ్‌ఏఐ కోరుతోంది. ఈ అభ్యర్థనను ఈ ఏడాది ఫిబ్రవరి 4న సుప్రీంకోర్టు తిరస్కరించగా...మరోసారి ఎన్‌హెచ్‌ఏఐ పిటిషన్ దాఖలు చేసింది. వెనుకటి తేదీ నుంచి తీర్పును వర్తింపజేయడం వల్ల రూ.35వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందని, ఈ మొత్తాన్ని ఇదివరకు రూ.100 కోట్ల మొత్తంగానే అంచనా వేశారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీంతో గత తీర్పును సమీక్షించడానికి అంగీకరించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం సంబంధితులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. వాటికి ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది.

న్యాయాధికారుల పదోన్నతులకు ఏకరూప నిబంధనలపై తీర్పు వాయిదా

దిల్లీ: న్యాయవ్యవస్థ ప్రాథమిక స్థాయిలో న్యాయాధికారులుగా వృత్తి జీవితాన్ని ప్రారంభించే సివిల్ జడ్జీలకు పదోన్నతుల విషయంలో దేశవ్యాప్తంగా ఏకరీతి నిబంధనలు రూపొందించడంపై తీర్పును సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం వాయిదా వేసింది. ఈ అంశంపై పలువురు సీనియర్ న్యాయవాదులు, అమికస్ క్యూరీ సిద్ధార్థ భట్నాగర్ తదితరుల వాదనల అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ తెలిపారు. సీజేఐ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి సభ్యులుగా ఉన్నారు. న్యాయాధికారులకు పదోన్నతుల అంశంలో రాష్ట్రానికో విధానం సరికాదని విచారణ సమయంలో ధర్మాసనం అభిప్రాయపడింది.

ఆన్‌లైన్ గేమ్స్ చట్టాన్ని సవాల్ చేసిన పిటిషన్లకు సమగ్ర సమాధానం ఇవ్వండి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఆన్‌లైన్ మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేసిన పిటిషన్లకు సమగ్ర సమాధానాన్ని దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ గేమ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనలు, బ్యాంకు సేవలపైనా ఆంక్షలను చట్టం విధించింది. కేంద్రం మధ్యంతర అఫిడవిట్‌ను దాఖలు చేయడంపై జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం స్పందిస్తూ....సమగ్ర సమాధానం కావాలని పేర్కొంది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ హాజరుకావాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

అధికారంలోకి వస్తే రైతులకు బోనస్: తేజస్వి

పట్నా: బిహార్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతులకు కనీస మద్దతు ధరతోపాటు బోనస్‌గా వరికి రూ.300, గోధుమలకు రూ.400 చొప్పున ప్రతి క్వింటాలుకు చెల్లిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్), ప్రాథమిక మార్కెటింగ్ సహకార సంఘాల (వ్యాపార్ మండళ్లు) అధిపతులకు ప్రజాప్రతినిధుల హోదా ఇస్తాం. 8,400 వ్యాపార మండలాలు, పీఏసీఎస్ నిర్వాహకులకు గౌరవ వేతనం ఇచ్చేందుకు ఆలోచన చేస్తున్నాం. రైతులకు ఉచిత విద్యుత్తు అందిస్తాం" అని పేర్కొన్నారు. 'మై-బహన్' పథకాన్ని ప్రారంభించి, మహిళలకు ఏడాదికి రూ.30 వేలు కానుకగా అందజేస్తామని వెల్లడించారు. "ప్రతినెలా మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున జమ చేస్తామని ఇదివరకే హామీ ఇచ్చాం. ఇప్పుడు మొత్తం రూ.30 వేలు ఒకేసారి వారి ఖాతాల్లో వేస్తాం" అని తేజస్వి తెలిపారు. బిహార్ ప్రభుత్వం నవరాత్రి కానుకగా 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జమ చేసిన నేపథ్యంలో తేజస్వి ఈ ప్రకటన చేశారు.

భారత్- ఇజ్రాయెల్ మధ్య రక్షణ ఒప్పందం

ఉమ్మడిగా ఆయుధాల ఉత్పత్తికి వీలు

దిల్లీ: భారత్, ఇజ్రాయెల్‌లు మంగళవారం ఒక కీలక రక్షణ ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. వ్యూహాత్మక రంగంలో ఇప్పటికే బలంగా ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను ఇది మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లనుంది. దీనివల్ల అధునాతన ఆయుధ పరిజ్ఞానాలను పరస్పరం పంచుకోవడానికి, సైనిక హార్డ్‌వేర్‌ను ఉమ్మడిగా ఉత్పత్తి చేయడానికి మార్గం సుగమం చేస్తుంది. మంగళవారం భారత్-ఇజ్రాయెల్ సంయుక్త కార్యాచరణ బృందం టెల్ అవీవ్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా రెండు దేశాలు రక్షణ సహకారంపై ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ భద్రత, రక్షణ పరిశోధన, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక భాగస్వామ్యం వంటి రంగాల్లో సహకారానికి ఇది వీలు కల్పిస్తుంది. ఇజ్రాయెల్ సైనిక హార్డ్‌వేర్‌ను కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్ మొదటి స్థానంలో ఉంది. మన దేశానికి వివిధ రకాల ఆయుధ వ్యవస్థలు, క్షిపణులు, మానవరహిత విమానాలను ఇజ్రాయెల్ సరఫరా చేస్తోంది. ఆ కొనుగోళ్లు చాలావరకూ గోప్యంగా సాగుతున్నాయి.

గోపీచంద్ హిందుజా మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి.హిందుజా మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, హిందుజా గ్రూప్‌నకు ఎక్స్ వేదికగా సానుభూతి తెలియజేశారు. 'దార్శనిక పారిశ్రామికవేత్తగా గోపీచంద్ సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు' అని పేర్కొన్నారు.

హిందుజా మరణం తీరని లోటు: మంత్రి లోకేశ్

జీపీ హిందుజా మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. 'పారిశ్రామిక, సేవా రంగాల్లో గోపీచంద్ పి.హిందుజా చేసిన అసాధారణ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎక్స్‌లో పేర్కొన్నారు.

దార్శనికుడు గోపీచంద్: మాజీ సీఎం జగన్

హిందుజా గ్రూప్‌ను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన దార్శనికుడు గోపీచంద్ పి.హిందుజా. ఆయన మృతి బాధాకరం. కుటుంబ సభ్యులకు, సహచరులకు, హిందుజా గ్రూప్‌లోని ప్రతి ఒక్కరికీ నా సానుభూతి తెలియజేస్తున్నా' అని మాజీ సీఎం జగన్ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు.

కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పతో మాధవ్ భేటీ

ఈనాడు, అమరావతి: కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్పతో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ భేటీ అయ్యారు. మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు ముచ్చటించారు.



యడియూరప్పతో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఫైరింగ్ రేంజ్‌ను సందర్శించిన పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని సులకొటి ఏపీఎస్పీ ఫైరింగ్ రేంజ్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం సందర్శించారు. దాదాపు 2 గంటలపాటు ఆయన అక్కడ ఉన్నారు.

సలహాదారుగా విశ్రాంత స్థపతి సుందర రాజన్

ఈనాడు, అమరావతి: దేవాదాయ శాఖలో స్థపతిగా పదవీ విరమణ పొందిన ఎస్.సుందర రాజన్‌ను.. కమిషనరేట్‌లోని స్థపతి సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీచేసింది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి: ఈయూ

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి సంస్థ పాలకవర్గ సమావేశంలో నిర్ణయాలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) కోరింది. ఈ మేరకు ఆర్టీసీ ఛైర్మన్, ఎండీలకు మంగళవారం లేఖలు అందజేసినట్లు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

అంధ ఉపాధ్యాయులకు ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఆప్టా

ఈనాడు, అమరావతి: అంధ ఉపాధ్యాయులకు ముఖ ఆధారిత హాజరు(ఫేసియల్ రికగ్నైజేషన్) నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు కోరారు. 'గత నెలలో హాజరు నమోదు చేయనివారికి పాఠశాల విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. మానవతా దృక్పథంతో ముఖ ఆధారిత హాజరు నుంచి వారికి మినహాయింపు ఇవ్వాలి. మెగా డీఎస్సీలో చేరిన ఉపాధ్యాయులకు లీవ్ యాప్‌లో సెలవులు చేర్చలేదు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులను వినియోగించుకోలేకపోతున్నారు' అని తెలిపారు.

రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. 'జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యం పెరుగుతున్నందున రాష్ట్రం నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా క్రీడా విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి' అని పేర్కొన్నారు.

సర్టిఫికెట్లు ఇవ్వకపోతే చర్యలు: ఉన్నత విద్య కమిషన్

ఈనాడు, అమరావతి: ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, నిర్దేశిత ఫీజుల కంటే ఎక్కువ వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్న విద్యాసంస్థలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యా సంస్థలకు రూ.15 లక్షల జరిమానా విధించడంతో పాటు గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని తెలిపింది. ప్రవేశాల సమయంలో సర్టిఫికెట్లను పరిశీలించి, వెంటనే ఇచ్చేయాలని. అదనంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే ఇవ్వాలని ప్రిన్సిపల్స్‌కు, రిజిస్ట్రార్లకు సూచించింది.

ఐటీఐల ఆధునికీకరణకు కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పరివర్తన పథకం కింద ఐటీఐల ఆధునికీకరణకు రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. మరో ఏడుగురు శాఖ కార్యదర్శులు.. ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ సభ్య కార్యదర్శిగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శిథిలావస్థకు చేరిన పోలీసు క్వార్టర్ల కూల్చివేత

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన 940 పోలీసు క్వార్టర్లు కూల్చివేతకు ఎంఎస్‌టీసీకి అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో కొన్ని భవనాలు బ్రిటిష్ కాలంలో, మరికొన్ని 1961, 1962 సంవత్సరాల్లో, ఇంకొన్ని 1970, 1980, 1990ల్లో నిర్మించినవి ఉన్నాయి.

డెన్మార్క్‌లో.. అంబులెన్స్ డ్రైవర్‌కు వైద్యుడితో సమానమైన నైపుణ్యం

- ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారం ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లోనే
- చీటీలతో పనిలేకుండా సీపీఆర్ నంబరు ఆధారంగా మందులు, పరీక్షల ఫలితాలు
- పర్యటన వివరాలు వెల్లడించిన వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్





డెన్మార్క్ వెళ్లిన అధికారుల బృందానికి రోబోటిక్ శస్త్రచికిత్సల గురించి వివరిస్తున్న వైద్యుడు ★ డెన్మార్క్‌లో వైద్యసేవల గురించి వివరిస్తున్న ఆ దేశ ప్రతినిధి, చిత్రంలో వైద్యశాఖ కమిషనర్ వీరపాండియన్

ఈనాడు, అమరావతి: 'డెన్మార్క్‌లో అంబులెన్స్ డ్రైవర్లకు వాహనం నడపడంతోపాటు వైద్యులతో సమానంగా నైపుణ్యం ఉంటుంది. వారికి నాలుగేళ్లపాటు ప్రాథమిక, అత్యవసర వైద్యసేవలతోపాటు ప్రొఫెషనల్ కోర్సులపై శిక్షణ ఇస్తారు. ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరగకుండా డ్రైవర్లే అన్ని రకాల ప్రాథమిక వైద్యం అందిస్తారు. రోగికి ఇంజక్షన్లు, మందులు ఇవ్వడం, ఈసీజీ, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం వంటివి చేస్తుంటారు. అంతేకాకుండా ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారం డిజిటల్ హెల్త్ రికార్డుల్లో భద్రపరుస్తున్నారు' అని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. 'డానిడా ఫెలోషిప్' కింద డెన్మార్క్ ప్రభుత్వం నిర్వహించిన డిజిటలైజేషన్ శిక్షణకు హాజరైన ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పలు వైద్యశాలలను పరిశీలించారు. మెరుగైన వైద్యసేవలకు అక్కడ అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు, ఇతర అంశాలను మంగళవారం 'ఈనాడు'కు వివరించారు.

ఫ్యామిలీ హెల్త్ హిస్టరీ ఆధారంగా చికిత్స

సివిల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్(సీపీఆర్) నంబరుతో ప్రతి పౌరుడికి ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు(ఈహెచ్ఆర్)లు జారీచేస్తారు. ఆ నంబరు కొడితే ఆరోగ్య సమాచారం అంతా వస్తుంది. వైద్యులు, వైద్యశాలలు, ఫార్మసీలు అన్నీ ఒకే విధానంలో అనుసంధానం కావడం వల్ల మందుల చీటీలు రాసే పనిలేకుండా.. ఫార్మసిస్టుకు నంబరు చెబితే ఆన్‌లైన్‌లో చూసి మందులు ఇస్తారు. ల్యాబ్ పరీక్షల నివేదికలు ఇలాగే అందిస్తారు. సీపీఆర్ నంబరు ఆధారంగా హెల్త్ ప్రొఫైల్, ఫ్యామిలీ హెల్త్ హిస్టరీ తెలుసుకుని, వాటి ఆధారంగా చికిత్స చేస్తారు.

ఉన్నత వైద్యానికి జనరల్ ప్రాక్టీషనర్ సిఫార్సు తప్పనిసరి

డెన్మార్క్‌లో రెండంచెల వైద్య విధానం ఉంటుంది. ప్రాథమిక వైద్యంలో జనరల్ ప్రాక్టీషనర్లు(జీపీ) ఉంటారు. ఉన్నత వైద్యం కేటగిరీలో స్పెషలిస్టులు, ఇతర మెరుగైన వైద్యసేవలు ఉంటాయి. రోగి ఆరోగ్య చరిత్ర ఆధారంగా ఉన్నత వైద్యసేవలకు ఆస్కారం ఉంటుంది. ఇందుకు జనరల్ ప్రాక్టీషనర్ సిఫార్సు తప్పనిసరి. వంశపారంపర్య జబ్బులపైనా అధ్యయనం చేసి వైద్యం అందిస్తారు. రోబోలతో స్కానింగ్, శస్త్రచికిత్సలు చేయడం, లాజిస్టిక్ సేవలు అందించడం, ఏఐ బేస్డ్ డేటా అనాలసిస్, జీన్ థెరపీ ద్వారా పర్సనలైజ్డ్ మెడిసిన్ తయారీ తదితర సాంకేతికత అందుబాటులో ఉంది.

అత్యవసర సేవలకు ఎయిర్ అంబులెన్సులు

డెన్మార్క్‌లో సాధారణ వైద్య అవసరాలకు బేసిక్ అంబులెన్సులు, అత్యవసర పరిస్థితుల్లో సేవలకు అడ్వాన్స్‌డ్ అంబులెన్సులు, తీవ్రమైన ప్రమాదాలు, దూరప్రాంతాల రోగులకు సత్వర వైద్యానికి ఎయిర్ అంబులెన్సులు(హెలికాప్టర్), దీవుల్లో సేవలకు బోట్ అంబులెన్సులు, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడే అత్యవసరం లేని కేసులకు నాన్ ఎమర్జెన్సీ అంబులెన్సులు వినియోగిస్తున్నారు. ముఖ్యమైన ఆసుపత్రుల్లో హెలీప్యాడ్‌లు ఉన్నాయి.

ప్రతి సంస్థా జవాబుదారీతనంతో పనిచేయాలి

- రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్
- అటవీ అభివృద్ధి సంస్థ ఎనిమిదేళ్లుగా గణాంకాలను సమర్పించకపోవడంపై అసంతృప్తి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి నిధులు పొందుతున్న ప్రతి సంస్థా జవాబుదారీతనంతో పనిచేయాలని శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం గుంటూరులో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర అటవీ, వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, ఏవియేషన్, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి సంస్థల కార్యకలాపాలపై సమీక్షించారు. రవికుమార్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలోగా తనిఖీలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ తన వార్షిక కార్యకలాపాలు, ఆదాయ, వ్యయాలపై నివేదికలు సమర్పించాలని చెప్పారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ 182 సంస్థల కార్యకలాపాలను విచారణ చేయనుందని, ఇప్పటి వరకు 30 సంస్థలను పరిశీలించామని తెలిపారు. అటవీ అభివృద్ధి సంస్థ ఎనిమిదేళ్లుగా గణాంకాలను సమర్పించకపోవడంపై ప్రశ్నించారు. వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ 2014 నుంచి వార్షిక నివేదికలు ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆడిట్ అభ్యంతరాలకు బాధ్యులైన ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. అటవీ శాఖ ఎకో టూరిజం ప్రాజెక్టులను పీపీపీ పద్ధతిలో నిర్వహణకు సంబంధించిన అవకాశాలను పరిశీలించాలన్నారు. ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ ఆరేళ్లుగా ఆడిట్ చేయకపోవడాన్ని నిలదీశారు. సమావేశానికి పోలీస్ హౌసింగ్ సంస్థ, డెయిరీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్లు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ బోర్డు మీటింగ్ ఈ నెల 27న నిర్వహించనున్నామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను జూన్ నాటికి సిద్ధం చేసేందుకు, కర్నూలు ఎయిర్ పోర్ట్‌కు విమాన రాకపోకలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో అదనంగా 9 ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరీషా మాట్లాడుతూ సంస్థ పరిధిలో రూ.14,820 కోట్లతో 293 పనులు చేపట్టగా ఇప్పటి వరకు రూ.3,947 కోట్ల విలువైన పనులు పూర్తి చేశామన్నారు.

7న పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ 17వ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న హైదరాబాద్‌లో ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. 7న జరిగే భేటీలో పోలవరం ప్రాజెక్టు అథారిటీకి, ఏపీ జలవనరుల శాఖకు మధ్య కుదరాల్సిన ఒప్పందం అంశం చర్చకు రానుంది. నాడు అథారిటీ ప్రతిపాదించిన అంశాలపై అభ్యంతరాలతో ఆలస్యమవుతూ వచ్చింది. పోలవరం అథారిటీ కేంద్రాన్ని రాజమహేంద్రవరం తరలించే అంశమూ చర్చకు రానుంది. పోలవరం అథారిటీ ఖర్చులు కూడా ఆమోదించాల్సి ఉంది. మరోవైపు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్‌జైన్ ఈ నెల 8న ప్రాజెక్టు సందర్శనకు రానున్నారు.

క్షమాభిక్ష పిటిషన్ల పరిష్కారానికి ప్రత్యేక విభాగం

ఈనాడు, అమరావతి: ఏపీలోని జైళ్లలో మరణశిక్ష అనుభవిస్తున్న ఖైదీల క్షమాభిక్ష పిటిషన్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో జైళ్లశాఖ ఐజీ కార్యదర్శిగా, హోంశాఖ సంయుక్త కార్యదర్శి, న్యాయశాఖ అదనపు కార్యదర్శి సభ్యులుగా ఉంటారు.

మూడు దశల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి నిర్ణయం

- ప్రైవేటు భాగస్వామ్యంతో 53 పార్కులు
- మౌలిక వసతుల కల్పనకు హడ్కో రుణం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో దశల వారీగా ఎంఎస్ఎంఈ పార్కులు/ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించి మొదటి దశలో 56 పార్కులను అభివృద్ధి చేస్తోంది. మిగిలిన వాటి అభివృద్ధికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఏపీఐఐసీకి అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన చోట ప్రైవేటు భూములను కూడా సేకరించాలని కలెక్టర్లను కోరింది. మొత్తం 175 పార్కుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో 122, ప్రైవేటు భాగస్వామ్యంతో 53 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను రుణంగా తీసుకునేందుకు ఏపీఐఐసీకి ప్రభుత్వం అనుమతించింది.

మొదటి దశలో 56 పార్కులు

మొదటి దశలో 56 పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 11 పార్కులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 39 పార్కులకు ఆయన శంకుస్థాపన చేశారు. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికే ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక పార్కులు ఉన్నాయి. మూడు చోట్ల మౌలిక సదుపాయాలను కల్పించింది. మిగిలిన పార్కుల అభివృద్ధికి అవసరమైన భూములను సేకరించడంతో పాటు.. ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే పార్కులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది.

రెండు దశల్లో 119 పార్కులు

మిగిలిన 119 పార్కులను రెండు దశల్లో అభివృద్ధి చేస్తారు. వీటిలో 102 పార్కులకు అవసరమైన భూములకు సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. 66 చోట్ల మాత్రమే భూములు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనువైనవిగా ఉన్నట్లు పరిశ్రమలశాఖ అధికారులు భావిస్తున్నారు. పూర్తిగా ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న 25 పార్కులను రెండో దశలో పూర్తి చేస్తారు.

- ✦ సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి.. మూడో దశలో పార్కులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.
- ✦ ప్రైవేటు పార్కుల విధానం కింద 3 పార్కులను అభివృద్ధి చేసేందుకు అధికారులు అనుమతించారు. 14 పార్కుల కోసం భూములను గుర్తించాల్సి ఉంది.

మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ఏపీఐఐసీకి

పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించడంతోపాటు.. వాటిలో మౌలిక సదుపాయాలను ఏపీఐఐసీ కల్పిస్తోంది. ఎంఎస్ఎంఈ, పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పన, భూసేకరణకు హడ్కో నుంచి రూ.5 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీఐఐసీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రుణాన్ని ఇచ్చేందుకు హడ్కో కూడా అంగీకరించింది.

గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల మరమ్మతులకు రూ.113 కోట్లు

- ట్రైకార్ కింద రూ.24 కోట్లతో గురుకులాలు..
- మరో రూ.20 కోట్లతో సంక్షేమ రుణాలు
- త్వరలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ
- మంత్రి సంధ్యారాణి వెల్లడి



ఈనాడు, అమరావతి: గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సౌకర్యాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.113 కోట్లు మంజూరు చేశారని మహిళా శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రూ.155 కోట్లు కేటాయించి మౌలిక సౌకర్యాల పనులు చేపట్టామని, ఇప్పుడు మరో విడత నిధులు అందించారని వివరించారు. ట్రైకార్ ద్వారా రూ.24 కోట్లతో 9 ఐటీడీఏల పరిధిలో గోకులాలు మంజూరు చేశామని, మరో రూ.20 కోట్లతో అర్హుల్ని గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. సచివాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో సంధ్యారాణి మాట్లాడారు. "గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని 42 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నాం. పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి త్వరలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం'' అని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే శ్రీశైలం ప్రాంతంలోని గిరిజనులకు రేషన్, ఆధార్ కార్డులు ఇప్పించామని తెలిపారు. రక్తహీనతతో బాధపడే ఉత్తరాంధ్ర ప్రాంత గిరిజనులకు విశాఖ కేజీహెచ్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. 150 మంది విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇప్పించేందుకు పార్వతీపురం, సీతంపేటలో కేంద్రాలు నెలకొల్పామని, విశాఖపట్నంలో మరోటి ఏర్పాటు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు. "రాష్ట్రంలో 757 గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. అన్నిచోట్లా ఉపాధ్యాయులు సరిపడా ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాటిలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. ఇప్పటికే 2,012 నిర్మాణంలో ఉన్నాయి. పిల్లలు ఇంటికి ఫోన్ చేసేందుకు వీలుగా కాయిన్‌బాక్స్ ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నాం. 5వేల మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా ఉన్నతీకరించాం'' అని వివరించారు.



కిషన్‌రెడ్డి, రామచందర్‌రావుతో భేటీ అయిన శంకర్ గౌడ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాజపాకు 'జనసేన' మద్దతు

ప్రచారంలో పవన్‌కల్యాణ్ పాల్గొనే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాజపాకు జనసేన మద్దతు ప్రకటించింది. మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావులతో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ హైదరాబాద్‌లోని సాగర్ సొసైటీలో భేటీ అయ్యారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్టు వెల్లడించారు. ఉప ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొనే అవకాశముందని తెలిపారు.

6 నుంచి విద్యాశాఖ అధికారుల ఫిన్లాండ్ పర్యటన

ఈనాడు, అమరావతి: పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ ఉన్నతాధికారులు 6 నుంచి 12 వరకు ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విద్యారంగంలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసేందుకు పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, కళాశాల, సాంకేతిక విద్యా శాఖల డైరెక్టర్లు నారాయణ భరత్ గుప్తా, గణేష్ కుమార్‌లు ఫిన్లాండ్‌కు వెళ్లనున్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ బిల్లును ఉపసంహరించాలి

- విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల సమన్వయ కమిటీ డిమాండ్

ఈనాడు, అమరావతి: విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రతిపాదించిన 'విద్యుత్ సవరణ బిల్లు-2025'ను ఉపసంహరించాలని విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వచ్చే ఏడాది జనవరి 30న అన్ని రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థల ఉద్యోగులతో దిల్లీలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపింది. 'కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు, వినియోగదారుల సంస్థలతో ఐక్య ఫ్రంట్ ఏర్పాటు చేసి ఉమ్మడి ఉద్యమాన్ని నిర్వహిస్తాం. దీనికి సన్నాహక సమావేశాన్ని డిసెంబరు 14న దిల్లీలో నిర్వహిస్తాం' అని కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎన్ఆర్ఐల పెట్టుబడుల ఆకర్షణకు క్లబ్ ఏర్పాటు

మంత్రి కొండపల్లి ఆదేశం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై వివిధ దేశాల్లో కీలక స్థానాల్లో ఉన్న ఎన్ఆర్ఐలకు వివరించి.. వారి ద్వారా పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. దీనికోసం వారితో ఒక క్లబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించే పెట్టుబడుల సదస్సులో ఎన్ఆర్ఐలతో ప్యానల్ డిస్కషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీఎన్ఆర్టీ అధికారులతో సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ 'రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా విదేశాల్లో స్థిరపడిన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని వారికి వివరించాలి. ఎన్నారై క్లబ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి. విదేశీ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేసే ముఖ్య కార్యనిర్వహణాధికారులు, ఫైనాన్షియల్, టెక్నికల్ అధికారులను క్లబ్‌లో భాగస్వాములను చేయాలి. 135 దేశాల్లో ఉన్న తెలుగు వారిని ఒకే గొడుగు కిందకు తేవాలి. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి' అని పేర్కొన్నారు. అమరావతిలో ప్రతిపాదించిన ప్రవాసాంధ్రుల ఐకానిక్ టవర్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏపీఎన్ఆర్టీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, సీఈవో కృష్ణమోహన్ పాల్గొన్నారు.

డిసెంబరులో 'ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో'

బోర్డు సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: విజయవాడలో డిసెంబరు 12 నుంచి 14వ తేదీ వరకూ 'ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో-2025'ను నిర్వహించనున్నట్లు ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తెలిపారు. విజయవాడలో మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 'రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు, పరిశ్రమ నిపుణులు, ఆవిష్కర్తలు, వినియోగదారులు సహా భిన్న వర్గాలను ఆకర్షించేలా ఎక్స్‌పో ఉంటుంది. ఇందులో 160 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటారు. సుమారు 30 వేలకు పైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. నెట్‌వర్కింగ్, నైపుణ్య మార్పిడి, సహకారం, వ్యాపారాభివృద్ధికి తోడ్పడేదిగా ఈ ఎక్స్‌పో ఉంటుంది. వివిధ అంశాలపై సెమినార్లు ఉంటాయి' అని భాస్కరరావు వివరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి అక్కయ్యనాయుడు పాల్గొన్నారు.

బోర్డులో చర్చించిన ప్రధాన అంశాలు

- పరిశ్రమలకు రెండో విడత ప్రోత్సాహకాల చెల్లింపు.
- రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు.. వాటి ప్రభావం. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన.
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా.. వివిధ శాఖలు నిర్దేశించిన నిబంధనలను పాటించాల్సి రావడంతో 'ఇన్‌స్పెక్షన్ రాజ్' కొనసాగుతోంది. నిబంధనలను సరళీకరించాలని కోరుతూ ప్రభుత్వానికి సూచన.

గ్రానైట్ మిల్లులు, సీనరేజ్ గుత్తేదారుల సమస్యల పరిష్కారానికి కమిటీ: మంత్రి కొల్లు



ఈనాడు, అమరావతి: సీనరేజ్ ఫీజుల చెల్లింపు విషయంలో గ్రానైట్ కటింగ్ పాలిషింగ్ యూనిట్ల యాజమాన్యాలకు, సీనరేజ్ వసూళ్ల గుత్తేదారులకు మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, వారం రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటామని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల గ్రానైట్ మిల్లుల సంఘం ప్రతినిధులతో మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బీఎన్ విజయకుమార్‌లు మంగళవారం సచివాలయంలో సమావేశమయ్యారు. సీనరేజ్ గుత్తేదారులతో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గ్రానైట్ మిల్లుల సంఘాల ప్రతినిధులు కోరారు. గనులశాఖ జేడీ, జిల్లా గనులశాఖ అధికారి, సీనరేజ్ గుత్తేదారు సంస్థ ప్రతినిధి, గ్రానైట్ మిల్లుల సంఘాల నుంచి ఇద్దరు ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వీరంతా చర్చించి దీనిపై వారంలో నివేదిక అందించాలని ఆదేశించారు. ఇటు ప్రభుత్వానికి, అటు మిల్లుల యజమానులకు నష్టంలేకుండా చూస్తామని మంత్రి వెల్లడించారు. అంతకుముందు మిల్లుల ప్రతినిధులు మాట్లాడుతూ.. అన్ని గ్రేడ్‌ల ముడిరాయికి ఒకే విధమైన సీనరేజ్ చెల్లించడం ఆర్థికంగా భారమవుతోందని పేర్కొన్నారు. ఒక క్యూబిక్ మీటర్ ముడిరాయిని పాలిషింగ్ చేశాక 350 చదరపు అడుగులకే గనులశాఖ పాస్‌లు ఇస్తోందని, ఇప్పుడు కటింగ్, పాలిషింగ్ టెక్నాలజీ మారినందున 450 చదరపు అడుగులకు పాస్‌లు ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కొల్లేరు సరస్సు మేనేజ్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: కొల్లేరు సరస్సు పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కొల్లేరు సరస్సు మేనేజ్‌మెంట్ అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెవెన్యూ, మత్స్య, వ్యవసాయ, పంచాయతీరాజ్, జలవనరుల శాఖల కార్యదర్శులు, అటవీ దళాల అధిపతి, వన్యప్రాణి విభాగం పీసీసీఎఫ్ సహా మరికొంతమంది సభ్యులు కలిపి మొత్తం 26 మందితో ఈ అథారిటీని ఏర్పాటు చేసింది. సరస్సు సంరక్షణ, ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడం, కొల్లేరులోని జీవవైవిధ్యాన్ని కాపాడటం, సరస్సు సమగ్రాభివృద్ధి కోసం జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేయడం తదితర బాధ్యతల్ని ఈ అథారిటీకి అప్పగించింది. ప్రతి మూడు నెలలకోసారి కనీసం ఒక్కసారైనా అథారిటీ సమావేశమవ్వాలని నిర్దేశించింది. ఈ మేరకు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎర్రచందనం రైతులకు రూ.3 కోట్లు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం పండిస్తున్న 198 మంది రైతులతో పాటు ఆంధ్ర యూనివర్సిటీకి రూ.3 కోట్లు విడుదల చేస్తున్నట్లు జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) ప్రకటించింది. 'యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్ ఫ్రేమ్‌వర్క్' కింద ఈ మొత్తం ఇస్తున్నట్లు తెలిపింది. ఎర్రచందనం పరిమాణాన్ని బట్టి ఇందులో ఒక్కో రైతుకు రూ.33 వేల నుంచి రూ.22 లక్షల దాకా అందుతుందని తెలిపింది. జీవవైవిధ్య సంరక్షణ కోసం గతంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అటవీ శాఖలు, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండళ్లకు రూ.48 కోట్లు, తమిళనాడు రైతులకు రూ.55 లక్షలు విడుదల చేసినట్లు ఎన్‌బీఏ వెల్లడించింది. ప్రస్తుతం ఏపీకి విడుదల చేసిన రూ.3 కోట్ల మొత్తం చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాల్లోని 48 గ్రామాల్లో ఉన్న 198 మంది రైతులకు వెళ్తుందని తెలిపింది.

పరిశ్రమల్లో థర్డ్ పార్టీ ఆడిట్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: తక్కువ, మధ్యస్థ ప్రమాదకర పరిశ్రమల్లో థర్డ్ పార్టీ ఆడిట్‌కు అనుమతిస్తూ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిల్లో అధికారులు తనిఖీలు చేయరు. ఈ సంస్థలే థర్డ్ పార్టీ ఆడిట్ సర్టిఫికేషన్, ఆన్‌లైన్ వార్షిక రిటర్న్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. తనిఖీల్లో సరళీకరణ, పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చేందుకు ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్లు పేర్కొంది.

ఇన్సులిన్ నిరోధకత నియంత్రణ ఇలా..



కొన్ని చిన్న చిట్కాలతో ఇన్సులిన్ నిరోధకతను నియంత్రించే అవకాశం ఉంది. అవి.. అత్యధిక ప్రొటీన్ ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవాలి. భోజనపళ్లెంలో సగం కూరలు ఉండాలి. రాత్రివేళ ఆలస్యంగా భోజనం చేయడాన్ని మానేయాలి. పంచదార, స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, శీతల పానీయాలను త్యజించాలి. ప్రతిరోజూ భోజనం చేశాక 30-45 నిమిషాల పాటు నడవాలి. ఇన్సులిన్ నిరోధకత తీవ్రం కాకుండా రోజూ 7-8 గంటలు నిద్రించాలి. ఉదయం సూర్యరశ్మిలో 15-20 నిమిషాలు గడపాలి. శుద్ధి చేసిన నూనెలు, ఆహార పదార్థాలను దూరం పెట్టాలి.

– శాయాజీరావ్ గైక్వాడ్, వైద్యుడు